
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 200

శనివారం 11-10-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ II
హైదరాబాద్
శనివారం ॥ 11-10-2025



“ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో ఉడకబెట్టిన కోడిగుడ్లను తినడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. మంచి కొలెస్ట్రాల్ గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది.”

పోరాటం

మారుతున్న ఈ దేశంలో మారాల్సినవి ఇంకా ఉన్నాయి. మానవ వ్యర్థాలను ఎత్తి పోసే పాకీ పనిని నిషిద్ధం చేయగలిగినా మ్యాన్‌హోల్స్ శుభ్రతకు మురుగు నీటి వ్యవస్థ మరమ్మత్తులకు మనుషులనే ఉపయోగించడం వల్ల వారు అనారోగ్యం పాలై మృత్యువాత పడుతున్నారు. వారిలో చైతన్యం, పొందాల్సిన హక్కుల కోసం పని చేస్తోంది హేమలత కన్సోటియా. ఢిల్లీలో మొదలైన ఈమె ఉద్యమం ఇప్పుడు రాజస్థాన్‌కు చేరి మంచి ఫలితాలను ఇస్తోంది. హేమలత పరిచయం..



హేమలత కన్సోటియా

‘మురుగున’ పడ్డ జీవితాల్లో వెలుగు

‘జూన్‌లో బికనీర్‌లో ముగ్గురు స్కావెంజర్లు మరణించారు... సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేస్తూ. విష వాయువుల వల్ల ఇలా జరిగింది. కేసు ఏం పెట్టలేదు. కొద్ది డబ్బుతో వదిలించుకున్నారు. ఇలా ఎన్నిచోట్ల జరుగుతున్నదో చెప్పలేము. ఈ పరిస్థితి మారాలి’ అంటుంది హేమలత.

ఢిల్లీకి చెందిన హేమలత ప్రస్తుతం రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఉంటూ మాన్యువల్ స్కావెంజర్ల కోసం పని చేస్తోంది. గతంలో ‘మాన్యువల్ స్కావెంజర్స్’ అంటే మానవ వ్యర్థాలను శుభ్రం చేసే వారిని అనేవారు. ఇప్పుడు మ్యాన్‌హోల్స్‌ను, సెప్టిక్ ట్యాంకులను, మురుగు కాల్వలను శుభ్రం చేసే వారికి కూడా వాడుతున్నారు. మొత్తంగా పారిశుద్ధ్య కార్మికుల పనిలో యంత్ర ప్రమేయం అవసరం గురించి హేమలత పోరాటం సాగిస్తున్నారు. ఆమె వాదన వింటే ఎవరికైనా సరే పారిశుద్ధ్య కార్మికుల గురించి ఆలోచన మొదలవుతుంది.

చిన్న వయసు నుంచే

ఢిల్లీకి చెందిన హేమలతకు పద్నాలుగేళ్ల వయసులో చెవి వైద్యం చేయిస్తే అది వికటించి ముఖానికి పాక్షిక పక్షవాతం వచ్చింది. దాంతో ఆమెను తల్లిదండ్రులు పెళ్లి పేరుతో వదిలించుకున్నారు. ఆ పెళ్లి నిలువలేదు. హేమలత భవన నిర్మాత కూలీలతో పని చేస్తూ ఎం.ఏ చదివి కార్మికుల హక్కుల కోసం పని మొదలెట్టింది. 1998 నుంచి ఆమె ఈ పనిలో ఉన్నా 2007లో ఓ కేసు ఆమె దృష్టిని మార్చింది. ఓ నిర్మాణంలో జరిగిన ప్రమాదం కారణంగా ముగ్గురు మరణించారని ఆమెకు చెప్పారు. ఆమె అక్కడికి వెళ్లి చూశాక అసలు విషయం అర్థమైంది.

మనిషి దిగొద్దు

సామాజిక కార్యకర్త బెజవాడ విల్సన్ తదితరుల కారణంగా అప్పటిదాకా పాకీ పని చేసేవారి గురించి దేశ వ్యాప్తంగా చర్చ సాగింది. అయితే మ్యాన్‌హోల్స్‌లో దిగి శుభ్రం చేసేవారి గురించి, వారి భద్రత గురించి హేమలత వల్ల తొలిసారి చర్చ మొదలైంది. ఈ క్రమంలో అనేక ప్రాంతాలు తిరిగి అక్కడి కార్మికులతో మాట్లాడారు హేమలత. మురుగుకాల్వలు, మ్యాన్‌హోల్స్ వంటి చోట్ల పనిచేసేవారి పట్ల సమాజం ఎంత వివక్షపూరితంగా ఉందనేది తెలిసింది. వారి ప్రాణాలు గాల్లో దీపాలుగా మారాయన్న విషయం వెలుగులోకి వచ్చింది. కోర్టులో సుదీర్ఘ వాదనల అనంతరం 2010లో ఢిల్లీ హైకోర్టు తీర్పు వెలువరించింది. మ్యాన్‌హోల్స్‌లోకి దిగి మురుగును శుభ్రం చేయడం చట్టవ్యతిరేక చర్య అని ప్రకటించింది.

అక్కడ మ్యాన్‌హోల్ శుభ్రం చేసేందుకు వెళ్లి విషవాయువులు పీల్చి ఆ ముగ్గురూ మరణించారు. ఆ ఘటన ఆమె మనసును కదిలించింది. దేశంలో ఇంకా ఇలాంటి ఘటనలు జరుగుతుండటమేమిటనే ప్రశ్న మొదలైంది. పొట్టకూటి కోసం కార్మికులు ఈ ప్రమాదకరమైన పని చేస్తూ మృత్యువు పాలవుతున్నారని ఆమె గుర్తించింది. వారి కుటుంబాలకు నష్టపరిహారం సైతం అందడం లేదనే విషయం ఆమెకి తెలిసింది.

ఈ పనులకు ముగింపు పలకాలని భావించి అదే సంవత్సరం ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేసింది.

సమాజం మారాలి

‘ప్రభుత్వ విధానాలు పేపర్ల మీద ఉంటాయి. కాని అవి వాస్తవరూపం దాల్చితేనే ఫలితం’ అంటుంది హేమలత. మ్యాన్‌హోల్స్ శుభ్రం చేస్తూ మరణించిన వారి కుటుంబాలకు ఆమె అండగా నిలబడ్డారు. వారి కాళ్ల మీద వారు నిలబడేలా సాయం అందించాలని భావించారు. అందుకు తగ్గ పనులు మొదలుపెట్టారు. అందుకూ ఆమెకు సమాచార హక్కు చట్టమే తోడ్పాటుగా నిలిచింది. ఆమె కృషి ఫలితంగా ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. మ్యాన్‌హోల్స్ శుభ్రం చేస్తూ మరణించిన వారి కుటుంబాలకు సాయం అందించేందుకు సిద్ధమైంది. దీంతోపాటు ఏళ్లుగా ఈ పనిలోనే ఉన్నవారిని ఆ పని మాన్పించి, కొత్త పనులు చేపట్టేలా ప్రభుత్వ పథకాలను వారికి చేరువ చేశారు హేమలత. ఇది మాత్రమే కాదు, నిరుపేద కుటుంబాలకు విద్య, వైద్యం, మౌలిక వసతులు అందే విషయంలోనూ ఆమె క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. సుమారు రెండు వేల మంది చిన్నారులకు సక్రమంగా పోషకాహారం అందేందుకు ఆమె పాటుపడ్డారు.

‘మ్యాన్‌హోల్‌లో ఎవరో ఒకరు దిగి శుభ్రం చేయకపోతే ఊళ్లు శుభ్రంగా ఎలా ఉంటాయి?’ అని చాలా మంది హేమలతతో వాదిస్తుంటారు. ‘మనిషి జన్మ ఎత్తిన వారెవరూ ఇటువంటి పనులు చేయకూడదు. అలా చేయకుండా చూడాల్సిన బాధ్యత సమాజానిది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఇంత అభివృద్ధి సాధించాం. మురుగు కాల్వ శుభ్రం చేయడానికి ఆ అభివృద్ధిని ఉపయోగించలేమా?’ అని ఆమె ప్రశ్నిస్తారు. యంత్రాలను తీసుకొచ్చి, ఆ కార్మికులకు శిక్షణ ఇచ్చి, వారికి ఉపాధి కల్పించాలని ఆమె అంటున్నారు. తద్వారా దేశం నిజమైన అభివృద్ధి సాధిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిభ, పాపులారిటీ.. పాలిటిక్స్‌కి మోస్ట్‌వాంటెడ్ థింగ్స్! ఈ రెండూ ఉన్న వ్యక్తులను ఎన్నికల్లో పార్టీ టికెట్స్ వలచి వరిస్తాయి! ఆ కోవలో గ్లామర్ స్టార్స్, కళాకారులకైతే స్పెషల్ రిజర్వేషన్ ఉంటుంది! అందులో అమ్మాయైతే.. మహిళా ప్రాతినిధ్యానికి ఒక ఓటు పెరిగినట్టే.. ఓ ఆశ చిగురించినట్టే! ఇప్పుడీ ప్రస్తావనకు ప్రాసంగికత బిహార్ ఎన్నికలు.. అలా టాలెంట్ అండ్ ఫాలోయింగ్ గల అభ్యర్థి.. గాయని మైథిలీ ఠాకుర్. ఆమె పరిచయం..

పాలిటిక్స్‌లో పాట కచేరి



మైథిలీ ఠాకుర్

గాయనిగా మైథిలీ ఠాకుర్ దేశమంతటా సుపరిచితం. ఆమె మైథిలీ, భోజ్‌పురి, హిందీ భాషల్లో జానపద సంగీతంతో పాటు శాస్త్రీయ సంగీతంలోనూ ఘనాపాటి. సంగీత కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన మైథిలీ జన్మస్థలం బిహార్, మధుబని జిల్లాలోని బేనీ పట్టీ. తండ్రి రమేశ్ ఠాకుర్ సంగీతం మాస్టారు. మైథిలీ తన ఇద్దరు సోదరులతో పాటు తండ్రి, తాత దగ్గరే శాస్త్రీయ, జానపద సంగీతం నేర్చుకున్నారు. దేశంలోనే కాదు, విదేశాల్లోనూ భక్తి, జానపద సంగీత కచేరీలు ఇస్తున్నారు. జానపద సంగీతంలో ఆమె చేస్తున్న కృషిని గుర్తించిన సంగీత నాటక అకాడమీ ఆమెను ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారంతో సత్కరించింది. మైథిలీకి సంగీత కళ మీద ఆరాధనే కాదు. సామాజిక స్పృహ కూడా బాగా ఉంది. ఓటర్ ఎడ్యుకేషన్ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొని ఓటర్లకు అవగాహన పెంచడంలో తన వంతు పాత్ర పోషించారు. అందుకే ఎలక్షన్ కమిషన్ ఆమెను బిహార్ స్టేట్ ఐకాన్‌ను చేసింది. ఇవన్నీ కూడా ఆమెను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టిలో పడేట్టు చేశాయి. అయోధ్య రామాలయ ప్రారంభోత్సవంలో శబరి మీద ఆమె పాట పాడారు. ఆ గాన మాధుర్యాన్ని ప్రధాని అభినందించారు.

ఇవన్నీ ఆమె రాజకీయ ప్రవేశాన్ని సునాయాసం చేయనున్నాయి. బిహార్ ఎన్నికల్లో మధుబని లేదా అలీనగర్ ఈ రెండిట్లో ఏదో ఒక నియోజక వర్గానికి ఆమె అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసేట్టు కనిపిస్తున్నాయి. మధుబని, దర్భంగా (అలీనగర్ ఈ జిల్లాలోనిదే).. ఈ రెండూ కూడా మిథిలా ప్రాంతం కిందకు వస్తాయి. మైథిలీ ఆ సంస్కృతీ సంప్రదాయంలోనే పుట్టి పెరిగిన వనిత. పైగా కళాకారిణి. ఈ రెండూ ఆమెను ఇటు సంప్రదాయవాదులకు, అటు సంప్రదాయవాదులు కాని వాళ్లకూ కూడా కావల్సిన వ్యక్తిగా ఆమెను ప్రజలకు దగ్గర చేస్తున్నాయి. సరిగ్గా బీజేపీ ఈ అంశాన్నే పరిగణనలోకి తీసుకుని ఆ రెండు నియోజకవర్గాల్లో ఒక స్థానం నుంచి ఆమెను బరిలోకి దింపే ప్రయత్నం చేస్తోందని రాజకీయ విశ్లేషకుల మాట. అంతేకాదు ఆమె యంగ్ లేడీ కావడంతో ఇటు యూత్‌నూ ఆకట్టుకోవచ్చని బీజేపీ ఆలోచిస్తోందని చెబుతున్నారు. అయితే గెలుపు మాత్రం అంత అనాయాసంగా ఉండకపోవచ్చని మైథిలికి మద్దతిస్తున్న వారి అభిప్రాయం. ఆమె ముందు చాలా సవాళ్లే ఉన్నాయి. ఓటరు అవగాహనా కార్యక్రమాల్లో పాల్గొనడం మాత్రమే సరిపోదు రాజకీయ ప్రవేశానికి. ఎంతో కొంత క్షేత్రస్థాయి అనుభవం, వ్యూహాలు, సంస్థాగత తోడ్పాటు, పార్టీ అంచనాలకనుగుణంగా పని చేయడం వంటివి మైథిలి ముందున్న సవాళ్లని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఏదేమైనా యువత.. అందులో అమ్మాయిలు రాజకీయాల్లోకి రావడం మాత్రం శుభపరిణామమే!

సమ్‌థింగ్ స్పెషల్

పల్లెకు పోదాం ఛలో ఛలో... పిడకలు చేద్దాం ఛలో ఛలో!

అమెరికన్ అయిన జెస్సికా ఇండియన్‌ను పెళ్లి చేసుకుంది. గత పందొమ్మిది సంవత్సరాలుగా ఇండియాలోనే ఉంటోంది. హిందీ భేషుగ్గా మాట్లాడుతుంది.



సోషల్ మీడియాలో జెస్సికా వీడియోలు చూసి...

‘ఒక అమెరికన్ ఇంత స్పష్టంగా హిందీ మాట్లాడడం చాలా గ్రేట్’ అని ప్రశంసల వర్షం కురిపిస్తుంటారు నెటిజనులు.

ఆమె తాజా వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియోలో పిడకలు చేయడాన్ని జెస్సికా శ్రద్ధగా నేర్చుకుంటున్న దృశ్యం కనిపిస్తుంది. బిహార్‌లోని ఒక గ్రామానికి వెళ్లిన జెస్సికా గ్రామస్థులతో హిందీలో మాట్లాడుతూ పిడకలు ఎలా చేయాలో నేర్చుకుంది.

అంతేకాదు.. నిల్వ చేసిన పిడకలతో మట్టి పొయ్యి వెలిగించి వంట కూడా చేసింది.

‘ఛలో’ క్యాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియోలలో పక్కా పల్లెజీవితం, స్థానిక వంటలు, సంస్కృతులు కనిపిస్తాయి.

సెల్ఫ్-మేడ్

చదివింది ఎనిమిదో క్లాస్ ఇప్పుడు... దుబాయ్‌లో బిలియనీర్!

చదువు బుర్రకెక్కలేదో, ఇతరత్రా కారణాలు ఏమైనా ఉన్నాయో తెలియదుగాని ఎనిమిదవ తరగతిలోనే చదువు ఆపాడు మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌కు చెందిన సతీష్ సాన్పాల్.

పదిహేను సంవత్సరాల వయసులో చిన్న కిరాణం కొట్టు మొదలుపెట్టాడు. ఇది చాలా చిన్న వ్యాపారమే అయినా వ్యాపార ప్రపంచానికి సంబంధించి విలువైన పాఠాలు ఎన్నో నేర్చుకున్నాడు. అవే తన భవిష్యత్‌కు గట్టి పునాది వేశాయి.



మెరుగైన భవిష్యత్‌ను వెదుక్కుంటూ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కి వెళ్లాడు.

‘నేను ఎనిమిదవ తరగతి వరకే చదువుకున్నాను. నేనేం చేయగలను!’ అని ఎప్పుడూ అనుకోలేదు.

‘ఏదో ఒకటి చేయాల్సిందే. గట్టి విజయం సాధించాల్సిందే’ అని గట్టిగా అనుకునేవాడు. బంగారం వ్యాపారంలోకి అడుగుపెట్టాడు. స్టాక్‌మార్కెట్‌కు సంబంధించి అవగాహన ఉండడంతో మొదట్లో క్లయింట్స్‌కు సహాయం చేసేవాడు. సలహాలు ఇచ్చేవాడు. ఈ క్రమంలో ప్రాక్టికల్ నాలెడ్జ్‌తోపాటు తన మీద తనకు ఆత్మవిశ్వాసం వచ్చింది.

2018లో ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ‘అనాక్స్ హోల్డింగ్స్’కు శ్రీకారం చుట్టాడు. ఆ తరువాత కాలంలో ‘అనాక్స్ డెవలప్‌మెంట్స్’ ‘అనాక్స్ హాస్పిటాలిటీ’ ‘అనాక్స్ క్యాపిటల్’ పేరుతో మూడు విభాగాలు ప్రారంభించాడు.

కోవిడ్ కల్లోల కాలంలో ఎన్నో వ్యాపారాలు మూలనపడ్డాయి. అయితే సతీష్ మాత్రం దూరదృష్టి, వ్యూహాత్మక దృక్పథంతో తన వ్యాపారాలు నష్టాల బారిన పడకుండా జాగ్రత్త పడ్డాడు. కోవిడ్ కల్లోల కాలంలో దుబాయ్‌లో తక్కువ విలువ కలిగిన ఆస్తులలో పెట్టుబడి పెట్టాడు. ఆ తరువాత అవి గణనీయంగా పెరిగాయి. గడియారాలు, బంగారం, కార్లలో పెట్టుబడులు పెట్టేవాడు.

తన ఊళ్లో చిన్న కిరాణా కొట్టుకు మాత్రమే పరిమితం కాలేదు సతీష్. నాలుగు అడుగులు ముందుకు వేసి కోటీశ్వరుడు అయ్యాడు. ఆ తరువాత ఏమిటి?

‘2034 టాప్ బిలియనీర్స్’ జాబితాలో తన పేరు కూడా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు!

వంటిల్లు

వేయించుకు తినండి

స్నాక్స్‌గానూ, భోజనంలోనూ రెండు విధాలుగా ఉపయోగపడే వంటకాలు కొన్ని ఉంటాయి. వాటిలో ఇంటిల్లిపాదినీ మెప్పించే క్రిస్పీ వెజ్, చికెన్ మెజెస్టిక్, చిల్లీ గార్లిక్.. చెఫ్ గోవర్ధన్ ఇచ్చిన వంటకాలతో వంటిల్లు.

క్రిస్పీ వెజ్



కావలసినవి: క్యారెట్ – 100 గ్రా.; బీన్స్ – 50 గ్రా; రెడ్ క్యాప్సికం – 50 గ్రా; యెల్లో క్యాప్సికం – 50 గ్రా; గ్రీన్ క్యాప్సికం – 50 గ్రా.; క్యాబేజీ – 100 గ్రా.;

పిండి మిశ్రమానికి... కార్న్ ఫ్లోర్ – 3 టేబుల్ స్పూన్లు; మైదా – 3 టేబుల్ స్పూన్లు; బియ్యప్పిండి – 3 టేబుల్ స్పూన్లు; ఉప్పు – తగినంత; కచ్చాపచ్చాగా దంచిన మిరియాల పొడి – టీ స్పూన్; సన్నగా తరిగిన వెల్లుల్లి – రెండు స్పూన్లు; సన్నగా తరిగిన అల్లం – టేబుల్ స్పూన్; నీళ్లు – అవసరమైనంత.

తయారీ: ● పిండి మిశ్రమం కోసం తీసుకున్న పదార్థాలన్నీ ఒక వెడల్పాటి గిన్నెలో వేసి నీరు కలిపి మృదువైన మిశ్రమాన్ని తయారు చేసుకోవాలి ● కూరగాయలన్నీ పొడవాటి సన్నని ముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి ● కూరగాయ ముక్కలను పిండి మిశ్రమంలో ముంచి, అన్ని వైపులా పిండి పట్టేలా ఉంచాలి ● స్టౌ పై కడాయి పెట్టి, నూనె పోసి, వేడయ్యాక, అందులో సిద్ధం చేసుకున్న కూరగాయల ముక్కలను వేసి, బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి ● చట్నీ లేదా సాస్‌తో వేడిగా సర్వ్ చేయాలి.

చికెన్ మెజెస్టిక్



కావలసినవి: చికెన్ మ్యారినేట్ చేయడానికి... బోన్లెస్ చికెన్ – 500 గ్రా.; చిక్కటి మజ్జిగ– గ్లాసుడు; అల్లం వెల్లుల్లి పేస్ట్ – టేబుల్ స్పూన్; పసుపు – టీ స్పూన్; కారం – టేబుల్ స్పూన్; ఉప్పు – టీ స్పూన్; కార్న్ ఫ్లోర్ – టేబుల్ స్పూన్; మైదా – టేబుల్ స్పూన్;

సాస్ కోసం... నూనె – 2 టేబుల్ స్పూన్లు; సన్నగా తరిగిన వెల్లుల్లి – రెండు స్పూన్లు; పచ్చిమిర్చి – నాలుగైదు; కరివేపాకు – ఒక రెమ్మ; పుదీనా ఆకులు – అర కప్పు; సోయా సాస్ – 2 టేబుల్ స్పూన్లు; ఎండు మిరపకాయలు – 6; గరం మసాలా – టీ స్పూన్; పెరుగు – 6 టేబుల్ స్పూన్లు; నీరు – 50 మి.లీ.

తయారీ: ● చికెన్‌ను అన్ని పదార్థాలతో కలిపి, కనీసం 30 నిమిషాలు మ్యారినేట్ చేయాలి ● బాణలిలో నూనె పోసి, మ్యారినేట్ చేసిన చికెన్ పీసులను బంగారు రంగు వచ్చేవరకు వేయించి, తీయాలి.

సాస్ తయారీ: ● పాన్‌లో నూనె వేసి వెల్లుల్లి, మిర్చి, కరివేపాకు, పుదీనా ఆకులు వేసి వేయించాలి. తర్వాత సోయా సాస్, ఎండు మిరపకాయలు, గరం మసాలా, పెరుగు, నీరు వేసి చిక్కగా అయ్యేవరకు ఉడికించాలి. వేయించిన చికెన్‌ను ఈ సాస్‌లో వేసి బాగా కలపాలి. ● పుదీనా లేదా కొత్తిమీరతో అలంకరించి వేడిగా సర్వ్ చేయాలి.



గోవర్ధన్, చెఫ్

చిల్లీ పనీర్



కావలసినవి: పిండి మిశ్రమానికి... పనీర్ – 500 గ్రా. (డైమండ్ షేప్‌లో కట్ చేయాలి); కార్న్ ఫ్లోర్ – 40 గ్రా.; మైదా – 40 గ్రా.; ఉప్పు – టీ స్పూన్; మిరియాల పొడి – టీ స్పూన్; సన్నగా తరిగిన వెల్లుల్లి – టేబుల్ స్పూన్; నీరు – అవసరమైనంత.

సాస్ కోసం... నూనె – 2 టేబుల్ స్పూన్లు; సన్నగా తరిగిన వెల్లుల్లి – 2 టేబుల్ స్పూన్లు; సన్నగా తరిగిన అల్లం – టీ స్పూన్; పచ్చిమిర్చి (డైమండ్ కట్) – 8; గ్రీన్ క్యాప్సికం – ఒకటి (సన్నగా తరగాలి); ఉల్లిపాయ – ఒకటి (సన్నగా తరగాలి); ఉప్పు – తగినంత; చక్కెర – టీ స్పూన్; టొమాటో సాస్ – టేబుల్ స్పూన్; వెనిగర్ – టీ స్పూన్; సోయా సాస్ – టేబుల్ స్పూన్; గ్రీన్ చిల్లీ సాస్ – 2 టేబుల్ స్పూన్లు; రెడ్ చిల్లీ పొడి – టీ స్పూన్; నీళ్లు – 150 మి.లీ.

తయారీ: ● పై పదార్థాలన్నీ ఒక గిన్నెలో వేసి, కలిపి, మిశ్రమం తయారు చేయాలి. పనీర్ ముక్కలను మిశ్రమంలో ముంచి, కాగుతున్న నూనెలో వేసి, బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. ● సాస్ తయారీకి.. పాన్‌లో నూనె పోసి, వేడయ్యాక వెల్లుల్లి–అల్లం వేయించాలి. తరువాత పచ్చిమిర్చి, క్యాప్సికం, ఉల్లిపాయ వేసి, వేపాలి ● ఉప్పు, చక్కెర, టొమాటో సాస్, వెనిగర్, సోయా సాస్, చిల్లీ సాస్, కారం పొడి వేసి, నీళ్లు కలిపి చిక్కగా అయ్యేవరకు ఉడికించాలి ● వేయించిన పనీర్ ముక్కలను ఈ సాస్‌లో వేసి బాగా కలపాలి ● కొత్తిమీర లేదా గుండ్రంగా తరిగిన ఉల్లిపాయ స్లైసులతో అలంకరించి వేడిగా సర్వ్ చేయాలి.

● కిచెన్ టిప్స్



వేపుడు కూరలు వండేటప్పుడు టీస్పూను వెనిగర్ వేస్తే కూర అంతగా నూనె పీల్చుకోదు.

మిగిలిపోయిన చపాతీ, బ్రెడ్‌స్లైసులు గట్టిగా అయిపోయి తినడానికి పనికిరావు. వీటిని ప్లేటులో పెట్టి, ఈ ప్లేటులోనే అరగ్లాసు నీటిని కూడా ఉంచి, మైక్రోవేవ్‌లో పది నిమిషాలు ఉంచాలి. ఇలా చేయడం వల్ల నీళ్లు ఆవిరిగా మారి చపాతి, బ్రెడ్‌స్లైసులు మెత్తబడి, అప్పుడే చేసినవాటిలా తాజాగా ఉండి , తినడానికి పనికొస్తాయి.



సన్నని మంట మీద యాపిల్ తొక్కలు మరిగించిన నీటితో అల్యూమినియం పాత్రలను తోమితే మొండి మరకలు ఇట్టే పోతాయి.



బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
అక్టోబర్ 10న ముగింపు రూ.ల్లో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,28,000	బంగారం (24 క్యారెట్లు)	1,24,450	బంగారం (24 క్యారెట్లు)	1,24,160	బంగారం (24 క్యారెట్లు)	1,24,450	బంగారం (24 క్యారెట్లు)	1,27,500	బంగారం (24 క్యారెట్లు)	1,22,830
బంగారం (22 క్యారెట్లు)	1,16,200	బంగారం (22 క్యారెట్లు)	1,12,100	బంగారం (22 క్యారెట్లు)	1,13,800	బంగారం (22 క్యారెట్లు)	1,15,460	బంగారం (22 క్యారెట్లు)	1,17,300	బంగారం (22 క్యారెట్లు)	1,12,600
వెండి	1,85,000	వెండి	1,65,000	వెండి	1,82,000	వెండి	1,65,000	వెండి	1,68,000	వెండి	1,80,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 200

శనివారం 11-10-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఏదో తింటున్నారంతే

బలహీనంగా కౌమార దశలోని బాలికలు, మహిళలు - 18లో



రుణమే.. బంగారమాయెనే!

ధరల పెరుగుదలతో పసిడి రుణాలకు డిమాండ్. రేటింగ్ ఏజెన్సీ ఇక్రా - 17లో



ఫిలిప్పీన్స్‌లో రెండు భూకంపాలు

ఫిలిప్పీన్స్ దక్షిణ ప్రాంతంలో కొద్ది గంటల వ్యవధిలో సంభవించిన రెండు భూకంపాలు తీవ్ర విధ్వంసం సృష్టించాయి.

- వివరాలు 6లో



అఫ్గాన్‌లో అభివృద్ధి పునఃప్రారంభం

అఫ్గానిస్తాన్‌లో తాలిబన్లు అధికారంలోకి వచ్చాక నిలిచిపోయిన అభివృద్ధి కార్యక్రమాలను భారత్ తిరిగి ప్రారంభించనుంది.

- వివరాలు 6లో



గాజాలో అమల్లోకి కాల్పుల విరమణ

ధ్రువీకరించిన ఇజ్రాయెల్ సైన్యం

శుక్రవారం మధ్యాహ్నం నుంచి గాజాలో నెలకొన్న ప్రశాంతత

యుద్ధానికి ముగింపుపై పెరుగుతున్న ఆశలు

- వివరాలు 6లో



ప్రజాస్వామ్య గళానికి శాంతి నోబెల్

వెనెజువెలా ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడోకు ప్రతిష్టాత్మక పురస్కారం

- ఆంక్షలను లెక్కచేయక వెనెజువెలాలో ప్రజాస్వామ్య పోరాటాలు
- ఆమె పోరాటం లక్షలాది మందికి స్ఫూర్తిగా నిలిచింది: నోబెల్ కమిటీ
- ఆల్ఫ్రెడ్ నోబెల్ ఆకాంక్షలకు అనుగుణంగానే పురస్కారాలు
- నోబెల్ కమిటీ చైర్మన్ జోర్గాన్ వాట్నీ ఫ్రైడ్‌నెస్ ప్రకటన

6లో

ట్రంప్‌కు నోబెల్ నిరాశ

నోబెల్ కమిటీ నిర్ణయంపై వైట్‌హౌస్ అక్కసు.. రాజకీయాలకే విలువిచ్చారని ఆరోపణ

50 శాతంతో ఓకే!

'స్థానిక' పోరుపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు సూచన

ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 9, 41, 42 నిలిపివేత

- సర్కార్ ఉత్తర్వులు సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధం
- మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించడానికి వీలులేదు
- పూర్తి స్థాయిలో మెరిట్స్‌లోకి ఇప్పుడే వెళ్లడం లేదన్న న్యాయస్థానం
- పెంచిన 17% సీట్లను ఓపెన్ కేటగిరీగా పేర్కొని ఎన్నికలు నిర్వహించుకోవచ్చని సూచన
- శుక్రవారం అర్ధరాత్రి తీర్పు కాపీ విడుదల



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 9ని హైకోర్టు సీజే ధర్మాసనం నిలిపివేసింది. దీంతో పాటు మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికలు సంబంధించి పంచాయతీ రాజ్ చట్టం–2018లో రిజర్వేషన్లను మారుస్తూ సెప్టెంబర్ 26న జారీ చేసిన జీవో నంబర్ 41, 42పై కూడా స్టే విధించింది. ప్రస్తుతానికి తాము పూర్తిస్థాయిలో మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని తెలిపింది. వికాస్ కిషన్‌రావ్ గవాలీ కేసులో సుప్రీంకోర్టు రిజర్వేషన్లు 50 శాతానికి మించవద్దని నిర్దేశించిందని, దీన్ని పాటించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వ్యాఖ్యానించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవోలను ఈ కోర్టు నిలిపివేసినందున, రాష్ట్ర ఎన్నికల సంఘం పెంచిన 17 శాతం సీట్లను ఓపెన్ కేటగిరీ సీట్లుగా నోటిఫై చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవచ్చని తేల్చిచెప్పింది. ఈ మేరకు శుక్రవారం అర్ధరాత్రి తీర్పు కాపీని విడుదల చేసింది.

ఓపెన్ కేటగిరీగా నోటిఫై చేయండి..

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినందున ప్రక్రియలో జోక్యం చేసుకోవద్దన్న వాదనలు తమ ముందుకు వచ్చాయని.. వాదనలు

మిగతా 2వ పేజీలో ▶

3 ట్రిలియన్ ఎకానమీ సాధించేదెలా?

- ప్రతి జిల్లా అభివృద్ధి ఎలా సాధ్యం?.. మెరుగైన జీవనమెలా సాధ్యం?
- విద్య, నైపుణ్యాల అభివృద్ధి ఎలా?.. పాలన, పౌర సేవలు ఎలా ఉండాలి?
- రాష్ట్రాభివృద్ధికి మీరేం సూచిస్తారంటూ 8 అంశాలతో రాష్ట్ర ప్రభుత్వ సర్వే

తెలంగాణ రైజింగ్ విజన్-2047 పేరుతో ఆన్‌లైన్‌లో అభిప్రాయ సేకరణ 13లో

Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate				
₹.72	Ex Farm Live Bird	102 kg	Dressed with Skin	180 kg
	Retail Live Bird	124 kg	Skin Less	205 kg

Conditions Apply

Issued in the interest of consumers

క్లుప్తంగా...

సీజేఐపై దాడిని నిరసిస్తూ 13 నుంచి ర్యాలీలు

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వారిమీద చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, దళితులు ఉన్నత స్థానాల్లో కూర్చోవడం కొంతమందికి గిట్టడం లేదని, అందుకే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇది కేవలం చీఫ్ జస్టిస్‌పై దాడి మాత్రమే కాదని, దేశ న్యాయవ్యవస్థ మీద, ప్రధానంగా రాజ్యాంగంపై దాడిగా చూడాలని అన్నారు. ఈ దాడిని నిరసిస్తూ ఈనెల 13న అన్ని కలెక్టర్ కార్యాలయాల ముందు, 17 మండల కేంద్రాల్లో నల్ల జెండాలతో నిరసన ప్రదర్శనలు చేస్తామన్నారు. 22న చలో హైదరాబాద్ పేరుతో భారీ నిరసన ర్యాలీ చేస్తామని వివరించారు. కాగా, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్షం ఏర్పాటు చేయాలని మందకృష్ణ మాదిగ కోరారు.

రిజర్వేషన్లపై 13న జాతీయ రహదారుల దిగ్బంధం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈనెల 13న జాతీయ రహదారులను దిగ్బంధం చేయాలని నిర్ణయించినట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం తెలంగాణ సచివాలయ మీడియా పాయింట్ బయట ఆయన విలేకరులతో మాట్లాడారు. రిజర్వేషన్లు వచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ముందుకు పోవాల్సిన అంశాలపై చర్చించేందుకు బంజారాహిల్స్‌లో ఉన్న కళింగ భవన్‌లో శనివారం అఖిలపక్ష పార్టీలు, బీసీ సంఘాలు, కుల సంఘాలు, మేధావులు, సామాజిక తత్వవేత్తలతో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు జాజుల వెల్లడించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ , బీసీ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బర్ల మనిమంజరి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ హామీ, అమలు బాధ్యత రేవంత్ సర్కార్‌దే

సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై జరుగుతున్న అన్యాయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ అన్నారు. రిజర్వేషన్ హామీతో పాటు అమలు బాధ్యత రేవంత్ సర్కార్‌దేనని, రిజర్వేషన్లు అమలయ్యేందుకు సుప్రీంకోర్టు రివ్యూ కోరాలన్నారు.



ఖర్చు ఎక్కువైనా మంచి వైద్యం అందాల్సిందే..

- నిర్దిష్ట నాణ్యత ప్రమాణాలు ఉండాల్సిందే
- ఆరోగ్య సేవల్లో మరింత పారదర్శకత కోరుతున్న ప్రజలు
- ఫిక్కీ, ఈవై–పార్థనాన్ తాజా నివేదిక వెల్లడి

ఆరోగ్య సమస్య తలెత్తితే ఎక్కడ వైద్యం చేయించుకోవాలి అన్నది దాదాపు ప్రతి ఇంటా ఓ సవాలే. సమస్యకు సత్వర పరిష్కారంతో పాటు ఖర్చులు భారం కాకుండా నమ్మకమైన చికిత్స కోసం ఏ హాస్పిటల్‌ని, ఏ వైద్యుడిని సంప్రదించాలో సన్నిహితులు, స్నేహితుల సలహా తీసుకోవడమూ సహజమే. అయితే మన దేశంలో అత్యధికులు ఆరోగ్య సంరక్షణలో మరింత పారదర్శకతను కోరుకుంటున్నారు. ఈ మేరకు ఆరోగ్య సేవలు నిర్దిష్ట నాణ్యత ప్రమాణాలకు (సర్టిఫైడ్) అనుగుణంగా లభిస్తే ప్రీమియం చెల్లించడానికి సైతం సిద్ధంగా ఉన్నారని ఓ నివేదిక చెబుతోంది.

సాక్షి, స్పెషల్ డెస్క్

అధిక నాణ్యతకే ప్రాధాన్యం

ఫిక్కీ, ఈవై–పార్థనాన్ తాజా నివేదిక ప్రకారం.. మన దేశంలో వైద్యానికి సంబంధించిన సరైన సమాచారం మూడింట ఒక వంతు మందికి మాత్రమే సులభంగా లభిస్తోంది. బ్రాండ్ లేదా వైద్యుడికి ఉన్న పేరు ప్రఖ్యాతులపై 60%, నోటి మాటపై 79% మంది ఆధారపడుతున్నారు. 83% మంది రోగులు.. చికిత్స కోసం వెళ్లాల్సిన ఆసుపత్రి, ఎంచుకోవాల్సిన వైద్యుల ఎంపిక విషయంలో మార్గనిర్దేశం చేయడానికి నిష్పాక్షికమైన, అందుబాటులో ఉన్న సమాచారాన్ని కోరుకుంటున్నారు. ఇటువంటి సమాచారం కోరిన వారిలో దాదాపు 90% మంది సర్టిఫైడ్, అధిక–నాణ్యత గల ఆసుపత్రిలో వైద్యం కోసం ఎక్కువ చెల్లించేందుకు సిద్ధమని చెప్పారు.

మహమ్మారి తర్వాత మారిపోయింది..

వైద్య సేవలు ఎక్కడ మెరుగ్గా ఉంటాయో తెలుసుకోవడానికి భారతీయులు.. బంధువులు, సన్నిహితులపై ఆధారపడుతున్నారు. దశాబ్దాలుగా దాదాపు ప్రతి ఇంటా ఈ తంతు సహజంగా జరుగుతోంది. అయితే కోవిడ్–19 మహమ్మారి తర్వాత పరిస్థితుల్లో మార్పులు వస్తున్నాయని నివేదిక చెబుతోంది. 'నిజంగా మంచి నాణ్యతతో వైద్యం లభిస్తుందా? ఏ ప్రాతిపదికన చెబుతున్నారు. నేను ఎలా గుర్తించాలి?' అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయని నివేదిక పేర్కొంది. సేవల్లో పారదర్శకత కోసమే ఈ డిమాండ్ వస్తోందని తెలిపింది.

వార్షిక వినియోగాన్ని మించి వ్యయం!

అందుబాటు ధరలో వైద్యం అన్నది ఒక ప్రధాన అడ్డంకిగా మిగిలిపోయిందని నివేదిక తెలిపింది. ప్రైవేట్ ఆసుపత్రిలో చేరితే సగటు ఖర్చు రూ.58 వేలు అవుతోంది. ఇది దాదాపు సగం భారతీయ కుటుంబాలు, 70 శాతం గ్రామీణ కుటుంబాల వార్షిక వినియోగ వ్యయాన్ని మించి ఉండటం ఆందోళన కలిగిస్తోంది. రోగులు తమ జేబులకు చిల్లులు పడుతున్నాయని ఆందోళన చెందుతుండడంతో ఇది సున్నితమైన అంశంగా పరిణమించింది. కాగా, 10% కంటే తక్కువ ప్రైవేట్ ఆసుపత్రులు, 2%లోపు డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లు ఎన్ఏబీఎల్ గుర్తింపును కలిగి ఉన్నాయని నివేదిక తెలిపింది.

పటిష్ట కార్యాచరణ అమలు చేయాలి

వైద్య సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి సమన్వయంతో కూడిన బహుముఖ ప్రయత్నం అవసరమని నివేదిక వెల్లడించింది. మెరుగైన వైద్య సేవలు, వ్యయాలను దృష్టిలో పెట్టుకోవడం, వినియోగదారుల సాధికారతను నొక్కి చెబుతూ పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని సూచించింది. మెడికల్ రీయింబర్స్‌మెంట్, కనెక్టెడ్ ఎకోసిస్టమ్ అమలు చేయాలని స్పష్టం చేసింది. సర్వేలో పాలుపంచుకున్న 90% మంది వైద్యులు నాణ్యత ప్రమాణాల ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు.

ఎవరెవరు పాల్గొన్నారంటే..



సర్వేలో భారత్‌కు చెందిన 40 నగరాల్లోని 250 ఆసుపత్రులు పాలుపంచుకున్నాయి. వీటి మొత్తం పడకల సామర్థ్యం 75 వేల పైచిలుకు ఉంది. 1,000 మందికిపైగా రోగులు, 100 మందికిపైగా వైద్యులు, 70 మందికి పైగా సీఈవోలు, సీనియర్ వైద్యులు, నిర్వాహకులు, పెట్టుబడిదారుల నుంచి సమాచారం సేకరించి వాటి ఆధారంగా నివేదిక రూపొందించారు.

అంతా గందరగోళం!

స్థానిక ఎన్నికలపై హైకోర్టు స్టే నేపథ్యంలో కాంగ్రెస్ కేడర్‌లో అయోమయం

- పార్టీ, నామినేటెడ్ పదవులు లేక ఇప్పటికే నిరాశలో నేతలు



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై హైకోర్టు స్టే విధించడంతో అధికార కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడిన నేపథ్యంలో కచ్చితంగా ఎన్నికలు జరుగుతాయని అంతా భావించగా.. ఇప్పుడు అసలు ఎప్పుడు ఎన్నికలు జరుగుతాయో, ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతాయో అర్థం కాక కింది స్థాయి కేడర్ అయోమయంలో పడిపోయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై దాదాపు రెండేళ్లు అవుతున్నా అటు పార్టీ పదవులు కానీ, ఇటు నామినేటెడ్ పదవులు కానీ లేకపోవడంతో నిరాశా నిస్పృహలు నెలకొన్నాయని, ఇప్పుడు స్థానిక ఎన్నికలకు సైతం బ్రేకులు పడడంతో ఏం చేయాలో పాలుపోని స్థితి ఏర్పడిందని పార్టీ శ్రేణులు వాపోతున్నాయి.

కేడర్‌కు దిశానిర్దేశం ఏదీ?: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఏ మేరకు అమలవుతాయన్న దానిపై కూడా కాంగ్రెస్ కేడర్‌కు దిశానిర్దేశం చేసేవారు కరువయ్యారనే విమర్శలు వ్యక్తమవు తున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ఓ స్థాయి నాయకత్వం వరకు మాత్రమే చేరగా, సాధారణ కార్యకర్తల్లో మాత్రం అసలేం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి ఉందని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. 'రిజర్వేషన్ల గురించి మాకు అవగాహన ఉంది. ఈ రిజర్వేషన్లు అమలు కాకపోతే ఎన్నికలు జరిగే అవకాశం కూడా లేదనే స్పష్టత మాకుంది. కానీ, గ్రామాల్లో పనిచేసే కార్యకర్తలకు ఈ అవగాహన లేదు. ఎన్నికలు జరుగుతాయని అందరూ అనుకున్నారు. నోటిఫికేషన్ కూడా రావడంతో అన్ని ఏర్పాట్లు చేసుకుని నామినేషన్లకు సిద్ధమవుతున్న తరుణంలో కోర్టు స్టే విధించడం గందరగోళానికి తెరతీసింది.' అని ఓ మండల స్థాయి కాంగ్రెస్ నాయకుడు వ్యాఖ్యానించారు. రిజర్వేషన్ల సంగతి ఎలా ఉన్నా ఏదో రూపంలో వీలున్నంత త్వరగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడం మేలనే అభిప్రాయం క్షేత్రస్థాయి నాయకత్వంలో వ్యక్తమవుతోంది.

రిజర్వేషన్లపై ముందుకే..

రిజర్వేషన్ల విషయంలో ముందుకే వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌తో పాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌లు ఎట్టి పరిస్థితుల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికల కు వెళ్లాలని పట్టుబడుతున్నారు. ఏఐసీసీ ఆలోచన కూడా ఇదే తరహాలో ఉందని తెలుస్తోంది. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి స్థానిక ఎన్నికలకు వెళితే ఇతర రాష్ట్రాల్లో కూడా మార్గదర్శకంగా ఉంటామని, తాము బీసీలకు న్యాయం చేస్తామని తెలంగాణను చూపించి దేశ వ్యాప్తంగా చెప్పుకునే వెసులుబాటు ఉంటుందని ఏఐసీసీ భావిస్తోంది. పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించి స్థానిక ఎన్నికలు నిర్వహించడం కన్నా కోర్టులు, రాజ్యాంగ ప్రక్రియను అనుసరించి ముందుకు వెళ్లడమే మేలనే భావనలో టీపీసీసీ నాయకత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కోర్టు తీర్పు పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాత ఎన్నికల ప్రక్రియకు మాత్రమే కోర్టు స్టే విధిస్తే, ఆ స్టేను ఎత్తివేయాలని కోరుతూ పార్టీ పరంగా కూడా అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించాలనే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం.

ఎమ్మెల్యే భూపతి రెడ్డికి సీఎం పరామర్శ



సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న భూపతిరెడ్డి. చిత్రంలో మహేశ్‌గౌడ్

సుభాష్‌నగర్: సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి మాతృమూర్తి రేకులపల్లి లక్ష్మీనర్సమ్మ ద్వాదశ దినకర్మ కార్యక్రమానికి హాజరై చిత్రపటానికి నివాళులు అర్పించారు. కాగా, కలెక్టరేట్ వద్ద సీఎంకు వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్లిన బీజేపీ ఎమ్మెల్యేలకు పోలీసులు అభ్యంతరం చెప్పగా, అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు.

బీసీ రిజర్వేషన్లను కాంగ్రెస్ అపహాస్యం చేసింది

బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ పద్ధతుల ద్వారా చేయాల్సిన బీసీ రిజర్వేషన్లను కాంగ్రెస్ పార్టీ అపహాస్యం చేసిందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ విమర్శించారు. కులాల వారీగా కుట్రలు పెంచి కాంగ్రెస్ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వానికి అవగాహన ఉందా..? ఉంటే ఒంటెద్దు పోకడల వెనక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కులగణన వివరాలు పబ్లిక్ డొమైన్‌లో పెట్టకుండా ఎందుకంత గోప్యంగా దాచి పెట్టారని నిలదీశారు. ప్రభుత్వపరంగా నిర్వహించిన సర్వేలు బీసీలు రాజకీయ, ఆర్థిక, విద్యా, ఉద్యోగ అంశాల్లో వెనకబడ్డారని ఎందుకు నిరూపించలేకపోయారని ప్రశ్నించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీ సబ్‌ప్లాన్ కు చట్ట బద్ధత కల్పిస్తామన్న హామీ అమలుకు రేవంత్ రెడ్డికి ఏ కోర్టులు అడ్డమొచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్డీఏకు గండి కొట్టాలనే పన్నాగంలో భాగంగానే ఓట్ల చోరీ, బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ గందరగోళం సృష్టిస్తోందని లక్ష్మణ్ మండిపడ్డారు.

చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి సుప్రీం ముందస్తు బెయిల్

కక్ష సాధింపుతో అరెస్ట్ చేయాలని చూస్తున్నారు

- కారులో డబ్బు దొరికిందంటూ కేసులో ఇరికించారు
- ఇప్పటికే ఇదే అక్రమ కేసులో ఆయన తండ్రి జైల్లో ఉన్నారు
- కుమారుడిని కూడా జైల్లో పెట్టాలని చూస్తున్నారు
- మోహిత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది గోయల్ వాదనలు





సాక్షి, న్యూఢిల్లీ: మద్యం అక్రమ కేసులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ముందస్తు బెయిల్‌ను తిరస్కరిస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ మోహిత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాదుల వాదనలను తోసిపుచ్చిన ధర్మాసనం మోహిత్‌రెడ్డికి మధ్యంతర రక్షణ కల్పించింది. ప్రభుత్వం చెప్పాలనుకుంటున్న వాదనలను నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ రూపంలో దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఆ తర్వాత పిటిషనర్ రెండు వారాల్లోగా రిజాయిండర్ దాఖ లు చేసేందుకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి అవకాశం కల్పించింది. అనంతరం ఈ కేసును తదుపరి విచారణకు జాబితాలో చేర్చనున్నట్లు ధర్మాసనం తెలి పింది.

కక్ష సాధింపే: మోహిత్ తరఫు న్యాయవాది

మోహిత్‌రెడ్డికి బెయిల్ ఇవ్వొద్దంటూ ప్రభుత్వం తరఫున న్యాయవాదుల చేసిన వాదనలను మోహిత్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది నిఖిల్ గోయల్ తోసిపుచ్చారు. పిటిషనర్ పేరు మీద ఉన్న కారులో డబ్బు దొరికిందంటూ ఆయనను ఈ కేసులో ఇరికించారని పేర్కొన్నారు. ఇప్పటికే ఇదే కేసులో ఆయన తండ్రి జైలులో ఉన్నారని, ఇప్పుడు మోహిత్ రెడ్డిని కూడా జైల్లో పెట్టాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కక్ష సాధింపుతోనే ఇదంతా చేస్తున్నట్లు వివరించారు. విచారణకు ఎప్పుడు పిలిచినా వస్తామని, పూర్తిగా సహకరిస్తామని మోహిత్ రెడ్డి ఇప్పటికే పోలీసులకు తెలియజేసిన విషయాన్ని నిఖిల్ గోయల్ ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు.

మీరా బెయిల్‌ను వ్యతిరేకించేది?

ప్రభుత్వ నాయవాదులకు సుప్రీం చురకలు

కాగా, పిటిషన్‌పై విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాదుల తీరుపై కీలకమైన, ఘాటైన వ్యాఖ్యలు చేసింది. 'మీరా బెయిల్‌ను వ్యతిరేకించేది..?' అంటూ సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, సిద్ధార్థ లూథ్రా, సిద్ధార్థ అగర్వాల్‌లను ఉద్దేశించి ధర్మాసనం నేరుగా ప్రశ్నించింది. 'మీరు దేశంలోని మోసగాళ్లందరి తరఫున వాదించే న్యాయవాదులు. దేశంలో జరిగిన అతిపెద్ద కుంభకోణాలలో నిందితులకు మీరే లాయర్లు. ఎప్పుడూ బెయిల్ కోసం వాదించే మీరే.. ఇప్పుడు బెయిల్‌ను వ్యతిరేకిస్తున్నారంటే ఆశ్చర్యంగా ఉంది' అని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. ప్రభుత్వ మద్యం విధానంలో మార్పులు చేసి, దేశవ్యాప్తంగా పేరున్న బ్రాండ్లను తొలగించారని రోహత్గి చేస్తున్న వాదనల సందర్భంగా జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. 'ప్రముఖ బ్రాండ్లను తొలగించి కొత్త బ్రాండ్లను తీసుకురావడం అంటే.. బహుశా ఎంఎస్ఎంఈ (చిన్న, మధ్య తరహా పరిశ్రమల) తరహాలో వాటిని ప్రోత్సహించారేమో..!' అని వ్యాఖ్యానించింది.

ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే ఏడాది నుంచి అల్పాహారం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం (2026–27) నుంచి ఉదయం పూట అల్పాహారం అందించనున్నారు. పాఠశాల విద్యాశాఖ ఇందుకు సంబంధించిన కసరత్తు మొద లుపెట్టింది. విద్యార్థులకు ఉదయం ఇచ్చే అల్పాహా రానికి అయ్యే ఖర్చుపై అంచనాలు రూపొందిస్తున్నారు. మూడు రోజులు బియ్యంతో కూడిన పదార్థాలు, ఒకరోజు ఇడ్లీ, మరో రోజు బొండాను అందించాలనే యోచనలో విద్యాశాఖ ఉంది. రాష్ట్రంలో 18,250 ప్రైమరీ, 3,143 అప్పర్ ప్రైమరీ, 5,704 ఉన్నత పాఠశాలలున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తంగా 16.70 లక్షల మంది విద్యార్థులున్నారు. వీరందరికీ ప్రస్తుతం మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారు. అల్పాహారానికి సంబంధించి ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను కూడా అధికారులు అధ్యయనం చేశారు. ఈ పథకం తీరు తెన్నులపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు పాఠశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు.

రిజర్వేషన్లు ఇవ్వకపోతే కాంగ్రెస్‌కు పుట్టగతులుండవు

బీఆర్ఎస్ నేత క్యామ మల్లేశ్

సాక్షి, హైదరాబాద్: రేవంత్‌రెడ్డి ఓ మేక వన్నె పులి అని బీఆర్ఎస్ నేత క్యామ మల్లేశ్ వ్యాఖ్యానించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోతే కాంగ్రెస్‌కు పుట్టగతులుండవని హెచ్చరించారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, కిశోర్‌గౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, దత్తాత్రేయలతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీపై కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు ఒత్తిడి చేయరని ప్రశ్నించారు. బీసీల నోట్లో మన్ను కొట్టే విధంగా పని చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలను క్షమించే ప్రసక్తే లేదన్నారు.

కాంగ్రెస్‌లా డ్రామా కంపెనీ కాదు: బి.వినోద్



సాక్షి, హైదరాబాద్: బీసీల మనోభావాలతో రాజకీయం చేసేందుకు బీఆర్ఎస్ డ్రామా కంపెనీ కాదని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్ విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో రేవంత్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన జీఓ 9పై హైకోర్టు స్టే విషయంలో బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు అర్థరహితమని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఆమోదించి కేంద్రానికి పంపినా నేటికీ పెండింగులో ఉందన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమా భరత్‌కుమార్ గుప్తా, లీగల్ సెల్ ప్రతినిధి సి.కల్యాణ్‌రావుతో కలిసి వినోద్ మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ ప్రధాని మోదీని ఎందుకు కలవడం లేదని ప్రశ్నించారు. తొమ్మిదో షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశాన్ని చేర్చడంపై కాంగ్రెస్, బీజేపీ దృష్టి పెట్టాలని హితవు పలికారు.

బీసీలు రాజకీయ వాటా కోసం పోరాడాలి

- 14న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో మధుసూదనాచారి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

హిమాయత్‌నగర్/పంజగుట్ట (హైదరాబాద్): రాష్ట్రంలోని రెండు కోట్ల మంది బీసీలు తమ ఆత్మగౌరవం, రాజకీయ రిజర్వేషన్లలో వాటా కోసం ఐక్య పోరాటాలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంతో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఇచ్చిన స్టేను వ్యతిరేకిస్తూ ఈ నెల 14న తలపెట్టిన బీసీల రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం జరిగిన వివిధ రాజకీయ పార్టీల నేతలు, కుల, ఉద్యోగ, మహిళా సంఘాల నాయకుల సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ బీసీల ఉద్యమానికి ఒక స్వరూపం వచ్చే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచిన ప్రతిసారీ రిజర్వేషన్ వ్యతిరేకులు కోర్టుల ద్వారా అడ్డుకుంటున్నారని, కోర్టులు కూడా బీసీలకు న్యాయం చేయడం లేదని విమర్శించారు. హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రివ్యూ కోరాలని అన్నారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ గత 75 ఏళ్లుగా బీసీల రాజ్యాధికారానికి ఆధిపత్య కులాలు, పాలక వర్గాలు అడ్డు పడటం దుర్మార్గం అన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు స్టే ఇవ్వడం నోటికాడి ముద్ద ఎత్తగొట్టడమేనని అన్నారు. ఈ సమావేశంలో చెరుకు సుధాకర్, పల్లె రవికుమార్, గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, బీసీ జనసభ ఆధ్వర్యంలో జనసభ అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలోనూ కృష్ణయ్య మాట్లాడారు. హైకోర్టు స్టేపై నిరసనగా ఈ నెల 14న రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తున్నట్లు చెప్పారు.

ఇదండీ సంగతి



శాంతి బహుమతి ఇవ్వకుండా నాకు శాంతి లేకుండా చేస్తావా!!

50 శాతంతో ఓకే!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాథమిక దశలోనే ఉన్నందున.. గతంలో రాహుల్ రమేశ్‌వాఘ్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఆధారపడుతున్నామని చెప్పింది. రాష్ట్రం లేదా కేంద్ర పాలిత ప్రాంతం ట్రిపుల్ టెస్ట్‌ను పాటించపోతే, స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసే పరిస్థితి లేకుండా, పెంచిన దామాషా సీట్లను ఓపెన్ కేటగిరీ సీట్లుగా నోటిఫై చేసి ఎన్నికలు నిర్వహించాలని ఈసీకి సూచించింది. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవాలని, స్థానిక ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని ఈ కోర్టు భావించడం లేదని చెప్పింది. రిజర్వేషన్ల పెంపు జీవోను నిలిపివేసినందున ఆ మేరకు మార్పు మాత్రమే సూచిస్తున్నామని స్పష్టం చేసింది.

కింకర్తవ్యం..!?

- జీవో నంబర్ 9పై హైకోర్టు స్టే నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మల్లగుల్లాలు

సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42% కోటా జీవోపై హైకోర్టు స్టే విధించడంతో మున్ముందు ఏం జరుగుతుందోనన్న చర్చ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఎలా ముందుకెళ్లాలనేదానిపై ప్రభుత్వం కూడా మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవోపై హైకోర్టు స్టే ఇవ్వడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చినట్టు అటు రాజకీయ వర్గాలు, ఇటు బీసీ సంఘాలు భావిస్తున్నాయి. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుందా లేదా అన్న దానిపై కూడా భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. హైకోర్టు తీర్పు దరిమిలా ఏం చేయాలన్న దానిపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి న్యాయ నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారని, సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేయాలా వద్దా అన్న అంశంపై చర్చలు జరుగుతున్నాయనే సమాచారం అందుతోంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జాతీయ, రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేయగలిగే ఈ అంశంపై పకడ్బందీగా ముందుకు వెళ్లడంపై న్యాయ నిపుణులతో సీఎం చర్చలు జరుపుతున్నట్టుగా తెలుస్తోంది. అసలు హైకోర్టు ఏం తీర్పు ఇచ్చిందనేది కూడా శుక్రవారం అర్ధరాత్రికి స్పష్టత రావడంతో, ఆయా అంశాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్లడంపై ప్రభుత్వ వర్గాలు దృష్టి సారించనున్నాయి. ఈ మేరకు న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపే అవకాశం ఉందని అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందు రెండే ప్రత్యామ్నాయాలున్నాయని రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు. హైకోర్టు స్టేపై సుప్రీంకోర్టును ఆశ్రయించడం ఒకటి కాగా.. జీవో అమలుపై స్టే విధించిన నేపథ్యంలో హైకోర్టు సూచనలకు అనుగుణంగా ఆరు వారాల పాటు వేచి ఉండటం రెండో ప్రత్యామ్నాయమని చెబుతున్నారు. ఆ సమయానికి రాష్ట్రపతి, గవర్నర్లకు పంపిన బిల్లులకు కూడా మూడు నెలల సమయం పూర్తవుతుందని, అప్పుడు అటు సుప్రీంకోర్టు, ఇటు హైకోర్టులో బలమైన వాదనలు వినిపించి బీసీ రిజర్వేషన్ల జీవోకు అనుకూల నిర్ణయాన్ని కోర్టుల నుంచి ఆశించేందుకు అవకాశం ఉంటుందని వారంటున్నారు.

కాలానికీ, కర్మకూ జ్ఞాపకశక్తి ఎక్కువ.
ఎంతకాలం తర్వాత అయినా, మనిషి చేసిన
మంచి చెడులకు ఫలితం ఇవ్వకుండా ఊరుకోవు.
– హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 11 అక్టోబర్ 2025

ట్రంప్‌కు దక్కని నోబెల్!

ప్రకటించటానికి ముందే రివాజుకు భిన్నంగా అందరి నోళ్లలోనూ నానిన నోబెల్ శాంతి పురస్కారం ఈ ఏడాది వెనిజులా విపక్ష నాయకురాలు మరియా కొరీనా మచాడోకు దక్కింది. ఆ దేశంలో ప్రజాస్వామిక హక్కుల కోసమూ... నిరంకుశత్వం నుంచి ప్రజాస్వామ్యానికి న్యాయమైన, శాంతియుతమైన పరివర్తన సాధించేందుకూ ఆమె చేస్తున్న పోరాటానికి గుర్తింపుగా దీన్ని అందిస్తున్నట్టు నార్వే నోబెల్ కమిటీ తెలియజేసింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ పురస్కారంపై బాగా ఆశలు పెట్టుకున్నారు గనుక సహజంగానే ఈ నిర్ణయాన్ని వైట్ హౌస్ తప్పుబట్టింది. శాంతికన్నా రాజకీయాలకే కమిటీ ప్రాధాన్యమిచ్చిందని విమర్శించింది. కమిటీపై ఈ మాదిరి విమర్శలు గతంలో చాలా వచ్చాయి. మేధావులూ, సామాజిక అధ్యయనకారులూ ఆ పని చేసేవారు. అమెరికా, పాశ్చాత్య దేశాలు ప్రాధాన్యతా అంశంగా భావించే వైపు ప్రపంచ ప్రజల చూపు మరల్చటం కోసం నోబెల్ కమిటీ ప్రయత్నిస్తున్నదని విమర్శించేవారు. ఇప్పటికే ట్రంప్ వెనిజులాను అష్టదిగ్బంధం చేశారు. గత నెల మొదట్లో వెనిజులా స్పీడ్ బోట్లు రెండింటిపై అమెరికా సైన్యం విరుచుకు పడటంతో 17 మంది మరణించారు. ఇంతవరకూ అవి మాదక ద్రవ్యాలున్న బోట్లని చెప్పే ఆధారాలేమీ అమెరికా ప్రకటించలేదు. ఇది కేవలం మొదటి దశ అని, రెండో దశ వెనిజులా గడ్డపై ఉంటుందని ట్రంప్ ప్రకటించారు. అది సైనిక జోక్యం కావొచ్చన్న అంచనాలున్నాయి. అమెరికా ఆర్థిక ఆంక్షలతో ఆ దేశం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. వీటన్నిటిపైనా మచాడో స్పందనేమిటో తెలియదు. నిజానికి ఈ ఏడాది సూడాన్‌లో అత్యవసర సేవలు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ, ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థ, డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్ సంస్థ ఈ రేసులో ఉంటాయని పలువురు అనుకున్నారు.

యుద్ధాన్ని వ్యతిరేకించటమో, కాల్పుల విరమణ సాధించటమో పురస్కారానికి అర్హత సాధించిపెడుతుందని ట్రంప్ అనుకున్నందుకు ఆయన్ను నిందించి ప్రయోజనం లేదు. అందుకు నోబెల్ కమిటీ బాధ్యత కూడా ఉంది. గతంలో కమిటీ ఇచ్చిన కొన్ని పురస్కారాలు గమనిస్తే ఈ సంగతి బోధపడుతుంది. 2009లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాకు ఈ పురస్కారం ప్రకటించే నాటికి ఆయన అధికారం లోకొచ్చి తొమ్మిది నెలలైంది. 'విశ్వ మానవాళి ఆకాంక్షల పరిరక్షణలో అమెరికా నిర్ణయాత్మక పాత్రను ఈ పురస్కారం ధ్రువీకరిస్తున్నద'ని ఒబామా ఘనంగా చెప్పుకొన్నారు. కానీ ఆ బహుమతి తనకెందుకిచ్చారో ఇప్పటికీ తెలియటం లేదని 2016లో ఆయన నిజాయతీగా ఒప్పుకొన్నారు. బుష్ మొదలెట్టిన యుద్ధాలను ఆయన మరింత ముందుకు తీసుకుపోయారు. ఒబామా ఏలుబడిలో లిబియా, సిరియా, సోమాలియా, అఫ్గాన్‌లలో అమెరికా సైన్యం దాడుల్లో వేలాదిమంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో నోబెల్ ఎంపిక కమిటీ కార్యదర్శిగా వ్యవహరించిన గీర్ లెండ్‌స్టెడ్ అది ఘోర తప్పిదమని 2015లో అంగీకరించారు. వాస్తవానికి 1973లో నాటి అమెరికా విదేశాంగ మంత్రి హెన్రీ కిసింజర్‌కు శాంతి బహుమతి ప్రకటించినప్పుడు ప్రపంచం నివ్వెరపోయింది. 1971లో బొలీవియా, 1973లో చిలీ దేశాల్లో సైనిక తిరుగుబాట్లకు పథక రచన చేయటం, బంగ్లాదేశ్‌లో పాక్ సైన్యం సాగించిన నరమేధానికి అండదండలీయటం, అనేక చోట్ల నియంతృత్వ ప్రభుత్వాలకు చేయూతనందించటం వగైరాల్లో ఆయన పాత్ర అత్యంత దారుణమైనది.

నిరాయుధీకరణకూ, అంతర్జాతీయ సౌభ్రాతృత్వానికీ చిత్తశుద్ధితో పనిచేసేవారికి మొదట్లో ఆ బహుమతి ఇచ్చేవారు. అటుతర్వాత ఇతరేతర ప్రయోజనాలూ, ఉద్దేశాలూ వచ్చిచేరాయి. వర్తమానంలో ఆయుధాలు పోగేసుకోవటం, బెదిరించటం, క్షిపణులూ, బాంబులతో విధ్వంసం సృష్టించటం ఘనకార్యాలుగా చలామణీ అవుతున్నాయి. అలాంటి అధినేతలు దృఢమైన నాయకులుగా నీరాజనాలందుకుంటున్నారు. ఆ దృక్పథాన్ని మార్చి శాంతి అంటే యుద్ధం లేకపోవటం మాత్రమే కాదనీ, సమాజంలో సమానత్వ సాధనకు కృషి చేయటం, ప్రపంచ శాంతికి దోహదపడటం అని అందరూ గుర్తించేందుకు నోబెల్ కమిటీ తన వంతు ప్రయత్నించిన దాఖలా లేదు. మరి ఈ పురస్కారాల పరమార్థం ఏమిటో ఆ కమిటీయే ఆత్మవిమర్శ చేసుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.పంచమి రా.10.02 వరకు తదుపరి షష్ఠి, **నక్షత్రం:** రోహిణి రా.9.14 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** ప.1.47 నుండి 3.16 వరకు, తదుపరి రా.2.31 నుండి 4.01 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.48 నుండి 7.29 వరకు, **అమృత ఘడియలు:** సా.6.15 నుండి 7.56 వరకు.

సూర్యోదయం : 5.55
సూర్యాస్తమయం: 5.39
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

వంటల పుస్తకం



నేనెప్పుడూ వంట గదిలో ప్రయోగాలు చేస్తుంటాను. కొన్నిసార్లు నాకు అనిపిస్తుంటుంది – నేనొక వంటల పుస్తకం రాయాలని! లేదా నేను కనిపెట్టిన వంటల గురించి పత్రికలకు ఆర్టికల్స్ పంపాలని! తర్వాత మళ్లీ మామూలే. ఫిక్షన్ రాయటంలో పడిపోతాను.

– కిరణ్ దేశాయ్, బుకర్ విజేత

అమ్మ చెప్పింది!



నీ పట్ల ఎవరైనా సరిగా ప్రవర్తించనప్పుడు, వాళ్లను హద్దుల్లో ఉంచటానికి నీ గొంతు పెంచేందుకు ఎప్పుడూ భయపడవద్దని మా అమ్మ నాకు నేర్పింది. అలాగే 'నీ పనులు నువ్వు చేసుకోలేనప్పుడు మాత్రమే ఇతరులను నీకు సహాయం చేయటానికి అనుమతించు' – అని కూడా చెప్పింది.

– అవికా గోర్, నటి

డైట్ చీటింగ్!



సోమవారం, గురువారం నేను 500 కేలరీల కంటే తక్కువ తింటాను. మిగతా ఐదు రోజులూ తిండిబోతులా తినేస్తాను. ఈ దీర్ఘాయుష్షు రహస్యాన్ని నేను బీబీసీ డాక్యుమెంటరీలో ఒక 138 సంవత్సరాల వయసు గల భారతీయ వ్యక్తి నుంచి తెలుసుకున్నాను.

– జిమ్మి కెమ్మెల్, టీవీ హోస్ట్

మనసైన చోటు



నేను హాంకాంగ్‌లో పుట్టాను. జపాన్, చైనాలో పెరిగాను. లండన్‌లో మూడేళ్లు ఉన్నాను. తర్వాత ఇండియా వచ్చాను. అంతా నన్ను లండన్ అమ్మాయి అనుకుంటారు. కానీ కాదు. ఇండియానే నేను నా ఇల్లుగా భావిస్తాను. మనసు ఎక్కడుంటే అదే మన పుట్టిల్లు.

– కత్రినా కైఫ్, నటి

ఓటమీ విలువైనదే!



గెలుపు గురించి నేను ఒకటి చెప్పాలి. ప్లేయర్‌కు ముఖ్యమైనది టైటిల్ కాదు. ఆ టైటిల్ దగ్గరికి మిమ్మల్ని చేర్చిన ప్రయాణం, అందుకు మీరు పడ్డ కష్టం, మెరుగవటానికి చేసిన పోరాటం... ఇవీ విలువైనవి! ఇదే విలువ ఓడిన వారికీ ఉంటుంది.

– ఐతానా బోన్మాటీ, స్పెయిన్ ఫుట్‌బాలర్

విజయం–వ్యక్తిత్వం



పోటీ, అభద్రత, అవకాశాలు రాకపోవటం ప్రతి మనిషి జీవితంలోనూ ఉండేవే. అన్నిటినీ తట్టుకుని నిలబడాలి. మనసు చెప్పినట్లు ముందుకు నడవాలి. విజయం ఆత్మవిశ్వాసాన్ని పెంచితే; నిరాశలు, వైఫల్యాలు వ్యక్తిత్వం బలపడటానికి తోడ్పడతాయి.

– శరద్ మల్హోత్రా, బాలీవుడ్ నటుడు

ప్రజాస్వామ్యంలో ఏకతా శక్తి

సందర్భం



సి.పి. రాధాకృష్ణన్
భారత ఉప రాష్ట్రపతి

ధార్మిక, సాంస్కృతిక, జ్ఞాన భూమి అయిన బిహార్‌లో గంగా, ఘాఘరా నదుల సంగమ స్థానాన ఉన్న సితాబ్ దియారా గ్రామంలో 1902 అక్టోబరు 11న జయప్రకాశ్ నారాయణ్ జన్మించారు. మనమంతా ఆత్మీయంగా జేపీ అని పిలుచుకునే జయప్రకాశ్ నారాయణ్... గొప్ప రాజనీతిజ్ఞుడు, ప్రజాస్వామ్య రక్షకుడు, 'సంపూర్ణ క్రాంతి' రూపశిల్పి. 'లోక్ నాయక్' బిరుదు ఆయనకు ఎవరో పెద్దలు ఇచ్చింది కాదు... 1974 జూన్ 5న పట్నాలోని గాంధీ మైదానంలో సమావేశమైన లక్షలాది ప్రజలు ప్రేమతో ఆయనను 'లోక్ నాయక్' అని పిలిచారు.

రాజకీయ చేతనకు పునాది

సితాబ్‌దియారాలో ప్రాథమిక విద్య అనంతరం పట్నా వెళ్లిన ఆయనను అక్కడి జాతీయవాద వాతావరణం ఆకట్టుకుంది. ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో దేశంలో బ్రిటిష్ ఆక్రమణవాదానికి వ్యతిరేకంగా సాగుతున్న అహింసాయుత, సహాయ నిరాకరణోద్యమం ఆయనపై అమితమైన ప్రభావం చూపింది.

అమెరికాలో ఏడేళ్ల విద్యాభ్యాస సమయంలో మార్క్సిజం వైపు ఆకర్షితుడయ్యారు. దేశంలో సమస్యలన్నింటికీ మార్క్సిజమే పరిష్కారం చూపుతుందని ఆ సమయంలో భావించారు. అయితే, భారత్‌కు తిరిగొచ్చిన తర్వాత ఈ దేశ పరిస్థితులకు మార్క్సిజాన్ని అన్వయించే సాధ్యాసాధ్యాలను అన్వేషించిన అనంతరం... 'ప్రజాస్వామ్య సామ్యవాదం', 'సర్వోదయ' భావనలే ఇక్కడి సమస్యలకు పరిష్కారమన్న నిశ్చయానికి వచ్చారు. ఈ ఆచరణాత్మక దృక్పథమే జేపీ ఔచిత్యానికీ, రాజనీతిజ్ఞతకూ నిదర్శనం.

శ్రమ విలువ తెలిసినవారు!

వినోబా భావే భూదానోద్యమాన్నీ, సర్వోదయ తాత్వికతనూ మేళవిస్తే దేశంలోని భూ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారం లభిస్తుందని 1952లో జేపీ భావించారు. 1954–73 మధ్య కాలంలో ఆయన చేపట్టిన చంబల్ బందిపోట్ల పునరావాసం, అహింసాయుత సంపూర్ణ విప్లవం వంటి కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపునూ, ప్రశంసలనూ పొందాయి.

'శ్రమకు గౌరవం (డిగ్నిటీ ఆఫ్ లేబర్)' అన్న భావనను జేపీ అర్థం చేసుకున్న తీరు కేవలం సైద్ధాంతికపరమైంది కాదు. స్వీయానుభవాల నుంచి గ్రహించినదే. అమెరికాలో అభ్యసిస్తున్న రోజుల్లో 'చదువుకుంటూనే సంపాదించుకోవడం' ఆయనకు అలవడింది. ఆర్థిక అవసరాల కోసం చిన్న చిన్న పనులు చేశారు. నిజాయతీగల శ్రమకు గౌరవం, న్యాయబద్ధమైన వేతనాలు, మానవీయ పని వాతావరణం ఉండి తీరాలన్న ఆయన నిశ్చయాన్ని ఇవి మరింత బలోపేతం చేశాయి. కార్మిక వర్గ సంక్షేమమే న్యాయబద్ధమైన సమాజానికి పునాది అన్న దృఢమైన నిశ్చయంతో ఆయన భారత్‌కు వచ్చారు. ముఖ్యంగా 1947లో మూడు ముఖ్యమైన అఖిల భారత కార్మిక సంఘాలు – అఖిల భారత రైల్వే సిబ్బంది సమాఖ్య, అఖిల భారత పోస్టుమెన్ – టెలిగ్రాఫ్ దిగువ స్థాయి సిబ్బంది సంఘం, అఖిల భారత ఆయుధ కర్మాగారాల కార్మికుల సంఘాలకు ఆయన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.



నేడు 'లోక్‌నాయక్' జయప్రకాశ్ నారాయణ్ జయంతి

◆ ఎంత కఠినమైన సవాళ్లు ఎదురైనా, ప్రజలు తలచుకుంటే మార్పును తేగలరని చెప్పడానికి జేపీ జీవితం, బోధనలు నిదర్శనం. ప్రజాస్వామ్య విలువలను రక్షించుకుంటూనే – సమానత్వం, న్యాయం, శాంతి నెలకొని ఉన్న సమాజాన్ని నిర్మించాలన్నది ఆయన బోధనల సారాంశం.

1960ల సమయంలో రుతుపవనాల వైఫల్యం బిహార్‌ను కరవు పరిస్థితిలోకి నెట్టింది. ఆ సమయంలో జేపీ తన భూదానోద్యమ సహచరులు, అనుచరులతో కలిసి ప్రజల బాధలను తగ్గించేందుకు సహాయక చర్యల్లో తలమునకలయ్యారు. 'బిహార్ రాహత్ కమిటీ'తో ఈ సమయంలోనే ఆయనకు మంచి అనుబంధం ఏర్పడింది. ఆర్‌ఎస్‌ఎస్ స్వయంసేవకుల 'దేశ సేవా దృక్పథా'న్ని ప్రత్యక్షంగా చూశారు. అది ఆయననెంతో ప్రభావితం చేసింది.

నా అనుభవం

జీవితంలో ప్రతి దశలోనూ అవినీతి సమస్యను ఎదుర్కొన్న జేపీ... భారతీయ సమాజ పునరుజ్జీవనం, పునర్నిర్మాణంలో భాగస్వాములయ్యేలా దేశ యువతను ప్రేరేపించాల్సిన ఆవశ్యకత ఉందని భావించారు. ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజలు విశ్వాసం కోల్పోతున్న తరుణంలో... ప్రజాస్వామ్య శక్తిపై వారిలో ఆశలనూ, నమ్మకాన్నీ పునరుద్ధరించారు. 1973లో వినోబా భావే పవనార్ ఆశ్రమం నుంచి 'సంపూర్ణ విప్లవం' దిశగా జేపీ స్పష్టంగా పిలుపునిచ్చారు. ఆదర్శ మానవీయ సమాజాన్ని సాధించడమే 'సంపూర్ణ క్రాంతి' ఉద్యమ లక్ష్యం. అవినీతికి వ్యతిరేకంగా నిరంతరం గొంతెత్తిన ఆయన భావాలు నాటి రాజకీయాల్లో వేళ్లూనుకున్నాయి. ప్రజల్లో చైతన్యాన్ని రగల్చగల ఆయన సమర్థత, 1977లో దేశంలో ఓ కొత్త వ్యవస్థను నెలకొల్పే దిశగా వారి ఆగ్రహాన్ని ఆయన మళ్లించిన తీరు అనన్య సామాన్యం.

19 ఏళ్ల యువకుడిగా కోయంబత్తూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా 'సంపూర్ణ క్రాంతి' ఉద్యమంలో భాగస్వామినయ్యే అవకాశం దక్కడం నాకు లభించిన గొప్ప గౌరవం. ఈ దశలో, దేశ చరిత్రలో అత్యంత కీలక సమయంలో నేను నేర్చుకున్న విషయాలు యువకుడిగా ఉన్న నన్ను... ఆత్మవిశ్వాసంతో కూడిన, సామాజిక అవగాహన కలిగిన నాయకుడిగా తీర్చిదిద్దాయి.

మన ప్రియతమ నేత జయప్రకాశ్ నారాయణ్‌ను ప్రేమగా గుర్తు చేసుకుంటున్న మనం... దేశ స్వాతంత్ర్యోద్యమం కోసం నిస్వార్థంగా బ్రహ్మచర్య ప్రతిజ్ఞ చేసిన ఆయన జీవిత భాగస్వామి ప్రభావతీ దేవినీ మరవకూడదు. గాంధీ ఆదర్శాల సాధన కోసం నిస్వార్థంగా ఆమె తన శక్తినంతా వెచ్చించారు.

జేపీ వారసత్వం

1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమం నుంచి 1970లో చేపట్టిన 'సంపూర్ణ క్రాంతి' దాకా... దేశం పట్ల ఉన్న ప్రేమ భావనే ఆయనను నిరంతరం ముందుకు నడిపింది. ప్రభుత్వంలో తనకు నచ్చిన పదవిని పొందే అవకాశం దొరికినప్పటికీ, అధికార వ్యామోహానికి ఆయనెప్పుడూ లొంగలేదు. నిస్వార్థ దేశసేవకే కట్టుబడి ఉన్నారు.

ఎంత కఠినమైన సవాళ్లు ఎదురైనా, ప్రజలు తలచుకుంటే మార్పును తేగలరని చెప్పడానికి జేపీ జీవితం, బోధనలు నిదర్శనం. ప్రజాస్వామ్య విలువలను రక్షించుకుంటూనే – సమానత్వం, న్యాయం, శాంతి నెలకొని ఉన్న సమాజాన్ని నిర్మించాలన్నది ఆయన బోధనల సారాంశం. సామాజిక, ఆర్థిక న్యాయమూ, రాజకీయ స్వేచ్ఛ విడదీయలేనివని ప్రకటించిన దార్శనిక నాయకుడాయన.

విప్లవమంటే హింస అని భావించే అవకాశం ఉంది. కానీ, జేపీ చేపట్టిన సంపూర్ణ విప్లవానికి అహింసే ప్రాతిపదిక. అహింసాయుత ప్రజా ఉద్యమం ద్వారా... వ్యవస్థాగతంగానూ, సామాజికంగానూ మానవత, నైతికత విలువల ఆధారంగా భారత పురోగమనానికి ఆయన పునాది వేశారు. జాగరూకులమై, నిస్వార్థం, సేవ, సత్యసంధతతో భారత అభ్యున్నతికి కృషి చేయడమే మనం 'భారతరత్న' జేపీకి అందించే నిజమైన నివాళి. ◆

చేయూతే దివ్యౌషధం

మానవ జీవితంలో జ్ఞాపకం ఒక అద్భుతమైన బహుమానం. మన అనుభవాలు, మన సంస్కృతి, మన సంబంధాలు అన్నీ జ్ఞాపక శక్తి మీద ఆధారపడి ఉంటాయి. కానీ ఆ జ్ఞాపకం మన నుండి నెమ్మదిగా జారిపోతే? మన సొంత గతం గుర్తుకు రాకపోతే? మనకు బంధువులూ, మనకిష్టమైన వ్యక్తులూ కూడా అపరిచితులైపోతే? ఇదే మతిమరుపు వ్యాధి (డిమెన్షియా) అనే అనివార్యమైన సవాలు!

మతిమరుపు అనేది ఒక వ్యాధి కాదు. ఇది ఒక సిండ్రోమ్. అంటే లక్షణాల సముదాయం. ప్రధానంగా ఇది మెదడు క్రమానుగత క్షీణత వల్ల వస్తుంది. అల్జీమర్స్ వ్యాధి... మతిమరుపు కేసుల్లో సుమారు 60–70 శాతానికి కారణం. ఇతర కారణాల్లో వాస్క్యులర్ డిమెన్షియా, లెవీ బాడీ డిమెన్షియా, ఫ్రంటోటెంపరల్ డిమెన్షియా ఉంటాయి. మతిమరుపు రావడానికి ముఖ్యమైన కారణాలలో వయస్సు పెరగడం, జన్యు ప్రభావం, మెదడులో అమిలాయిడ్ ప్లాక్‌లు, టావ్ ప్రోటీన్ తంతువులు, రక్తనాళ సమస్యలు (స్ట్రోక్ వంటి పరిస్థితులు), మద్యం, పొగాకు దుర్వినియోగం, జీవనశైలి సంబంధిత కారణాలు, అధిక రక్తపోటు, షుగర్, కొలెస్ట్రాల్ లాంటివి ఉన్నాయి.

ప్రస్తుతం భారత్‌లో సుమారు 45–50 లక్షల మంది మతి మరుపుతో బాధపడుతున్నారు. ఇది కేవలం వైద్య సమస్య మాత్రమే కాదు, ఒక సామాజిక–ఆర్థిక సవాలు.

పెరగనున్న సవాలు

జ్ఞాపకాలు జారిపోతాయి. మనసులో చెప్పదలచుకున్నది ఉంటుంది, కానీ నోరు తడబడుతుంది. ఒక్కొక్కసారి ఒక పదం కోసం నిమిషాల తరబడి కష్టపడటం కనిపిస్తుంది. ఎన్నో ఏళ్ళుగా చేసిన పనులు కూడా చేయలేకపోవడం – డబ్బు లావాదేవీ లాంటి చిన్న పనిలోనూ గందరగోళం కనిపిస్తుంది. తమను తామే అనుమానించుకోవడం, ఎప్పుడూ నవ్వుతూ ఉండే వ్యక్తి ఒక్కసారిగా కోపంతో, అనుమానంతో రగిలిపోవడం, బట్టలు సరిగ్గా వేసుకోలేకపోవడం, వంటలో ఉప్పు వేయడం మరిచిపోవడం, తాను తినడం కూడా మర్చిపోవడం గమనించవచ్చు.



మన కుటుంబాలలో, సమాజంలో, వైద్య రంగంలో ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే... రాబోయే దశాబ్దాల్లో ఇది పెద్ద సునామీలా దూసుకొస్తుంది. 'జ్ఞాపకాలు లేని జీవితం' కేవలం రోగికి మాత్రమే కాదు, మొత్తం కుటుంబానికీ ఒక పరీక్ష అవుతుంది. కాబట్టి, ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకుని, ముందస్తు చర్యలు తీసుకోవాలి. మతిమరుపు రోగులకు మానవత్వంతో సహాయం చేయాలి.

మనం ఏం చేయాలి?

ప్రారంభ లక్షణాలను గుర్తించకపోవడం, ఆర్థికంగా దీర్ఘకాలిక చికిత్సకు అయ్యే ఖర్చులను భరించలేకపోవడం వల్ల వ్యాధి ముదిరిపోయి మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తుంది. ప్రస్తుతం మతిమరుపునకు పూర్తిస్థాయి ఔషధ నివారణ లేదు. అయినప్పటికీ డోనెపెజిల్, రివాస్టిగ్మిన్, మెమెంటైన్ వంటి ఔషధాలు కొన్ని లక్షణాలను నియంత్రిస్తాయి. జ్ఞాపక వ్యాయామాలు, సంగీతం, కళ, ఫిజియోథెరపీ ద్వారా రోగికి మానసిక ఊరట కల్పించవచ్చు. కుటుంబ సభ్యులు రోగిని తిట్టకుండా, ఓర్పుతో, ప్రేమతో చూసుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం (పండ్లు, కూరగాయలు, గింజలు), నియమిత వ్యాయామం, పొగ త్రాగకపోవడం, మద్యం తగ్గించడం, రక్తపోటు, మధుమేహాల నియంత్రణ; పఠనం, పజిళ్లు, సామాజిక సంబంధాలు ద్వారా మెదడును చురుకుగా ఉంచడం అత్యంత కీలకం. ప్రభుత్వం... డిమెన్షియా ఫ్రెండ్లీ సిటీలు, హెల్ప్‌లైన్‌లు, సంరక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

– డా॥ బి. హర్షిణి, ఎండీ (సైకియాట్రీ)
ఫాదర్ ముల్లర్ మెడికల్ సైన్సెస్, కర్ణాటక

హక్కుల ఉద్యమ తాత్వికసారం

ఇన్ బాక్స్

బాలగోపాల్ మరణించి 16 సంవత్సరాలు గడిచినా ఆయన అందించిన చైతన్య దీప్తి నిరాటంకంగా వెలుగుతూనే ఉంది. ఆయన ప్రయాణం ఆది నుంచీ ఒక కొత్త మార్గంలోనే నడిచినా, అది ఆనాటి పౌర హక్కుల ఉద్యమంలో చేరిన తర్వాత అనూహ్యమైన వేగం పుంజుకొని కొత్త పుంతలు తొక్కింది. సమాజపు సంక్లిష్టమైన సంబంధాలను, వానిలో అంతర్లీనంగా ఉన్న అంతరాలను పొరలు పొరలుగా విప్పి, వాటిని తులనాత్మక చర్చకు గురిచేసిన ఆర్గానిక్ మేధావి బాలగోపాల్.

అధికారాన్ని నిరంతరం సందేహించవలసి ఉంటుందనీ, అధికారం మరే ఇతర విషయాలకన్నా మానవ స్వభావాన్నీ, ప్రవర్తననూ పెద్ద ఎత్తున ప్రభావితం చేయగల శక్తి అనీ, నిజానికి అధికారాన్ని సందేహించని వారు హక్కుల కార్యకర్తలు కాజాలరనీ ఆయన చేసిన సూత్రీకరణ అసామాన్యమైనది. మానవ స్వభావపు వైవిధ్యాన్ని హక్కుల కోణం నుంచి ఆవిష్కరించినప్పుడు... వ్యక్తికీ– సమూహానికీ మధ్య నిరంతర సంఘర్షణను మనం గుర్తించక తప్పదనీ, ఆ సంఘర్షణను పరిష్కరించే ప్రయత్నంలో కనుగొనబడ్డ రాజకీయ నిర్మాణాలలో ప్రజాస్వామ్యం ఇప్పటికీ మెరుగైనదేననీ, అయితే దానిలో గల లోపాలను, దానికి గల పరిమితులను ఇంకా మనం పరిష్కరించుకోవలసే ఉన్నదనీ తన రచనల ద్వారా, ప్రసంగాల ద్వారా ప్రభావితం చేసిన వ్యక్తి ఆయన.



కె. బాలగోపాల్

ఆయన జీవించిన కాలం నాటికి తెలుగు సమాజం మాత్రమే కాదు, మొత్తంగా భారత సమాజం ఎదుర్కొన్న అతి క్లిష్టమైన సామాజిక సమస్యలనూ, సందర్భాలనూ తన సునిశిత పరిశీలనా శక్తితో విశ్లేషించి వీలైనంత న్యాయంగా సంతులనమైన పరిష్కారాలు సూచించారు. ఒకవైపు హక్కుల ఉద్యమపు దిక్సూచిగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తూనే సాహిత్య రంగంలో కూడా విశిష్టమైన కృషి చేశారు. మానవ స్వభావపు సంక్లిష్టతలను సాంఘిక జీవితం పసిగట్ట లేనప్పుడు ఆ వెలితిని పూడ్చగలిగేదీ, ఆ అంతరాలను పసిగట్టగలిగేదీ సాహిత్యం మాత్రమేనన్నారు. అదే నిజానికి దాని ప్రయోజనం అనీ ఆయన ప్రగాఢంగా విశ్వసించారు. హక్కుల తాత్వికతను తను ఎంచుకున్న న్యాయవాద వృత్తికి జోడించి తను చేసిన రచనలు ఆయన దార్శనికతకూ, సునిశిత పరిశీలనా దృష్టికీ అద్దం పడతాయి.

ఆయన జ్ఞాపకాలను నెమరేసుకోవటానికి 12వ తేదీ ఆదివారం, హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం ఏర్పాటయ్యింది. ఇందులో 'బస్తర్ ఎవరిది? భవిష్యత్తు కోసం ఆదివాసీల పోరాటం' అంశంపై ఢిల్లీ విశ్వవిద్యాలయం సోషియాలజీ ప్రొఫెసర్ నందినీ సుందర్, 'కృత్రిమ మేధ కాలంలో గోప్యత' అంశంపై ఇంటర్నెట్ ఫ్రీడం ఫౌండేషన్‌కు చెందిన అపర్ గుప్తా, 'ప్రాతినిధ్య ప్రజాస్వామ్యపు నిర్మాణానికి ఎదురవుతున్న సవాళ్లు' అంశంపై 'భారత్ జోడో అభియాన్' నాయకులు యోగేంద్ర యాదవ్, 'భూ చౌర్యానికి కొత్త పద్ధతులు' అంశంపై 'ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్'కు చెందిన పీఎస్ అజయ్ కుమార్ ప్రసంగిస్తారు.


– టి. హరికృష్ణ I మానవ హక్కుల వేదిక
(రేపు హైదరాబాద్‌లో కె. బాలగోపాల్ సంస్మరణ సభ)

డేటా పాయింట్

పరిమితికి మించి ఖైదీలు

దేశంలో జైళ్లు సామర్థ్యానికి మించి ఖైదీలతో నిండిపోతున్నాయి. 2005లో ఆక్యుపెన్సీ రేటు 145 శాతం ఉండేది. అయితే, 2022లో 131 శాతానికి, 2023 నాటికి 121 శాతానికి మాత్రమే తగ్గింది.





సేవతోనే మనశ్శాంతి

జ్యోతిర్మయం

ఒకరోజు ఒక యువకుడు స్వామి వివేకానందను చూడటానికి వచ్చాడు. 'స్వామీ! నాకు అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. కానీ నాకు మనశ్శాంతి లేదు. నేను మంచం మీద పడుకుంటాను, కానీ నాకు నిద్ర పట్టదు. ఏవేవో ఆలోచనలు నన్ను పడుకోనివ్వవు' అని అన్నాడా యువకుడు.

'నాకు దేవుడిపై చాలా నమ్మకం ఉంది. ప్రతి రోజూ నేను చాలాసేపు నాకెంతో ఇష్టమైన దైవాన్ని పూజిస్తుంటాను. కానీ నా మనస్సు స్థిరంగా ఉండటం లేదు. ఉండాలని ఎంత ప్రయత్నించినా ఫలితం లేదు. అందరూ నన్ను నిలకడలేని మనిషి అంటుంటారు. నేను కళ్ళు మూసుకుని ధ్యానం చేయడానికి కూర్చున్నప్పుడు, నా మనస్సు నా దగ్గరుండదు. ఎక్కడెక్కడికో ప్రయాణం చేస్తుంది. కనుక స్థిరచిత్తం కోసం మీరు నాకు మంచి మార్గం చూపించాలి' అని అడిగాడు.

అందుకు స్వామి వివేకానంద 'మనశ్శాంతిని పొందడానికి ఉత్తమ మార్గం నిస్వార్థ ప్రజాసేవలో పాల్గొనడమే! మీ ఇంటి చుట్టూ పేదలు, నిస్సహాయ వ్యక్తులు నివసిస్తుంటే, వారికి నువ్వు చేయగలిగినదంతా చేయాలి. ఏ అండా లేకుండా పడి ఉన్న రోగులకు సేవ చేయాలి! నిజమైన సంతృప్తి ఇతరులకు సేవ చేయడంలోనే పొందవచ్చు. మనస్సులో సంతృప్తి ఉంటే, ప్రశాంతతకు లోటుండదు.

నువ్విది గ్రహించకపోతే, ఎంత ప్రయత్నించినా కచ్చితంగా ధ్యానం చేయలేవు. నీ మనస్సు ఒకే చోట ఉండదు. పరిపరి విధాల ఆలోచిస్తుంటుంది. ఎటో పోతుంటుంది. అందుకే మనసుని నియంత్రించుకోవడం ప్రధానం' అని బోధించారు.

– యామిజాల జగదీశ్

ఉద్యోగులకు 42% ఫిట్‌మెంట్ అమలు చేయాలి

తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు

సాక్షి, హైదరాబాద్/పాపన్నపేట(మెదక్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 42 శాతం ఫిట్‌మెంట్ అమలు చేయాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. 'ఓ తండ్రిని కొడుకులుగా అడుగుతున్నాం. వెంటనే 42 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించండి. కనీసం రెండు డీఏలు చెల్లించండి. నెలనెలా చెల్లిస్తామన్న రూ.700 కోట్ల బకాయిల వివరాలు తెలపండి. లక్షలాది ఉద్యోగుల అసంతృప్తి ఆగ్రహంగా మారకుండా చూడండి' అని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఏడుపాయల వద్ద టీజీఓ కేంద్ర సంఘం


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో 13 అంశాలపై తీర్మానం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి తీర్మానాలను పంపనున్నట్లు తెలిపారు.

ప్రధాన తీర్మానాలివే..

➤ ఉద్యోగులకు 42 శాతం ఫిట్‌మెంట్ అమలు చేయాలి. ➤ ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను వెంటనే విడుదల చేయాలి.
➤ ఈహెచ్‌ఎస్ విధివిధానాలను వెంటనే అమలు చేయాలి. ➤ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. ➤ ఉద్యోగులకు సంబంధించి 64 డిమాండ్లలో 25 డిమాండ్లను కొంతమేర పరిష్కరించినందుకు ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ➤ వివిధ ప్రభుత్వ శాఖల్లో అద్దె వాహనాల బిల్లులు వెంటనే చెల్లించాలి.
➤ జిల్లా శాఖలు, ఫోరమ్‌లకు ఆఫీసు భవనాలకు భూ కేటాయింపులు చేయాలి.

'ప్రవాసీ ప్రజావాణి'కి చిత్ర రూపం

- స్వీకరించిన వినతుల ద్వారా జరిగిన పరిష్కారంపై డాక్యుమెంటరీ
- త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ


కొడిచెర్లలో డాక్యుమెంటరీ చిత్రీకరణ

మోర్తాడ్ (బాల్కొండ): వలస కార్మికుల సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిర్వహిస్తున్న ప్రవాసీ ప్రజావాణి కార్యక్రమానికి చిత్ర రూపమిస్తున్నారు. 15 నిమిషాల నిడివిగల డాక్యుమెంటరీని ఐదు రోజుల పాటు చిత్రీకరించి ఇటీవలే పూర్తి చేశారు. ఎన్నారై సెల్ అమెరికా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న బొజ్జా అమరేందర్‌రెడ్డి నిర్మాణ సారథ్యంలో సినీదర్శకుడు సునీల్‌కుమార్‌రెడ్డి మార్గదర్శకంలో ఈ డాక్యుమెంటరీని చిత్రీకరించారు. స్క్రీన్ షాట్ స్టూడియోస్ సాంకేతిక సహకారం అందించగా ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ పరిసరాల్లో డాక్యుమెంటరీని చిత్రీకరించారు. ఏడాది గా ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రాలు అందించి తమ సమస్యను పరిష్కరించుకున్న బాధిత కుటుంబాలను ఈ డాక్యుమెంటరీలో భాగస్వామ్యం చేశారు. వలస కార్మికులు తమ కుటుంబాలు జరిగిన న్యాయం, ప్రయోజనాలను వివరించగా డాక్యుమెంటరీలో పొందు పరిచినట్లు దర్శకుడు సునీల్‌కుమార్‌రెడి తెలిపారు.

ప్రజాస్వామ్య గళానికి శాంతి నోబెల్

వెనెజువెలా ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడోకు ప్రతిష్టాత్మక పురస్కారం

కఠిన ఆంక్షలను లెక్కచేయక ప్రజాస్వామ్య పోరాటాలు ● ఆమె పోరాటం లక్షలమందికి స్ఫూర్తిగా నిలిచింది: నోబెల్ కమిటీ

ఓస్లో: ఎవరిని వరిస్తుందా అని ప్రపంచమంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నోబెల్ శాంతి బహుమతి 2025 సంవత్సరానికి వెనెజువెలా ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడో (57)కు లభించింది. ఓస్లోలో నోబెల్ కమిటీ శుక్రవారం ఈ మేరకు ప్రకటన చేసింది. 'చుట్టూ చీకట్లు ముసురుకుంటున్నా ధైర్యంగా నిలబడి ప్రజాస్వామ్య అగ్నిజ్వాలను ఆరిపోకుండా రగిలించారు. లక్షల మందికి ఆదర్శంగా నిలిచారు'అని మచాడోను నోబెల్ కమిటీ ప్రశంసల్లో ముంచెత్తింది. ప్రపంచవ్యాప్తంగా ఏడు యుద్ధాలు ఆపిన తనకే నోబెల్ శాంతి బహుమతి దక్కాలని ఎంత బలంగా వాదించినా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నిరాశే ఎదురయ్యింది.

నిర్బంధాలను ఎదిరించి నిలిచిన నేత

కమ్యూనిస్టు వెనెజువెలాలో ప్రజాస్వామ్యం కోసం మరియా కొరినా మచాడో పోరాడుతున్నారు. నికొలాస్ మదురోకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నింటినీ ఏకం చేసి పోరాటం చేస్తున్నారు. దీంతో ఆమెపై మధురో ప్రభుత్వం తీవ్ర నిర్బంధం విధించింది. ఇతర విపక్ష నేతలంతా అరెస్టులకు భయపడి దేశం విడిచి వెళ్లిపోయినా ఆమె మాత్రం సొంత దేశంలోనే ఉండి ప్రజాస్వామ్య వాదులకు స్ఫూర్తినిస్తున్నారు. గత సంవత్సరం వెనెజువెలాలో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో అధ్యక్షుడు మదురోకు పోటీగా ఎన్నికల్లో నిలబడుతున్నట్లు మరియా ప్రకటించారు. కానీ, ఆ దేశ ఎన్నికల సంఘం ఆమె అభ్యర్థిత్వాన్ని తిరస్కరించింది. దీంతో ఆమె మరో ప్రతిపక్ష నేత ఎడ్మండో గోంజాలెజ్‌కు మద్దతు పలికారు. కానీ, ఎన్నికల్లో మదురో 51.95 శాతం ఓట్లు సాధించి విజయం సాధించినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. మదురో వరుసగా మూడోసారి అధ్యక్షుడయ్యారు. ఆ వెంటనే ప్రజాస్వామ్యవాదులు, ప్రతిపక్ష నేతలపై ఉక్కుపాదం మోపారు. దీంతో చాలామంది దేశం విడిచి వెళ్లిపోవటమో, అజ్ఞాతంలోకి వెళ్లటమో జరిగింది. మరియా కూడా ఏడాది కాలంగా అజ్ఞాతంలోనే ఉన్నారు. గోంజాలెజ్ స్పెయిన్‌లో రాజకీయ ఆశ్రయం పొందారు. అయితే, ఎన్నికల ఫలితాలను తారుమారు చేశారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. గోంజాలెజ్ 67 శాతం ఓట్లు సాధించి స్పష్టమైన విజయం సాధించారని మరియా ఎన్నికల తర్వాత వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు.

నా నోబెల్ ట్రంప్‌కు అంకితం

నోబెల్ శాంతి పురస్కారం లభించక వేదన పడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కొంత సాంత్వన, మరికొంత చికాకు కలిగించే పరిణామం ఇది. ఈ ఏడాది శాంతి నోబెల్ పురస్కారం పొందిన వెనెజువెలా ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడో.. తన పురస్కారాన్ని ట్రంప్‌కు అంకితమిస్తున్నట్లు ప్రకటించారు. నోబెల్ పురస్కారం లభించటంపై సంతోషం వ్యక్తంచేస్తూ ఎక్స్‌లో ఆమె ఓ సందేశం పోస్ట్ చేశారు. 'స్వేచ్ఛ కోసం పోరాటం చేస్తున్న వెనెజువెలా ప్రజలందరికీ లభించిన గుర్తింపు ఇది. ఈ గుర్తింపు మా పోరాటానికి మరింత శక్తినిస్తుంది. మేం విజయానికి అతి సమీపంలో ఉన్నాం. మేము స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం సాధించేందుకు సహకారం అందిస్తున్న అధ్యక్షుడు ట్రంప్, అమెరికా ప్రజలు, లాటిన్ అమెరికా, ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాల్లో మా భాగస్వాములను ఎప్పటికీ గుర్తుంచుకుంటాం. ఈ పురస్కారాన్ని కష్టాలు అనుభవిస్తున్న వెనెజువెలా ప్రజలతోపాటు మాకు నిర్ణయాత్మక మద్దతిస్తున్న అధ్యక్షుడు ట్రంప్‌కు అంకితం ఇస్తున్నా'అని మచాడో పేర్కొన్నారు.


మరియా కొరినా మచాడో

ఇంజనీర్ నుంచి రాజకీయ నేతగా

మరియా మచాడో వెనెజువెలా రాజధాని కారకాస్‌లో అక్టోబర్ 7, 1967లో జన్మించారు. ఇండస్ట్రియల్ ఇంజనీర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె.. 2002లో రాజకీయాల్లోకి వచ్చారు. ఆ సంవత్సరమే ఆమె రాజకీయ హక్కులు, ఎన్నికల పర్యవేక్షణ కోసం సుమటే పేరుతో ఓ స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. దాని ద్వారా వెనెజువెలాలో ప్రజాస్వామ్య పోరాటం చేస్తున్నారు. 'బుల్లెట్ల స్థానంలో బ్యాలెట్‌ను ప్రోత్సహించటమే నా లక్ష్యం 'అని గతంలో ఆమె ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. మచాడో వెనెజువెలా కులీన (ప్రభువర్గం) వర్గానికి చెందినవారు. వెనెజువెలా మూడో మార ఆఫ టోరో (ఆ దేశంలో ప్రభువులకు ఇచ్చే బిరుదు) సెబాస్టియన్ జోష్ ఆంటోనియో రోడ్రిగేజ్ డెల్ టోరో యే అసానియో వారసురాలు. ఆ దేశ ప్రముఖ రచయిత, రాజకీయ నాయకుడు ఎడ్వార్డో బ్లానో ఆమెకు ముత్తాత అవుతారు. ఆమె ఆండ్రెస్ బెల్లో క్యాథలిక్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదివారు. ఇన్‌స్టిట్యూటో డి ఎస్టుడియోస్ సుపీరియరెస్ డి అడ్మినిస్ట్రాసియోలో మాస్టర్స్ చేశారు. ఆమెకు ముగ్గురు సంతానం. 1992లో ఈటెనా ఫౌండేషన్‌ను స్థాపించారు. అయితే, 2002 నుంచి సుమటే కార్యక్రమాలతో ఆమెకు దేశంలో మంచి పేరు వచ్చింది. 2011 నుంచి 2014 వరకు ఆ దేశ నేషనల్ అసెంబ్లీ సభ్యురాలిగా కొనసాగారు. ప్రస్తుతం 'వెంటే వెనెజువెలా'రాజకీయ పార్టీకి సమన్వయకర్తగా కొనసాగుతున్నారు. ఆ పార్టీ తరఫున ఆమె 2012లోనే అధ్యక్ష బరిలో దిగారు. కానీ, ప్రైమరీ ఎన్నికల్లోనే ఓడిపోయారు. 2023లో మరోసారి ప్రైమరీ ఎన్నికల్లో గెలిచి అధ్యక్ష అభ్యర్థిగా నిలిచారు. కానీ, ఆమె అభ్యర్థిత్వాన్ని ఎన్నికల సంఘం రద్దు చేసింది. గత దశాబ్ద కాలంగా అధ్యక్షుడు మదురోకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజాస్వామ్య పోరాటాలకు ఆమె నాయకత్వం వహిస్తున్నారు.

ఒక అసాధారణ మహిళ

మరియా మచాడో సేవలను నోబెల్ కమిటీ గొప్పగా ప్రశంసించింది. 'ఇటీవలి కాలంలో లాటిన్ అమెరికాలో అసాధారణ పౌర సాహసికుల్లో మచాడో ఒకరు'అని కొనియాడింది. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా గొప్పగా పోరాడుతున్నారని జోర్డాన్ వాట్నే పేర్కొన్నారు. ఓస్లోలో ఈ అవార్డు ప్రకటించిన సమయంలో వెనెజువెలాలో రాత్రి సమయం కావటంతో ఆమె ఒక గుర్తు తెలియని ప్రాంతంలో నిద్రపోతున్నారు. నోబెల్ కమిటీ సభ్యులు ఆమెకు నేరుగా ఫోన్ చేసి విషయం చెప్పగానే షాక్‌కు గురయ్యారు. 'దేవుడా.. నాకు మాటలు రావటం లేదు. ఇది ఒక ఉద్యమం, మొత్తం సమాజం సాధించిన ఫలితం ఇది. నేను కేవలం ఒక వ్యక్తిని మాత్రమే. వ్యక్తిగతంగానే ఈ పురస్కారానికి నేను అర్హురాలిని కాదు'అని పేర్కొన్నారు. మచాడోకు నోబెల్ పురస్కారం రావటంపై వెనెజువెలాలోని ఆమె మద్దతుదారులు సంబరాలు చేసుకుంటుంటే, మదురో మద్దతుదారులు నిరసనలు వ్యక్తంచేస్తున్నారు. 'దేశంలో పరిస్థితిని మెరుగుపర్చటం ఎలాగో నాకు తెలియదు కానీ, నోబెల్ శాంతి పురస్కారానికి ఆమె (మచాడో) మాత్రం సంపూర్ణంగా అర్హురాలు'అని సాండ్రా మార్టినెజ్ అనే 32 ఏళ్ల మహిళ సంతోషం వ్యక్తంచేశారు.

ట్రంప్‌కు నోబెల్ నిరాశ

- అవార్డు వెనెజువెలా నేతకు దక్కటంతో ట్రంప్ ఆశలు గల్లంతు
- కమిటీ నిర్ణయంపై వైట్‌హౌస్ అక్కసు
- మీడియా ప్రచారాన్ని నమ్మి నోబెల్ ఇవ్వం: నోబెల్ కమిటీ

వాషింగ్టన్: నోబెల్ శాంతి బహుమతిని బలవంతంగానైనా సాధించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చివరకు భంగపాటే ఎదురయ్యింది. తానే ప్రపంచంలో అతిపెద్ద శాంతి దూతనని, ఏడు యుద్ధాలను ఆపి ప్రపంచంలో శాంతిని నెలకొల్పానని, అందువల్ల తనకే నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలన్న ఆయన వాదనను నోబెల్ కమిటీ ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ ఏడాది నోబెల్ శాంతి పురస్కారాన్ని వెనెజువెలా ప్రతిపక్ష నేత, ప్రజాస్వామ్య ఉద్యమకారిణి మరియా కొరినా మచాడోకు ప్రకటించటంతో ట్రంప్ కార్యవర్గంపై నోబెల్ కమిటీపై అక్కసు వెళ్లగక్కింది. నోబెల్ కమిటీ అసలైన శాంతి పరిరక్షకులకంటే రాజకీయాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చిందని అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్‌హౌస్ శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శలు గుప్పించింది. మరోవైపు 'మీడియా ప్రచారాన్ని నమ్మి నోబెల్ ఇవ్వం' అని నోబెల్ కమిటీ స్పష్టం చేసింది.

నోబెల్ కోసం ట్రంప్ డిమాండ్

నోబెల్ శాంతి పురస్కారంపై ట్రంప్ ఆసక్తి ఇప్పటిది కాదు. ఆయన మొదటిసారి అమెరికా అధ్యక్షుడు అయినప్పటి నుంచే దానిపై మనసు పారేసుకున్నారు. రెండోసారి అధ్యక్షుడయ్యాక ఏకంగా తనకు నోబెల్ పురస్కారం ఇచ్చి తీరాలని డిమాండ్ చేయటం మొదలుపెట్టారు. తనకు ఆ పురస్కారం రాకపోవటంకంటే తన రాజకీయ ప్రత్యర్థి, అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు ఇవ్వటమే ట్రంప్‌ను అధికంగా మనోవేదనకు గురిచేస్తున్నట్లు ఆయన మాటల్లో స్పష్టమవుతోంది. ఈ ఏడాది మొదట్లో అధ్యక్ష పగ్గాలు చేపట్టినప్పటి నుంచే ఆయన నోబెల్ శాంతిబహుమతిపై కన్నేశారు. పలు దేశాలను బెదిరించి మరీ తనకు నామినేషన్ వేయించుకున్నారు. పది నెలల తన పాలనా కాలంలో ఏడు యుద్ధాలను ఆపానని, ఇంతకంటే శాంతి ప్రదాత ఎవరు ఉంటారని ప్రశ్నిస్తూ వచ్చారు. తనకు నోబెల్ ఇవ్వకుంటే అమెరికాను అవమానించినట్లేనని ఇటీవలే వ్యాఖ్యానించారు. పురస్కార ప్రకటనకు ఒక్క రోజు ముందు కూడా ఆయన దీనిపై స్పందించారు. 'ఒబామా ఏమీ చేయకుండానే నోబెల్ పురస్కారం ఇచ్చారు. అమెరికాను ధ్వంసం చేసినందుకు ఆయనకు ఇచ్చారు. సరే.. వాళ్లు ఇప్పుడు ఏం చేయగలరో చేయనివ్వండి. ఏ నిర్ణయం ప్రకటించినా మంచిదే. దానికోసం (అవార్డు కోసం) నేను పనిచేయలేదు. ఎంతోమంది ప్రజల ప్రాణాలు కాపాడేందుకే నేను ఇదంతా (యుద్ధాలను ఆపటం) చేశాను'అని గురువారం తెలిపారు. నోబెల్ కోసం సొంత టీమ్‌తో ప్రచారం చేయించుకున్న ట్రంప్.. ఈ ఏడాది జూలైలో ఏకంగా నార్వే ఆర్థికమంత్రి జెన్స్ స్టొల్టెన్‌బెర్గ్‌కు స్వయంగా ఫోన్ చేసి తనకు నోబెల్ ఇవ్వకుంటే టారిఫ్‌లు తప్పవన్నట్లు మాట్లాడారని నార్వే మీడియా పేర్కొంది.



గడువు ముగిసిన తర్వాత నామినేషన్లు

ఈ ఏడాది నోబెల్ శాంతి పురస్కారానికి ఫిబ్రవరి 1వ తేదీతో నామినేషన్ల గడువు ముగిసిపోయింది. ట్రంప్ తరఫున అనేక నామినేషన్లు వచ్చినప్పటికీ, చాలావరకు ఈ గడువు ముగిసిన తర్వాత వచ్చినవే ఉన్నాయి. ఈ ఏడాది మేలో చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో చావు దెబ్బ తిన్న పాక్‌ను ట్రంప్ చేరదీసి భరోసా ఇవ్వటంతో.. ఆ తర్వాత పాకిస్తాన్.. ట్రంప్‌కు నోబెల్ శాంతిపురస్కారం ఇవ్వాలని ప్రతిపాదించింది. ఇజ్రాయెల్‌తో కూడా బలవంతంగా గత నెలలో ట్రంప్ నామినేషన్ ఇప్పించుకున్నారు. అయితే, ఈ పురస్కా రం కోసం ట్రంప్ యంత్రాంగం గత ఏడాది డిసెంబర్ నుంచే ప్రచారం మొద లుపెట్టింది. అందుకోసం అధ్యక్ష కార్యాల యం ఓవల్ ఆఫీస్‌నే కేంద్రంగా చేసు కోవటం గమనార్హం.

నోబెల్ కమిటీపై వైట్‌హౌస్ ఫైర్

ట్రంప్‌కు నోబెల్ పురస్కారం ఇవ్వకపోవటంపై అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ప్రతినిధి స్టీవెన్ చెంగ్ అక్కసు వెళ్లగక్కారు. 'శాంతి ఒప్పందాలు కుదురుస్తూ, యుద్ధాలు ఆపుతూ, ప్రజల ప్రాణాలు కాపాడే పనిని అధ్యక్షుడు ట్రంప్ కొనసాగిస్తూనే ఉంటారు. ఆయనది గొప్ప మానవతా హృదయం. తన సంకల్ప శక్తితో పర్వతాలను సైతం కదిలించగల ఆయనలాంటి వ్యక్తి మరొకరు ఉండరు. నోబెల్ కమిటీ శాంతికంటే రాజకీయాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చింది'అని విమర్శించారు. అయితే, శాంతి పురస్కారానికి అభ్యర్థి ఎంపికపై నార్వేజియన్ నోబెల్ కమిటీ చైర్మన్ జోర్డాన్ స్పష్టత ఇచ్చారు. 'నాకు తెలిసి ఈ కమిటీ ఇలాంటి ప్రచారాలు, మీడియా రిపోర్టులను చాలా చూసే ఉంటుంది. శాంతి స్థాపన కోసం అది చేశాం, ఇది చేశామని పేర్కొంటూ మాకు ఏటా వేల లేఖలు వస్తాయి. నోబెల్ పురస్కారాలు పొందిన గొప్ప వ్యక్తుల చిత్రపటాలతో నిండిన ఓ గదిలో ఈ కమిటీ కూర్చుని చర్చిస్తుంది. ఆ గది సమగ్రత, ధైర్యసాహసాలతో నిండి ఉంటుంది. ఆల్ఫ్రెడ్ నోబెల్ సేవలు, ఆయన రాసిన విల్లులోని అంశాల ఆధారంగానే మేం నిర్ణయాలు తీసుకుంటాం'అని స్పష్టంచేశారు.

గాజాలో అమల్లోకి కాల్పుల విరమణ

- ధ్రువీకరించిన ఇజ్రాయెల్ మిలటరీ
- శుక్రవారం మధ్యాహ్నం నుంచి నెలకొన్న ప్రశాంతత

గాజా/కైరో: హమాస్ అంతమే లక్ష్యంగా ఇజ్రాయెల్ రెండేళ్ల క్రితం గాజాలో ప్రారంభించిన విధ్వంసక యుద్ధం ముగిసిన జాడలు కనిపిస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి గాజాలో ప్రశాంత వాతావరణం నెలకొంది. పాలస్తీనియన్లపై కాల్పులు, వైమానిక దాడులు నిలిచిపోయాయి. ఆ ప్రాంతంలో కాల్పుల విరమణ ఒప్పందం మధ్యాహ్నం నుంచి అమల్లోకి వచ్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం సైతం ధ్రువీకరించింది. యుద్ధానికి విరామం ఇవ్వడానికి, మిగిలిన బందీలను పాలస్తీనా ఖైదీలతో మార్పిడి చేయడానికి సంబంధించిన ఒప్పందాన్ని ఇజ్రాయెల్ మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు ప్రధాని నెతన్యాహూ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఆర్మీ ఈ మేరకు ప్రకటించడం గమనార్హం. దీంతో, సెంట్రల్ గాజాలోని వాడి గాజాలో గుమికూడిన వేలాది మంది పాలస్తీనియన్లు ఉత్తర ప్రాంతంలోని తమ సొంత నివాసాల దిశగా నడక సాగించారు.

24 గంటల్లో 11 మంది మృతి

గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు గాజా వ్యాప్తంగా ఇజ్రాయెల్ ఆర్మీ భారీగా కాల్పులు జరిపిందని స్థానికులు తెలిపారు. ఆర్మీ ప్రకటన తర్వాత కాల్పుల శబ్దాలు వినిపించలేదన్నారు. సైనిక విమానాలు తక్కువ ఎత్తులో ఎగురుతూ కనిపించాయని చెప్పారు. ఇలా ఉండగా, 24 గంటల వ్యవధిలో గాజా వ్యాప్తంగా ఇజ్రాయెల్ ఆర్మీ చేపట్టిన దాడుల్లో 11 మంది పాలస్తీనియన్లు చనిపోగా మరో 49 గాయపడ్డారని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. తమ బలగాలకు ప్రమాదకరమనిపించిన లక్ష్యాలపైనే దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ పేర్కొంది. దీనిపై హమాస్ మండిపడింది.

విడుదలవనున్న మర్వాన్ బర్ఘౌటి

ఒప్పందం ప్రకారం...గాజా నుంచి ఇజ్రాయెల్ బలగాలను ఉపసంహరించుకున్న అనంతరం హమాస్ తమ వద్ద బందీలుగా ఉన్న 48 మందిని విడుదల చేయాల్సి ఉంటుంది. వీరిలో కనీసం 20 మంది మాత్రమే సజీవంగా ఉన్నట్లు భావిస్తున్నారు. ఇందుకు బదులుగా 2 వేల మంది పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ విడిచిపెడుతుంది. వీరి జాబితాను శుక్రవారం అధికారులు విడుదల చేశారు. ఇందులో పాలస్తీనా అత్యధిక ప్రజాదరణ కలిగిన నేత మర్వాన్ బర్ఘౌటి కూడా ఉన్నారు. బందీలు, ఖైదీల విడుదల ఆదివారం రాత్రి లేదా సోమవారం మొదలవుతుందని మధ్యవర్తులుగా వ్యవహరించిన ఈజిప్టు అధికారులు తెలిపారు.

సిద్ధంగా మానవతా సాయం

గాజాలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితుల నేపథ్యంలో మానవతా సాయం తీసుకువచ్చిన ట్రక్కులు సాధ్యమైనంత త్వరగా చేరుకునేందుకు ఈజిప్టు, గాజా మధ్యనున్న రఫా సహా ఐదు సరిహద్దులను తెరిచి ఉంచనున్నారు. సుమారు 1.70 లక్షల టన్నుల మందులు, ఆహారం, ఇతర అత్యవసరాలను గాజాలోకి తరలించేందుకు సిద్ధంగా ఉన్నామని ఐరాస మానవతా సాయం చీఫ్ టామ్ ఫ్లెచర్ తెలిపారు. సానుకూల సంకేతాలు అందిన వెంటనే రంగంలోకి దిగుతామని చెప్పారు. ఇజ్రాయెల్‌తో కుదిరిన డీల్ ప్రకారం కాల్పుల విరమణ ఒప్పందం అమలును పర్యవేక్షించేందుకు 200 మంది సైనికులను గాజాకు పంపుతామని అమెరికా అధికారులు చెప్పారు.


గాజా ఉత్తర ప్రాంతంలోని స్వస్థలాలకు వెళ్తున్న పాలస్తీనియన్లు

కత్తి మెడపైనే ఉంది: నెతన్యాహూ

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెరపైకి తెచ్చిన కాల్పుల విరమణ ప్రణాళికలో పేర్కొన్న హమాస్ నిరాయుధీకరణ, గాజా భవిష్యత్తు పాలన వంటి అంశాలపై ఎటువంటి స్పష్టత లేదు. 'ట్రంప్ ప్రకటనలో తర్వాతి భాగం హమాస్ నిరాయుధీకరణే. ఇది సులువుగా జరిగితే సరేసరి. లేదంటే బలవంతంగానైనా సాధిస్తాం. మెడపై కత్తి ఉందని తెలిసే హమాస్ ఒప్పందానికి వచ్చింది. ఇప్పటికీ కత్తి మెడపైనే ఉంది'అని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ పేర్కొనడం గమనార్హం. కాగా, శుక్రవారం మధ్యాహ్నం అధికారికంగా కాల్పుల విరమణ ప్రారంభమవడానికి కొద్ది గంటల ముందుగానే బలగాల ఉపసంహరణ పూర్తయిందని ఇజ్రాయెల్ బ్రిగేడియర్ జనరల్ ఎఫ్పీ డెఫ్రిన్ చెప్పారు. ఉపసంహరణ అంశం సున్నితత్వం దృష్ట్యా గాజాలోని ఇటీవల స్వాధీనం చేసుకున్న 50 శాతం ప్రాంతంలో బలగాలు కొనసాగుతాయని ఓ సైనికాధికారి పేర్కొనడం విశేషం.

అఫ్గాన్‌లో అభివృద్ధి కార్యక్రమాల పునఃప్రారంభం

మంత్రి ముత్తాఖీతో భేటీ అనంతరం విదేశాంగ మంత్రి జైశంకర్ వెల్లడి

న్యూఢిల్లీ: అఫ్గానిస్తాన్ రాజధాని కాబూల్‌లోని భారత్ టెక్నికల్ మిషన్ ఇకనుంచి దౌత్య కార్యాలయంగా మారనుంది. అంతేకాదు, తాలిబన్లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిలిచిపోయిన అభివృద్ధి కార్యక్రమాలను తిరిగి ప్రారంభించనుంది. విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జై శంకర్ ఈ విషయాలను ప్రకటించారు. భద్రతాపరమైన భారత ప్రభుత్వ ఆందోళనలపై సానుకూలంగా స్పందించిన తాలిబన్లను ఆయన అభినందించారు. పహల్గాం ఉగ్రదాడిని తాలిబన్లు ఖండించి భారత్‌కు సంఘీభావం తెలపడం ముఖ్యమైన విషయ మన్నారు. ఆ దేశంలో నిలిచిపోయిన అభివృద్ధి కార్యక్రమాలను పునరుద్ధ రించడంతోపాటు కొత్తగా ఆరింటిని ప్రారంభించనున్నామన్నారు. సుహృద్భావ సూచనగా 20 అంబులెన్సులను కానుకగా అందజేయనున్నట్లు చెప్పారు. ముందుగా ఐదు అంబులెన్సులను స్వయంగా మంత్రి ముత్తాఖీకి అందజేశానని జై శంకర్ తెలిపారు. భారత్‌లో ఆరు రోజుల పర్యటనకు వచ్చిన అఫ్గాన్ విదేశాంగ మంత్రి అమిర్ ఖాన్ ముత్తాఖీతో మొదటిసారిగా జై శంకర్ శుక్రవారం భేటీ అయ్యారు. భారత్‌కు వ్యతిరేకంగా తమ భూభాగాన్ని వాడుకునేందుకు ఎవరికీ అవకాశమివ్వబోమని ముత్తాఖీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రెండు దేశాలతోపాటు ఈ ప్రాంతమంతటికీ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) సవాలుగా మారిందని అంగీకరించారు. ఈ ఉగ్ర గ్రూపుతో తాము సైతం ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. భారత కంపెనీలు తమ దేశంలో గనులు, ఖనిజాల రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. దీనివల్ల రెండు దేశాల వాణిజ్య సంబంధాలు బలోపేతమవుతాయని చెప్పారు. రెండు దేశాల మధ్య నేరుగా అదనంగా విమాన సర్వీసులను ప్రారంభించేందుకు ఇద్దరు నేతలు అంగీకారానికి వచ్చారు. అనంతరం, ముత్తాఖీ మీడియాతో మాట్లాడుతూ ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపర్చుకునేందుకు దశల వారీగా చేపట్టే చర్యల్లో భాగంగా భారత్‌కు దౌత్యాధికారులను కూడా పంపిస్తామన్నారు.

మహిళా జర్నలిస్టులకు అందని ఆహ్వానం

అఫ్గాన్ విదేశాంగ మంత్రి అమిర్ ఖాన్ ముత్తాఖీ శుక్రవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలోకి మహిళా జర్నలిస్టులకు ఆహ్వానం పంపకపోవడం వివాదానికి దారి తీసింది. భారత్‌లో ఉన్నా తాలిబన్లు లింగ వివక్షను కొనసాగించడంపై నిరసన వ్యక్తమైంది. భారత ప్రజాస్వామిక విలువలకు ఇది అవమానకరమంటూ జర్నలిస్టులతో పాటు రాజకీయ నేతలు, నెటిజన్లు మండిపడ్డారు.

సహనాన్ని పరీక్షించొద్దు: ముత్తాఖీ హెచ్చరిక

మీడియా సమావేశంలో ముత్తాఖీ పాకిస్తాన్ తీరుపై మండిపడ్డారు. కాబూల్‌లోని తెహ్రీక్–ఇ–తాలిబన్ పాకిస్తాన్(టీటీపీ) స్థావరాలే లక్ష్యంగా పాక్ వైమానిక దాడులకు దిగడంపై ఆయన స్పందిస్తూ.. అఫ్గాన్ల సహనాన్ని పరీక్షించే సాహసం చేయొద్దంటూ ఆ దేశానికి గట్టి వార్నింగిచ్చారు. 'సరిహద్దులు దాటి మా భూభాగంలో దాడికి పాల్పడి పాకిస్తాన్ తప్పు చేసింది. 40 ఏళ్ల తర్వాత శాంతిని, పురోగతి దిశగా సాగుతున్నాం. ఈ సమయంలో అఫ్గాన్ల సహనాన్ని పరీక్షించవద్దు' అని ముత్తాఖీ అన్నారు.

మరో ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక లోపం

దుబాయ్‌లో సురక్షితంగా ల్యాండింగ్

ముంబై: విమానాల్లో వరుస సమస్యలు ఎయిర్ ఇండియాను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. తాజాగా గురువారం ఢిల్లీ నుంచి వియన్నా వెళ్తున్న ఎయిర్ ఇండియా బోయింగ్ 787 రకం విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తటంతో దుబాయ్‌లో సురక్షితంగా దించినట్లు సంస్థ శుక్రవారం ప్రకటించింది. అయితే, ఈ ఘటనపై ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ (ఎఫ్‌పీఐ) కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. ఈ ఏడాది జూన్‌లో అహ్మదాబాద్‌లో కూలిపోయిన విమానం కూడా బోయింగ్ 787 రకానికి చెందినదే. ఈ నెల 4న బర్మింగ్‌హామ్ వెళ్తుండగా ఇదే రకం విమానంలో ఉన్నట్టుండి అత్యవసర ర్యాట్ తెరుచుకుంది. తాజాగా అదే రకం విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని ఎయిర్ ఇండియా పేర్కొంది. అయితే, ఆ సమస్యలు ఏమిటన్న విషయం మాత్రం వెల్లడించలేదు. కానీ, ఎఫ్ఐపీ మాత్రం ఆ విమానంలో ఆటోపైలట్, ఇన్‌స్ట్రుమెంట్ లాండింగ్ సిస్టమ్స్ (ఐఎల్ఎస్), ఫైట్ డైరెక్టరేట్స్ (ఎఫ్‌డీస్) ఫ్లైట్ కంట్రోల్ సిస్టమ్స్ వంటి కీలక వ్యవస్థలన్నీ చెడిపోయాయని ఆరోపించింది.

ఫిలిప్పీన్స్‌లో రెండు భూకంపాలు

తీవ్ర విధ్వంసం..ఏడుగురు మృతి

మనీలా: ఫిలిప్పీన్స్ దక్షిణ ప్రాంతంలో కొద్ది గంటల వ్యవధిలో సంభవించిన రెండు భూకంపాలు తీవ్ర విధ్వంసం సృష్టించాయి. దవావో ఓరియంటల్ ప్రావిన్స్‌లోనే ఇవి రెండూ సంభవించడం గమనార్హం. మొదటి భూకంపం మనాయే పట్టణానికి 43 కిలోమీటర్ల దూరంలో 23 కిలోమీటర్ల లోతులో సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.4గా నమోదైంది. రెండో భూకంప తీవ్రత 6.8గా నమోదైంది. మనాయేకు సమీపంలో 37 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రం ఉందని అధికారులు తెలిపారు. ప్రకంపనల ప్రభావంతో కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ఏడుగురు చనిపోయారు. సునామీ హెచ్చరికలను జారీ చేసిన అధికారులు తీర ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయించారు. మొదటి భూకంపంతో స్వల్పంగా దెబ్బతిన్న భవనాలు, నిర్మాణాలు రెండో భూకంపంతో మరింత బలహీనపడి కూలే ప్రమాదముందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సుప్రీంకోర్టు ఆవరణలో ఫ్రీ వైఫై

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు భవన సముదాయంలో ఉచిత వైఫై అందరికీ అందుబాటులో ఉంటుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ తెలిపారు. ప్రస్తుతం వైఫై సేవలు అందరికీ అవసరం. అందుకే సుప్రీంకోర్టు సముదాయమంతటా ఈ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం'అని శుక్రవారం ఆయన బార్ అసోసియేషన్‌ను ఉద్దేశించి ఒక ప్రకటన చేశారు. 'ఇప్పటి వరకు కోర్టు గదుల్లో మాత్రమే వైఫై సేవలు ఉన్నాయి. డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నాం. కోర్టు పరిసరాలలో న్యాయవాదులు, న్యాయ అధికారులు, ఇతర సిబ్బంది, కోర్టుకు వచ్చే సాధారణ ప్రజలు కూడా వైఫై సేవలు వినియోగించుకోవాలి. సుప్రీంకోర్టులో ఏ మూల ఉన్నవారైనా ఈ ఫ్రీ వైఫైను యాక్సెస్ చేసుకుని, ఇంటర్నెట్ సేవలు పొందవచ్చు'అని జస్టిస్ గవాయ్ తెలిపారు.

నాలుగు వారాల్లోగా బదులివ్వండి

కశ్మీర్‌కు రాష్ట్ర హోదాపై కేంద్రానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: కేంద్రపాలిత ప్రాంతం జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించే విష యమై నాలుగు వారాల్లోగా సమాధాన మివ్వా లని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ అంశంపై దాఖలైన పలు పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామంటూ ఇచ్చిన హామీని సాధ్యమైనంత త్వరగా కేంద్రం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలంటూ విద్యావేత్త జహూర్ అహ్మద్ భట్, సామాజిక–రాజకీయ ఉద్యమకా రుడు అహ్మద్ మాలిక్ తదితరులు తమ పిటిషన్లలో కోరారు. ఆర్టికల్ 370 రద్దును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ సమయంలో రాష్ట్ర హోదాను తిరిగి ఇస్తామంటూ హామీ ఇచ్చిందని పిటిషనర్లు గుర్తు చేశారు. ఈ విషయంపై నాలుగు వారాల్లోగా స్పందించాలని ఈ సందర్భంగా సీజేఐ బీఆర్ గవాయ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

దశలవారీగా ఎస్ఐఆర్: ఈసీ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా దశలవారీగా ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ చేపట్టనున్నట్లు ఎన్నికల కమిషన్ (ఈసీ)తెలిపింది. ముందుగా వచ్చే ఏడాదిలో ఎన్ని కలు జరిగే రాష్ట్రాల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించింది. అదేసమయంలో, స్థానిక ఎన్నిక లు జరిగే రాష్ట్రాల్లో ఈ ప్రక్రియను చేపట్టబోమని కూడా స్పష్టం చేసింది. 2026లో అసోం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమబెంగాల్ అసెంబ్లీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ ఐదు రాష్ట్రాలతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో మొదటి దశలో భాగంగా ఎస్ఐఆర్ చేపట్టనున్నామని పేర్కొంది. తేదీలను కూడా త్వరలోనే నిర్ణయిస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ చెప్పారు. విదేశీ అక్రమ వలసదారులను వారి పుట్టిన ప్రాంతం ఆధారంగా గుర్తించి, దేశం నుంచి పంపేయడమే ఎస్ఐఆర్ ప్రాథమిక ఉద్దేశమని ఈసీ అంటోంది. ఆయా రాష్ట్రాల్లో చిట్టచివరి ఎస్ఐఆర్ చేపట్టిన నాటి ఓటరు జాబి తాలను ఆన్‌లైన్‌లో ఉంచాల్సిందిగా ఈసీ ఇప్పటికే రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ అధికారులను ఆదేశించింది.

అమెరికా బాంబుల ఫ్యాక్టరీలో పేలుడు

మెక్‌ఈవెన్ (యూఎస్): అమెరికాలోని టెన్నెసీ రాష్ట్రంలో శుక్రవారం ఉదయం (స్థానిక కాలమానం ప్రకారం) మందుగుండు తయారుచేసే ఓ ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో పలువురు (దాదాపు 19 మంది) మరణించినట్లు, చాలామంది గల్లంతైనట్లు తెలిసింది. అయితే, మరణాల సంఖ్యపై అధికారుల నుంచి స్పష్టమైన ప్రకటన రాలేదు. హిక్‌మాన్ కౌంటీలోని అక్యురేట్ ఎనర్జిటిక్ సిస్టమ్స్ అనే సంస్థ కర్మాగారంలో ఉదయం 7.45 గంటల సమయంలో పేలుడు సంభవించింది. వెంటనే అక్కడికి వెళ్లిన సహాయ సిబ్బంది ఫ్యాక్టరీ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా మళ్లీ పేలుళ్లు సంభవించాయి. దీంతో సహాయక చర్యలు చేపట్టలేకపోయారు. 'పేలుడు జరిగిన సమయంలో ఫ్యాక్టరీలో పలువురు ఉన్నట్లు తెలిసింది. కానీ ఎంతమంది ఉన్నారనేది తెలియదు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాం. అక్కడ పనిచేసేవారి కుటుంబాలను సంప్రదిస్తున్నాం'అని హంప్రేస్ కౌంటీ షెరిఫ్ క్రిస్ డేవిస్ తెలిపారు.

సాక్షి హైదరాబాద్

శనివారం । 11 । అక్టోబర్ । 2025



అరట్టై.. అదిరేట్టు..
ఐటీ హబ్ హైదరాబాద్‌లో సరికొత్త డిజిటల్ తుపాన్ చెలరేగుతోంది. జోహో కార్పొరేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన అరట్టై మెసేజింగ్ యాప్ సందడి చేస్తోంది. - సిటీప్లస్‌లో



రూ.42 కోట్ల నుంచి..
నగరంలో భూముల ధరలు ఆకాశంలోకి దూసుకుపోయాయి. కోకాపేట, రాయదుర్గం వంటి పశ్చిమ ప్రాంతాల్లోని స్థలాలకు భారీ డిమాండ్ ఏర్పడింది. - రియల్టీలో

గరిష్ఠం/కనిష్ఠం
32.0/21.0

వాతావరణం
నగరంలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగలు పొడి వాతావరణం నెలకొంటుంది. గరిష్ఠంగా 32, కనిష్ఠంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

గతంలో ఖరీదు చేసిన రాధిక హౌసింగ్ సొసైటీ

- నాటకీయ పరిణామాలతో కోర్టుకు చేరిన వ్యవహారం
- దీన్ని ఆసరాగా చేసుకుని కన్ను వేసిన పార్థసారథి
- ఇప్పటికే ఆయనపై స్థానిక ఠాణాలో పలు కేసులు
- హైడ్రా జోక్యంతో కొలిక్కివచ్చిన వైనం



ఎవరిదా స్థలం.. ఎందుకీ వివాదం?

బంజారాహిల్స్ రోడ్డు నెం.10లో పది ఎకరాలు

సాక్షి, సిటీబ్యూరో

బంజారాహిల్స్‌లోని అత్యంత ఖరీదైన ప్రాంతం.. రోడ్డు నెం.10లో తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు (టీజీఐసీసీసీ) కూతవేటు దూరం.. రూ.వందల కోట్ల విలువైన 10 ఎకరాల స్థలం.. ఏళ్లుగా ఓ సొసైటీకి–ప్రభుత్వానికి మధ్య నడుస్తున్న వివాదం.. దీన్ని ఆసరాగా చేసుకుని నకిలీ పత్రాలతో సగం స్థలంలో తిష్ట వేసిన వైనం.. హైడ్రా అధికారులు శుక్రవారం స్వా.దీనం చేసుకున్న పది ఎకరాల స్థలం వెనుక ఉన్న కథ ఇది. కొన్నేళ్లుగా రెవెన్యూ, జలమండలి, పోలీసులకు తలనొప్పిగా మారిన ఈ కబ్జా బాగోతం హైడ్రా జోక్యంతో కొలిక్కిరావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

నాలుగు దశాబ్దాల క్రితం మొదలై..

సదరు స్థలాన్ని శ్రీ రాధిక కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ 1981లో ప్రైవేట్ వ్యక్తుల నుంచి ఖరీదు చేసింది. అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) నుంచి మినహాయింపు ఇవ్వాల్సిందిగా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. ఈ దరఖాస్తును తిరస్కరించిన ప్రభుత్వం అది సర్కారు భూమిగా పేర్కొంది. ఆపై ఈ పది ఎకరాలతో పాటు మొత్తం 30 ఎకరాలను బసవతారకం కేన్సర్ హాస్పిటల్‌తో పాటు మరో రెండు సొసైటీలకు కేయించింది. తమ స్థలం కేటాయింపును రాధిక సొసైటీ హైకోర్టులో సవాల్ చేసింది. దీంతో ఆ 10 ఎకరాల కేటాయింపునకు సంబంధించిన ఉత్తర్వులను న్యాయస్థానం కొట్టేసింది.

మ్యుటేషన్ చేయాలన్న సింగిల్ బెంచ్..

అదే సందర్భంలో ఆ పది ఎకరాలను రాధిక సొసైటీకి మ్యుటేషన్ చేయాలంటూ సింగిల్ బెంచ్ ఉత్తర్వులు ఇచ్చింది. దీన్ని ప్రభుత్వం అప్పీల్ చేయడంతో విచారించిన ఇరువురు జడ్జీల మధ్య ఏకాభిప్రాయం రాకపోవడంతో ఫుల్ బెంచ్‌కు నివేదించారు. వివాదాన్ని సివిల్ కోర్టులో పరిష్కరించుకోవాలంటూ అభిప్రాయపడ్డారు. అప్పటికే ఈ వివాదం మొదలై 20 ఏళ్ల కావడాన్ని పరిగణనలోకి తీసుకున్న ఫుల్ బెంచ్ విచారణకు మరింత కాలయాపన సరికాదని అభిప్రాయపడుతూ గతంలో సొసైటీలకు ఇచ్చిన రేటుకే రెగ్యులరైజ్ చేసే అవకాశాన్ని పరిశీలించాలని కోరింది. దీనికి అప్పట్లో అడ్వొకేట్ జనరల్ (ఏజీ) కూడా సమ్మతి తెలిపారు.

సుప్రీం కోర్టు నుంచి మళ్లీ హైకోర్టుకు..

ఈ ఉత్తర్వులను ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. అక్కడి పిటిషన్, రివ్యూ, క్యూరేటివ్‌లను ఉన్నత న్యాయస్థానం కొట్టేసింది. రాధిక సొసైటీకే రెగ్యులరైజ్ చేయాలంటూ స్పష్టం చేసింది. 2017లో ప్రభుత్వం మరోసారి అది ప్రభుత్వ భూమి అంటూ మెమో జారీ చేయడంతో వివాదం మొదటికి వచ్చింది. దీన్ని కొట్టేసిన హైకోర్టు సింగిల్ బెంచ్ సుప్రీం ఆదేశాలు పాటించాలని స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వుల్ని సర్కారు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేసింది. దీంతో ఈ పది ఎకరాల వివాదం ప్రస్తుతం మళ్లీ హైకోర్టు పరిధిలోకి చేరింది. ఈ స్థలం నుంచే గతంలో జలమండలికి ఎకరం, ఆపై మరో ఎకరం కేటాయించింది.

జాగిలాలు.. చుట్టూ సీసీ కెమెరాలతో...

ఈ స్థలంలోని ఐదు ఎకరాలపై కన్నేసిన పార్థసారథి, తన కుమారుడు విజయ్ భార్గవ్ చుట్టూ షీట్లు వేశారు. నకిలీ పత్రాలు సృష్టిస్తూ అది తమదే అంటూ రంగంలోకి దిగారు. అందులో 10 వేట కుక్కలు, 25 మంది తమ మనుషులు, పది మంది బౌన్సర్లను ఏర్పాటు చేశారు. స్థలం చుట్టూ దాదాపు 30 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి తమ అధీనంలో ఉంచుకున్నారు. దీనిపై ఇప్పటికే బంజారా హిల్స్ ఠాణాలో నాలుగు కేసులు నమోదు కాగా... 2021లో అరెస్టు కూడా అయ్యారు. వీరిపై శంకర్‌పల్లిలోనూ మూడు ఎకరాలు కబ్జాకు ప్రయత్నించిన ఆరోపణలు ఉన్నాయి. జలమండలి, రెవెన్యూ, పోలీసులను ధిక్కరిస్తూ తమ ఆధిపత్యం చూపించిన వీరి వ్యవహారాలకు హైడ్రా ఎంట్రీతో చెక్ పడింది.

సిద్ధమవుతున్న స్ట్రాంగ్ రూమ్‌లు





జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నవంబర్ 11న జరగనుంది. మొత్తం 3,98,982 మంది ఓటర్లు 407 పోలింగ్ బూత్‌లలో ఓటు వేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లను భద్రపరిచేందుకు యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో స్ట్రాంగ్‌రూమ్‌లను సిద్ధం చేస్తున్నారు. ఒక్కో స్ట్రాంగ్ రూమ్‌లో బూత్‌ల వారీగా ఈవీఎంలు పెట్టనున్నారు. ఇందుకోసం మార్కింగ్‌లు వేసే ప్రక్రియ పూర్తి కావచ్చింది. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. మరో రెండు రోజుల్లో స్ట్రాంగ్ రూమ్‌ల పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించారు. - బంజారాహిల్స్

ఓటరు నమోదుకు తుది గడువు నేడే



సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని అర్హులైన స్థానికులు ఓటు హక్కు పొందేందుకు ఈ నెల 11వ తేదీ (శనివారం) వరకే అవకాశం ఉందని జీహెచ్‌ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్ తెలిపారు. శనివారం సాయంత్రం వరకు అందిన దరఖాస్తులనే అధికారులు పరిశీలించి అర్హులను ఓటరు జాబితాలో చేర్చి, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో ఓటుహక్కు అవకాశం కల్పిస్తారని చెప్పారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అర్హులై ఉండి ఓటరుగా నమోదు కాని వారు వెంటనే తమ పేరు నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు.



ప్రలోభాల కట్టడికి కలసికట్టుగా పనిచేయాలి: కర్ణన్

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రలోభాల కట్టడికి కలసికట్టుగా పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన జిల్లా ఇంటెలిజెన్స్, ఎక్స్పెండిచర్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేస్తూ, నగదు, మద్యం, నిషేధిత పదార్థాలు, ఉచిత బహుమతులు వంటి అక్రమ ప్రలోభాలను కట్టడి చేయాలని సూచించారు. టోకెన్, కూపన్ ద్వారా గిఫ్టులు, లిక్కర్ పంపిణీ కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. తపాలా శాఖ ద్వారా కూడా ఓటర్లకు గిఫ్టులు పంపిణీ చేసే అవకాశం ఉన్నందున నిఘా పెట్టాలన్నారు. 24 గంటల పర్యవేక్షణ కోసం ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్, వీడియో సర్వైలెన్స్ బృందాలు యాక్టివ్‌గా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డీసీపీ అపూర్వ రావు, నోడల్ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, ఎంసీసీ నోడల్ అధికారి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏమి ‘టీ’ విచిత్రం!

చాయ్ రూ.5.. కాఫీ రూ.6..

- ఇరానీ సమోసా రూ. 3
- చికెన్ భోజనం రూ. 125
- ఇవి సబ్సిడీ ధరలు కాదు
- అన్నపూర్ణ క్యాంటీన్లలో అంతకన్నా కాదు
- జూబ్లీహిల్స్ ఉపఎన్నిక వేళ.. అభ్యర్థులు ఎన్నికల వ్యయం లెక్కల్లో చూపాల్సిన ధరలు



సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం ఏ ఎన్నికల్లో అయినా అభ్యర్థులు చేసే ఖర్చు రూ.కోట్లలో ఉంటుందనేది జగమెరిగిన సత్యం. ఎన్నికల నిబంధనల మేరకు మాత్రం అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థుల వ్యయ పరిమితి రూ. 40 లక్షలు మించరాదు. అభ్యర్థులు తాము ఎంతమొత్తంలో ఖర్చు చేసినా లెక్క మాత్రం అంతకు లోబడే ఉండాలి. అందుకుగాను అభ్యర్థులు తమ పార్టీ కార్యకర్తలకు, ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనేవారికి , ప్రజలను ఆకట్టుకునేందుకు చాటుమాటుగా పంచే నగదు, కానుకలకు ఎలాగూ లెక్కలుండవు. కానీ.. ప్రచారంలో పాల్గొనే వారికి ఇచ్చే టీ, కాఫీలు, భోజనాలు, ప్రచారంలో వినియోగించేందుకు కొనుగోలు చేసే, అద్దెకు తీసుకునే వస్తువులు, సరుకులు మాత్రం దాచలేరు. వ్యయపరిమితి మించకుండా ఉండేందుకు అభ్యర్థులు ఎలాగూ తక్కువ ఖర్చు చూపిస్తారు కాబట్టి, కనీసం టీ, కాఫీల వంటివాటికైనా వారు ఎక్కువ తిప్పలు పడి ఖర్చులు దాచనవసరం లేకుండా తక్కువ వ్యయాన్నే ఎన్నికల అధికారులు ఖరారు చేశారు. అన్నింటి ధరలు కాదు గానీ కొన్నింటికి మాత్రం ఏడేళ్ల నాటి ధరలే ఇంకా ఉండటం విశేషం. అసెంబ్లీ అభ్యర్థుల వ్యయ పరిమితి గతంలో రూ. 28 లక్షలుగా ఉండేది. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని రూ.40 లక్షలకు పెంచారు. అయినప్పటికీ కొన్నింటి ధరలు మాత్రం అలాగే ఖరారు చేయడం విచిత్రం. అంటే అభ్యర్థులు ఎక్కువ ఖర్చు చేసినప్పటికీ.. తక్కువగా చూపించేందుకు అవకాశం ఇచ్చారన్న మాట!

2018 నాటి ధరలే..

- గ్రేటర్ నగరంలో ఎక్కడైనా రూ.5కే కప్పు టీ దొరుకుతుందా? ఎన్నికల వ్యయాన్ని పరిగణనలోకి తీసుకునే ధరల పట్టికలో మాత్రం టీ (చిన్నకప్పు) ధర రూ. 5గానే ఖరారు చేశారు. కాఫీ చిన్న కప్పు ధర రూ.6గా ఖరారు చేశారు. 2018లో అసెంబ్లీ ఎన్నికలప్పుడు సైతం ఇవే ధరలున్నాయి. నగరంలో రోడ్డు పక్క చాయ్‌వాలా వద్ద కూడా ఇంత తక్కువ ధర ఉండదు. 200 మి.లీ. వాటర్ బాటిల్ ధర 2018లో, 2023లో, ఇప్పుడు కూడా రూ.6గానే చూపారు. నాలుగు ఇడ్లీల ధరలు, రెండు వడల ధరలు సైతం అప్పుడు, ఇప్పుడు రూ.20గానే ఉన్నాయి.
- ప్రచారంలో పాల్గొనే కార్యకర్తలు, అభిమానులకు ఆహార పదార్థాలు అందజేయాల్సి ఉంటుంది కాబట్టి వాటివల్లే ఎక్కువ వ్యయం కాకుండా ఉండేందుకు వీటి ధరలు పెంచలేదేమో ? ఆహార పదార్థాలతోపాటు కొనుగోలు చేసే ఆయా ఐటమ్‌లలోనూ, అద్దెలకు తీసుకునే సామాన్లు, వాహనాలు, టెంట్లు , తదితరమైన వాటిల్లోనూ పాత ధరలకు, ప్రస్తుత ధరలకు కొన్నింట్లో తేడాలున్నా, కొన్ని అలాగే ఉన్నాయి. చిన్న క్లాత్ బ్యానర్ గతంలో రూ.30 మాత్రమే ఉండగా, వాస్తవ ధరలకనుగుణంగా ప్రస్తుతం రూ.140 ఖరారు చేశారు. అలాగే.. పెద్ద బ్యానర్ గతంలో రూ. 55– 71 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.180కి పెరిగింది.

ఆయా వస్తువులు, సామగ్రి ధరలు 2018 అసెంబ్లీ, 2019 లోక్‌సభ, 2020 జీహెచ్‌ఎంసీ, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో, ప్రస్తుతం (2025) ఇలా ఉన్నాయి. (రూ.లలో)

ఐటెం	2018	2019	2020	2023	2025
సింగిల్ కలర్ పోస్టర్	11	11	12	13	13
మోడల్ బస్‌షెల్టర్	300	300	330	350	350
మెట్రోపిల్లర్లు	1000	1000	1100	1200	1200
వాటర్ ప్యాకెట్	1	1	1	1	2
వాటర్‌బాటిల్ (లీటరు)	18	18	20	20	20
ఆలు సమోసా	10	10	10	10	10
ఇరానీ సమోసా	3	3	3	3	3
మటన్ బిర్యానీ	190	190	160	180	180
వెజ్ మీల్	70	70	70	80	80
ఫొటోగ్రాఫర్‌కు రోజుకు	1300	1300	1400	1500	1500
ఫంక్షన్ హాల్ (చిన్నది)	5000	5000	5500	6200	6200

ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే..

ప్రస్తుత ధరలు

ప్రస్తుతం కండువా రూ. 25, పులిహోర రూ.40, చికెన్ బిర్యానీ రూ.170, ఫొటోగ్రాఫర్‌కు రోజుకు రూ.1500, వీడియోగ్రాఫర్‌కు రూ.1800, చిన్న పూల దండ రూ.100, పెద్ద పూలదండ రూ.250, ఆరు సీట్ల వరకు మోటార్ క్యాబ్ అద్దె రోజుకు రూ.1430గా ఉన్నాయి. మొత్తం 80 రకాల వస్తువులు, సామగ్రి, ఆహార పదార్థాలకు హాళ్లు, వాహనాల అద్దెలకు రేట్లు ఖరారు చేశారు. జాబితాలో లేని వాటికి అభ్యర్థులు సమర్పించే ఓచర్లను సంబంధిత అధికారులు పరిశీలిస్తారు.



పర్మిషన్ ప్లీజ్

- ఎల్‌అండ్‌టీ నుంచి మెట్రో టేకోవర్ ఒప్పందం
- కేంద్రానికి హెచ్‌ఎంఆర్‌ఎల్ లేఖ

మెట్రో రెండో దశకు అనుమతివ్వండి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మెట్రోరైల్ నుంచి ఎల్‌అండ్‌టీ వైదొలగనున్న దృష్ట్యా రెండోదశ నిర్మాణానికి అనుమతినివ్వాలని కోరుతూ హెచ్‌ఎంఆర్‌ఎల్ కేంద్రానికి లేఖ రాసింది. మొదటిదశ మెట్రో నిర్మాణంలో, నిర్వహణలో భాగస్వామిగా ఉన్న ఎల్‌అండ్‌టీతో రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు గత నెలలో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఈ ఒప్పందంలోని వివిధ అంశాలపై సమగ్ర వివరాలతో హైదరాబాద్ మెట్రోరైల్ అధికారులు కేంద్రానికి లేఖ రాశారు. మొత్తం 8 మార్గాల్లో నిర్మించనున్న రెండో దశపై ఇప్పటికే తీవ్ర జాప్యం నెలకొన్న దృష్ట్యా సత్వరమే ఆమోదించాలని కోరారు. రెండోదశపై హెచ్‌ఎంఆర్‌ఎల్ సమర్పించిన డీపీఆర్‌లలోని లోపాలను ఎత్తిచూపుతూ కేంద్రం గతంలో సందేహాలను లేవనెత్తింది. ఎల్‌అండ్‌టీతో ఏ విధమైన ఒప్పందం ఏర్పాటు చేసుకున్నారో తెలపాలని సూచించింది. ఈ క్రమంలోనే మెట్రో నుంచి తాను వైదొలగనున్నట్లు ఎల్‌అండ్‌టీ వెల్లడించింది. అనంతరం జరిగిన చర్చల్లో పలు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం, ఎల్‌అండ్‌టీకి మధ్య ఒప్పందం కుదిరింది. పీపీపీ పద్ధతిలో నిర్మించిన మెట్రో మొదటి దశ నుంచి ఎల్‌అండ్‌టీ వైదొలగనున్న దృష్ట్యా రూ.13,000 కోట్ల బ్యాంకు రుణాలను ప్రభుత్వమే భరించనుంది. ఎల్‌అండ్‌టీకి రూ.2,000 కోట్లు చెల్లించనున్నట్లు ఈ ఒప్పందంలో నిర్ణయించారు. ఈ వివరాలను కేంద్రానికి తెలియజేసేందుకు హెచ్‌ఎంఆర్‌ఎల్ ప్రస్తుతం సన్నాహాలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో ఈ లేఖను త్వరలో కేంద్రప్రభుత్వానికి అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆమోదం లభించగానే పనులు ప్రారంభం..

కేంద్రం నుంచి ఆమోదం లభించిన వెంటనే రెండో దశ పనులను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే ఎన్నికలను లక్ష్యంగా చేసుకొని సాధ్యమైనంత వరకు అన్ని కారిడార్‌లలో నిర్మాణ పనులను ప్రారంభించాలనే ప్రతిపాదన ఉంది. ప్రస్తుతం ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నిర్మించనున్న 7.5 కి.మీ వరకు రోడ్డు విస్తరణతో పాటు రైట్ ఆఫ్ వే పనులు తుదిదశకు చేరుకున్నాయి.

అప్పులు, ఆస్తులు లెక్కలు...

- మరోవైపు రెండోదశపై కార్యాచరణను వేగవంతం చేస్తూనే ఎల్‌అండ్‌టీతో ఏర్పాటు చేసుకున్న ఒప్పందం మేరకు ఆస్తులు, అప్పులపై అధికారులు దృష్టి సారించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ ఈ మేరకు ప్రతిరోజు వివిధ విభాగాల అధికారులు, నిపుణులతో సమీక్ష సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఆస్తులు, అప్పులపై మదింపు చేస్తున్నారు. సాధ్యమైనంత తక్కువ వ్యవధిలో ఎల్‌అండ్‌టీ వాటాను కొనుగోలు చేసేందుకు అనుగుణంగా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. మెట్రోరైల్ నిర్వహణ కోసం ప్రభుత్వం వివిధ ప్రాంతాల్లో సుమారు 270 ఎకరాల వరకు ఎల్‌అండ్‌టీకి లీజుకు ఇచ్చింది. అందులో కొన్ని చోట్ల మాల్స్ నిర్మించారు. కొన్ని చోట్ల ప్రభుత్వం ఇచ్చిన భూములు నిరుపయోగంగా ఉన్నాయి. ట్రాన్సిట్ ఆధారిత అభివృద్ధి (టీఓడీ)లో భాగంగా ఉప్పల్‌లో సుమారు 96 ఎకరాలు, మియాపూర్‌లో మరో 100 ఎకరాలు, ఫలక్‌నుమాలో మరో 17 ఎకరాల వరకు అప్పగించారు.
- రాయదుర్గం వద్ద ఎల్‌అండ్‌టీకి ఇచ్చిన 15 ఎకరాల్లో కొంతభాగాన్ని ఓ ప్రైవేట్ సంస్థకు సబ్‌లీజుకు ఇచ్చారు. ఇవి కాకుండా నగరంలోని పలు స్టేషన్‌ల వద్ద ఒక ఎకరా నుంచి గరిష్టంగా 5 ఎకరాల వరకు భూములు ఉన్నాయి. అలాగే పంజగుట్ట, మలక్‌పేట్, మాధాపూర్,ఎర్రమంజిల్‌లో మాల్స్‌ను నిర్మించారు. ఆస్తుల విలువ రూ.వేల కోట్లు ఉంటుందని అంచనా. ఎల్‌అండ్‌టీ వైదొలగనున్న దృష్ట్యా రాయదుర్గంలో ఆసంస్థ మరో సంస్థతో కుదుర్చుకున్న 50 ఏళ్ల సబ్ లీజ్ ఒప్పందాన్ని కూడా సమీక్షించవలసి ఉంది. ఈ భూముల నుంచి ప్రభుత్వానికి లభించే ఆదాయంలో మెట్రో అప్పులు, ఎల్‌అండ్‌టీకి చెల్లించాల్సిన రూ.2000 కోట్లు భారం కాబోవని హెచ్‌ఎంఆర్‌ఎల్ అధికారి ఒకరు తెలిపారు.

ఏసీబీకి చిక్కిన లాలాగూడ విద్యుత్ సబ్ ఇంజనీర్



పట్టుబడిన సుధాకర్‌రెడ్డి

లాలాపేట: లాలాగూడ విద్యుత్‌శాఖ సబ్ ఇంజనీర్ శుక్రవారం తార్నాకలోని తన కార్యాలయంలో రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సికింద్రాబాద్ పద్మారావునగర్ సబ్ డివిజన్‌లోని లాలాగూడ సెక్షన్ సబ్ ఇంజనీర్ భూమిరెడ్డి సుధాకర్‌రెడ్డి కొంత కాలంగా ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇంజనీర్‌గా కొనసాగుతున్నారు. తుకారాంగేటు ప్రాంతంలో సింగిల్‌ఫేజ్ మీటర్ల నుంచి త్రీ ఫేజ్ మీటర్లకు అప్‌గ్రేడ్ చేయడానికి ఓ ఫిర్యాదుదారు నుంచి రూ.15 వేలు డిమాండ్ చేశాడు. ఆ మొత్తాన్ని సదరు ఫిర్యాదు దారు నుంచి తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి ఆ లంచం నగదును స్వాధీనం చేసుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

ఎయిర్‌పోర్టులో కార్గో ‘సింహం’

- తొలిసారి వచ్చిన అతిపెద్ద ఫ్లైట్ అంటనోవ్‌- 124 రస్లాన్
- ఇక్కడ సరుకు దింపి దుబాయ్‌కి బయలుదేరిన విమానం





ఎయిర్‌పోర్టులో ల్యాండైన అంటనోవ్‌-124 రస్లాన్

శంషాబాద్: ప్రపంచంలో అతిపెద్ద కార్గో విమానాల్లో ఒకటైన ‘అంటనోవ్‌-124 రస్లాన్’ శుక్రవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో తొలిసారి అడుగుపెట్టింది. రస్లాన్ అంటే తుర్కీ భాషలో సింహం అని అర్థం. ఇది అత్యధిక సరుకు సామర్థ్యం కలిగి ఉండడంతో దీనికి ఆ పేరు పెట్టారు. అబుదాబి నుంచి భారీ సరుకుతో బయలుదేరిన ఈ విమానం మధ్యాహ్నం 12 గంటల సమయంలో రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వేపై అడుగు పెట్టింది. ఇక్కడ సరుకులు దించిన తర్వాత తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు టేకాఫ్ తీసుకుని దుబాయ్ బయలుదేరింది. అంటనోవ్‌-124 రస్లాన్ విమానాలు ప్రస్తుతం క్రియాశీలకంగా 26 మాత్రమే పని చేస్తున్నాయని సమాచారం.

ఈ ఫ్లైట్ ప్రత్యేకతలివీ..

- ఈ విమానానికి నాలుగు అతిపెద్ద టర్బో ఫ్యాన్ ఇంజిన్‌లు ఉంటాయి.
- 150 టన్నుల కార్గోని మోసుకెళ్లడం దీని ప్రత్యేకత. మల్టీలెగ్ ల్యాండింగ్ గేర్ కలిగి ఉంటుంది.
- రెక్కల వైశాల్యం 6760 చదరపు అడుగులు. ఖాళీ విమానం బరువు 1,81,000 కిలోలు.

గతంలో..

శంషాబాద్ విమానాశ్రయంలో 2016 మే 13 అంటనోవ్‌- 225 మ్రియా విమానం చెక్ రిపబ్లిక్ నుంచి బయలుదేరి ఆస్ట్రేలియాలోని పెర్త్‌కు భారీ జనరేటర్ తీసుకెళుతుండగా మార్గమధ్యలో విశ్రాంతి కోసం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండయింది. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద విమానం. రష్యా–ఉక్రెయిన్ యుద్ధ సమయంలో 2022 ఫిబ్రవరి ఇది పూర్తిగా ధ్వంసమైంది. దీని తర్వాత అతి పెద్ద విమానాల్లో ఒకటైన బెలుగా విమానం 2022, 2023, 2024లలో నాలుగు విదేశాలకు బయలుదేరుతూ ఇక్కడ ల్యాండై బయలుదేరాయి. తాజాగా అంటనోవ్‌-124 రస్లాన్ ఎయిర్‌పోర్టులో సరుకులు దించి ఇక్కడి నుంచి దుబాయ్‌కు వెళ్లింది.

రేపు 'కున్ హ్యుందయ్' ప్రత్యేక క్యాంపు

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ కున్ హ్యుందయ్ తమ కస్టమర్లకు మెరుగైన సేవలు అందించేందుకు 'హ్యుందయ్ ఆల్వేస్ అరౌండ్(హెచ్ఏఏ)' పేరుతో ఆదివారం ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కర్మన్‌ఘాట్, మోకిలా, బర్కత్‌పురాలో ఈ క్యాంపుల నిర్వహిస్తామని, కస్టమర్లు వినియోగించుకోవాలని కోరారు.

42 శాతం రిజర్వేషన్లపై దేశవ్యాప్త ఉద్యమం

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించే చట్టాన్ని భారతరాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. 42 శాతం రిజర్వేషన్‌ల సాధన కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నట్లు పేర్కొన్నాయి. ఈ మేరకు శుక్రవారం ఉస్మానియా వర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఓబీసీఎస్ఏ), దళిత బహుజన్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీబీఎస్ఏ), తదితర విద్యార్థుల సంఘాలు ఉస్మానియా ఆర్ట్స్ కాలేజ్ ముందు ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఏఐఓబీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు జి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ, 42 శాతం బీసీ రిజర్వేషన్ చట్టం సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ చట్టం అమలుపైన తలెత్తే న్యాయపరమైన సవాళ్ల దృష్ట్యా 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారానే శాశ్వతంగా న్యాయపరమైన రక్షణ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఓబీసీఎస్ఏ తెలంగాణ ఉధ్యక్షుడు రాజేశ్, అరవింద్, రాజేశ్ దుత్త, శివయాదవ్,అశ్విన్, లక్ష్మణ్, సూర్య, మధు పాల్గొన్నారు.

'బ్రిలియంట్'లో రూ.1.07 కోట్ల చోరీ

- ఫీజు డబ్బులను కాలేజీ ఆఫీసులో భద్రపర్చిన సిబ్బంది
- బీరువా తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన దుండగులు

అబ్దుల్లాపూర్‌మెట్: నగర శివారులోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో భారీ చోరీ జరిగింది. ఫీజుల రూపంలో విద్యార్థుల నుంచి వసూలు చేసిన రూ.1.07 కోట్లు అపహరణకు గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని బ్రిలియంట్ ఇంజనీరింగ్ విద్యాసంస్థకు చెందిన మూడు కాలేజీల్లో సిబ్బంది నాలుగు రోజులుగా ఫీజు డబ్బులు వసూలు చేశారు. అకౌంటెంట్ సెలవులో ఉండటంతో రూ.1.07 కోట్ల నగదును గురువారం కాలేజీ ఆవరణలోని ఆఫీసు బీరువాలో భద్రపర్చి, ఎప్పటిలాగే తాళాలు వేసి సాయంత్రం 6 గంటలకు ఇళ్లకు వెళ్లారు. శుక్రవారం ఉదయం 8.45 గంటలకు వచ్చిచూడగా మెయిన్ డోర్ ధ్వంసం చేసి ఉండటాన్ని గమనించారు. ఆఫీసు రూమ్ వద్దకు వెళ్లగా బీరువా తలుపులు తెరిచి ఉండటం, అందులోని డబ్బు కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ఈ విషయమై కళాశాల ఏఓ కేశినేని కుమార్‌తో పాటు పీఎస్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చోరీ జరిగిన ప్రాంతంతో పాటు పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఇదిలా ఉండగా చోరీకి పాల్పడిన దుండగులు మెయిన్ డోర్‌ను ధ్వంసం చేసి లోనికి చొరబడ్డారు. సీసీ కెమెరాలతో పాటు డీవీఆర్ బాక్స్‌ను సైతం ఎత్తుకెళ్లారు. ఎల్‌బీనగర్ డీసీపీ అనురాధ, వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అశోక్‌రెడ్డి కాలేజీకి చేరుకుని పలువురు సిబ్బందిని విచారించారు. చోరీకి పాల్పడిన వారిని త్వరలోనే పట్టుకుంటామని, ఇందు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. ఇదిలా ఉండగా అధికార పార్టీకి చెందిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కాలేజీలో పెద్ద మొత్తంలో డబ్బు చోరీకి గురికావడం చర్చనీయాంశంగా మారింది.



బ్రిలియంట్ కళాశాలలో సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ అనురాధ తదితరులు



దొంగలు ధ్వంసం చేసిన బీరువా

ప్రభాకర్ పనేనా..?

కాలేజీలో చోరీపై అనుమానిస్తున్న రాచకొండ పోలీసులు

- ఫిబ్రవరిలో గచ్చిబౌలి ప్రాంతంలో అరెస్టు
- గత నెల్లో పోలీసు ఎస్కార్ట్ నుంచి ఎస్కేప్



సాక్షి, సిటీబ్యూరో: అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బ్రిలియంట్ ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో గురువారం రాత్రి చోటు చేసుకున్న భారీ చోరీ వెనక 'కాలేజీ దొంగ' బత్తుల ప్రభాకర్ పాత్ర ఉందా..? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ అవకాశాన్ని కొట్టిపారేయలేమని చెప్తున్న రాచకొండ పోలీసులు ఆ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఈ అంతరాష్ట్ర ఘరానా దొంగ గత నెల 22న ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా దుద్దుకూరు వద్ద పోలీసు ఎస్కార్ట్ నుంచి ఎస్కేప్ అయ్యాడు. ఇళ్లతో పాటు కాలేజీలను టార్గెట్‌గా చేసుకుని చోరీలు చేసే ఇతడిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటకల్లో 86 కేసులు ఉన్నాయి. ప్రభాకర్ ఎస్కేప్‌పై అక్కడి దేవరపల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఇతగాడి కోసం ఏపీ పోలీసులు దాదాపు పది ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ప్రభాకర్ సుదీర్ఘకాలం హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఖరీదైన నివాసాల్లో జీవించాడు. ఇక్కడ ఉన్న విద్యార్థులతో పాటు అనేక మందితో సన్నిహితంగా మెలిగాడు. కాలేజీలను టార్గెట్‌గా చేసుకుని వరుసపెట్టి చోరీ చేశాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 1న గచ్చిబౌలిలోని ప్రిజం పబ్ వద్ద ఇతడి కదలికలు పసిగట్టిన సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. ఆ సందర్భంలో పోలీసులపై కాల్పులకు కూడా తెగపడ్డాడు. ఏపీలోనూ ఇతడిపై కేసులు ఉండటంతో పీటీ వారెంట్‌పై అక్కడి పోలీసులు తీసుకువెళ్లారు. గత నెల్లో పోలీసు ఎస్కార్ట్ నుంచి తప్పించుకున్న ఇతగాడు నగరానికి వచ్చి మళ్లీ కాలేజీలను టార్గెట్ చేశాడా? అనే కోణంలో రాచకొండ పోలీసులు ఆరా తీస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే పలు కీలక ఆధారాలు లభించినట్లు తెలిసింది.

హామీలు, ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడతాం : కవిత

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత చెప్పారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్‌కు చెందిన బీసీ నేత రామ్‌కోటి తన అనుచరులతో కలిసి తెలంగాణ జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా కవిత వారికి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ జాగృతి అంటేనే పోరాటాలు, విప్లవాల జెండా అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రసవం కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లిన గర్భిణులకు కేసీఆర్ కిట్‌తో పాటు ఆర్థిక సాయం అందించేవారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అది బంద్ అయిందని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు వారికిచ్చిన అన్ని హామీలు అమలు చేసేలా కొట్లాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్‌సింగ్ నాయక్, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

స్నాప్ చాట్‌లో పరిచయం.. పెళ్లి పేరుతో మోసం

బంజారాహిల్స్: స్నాప్‌చాట్‌లో పరిచయమైన ఓ వివాహితను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లక్షలాది రూపాయలు కాజేసిన యువకుడిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని సయ్యద్‌నగర్‌లో నివసించే వివాహిత (33) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నది. ఆమెకు భర్తతో మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకుంది. ఈ క్రమంలో రూ.6 లక్షలు భరణం వచ్చింది. ఆ మొత్తాన్ని బ్యాంకులో దాచుకుంది. రెండేళ్ల క్రితం సోమాజిగూడకు చెందిన సయ్యద్ హుస్సేన్ (33) అనే యువకుడు ఆమెకు స్నాప్‌చాట్‌లో పరిచయమయ్యాడు. ఆమె వద్ద నగలు, నగదు ఉన్నాయని తెలుసుకుని పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. తన కారులో ఓ నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో ఆమె నమ్మింది. మాయమాటలు చెప్పిన హుస్సేన్ ఆమె వద్ద నుంచి రూ.6 లక్షల నగదుతో పాటు ఆభరణాలను కూడా తన వ్యాపారానికి వాడుకున్నాడు. ఇటీవల ఆమె పెళ్లి చేసుకుందామని ఒత్తిడి తీసుకురాగా ముఖం చాటేసి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. మోసపోయానని తెలుసుకున్న బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బంజారాహిల్స్ పోలీసులు నిందితుడు సయ్యద్ హుస్సేన్‌పై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.కోటి విలువైన డ్రగ్స్ స్వాధీనం

నాగోలు: రాజస్థాన్ నుండి రూ.కోటి విలువైన డ్రగ్స్ తీసుకువచ్చి విక్రయించే ప్రయత్నం చేసిన వ్యక్తిని మల్కాజిగిరి ఎస్ఓటీ, కీసర పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. అతని వద్ద 7 కిలోల ఓపీఎం, 2 కిలోల పాపిస్ట్రా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ సుధీర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం..రాజస్థాన్‌లోని బల్దార్హా ప్రాంతానికి చెందిన లోకేష్ బరేత్ సులభంగా డబ్బు సంపాదించాలని డ్రగ్స్ రవాణాకు ఉపక్రమించాడు. అదే ప్రాంతానికి చెందిన జగదీష్ గుజ్జర్‌తో కలిసి హైదరాబాద్, చెన్నై వంటి ప్రాంతాలకు డ్రగ్స్ పంపుతున్నారు. ఈక్రమంలో జగదీష్ గుజ్జర్ ఆదేశాల మేరకు లోకేష్ బరేత్ రాజస్థాన్ నుంచి వచ్చి కీసర పోలీస్ స్టేషన పరిధిలోని కుందన్‌పల్లి ఓఆర్ఆర్ రోటరీ వద్ద గుర్తు తెలియని వ్యక్తికి డ్రగ్స్‌ను అప్పగించేందుకు వేచి ఉండగా సమాచారం అందుకున్న మల్కాజిగిరి ఎస్ఓటీ, కీసర పోలీసులు అరెస్టు చేశారు.

దుబాయి ఎయిర్‌పోర్టులో తెలంగాణ వాసికి అస్వస్థత

- ఆసుపత్రిలో చేర్పించిన సిబ్బంది
- తన భర్తను ఆదుకోవాలని సీఎం ప్రవాసీ ప్రజావాణిలో భార్య వినతి



సయ్యద్ బాబా

లక్ష్మీకాపూల్: ముంబై నుంచి సౌదీ అరేబియాకు బయలుదేరిన నిజామాబాద్ వాసి ఒకరు దుబాయ్ ఎయిర్‌పోర్టులో అస్వస్థతకు గురయ్యారు. అతన్ని ఆదుకోవాలంటూ భార్య సీఎం ప్రవాసీ ప్రజావాణిలో విన్నవించింది. వివరాల్లోకి వెళ్తే..నిజామాబాద్ పట్టణం మహబూబ్ బాగ్‌కు చెందిన సయ్యద్ బాబా(38) అనే వ్యక్తి గల్ఫ్‌లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 3న ముంబై నుంచి సౌదీ అరేబియాలోని అభా నగరానికి వెళుతూ మార్గమధ్యంలో దుబాయ్ ఎయిర్‌పోర్టులో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే స్పందించిన ఎయిర్‌పోర్ట్ సిబ్బంది అతన్ని రషీద్ హాస్పిటల్‌లో చేర్పించి మానవత్వం ప్రదర్శించారు. కాగా అతన్ని ఇండియాకు తిరిగి రప్పించాలని బాబా భార్య సమీనా బేగం సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమానికి సోదరుడు చోటుతో కలిసి వచ్చిన ఆమె ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఎమిగ్రెంట్స్ వెల్ఫేర్ ఫోరం ప్రధాన కార్యదర్శి బీఎల్ సురేంద్రనాథ్ వారికి మార్గదర్శనం చేశారు. సయ్యద్ బాబా అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకున్నారు. దుబాయిలో ఉన్న నిజామాబాద్ జిల్లాకు చెందిన నయీమ్, కొట్టాల సత్యం, నారా గౌడ్‌లు రోగి బాగోగులు చూసుకుంటున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

బాణాసంచా అక్రమ నిల్వలపై టాస్క్‌ఫోర్స్ కన్ను

రూ.18 లక్షల సరుకు స్వాధీనం చేసుకున్న టీమ్



సాక్షి, సిటీబ్యూరో: దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో బాణాసంచా అక్రమ నిల్వలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు కన్నేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా నగర వ్యాప్తంగా నిఘా ముమ్మరం చేశారు. ఫలితంగా ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ బృందానికి రూ.18 లక్షల విలువైన సరుకు చిక్కినట్లు అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు శుక్రవారం వెల్లడించారు. బొగ్గులకుంటకు చెందిన శ్యామ్ కుమార్ సుగంధి సిద్ధ అంబర్ బజార్‌లో ఓ గోదాం నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమతులు, ముందు జాగ్రత్త చర్యలు లేకుండా అందులో భారీగా బాణాసంచా నిల్వ ఉంచారు. జనావాసాల మధ్య ఈ గోదాం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిసినా అతడు నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. నగర వ్యాప్తంగా ఉన్న బాణాసంచ అక్రమ నిల్వలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు కొన్ని రోజులుగా ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈస్ట్‌జోన్ బృందానికి శ్యామ్ కుమార్ గోదాంపై సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ నేతృత్వంలో ఎస్సైలు ఎం.అనంతాచారి, ఎస్.కరుణాకర్ రెడ్డి, పి.నాగార్జున తమ బృందాలతో దాడి చేసి శ్యామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మొత్తం రూ.18 లక్షల విలువైన సరుకు స్వాధీనం చేసుకుని కేసును అఫ్జల్‌గంజ్ పోలీసులకు అప్పగించారు.

రక్షణ రంగం సాంకేతికతతో పురోగమిస్తున్న భారత్

డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌వీ హరప్రసాద్



అతిథిని సత్కరిస్తున్న సీబీఐటీ ప్రిన్సిపాల్ నరసింహులు

మణికొండ: రక్షణ రంగంలో మన దేశం సాంకేతికతను విరివిగా వినియోగించి రాణిస్తున్నదని డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్ (నావల్ సిస్టమ్స్, మెటీరియల్స్) అన్నారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో శుక్రవారం చైతన్య ఆస్ట్రా, సీబీఐటీ ఏరోస్పేస్ క్లబ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే కాస్మోకాన్-2025ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న సాంకేతికతను రక్షణరంగం పూర్తి స్థాయిలో వినియోగిస్తుందన్నారు. డీఆర్‌డీఓ లాంటి సంస్థలలో అనేక పరిశోధనలు కొనసాగుతున్నాయన్నారు. భవిష్యత్తు ఇంజనీర్లు మరింత ఉన్నత సాంకేతికతను కనుగొనేందుకు పరిశోధన చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన తన అనుభవాలు, ఆలోచనలు, వృత్తి జీవితానుభవాలను పంచుకున్నారు. విద్యార్థుల ఆసక్తిని పరీక్షించేలా వారికి పలు ప్రశ్నలను సంధించి సమాధానాలను రాబట్టారు. అంతకు ముందు డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ వర్చువల్‌గా తన సందేశాన్ని ఇచ్చారు. ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు మాట్లాడుతూ... పరిశోధన, నవీనత పట్ల సీబీఐటీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కాస్మోకాన్ కన్వీనర్ ఆకాశ్ కోటి, ఆస్ట్రా అధ్యక్షుడు టి.జై సాయి దిపేష్, ఉపాధ్యక్షుడు హర్షిత్ వర్మ, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ రాహుల్‌లు ఇప్పటి వరకు కొనసాగించిన పరిశోధనలు, సాధించిన విజయాలను వివరించారు.

తాగి వేధిస్తున్నాడని కొడుకుని చంపిన తల్లి

పంజగుట్ట: తాగి నిత్యం వేధింపులకు గురిచేస్తుండడంతో ఓ తల్లి తన కన్న కొడుకునే హత్య చేసింది. పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం. అనంతపూర్‌కు చెందిన గంగులమ్మ కుమారుడు హర్షవర్ధన్ (27)తో కలిసి పంజగుట్ట ఉమానగర్‌లో నివాసం ఉంటుంది. ఇళ్లలో పనిచేస్తూ పొట్టపోసుకుంటోంది. ఈ క్రమంలో హర్షవర్ధన్ తాగుడుకు బానిసై నిత్యం తల్లిని వేధిస్తున్నాడు. డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నాడు. దీంతో విసిగిపోయిన గంగులమ్మ బ్రాహ్మణవాడికి చెందిన మరో ఇద్దరి సహకారం తీసుకుని గురువారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో హర్షవర్ధన్ నిద్రిస్తుండగా టవల్ అతని మెడకు బిగించి హత్య చేశారు. సహకరించిన ఇద్దరూ పరారవగా.. గంగులమ్మ మృతదేహంతో ఉదయం వరకు ఉండి తెల్లవారిన తరువాత బంధువులకు, చుట్టాలకు మద్యం మత్తులో నిద్రలోనే చనిపోయాడని ఫోన్ చేసి చెప్పింది. చుట్టుపక్కల వారు అనుమానించి పోలీసులకు సమాచారం ఇవ్వగా..పంజగుట్ట ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సిబ్బంది మృతదేహాన్ని పరిశీలించి గంగులమ్మను విచారించగా తాగి వేధిస్తుంటే భరించలేక హత్య చేసినట్లు అంగీకరించింది. ఇద్దరు సహకరించినట్లు తెలిపింది. దీంతో గంగులమ్మను అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు హత్యకు సహకరించిన మరో ఇద్దరికోసం గాలిస్తున్నారు.

మిగతా ఐదు చెరువులకూ పునరుజ్జీవం తేవాలి

- సిబ్బందికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు
- తమ్మిడికుంట, నల్లకుంట చెరువు పనుల పరిశీలన



కూకట్‌పల్లి చెరువు వద్ద రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: బతుకమ్మకుంటను సర్వాంగసుందరంగా తీర్చిదిద్ది అందుబాటులోకి తీసుకువచ్చిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఇప్పుడు మిగిలిన ఐదు చెరువులపై దృష్టి పెట్టింది. వీటి అభివృద్ధి, పునరుజ్జీవం నవంబర్ నాటికి పూర్తి కావాలంటూ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. ఆయన శుక్రవారం క్షేత్రస్థాయిలో రెండు చెరువుల వద్ద జరుగుతున్న పనుల్ని పరిశీలించారు. మాదాపూర్‌లోని తమ్మిడికుంట చెరువు, కూకట్‌పల్లిలోని నల్ల చెరువుల వద్దకు వెళ్లిన ఆయన పలు సూచనలు చేశారు. ఈ రెండు చెరువులు పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. శిల్పారామం, మెటల్ చార్మినార్ వైపుల నుంచి తమ్మిడికుంటలోకి వచ్చే ఇన్‌లెట్లకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని స్పష్టం చేశారు. శిల్పారామం వద్ద వరద నీరు నిలవకుండా వాటిని అభివృద్ధి చేయాలని సూచించారు. చెరువు చుట్టూ బండ్, బయట వైపు రిటైనింగ్ వాల్ నిర్మించాలని... చెరువు లోపలి వైపు రాతి కట్టడం పటిష్టంగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. వేలాది నివాసాల మధ్య ఉన్న కూకట్‌పల్లి నల్లచెరువు వద్ద స్థానికులు సేదతీరేలా అభివృద్ధి చేయాలని రంగనాథ్ సూచించారు. మురుగునీటిని డైవర్ట్ చేసేందుకు నిర్మిస్తున్న కాలువ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని జలమండలి అధికారులను కోరారు. గతంలో 17 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నల్ల చెరువు ఆక్రమణలను తొలగించిన తర్వాత 27 ఎకరాలకు పెరిగిందని వివరించారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలతో కూడిన హైలైఫ్ బ్రైడ్ ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శివోహం పేరిట కళాకారిణి శిల్పా కాసు వేసిన చిత్రాల ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

తెలంగాణ భవన్‌కు తాళాలు వేసేందుకు యత్నం

– నలుగురు అరెస్టు

బంజారాహిల్స్: బీఆర్ఎస్ పార్టీ బాకీ కార్డులో తెలంగాణ ఉద్యమకారుల హామీలు పొందుపరచలేదని ఆరోపిస్తూ వినతిపత్రం ఇవ్వడంతో పాటు తెలంగాణ భవన్‌కు తాళాలు వేసేందుకు వెళ్లిన నలుగురు తెలంగాణ ఉద్యమకారులను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. మన తెలంగాణ తొలి దశ, మలి దశ ఉద్యమకారుల జేఏసీ నేతలు తెలంగాణ కొమురయ్య, శ్యామా అంజిరెడ్డి, మచ్చ సోమనారి, చెరుకుపల్లి నాగేశ్వరరావు తదితరులు శుక్రవారం ఉదయం బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌కు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ లోనికి చొచ్చుకువెళ్లేందుకు ప్రయత్నించారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేస్తామంటూ పోలీసులకు చెప్పగా అనుమతించలేదు. తాము వినతిపత్రంతో పాటు తమ హామీలు నెరవేర్చని తెలంగాణ భవన్‌కు తాళాలు వేసేందుకు ప్రయత్నించామని, తమను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశామన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు సముచిత గౌరవాన్ని కల్పించడం కోసం చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. గేటు ముందు నినాదాలు చేస్తున్న వీరిని పోలీసులు అరెస్టు చేసే క్రమంలో తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసులు వీరిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

బాలిక సాహసం.. ఉడాయించిన దొంగ



సీసీ కెమెరా దృశ్యం..



భవాని

సాక్షి, సిటీబ్యూరో: తమ పొరుగింట్లో చోరీకి యత్నించిన దొంగను ఓ బాలిక తరిమికొట్టింది. దొంగతనాన్ని నివారించి అందరి ప్రశంసలు అందుకుంది. వివరాల్లోకి వెళ్తే..చింతల్, భగత్ సింగ్ నగర్, రోడ్ నంబర్ 12లోని ఓ ఇంట్లో కావలి భవానీ అనే 13 ఏళ్ల బాలిక కుటుంబంతో కలిసి నివసిస్తోంది. తమ కింద పోర్షన్‌లో ఉమా మహేశ్వరి, చంద్రశేఖర్ దంపతులు నివసిస్తుండగా..వారు గురువారం రాత్రి బయటకు వెళ్లడం చూసి ఓ 20 ఏళ్ల యువకుడు దొంగతనం కోసం ఇంట్లోకి ప్రవేశించాడు. కిందింట్లో అలికిడి గమనించిన భవానీ అక్కడికి వెళ్లి ఎవరు నువ్వు అని నిలదీయడంతో యువకుడు బయటకు పరుగెత్తాడు. భవాని అంతటితో వదిలి పెట్టకుండా కేకలు పెడుతూ చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేస్తూ దుండగుడిని వెంబడించింది. వీధి చివర ప్రణవ్ ఇంటర్నేషనల్ స్కూల్ వరకు తరుముతూ వెళ్లింది. సీసీ కెమెరా రికార్డు ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులతోపాటు కాలనీ వాసులు భవానిని ప్రశంసించారు.

లంబాడీ మహిళలపై వ్యాఖ్యలు అనైతికం

పంజగుట్ట: పదవుల కోసం గిరిజన తెగల మధ్య చిచ్చుపెట్టడం నాయకులకు తగదని సేవాలాల్ బంజారా సంఘం జాతీయ అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ అన్నారు. గత కొన్ని నెలలుగా బంజారా, ఆదివాసీల మధ్య వైరం కొనసాగుతున్నా కాంగ్రెస్ పార్టీ స్పందించక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ .. ఇటీవల భద్రాచలంలో జరిగిన ఆదివాసీ సభలో తుడుందెబ్బ నాయకులు లంబాడీ మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. లంబాడీల సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేసిన లంబాడీలపై ఆ పార్టీ నాయకులు సీతక్క, సోయం బాపూరావు, తెల్లం వెంకట్రావులు కక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు ఆర్.నగేష్ నాయక్, మహిళా ప్రధానకార్యదర్శి సరితాబాయి, సంపత్, సాయి, పద్మ బాయి తదితరులు పాల్గొన్నారు.

జామపండ్లతో గణనాథుని అలంకరణ



ఫిల్మ్‌నగర్: ఫిల్మ్‌నగర్ దైవ సన్నిదానంలో కొలువుదీరిన శ్రీ సకల సిద్ధి విఘ్నేశ్వర స్వామికి శుక్రవారం శ్రీ సంకట హర చతుర్ది వ్రతం సందర్భంగా జామ పండ్లతో పాటు విశేష ఫలాలతో చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రం పంచామృతాభిషేకం, అలంకారంతో పాటు 216 కిలోల గుడార్చన, పల్లకీ సేవ, వ్రతకథ, హారతి, ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ వైభవంగా జరిగాయి. ఫిల్మ్‌నగర్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ వేడుకల్లో పాల్గొని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

సేవా కార్యక్రమాలకే డైరీ ఆదాయం



శ్రీనగర్‌కాలనీ: మున్నూరుకాపు డైరెక్టరీ, డైరీ ద్వారా వచ్చే ఆదాయాన్ని మున్నూరుకాపు పేద విద్యార్థుల విద్య, వైద్యం కోసం, సేవా కార్యక్రమాల కోసం ఖర్చు చేయనున్నట్లు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి, డైరీ కమిటీ చైర్మన్ మంగళారపు లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీలోని సంఘం కార్యాలయంలో సంఘం నేతలతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. పేద విద్యార్థుల విద్య, వైద్యానికి చేయూత అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర అధ్యక్షుడు కుటుంబం పురుషోత్తమరావు సలహా మేరకు 10 మంది సీనియర్ సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశామన్నారు. డైరీలో సంఘంలో ప్రముఖులు, రాజకీయ, సినీ, వ్యాపార రంగంలో దిగ్గజుల సమాచారంతో పాటు పలు అంశాలను ప్రస్తావించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది లవంగాల అనిల్‌కుమార్, వెంకటేశ్వర్లు, ఆకుల సతీష్, చాట్ల నర్సింగరావు, పర్వతం సతీష్, పోన్న వెంకటరమణ, కోట్ల వినోద్ పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చుకు డబ్బు ఇవ్వాలంటూ పోస్ట్

వ్యక్తిపై కేసు నమోదు

బంజారాహిల్స్: తాను జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ చేస్తున్నానని, అయితే తాను సామాన్యుడినని, నామినేషన్ వేసే ప్రక్రియ నుంచి ఎన్నికల దాకా తనకు ఖర్చుల కోసం ఒక్కొక్కరు రూ.100 నుంచి ఎంతైనా ఆర్థికంగా సహాయపడాలంటూ ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడమే కాకుండా క్యూఆర్ కోడ్ కూడా ఇచ్చాడు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా సదరు వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడని జూబ్లీహిల్స్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి పి.సాయిరాం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అభినయ్ దర్శన్ అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన అభినయ్ దర్శన్ అనే యువకుడు రెండు రోజుల క్రితం సోషల్ మీడియాలో తనకు ఎన్నికల ఖర్చు నిమిత్తం ప్రతిఒక్కరూ రూ.100 ఆర్థిక సహాయం చేయాల్సిందిగా పోస్ట్ చేశాడు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఓపెన్ అయిన తర్వాత అభినయ్ దర్శన్ అని వస్తుందని, దానికి డబ్బులు పంపాలని వీడియో షేర్ చేశాడు. స్థోమతకు తగినట్లుగా సహాయం చేస్తే ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తానని పేర్కొన్నాడు. తాను విధి నిర్వహణలో ఉండగా అభినయ్ దర్శన్ వీడియో చూడడం జరిగిందని, ఇది ఎన్నికల నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆర్వో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు అభినయ్ దర్శన్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభ్యర్థితో కలిపి ఐదుగురికే అనుమతి..

ఆర్వో కేంద్రానికి 100 మీటర్ల లోపే మూడు కార్లకు అనుమతి..

- నామినేషన్ దాఖలుపై సందేహాలకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు..
- ఉదయం 11 నుంచి 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ..
- 'సాక్షి'తో జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.సాయిరాం



ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.సాయిరాం..



ఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్..



ఆర్వో కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు..

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. నవంబర్ 11న ఎన్నికలు జరగనుండగా 14న ఫలితాలు వెలువడనున్నాయి. ఇందుకోసం అక్టోబర్ 11న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండగా, అక్టోబర్ 13 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని షేక్‌పేట మండల కార్యాలయంలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. నామినేషన్లను కూడా అక్కడే స్వీకరించనున్నారు. నామినేషన్ల ప్రక్రియ, అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కార్యాలయంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై రిటర్నింగ్ అధికారి పి.సాయిరాం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు..

ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఈ నెల 13న జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. షేక్‌పేట మండల కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేశారు. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతి ఉంటుంది. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో మాత్రమే అభ్యర్థి కాన్వాయ్‌లో మూడు వాహనాలకు మాత్రమే అనుమతిస్తారు. వంద మీటర్ల దూరం నుంచి అభ్యర్థి తనతో వచ్చిన నలుగురితో కలిసి నామినేషన్ కేంద్రంలోకి రావాల్సి ఉంటుంది. ఈ నెల 13 నుంచి 21 వరకు అన్ని పని దినాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 19న ఆదివారం, 20న దీపావళి నేపథ్యంలో ఈ రెండు రోజులు మాత్రం సెలవు దినాలు ఉంటాయి.

రెండు హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు...

నామినేషన్ పత్రాలు స్వీకరించడంతో పాటు నామినేషన్లు భర్తీ చేయడంపై అవగాహన కల్పించేందుకు ఆర్వో కేంద్రంలో రెండు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటుచేశాం. అనుభవజ్ఞులైన సిబ్బంది ఇక్కడ ఉంటారు. నామినేషన్ పత్రం-2(బీ)తో పాటు అఫిడవిట్, నిబంధనల కాపీ, చెక్ లిస్టు ఈ నాలుగూ ఇక్కడ హెల్ప్‌డెస్క్‌లో అందుబాటులో ఉంటాయి. నామినేషన్ పత్రం ఇచ్చే ముందు ఎవరికిచ్చారో రాసుకుని ఇవ్వడం జరుగుతుంది. అలాగే వివరాలన్నీ సరిగ్గా భర్తీ చేసే విధంగా హెల్ప్ డెస్క్ సిబ్బంది సహాయపడతారు. ప్రపోజల్స్ కోసం ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లో చెక్ చేసుకోవాలి.

ఆరు జాతీయ.. నాలుగు ప్రాంతీయ పార్టీలు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, ఆప్, సీపీఎం, నేషనల్ పీపుల్స్ పార్టీ తదితర ఆరు పార్టీలు జాతీయ రాజకీయ పార్టీలుగా గుర్తింపు పొందాయి. అలాగే బీఆర్ఎస్, ఎంఐఎం, టీడీపీ, వైఎస్సార్‌సీపీ తదితర నాలుగు పార్టీలు ప్రాంతీయ పార్టీలుగా గుర్తింపు పొందాయి. ఆయా పార్టీల అభ్యర్థులు మాత్రమే ఒకరి ప్రపోజల్స్‌తో నామినేషన్ వేస్తే సరిపోతుంది. సెప్టెంబర్ 30న ఓటరు జాబితాలో ఉన్న పేరుతో కరెక్ట్ సీరియల్ నెంబర్ రాసి ప్రపోజల్ చేయాల్సి ఉంటుంది. స్వతంత్ర అభ్యర్థులు మాత్రం 10 మంది ప్రపోజల్స్ ఇవ్వాల్సి ఉంటుంది.

కలర్ ఫొటో తప్పనిసరి..

నామినేషన్ వేసే అభ్యర్థులు తప్పనిసరిగా కలర్ ఫొటో అంటించాలి. 2/2.5 సెంటీమీటర్ల ఫొటోను కళ్లజోడు పెట్టుకోకుండా తీసుకుని జతపర్చాలి. అలాగే 3/4 వంతు ముఖం ఫొటోలో కనబడాలి. వైట్ బ్యాక్‌గ్రౌండ్ ఉండాలి.

ప్రపోజల్ నియోజకవర్గ ఓటరు అయ్యి ఉండాలి..

అభ్యర్థులను ప్రపోజ్ చేసే ఓటర్లు తప్పనిసరిగా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన వారే ఉండాలి. అభ్యర్థి మాత్రం ఏ నియోజకవర్గానికి చెందిన వారైనా సరే. అయితే ఈఆర్వో నుంచి ఎలక్ట్రోరల్ ఎక్స్‌ట్రాక్ట్ కాపీ తీసుకోవాల్సి ఉంటుంది.

జనరల్ అభ్యర్థి సెక్యూరిటీ డిపాజిట్ రూ.10 వేలు..

ఎన్నికల్లో పోటీ చేసే జనరల్ అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.10 వేలు చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీలు అయితే కుల ధృవీకరణ పత్రం జతచేసి రూ.5 వేలు డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 21 లోపు జాతీయ, రాష్ట్ర పార్టీల అభ్యర్థులు మూడు గంటల్లోపు ఏ, బీ ఫారాలను సమర్పించాలి. పోటీ చేసే అభ్యర్థి 25 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి.

ఐదుగురు ఏఆర్వోలతో పర్యవేక్షణ..

నామినేషన్ కేంద్రంలో ఒకవేళ ఆర్వో సెలవులో ఉంటే ఏఆర్వో ప్రేమ్‌కుమార్ విధుల్లో ఉండి నామినేషన్ల స్వీకరించడమే కాకుండా ఇతరత్రా పనులు నిర్వహిస్తారు. మొత్తం 5 మంది ఏఆర్వోలు నియమించాం. ప్రేమ్‌కుమార్‌తో పాటు రజనీకాంత్‌రెడ్డి, కమల్, అజారుద్దీన్, ప్రసీద తదితరులు విధుల్లో ఉంటారు. రోజూ నామినేషన్లు గడువు ముగియగానే 3 గంటల తర్వాత ఎవరెవరు నామినేషన్ల వేసింది అఫిడవిట్లతో సహా నోటీసు బోర్డులో పెడతాం.

15 ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు..

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు 15 ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 15 స్టాటిక్ సర్వైలెన్స్, 5 వీడియో సర్వైలెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయడం జరిగింది. ఎన్నికల కోడ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో మాత్రమే ఉంటుంది. వీరంతా ర్యాలీలు, మీటింగ్‌లను నిత్యం తనిఖీలు చేస్తూ వీడియోలు తీస్తారు.

ప్రచార అనుమతులకు సువిధ..

అభ్యర్థులు ప్రచారాలు, సభలకు సంబంధించి మూడు రోజుల ముందు సువిధలో దరఖాస్తు చేసుకోవాలి. అలాగే ఫిర్యాదుల కోసం సీ-విజిల్ అందుబాటులో ఉంటుంది.

ఇద్దరు సహాయ వ్యయ పరిశీలకులు..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షలు మాత్రమే ఖర్చు చేయాలి. రోజువారీ ఖర్చులను రాసుకునేందుకు ఒక బుక్ ఇవ్వడం జరుగుతుంది. ఎప్పటికప్పుడు అభ్యర్థులు ఖర్చులు నమోదు చేసుకోవాలి. ఇందుకోసం ఇద్దరు సహాయ వ్యయ పరిశీలకులు, వారి కింద నలుగురు అకౌంటింగ్ టీమ్ ఏర్పాటు చేశాం.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్..



అభ్యర్థులకు జాబ్ లెటర్లు అందజేస్తున్న కంపెనీల ప్రతినిధులు..

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రీటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో శుక్రవారం వర్సిటీ క్యాంపస్‌లో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. 'స్టైఫండ్ బేస్డ్ అప్రెంటీస్‌షిప్ ప్రోగ్రామ్'లో చేరిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో ప్రముఖ రిటైలర్స్ పై ఇంటర్నేషనల్, స్టార్ బజార్, దర్పన్ ఫర్నీచర్, ఆదిత్య బిర్లా, అపోలో మెడికల్, మెడ్‌ప్లస్, తనిష్క్ జ్యువెలర్స్ సంస్థలు పాల్గొన్నాయి. ఎంపికైన అభ్యర్థులకు ఆయా సంస్థల ప్రతినిధులు నియామక ఉత్తర్వులు అందజేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.వి జయకృష్ణారెడ్డి, ఈఎంఆర్ అండ్ ఆర్‌సీ రవీంద్రనాథ్ సోలమన్, యూజీసీ-డీఈబీ డైరెక్టర్ పల్లవీ కాబ్డే, ప్లేస్‌మెంట్ అధికారి వేణుగోపాల్‌రెడ్డి, రాసి సౌత్ రీజియన్ జనరల్ మేనేజర్ చందా వడ్డే తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం..



ప్రశాంత్‌రాజు

ఫిలింనగర్: ఓ యువకుడు అదృశ్యమైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఫిలింనగర్ రోడ్డు నెంబర్-2లో నివసించే గోకరాజు ప్రశాంత్‌రాజు (36) గురువారం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో అతడి తండ్రి జీకే రామరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని గాలింపు చేపట్టారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే స్టిక్కర్‌తో ప్రచారం

చర్యలు తీసుకోవాలంటూ మాజీ కార్పొరేటర్ ఫిర్యాదు



ఎమ్మెల్యే స్టిక్కర్‌తో తిరుగుతున్న వాహనం..

వెంగళరావునగర్ : ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే కారు స్టిక్కర్‌తో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారం చేస్తున్నారని యూసుఫ్‌గూడ మాజీ కార్పొరేటర్ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఇటీవల మృతి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కారుపై ఎమ్మెల్యే పేరుతో స్టిక్కర్లు ఉన్నాయి. కాగా ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సతీమణి, బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ అభ్యర్థి మాగంటి సునీత నియోజకవర్గంలో ఎమ్మెల్యే స్టిక్కర్ ఉన్న కారులో ప్రయాణిస్తూ ప్రచారం చేస్తున్నారు. ఇది నిబంధనలకు వ్యతిరేకమని, తక్షణం ఆమెతో పాటుగా కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ యూసుఫ్‌గూడ మాజీ కార్పొరేటర్ జి.సంజయ్‌గౌడ్ రిటర్నింగ్ అధికారి పి.సాయిరామ్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎన్నికల అధికారి సాయిరామ్‌ను వివరణ కోరగా సదరు వాహనానికి సంబంధించిన పూర్తి వివరాలు అందించాలని ఆర్‌టీఏ అధికారులను కోరినట్లు తెలిపారు. వివరాలు వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు బ్రేక్



సాగర్ సొసైటీ వద్ద క్రాకర్స్ దుకాణాల ఏర్పాటు పనులను అడ్డుకుంటున్న షేక్‌పేట మండల అధికారులు...

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని సాగర్ సొసైటీ సిగ్నల్ సమీపంలోని ఓ ప్రైవేట్ స్థలంలో దీపావళి సందర్భంగా ఏటా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది షేక్‌పేట మండల కార్యాలయాన్ని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంగా కేటాయించారు. క్రాకర్స్ దుకాణాలు ఏర్పాటు చేసే స్థలం నుంచి రిటర్నింగ్ అధికారి కార్యాలయం 300 మీటర్ల దూరంలోనే ఉండటంతో ఏవైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందనే కారణంతో మండల అధికారులు అభ్యంతరం చెబుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సదరు స్థలంలో వ్యాపారులు దుకాణాల ఏర్పాటుకు షెడ్లు నిర్మిస్తుండగా సమాచారం అందుకున్న షేక్‌పేట మండల అధికారులు అక్కడికి వెళ్లి పనులను నిలిపివేశారు. పోలీసు, అగ్నిమాపక, ఎన్నికల సంఘం ఉన్నతాధికారులతో మాట్లాడిన తర్వాత ఇక్కడ దుకాణాల ఏర్పాటుకు అనుమతిపై ఆలోచిస్తామని అప్పటి వరకు షెడ్లు నిర్మించవద్దంటూ తహసీల్దార్ అనితారెడ్డి దుకాణదారులకు సూచించారు. షేక్‌పేట మండల కార్యాలయంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఈ నెల 21 వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, 24న నామినేషన్ల ఉప సంహరణ తేదీని ఎన్నికల సంఘం ప్రకటించింది. మరో వైపు దుకాణదారులు తాము ఎన్నో ఏళ్లుగా ఇక్కడ దుకాణాలు ఏర్పాటు చేస్తున్నామని ఎన్నికల కార్యాలయానికి ఈ స్థలం చాలా దూరంలో ఉందని ఎటువంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే బీసీ రిజర్వేషన్లకు అడ్డుకట్ట

హిమాయత్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు కల్పించిన 42 శాతం రిజర్వేషన్లను బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు తమ రాజకీయ లబ్ధి కోసం అడ్డుకుంటున్నాయని తెలంగాణ బీసీ-ఎ కులాల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు ప్రొఫెసర్ ఎం.భాగయ్య అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో హైకోర్టు న్యాయవాది సుదర్శన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 42 శాతం రిజర్వేషన్లలో బీసీ కులాల దామాషా ప్రకారం ఏబీసీడీ వర్గీకరణ చేసి రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 ప్రకారం ఎన్నికల నోటిఫికేషన్‌లో కోర్టులు జోక్యం చేసుకోరాదని పేర్కొందన్నారు. సమావేశంలో నాయకులు రాంచందర్, శ్రీహరి, అంబటి సుధాకర్, రామానంద స్వామి, నరేందర్ రావు నాయి, మహేందర్ రావు నాయి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సమాజానికి కాంగ్రెస్ బహిరంగ క్షమాపణలు చెప్పాలి

హిమాయత్‌నగర్ : బీసీల రిజర్వేషన్ జీఓను, స్థానిక ఎన్నికలను నిలుపుదల చేస్తూ హై కోర్టు స్టే ఇవ్వడానికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే తమ పదవికి రాజీనామా చేయాలని జాతీయ ప్రజా స్వామిక లౌకిక కూటమి(ఎన్.డి.ఎ స్.ఎఫ్) చైర్మన్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9కు రాజ్యాంగ బద్ధత లేదని, కోర్టు ఇచ్చిన స్టే ద్వారా తేలిపోయిందన్నారు. పార్లమెంట్‌లో బిల్లు పెట్టి 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని చేర్చితేనే బీసీలకు రక్షణ ఉంటుందన్నారు. ఈనెల 14న బీసీల రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అశోక్, పుల్లూరి వెంకటర రాజేశ్వరరావు, వీరన్న నాయుడు, జె.ఎస్.రావు, గోత్రాల శ్రీనివాస్, మద్దెల రాయప్ప, పి.సుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ప్రత్యేక వసతులు..



సమావేశంలో పాల్గొన్న ఎల్డర్లీ ఐకేర్ టీమ్ సభ్యులు

బంజారాహిల్స్: వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ మార్గదర్శకాల ప్రకారం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థల్లో వృద్ధుల కోసం ప్రత్యేక సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు వృద్ధుల కంటి సంరక్షణ విభాగాధిపతి డాక్టర్ అవినాష్ పతెంగే తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎల్డర్లీ ఐకేర్ టీమ్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ కల్లం అంజిరెడ్డి క్యాంపస్ (హైదరాబాద్), జీఎంఆర్ వరలక్ష్మీ క్యాంపస్ (విశాఖపట్నం), మిథుతుల్సి చన్ రాయి క్యాంపస్ (విజయవాడ), రాజశేఖరరెడ్డి క్యాంపస్ (కడప)లో వృద్ధుల కోసం ప్రత్యేక వసతులు కల్పించామన్నారు. ఆస్పత్రికి వచ్చిన వృద్ధులకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఆప్తమాల్మిక్ నర్సింగ్ అసిస్టెంట్లతో స్క్రీనింగ్ చేయిస్తామన్నారు. జ్ఞాపకశక్తి, వినికిడి లోపాలు, కుంగుబాటు తదితర సమస్యలపై ప్రాథమిక పరీక్షలు చేసి వారికి మద్దతుగా నిలుస్తామన్నారు. ఆస్పత్రులకు వచ్చిన వృద్ధులు జారి పడిపోకుండా ఫాల్ ప్రివెన్షన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. సురక్షితంగా స్నానం చేసేందుకు షవర్ కుర్చీలు, హ్యాండ్ షవర్స్, సమతుల్యత కోసం గ్రాబ్‌బార్లు, డ్యూయల్ సైడెడ్ మెట్లు, మెరుగైన దృష్టి కోసం ఎస్ఈడీ లైటింగ్, యాంటీ స్లిప్ టైల్స్, మెట్ల లోతు తెలుసుకునేందుకు కాంట్రాస్ట్ టేపింగ్, వాకింగ్ స్టిక్స్ వంటివి ఏర్పాటు చేసి ప్రమాదాలను గణనీయంగా తగ్గించినట్లు వివరించారు. వృద్ధులు ఆరోగ్యంగా, మెరుగైన జీవితం కొనసాగించేందుకు సహాయకులకు కూడా అవగాహన కల్పిస్తున్నామన్నారు. మరింత సమాచారం కోసం 99591 54371, 99639 80259 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అధిష్టానం నిర్ణయానికి లోబడి ఉండాలి



సమావేశంలో పాల్గొన్న రాఘవరెడ్డి, విశ్వనాథన్, నాగార్జునరెడ్డి, అభ్యర్థి నవీన్ తదితరులు

వెంగళరావునగర్ : ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త అధిష్టానం నిర్ణయానికి లోబడి పని చేయాలని ఏఐసీసీ పరిశీలకులు విశ్వనాథన్, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. శుక్రవారం వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్ సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీహాల్‌లో 130-140 బూత్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నాయకులు మాట్లాడుతూ త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. సమయం తక్కువగా ఉన్నందున ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని సాధ్యమైనవన్నీ పరిష్కరించాలన్నారు. బూత్ కమిటీల్లో యువతకు అవకాశం కల్పిస్తూ, సీనియర్ నాయకులు గెలుపు కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అభ్యర్థి నవీన్ యాదవ్, చైర్మన్ అవినాష్‌రెడ్డి, సీనియర్ నేతలు దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, చిలకల వెంకటేశ్వరరావు, మనోజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 26న పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

పంజగుట్ట: శరీరానికి తగిన పోషణ, ఆరోగ్య పరిరక్షణకు ప్రతి రోజూ కోడిగుడ్డు తినాలని పలువురు వక్తలు అన్నారు. ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐపీఈఎంఏ) ఆధ్వర్యంలో నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (నెక్) సహకారంతో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వరల్డ్ ఎగ్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెంకటేశ్వర హేచరీస్ గ్రూప్ ప్రతినిధి కేజీ ఆనంద్, ఈక్వెస్ట్రియన్ చాంపియన్ శుశ్రుత కుమార్, పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. మన దేశం ప్రపంచంలోనే గుడ్ల ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉన్నప్పటికీ 2024లో వార్షిక తలసరి వాడకం కేవలం 103 గుడ్లేనని అన్నారు. ఎగ్‌డే లాంటి సమయాల్లోనైనా గుడ్డు ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని కోరారు. నవంబర్ 26 నుంచి 28 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో 2025 పేరుతో దక్షిణ ఏషియాలోనే అతిపెద్ద పౌల్ట్రీ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎక్స్‌పోలో 50 దేశాలకు చెందిన 500 మంది ఎగ్జిబిటర్లు, 50 వేల మందికి పైగా సందర్శకులు పాల్గొంటారన్నారు. పౌల్ట్రీ బ్రీడింగ్, ఆటోమేషన్, వెటినరీ సైన్స్, సుస్థిర ఫార్మింగ్ తదితర అంశాల్లో వస్తున్న అత్యాధునిక ఆవిష్కరణలపై చర్చించనున్నట్లు తెలిపారు. నవంబర్ 25న ఒక ప్రత్యేక నాలెడ్జ్ డేను హైదరాబాద్ నోవాటెల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కోళ్లకు వస్తున్న వ్యాధులు, మేత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిష్కారాలు, ఈ రంగంలో కేరీర్ అవకాశాలు తదితర అంశాలపై నిపుణులతో సెమినార్‌లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వెట్ కాలేజీ డీన్ డాక్టర్ ఉదయ్, ఆర్.పి.నాయుడు, బాలు నాయక్, డాక్టర్ రవీందర్ రెడ్డి, పి.చక్రధర్ రావు, సురేష్ చిట్టూరి, డాక్టర్ బాలస్వామి పాల్గొన్నారు.

బంజారానగర్‌లో అగ్ని ప్రమాదం



రహమత్‌నగర్ : బోరబండ డివిజన్ బంజారానగర్‌లో శుక్రవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బంజారానగర్‌కు చెందిన రాపర్తి రాందాస్ నివాసంలో శుక్రవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న స్థానిక కార్పొరేటర్ బాబా ఫసి యుద్దిన్ సంఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఇంట్లోని విలువైన వస్తువులు కాలిపోకుండా కార్యకర్తలతో వాటిని బయటికి తెప్పించి, చుట్టు పక్కన నివాసాలకు మంటలు వ్యాపించకుండా ఫైర్ ఇంజన్ ద్వారా అదుపు చేయించారు. ఈ సందర్భంగా బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం పరంగా నష్ట పరిహారం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బీసీ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడిని నేనే..



మాట్లాడుతున్న ఐతగోని రాఘవేంద్ర ..

పంజగుట్ట: రాజ్యాధికార సాధనకు బీసీలు ఐక్యంగా పోరాడుతుంటే బీసీ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడిని చేసి రూ. లక్షలు ఖర్చు పెట్టించి ఇప్పుడు ఎలాంటి కారణాలు చూపించకుండా అధ్యక్ష పదవి నుంచి తొలగించామని ప్రకటించడం దారుణమని బీసీ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఐతగోని రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ .. ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు పాలూరి రామకృష్ణయ్య తనకు పలుమార్లు ఫోన్ చేసి కోరడంతోనే తాను ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించానని తెలిపారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత రామాంతపూర్‌లో ఫ్రంట్ ఆధ్వర్యంలో భారీ సభ ఏర్పాటు చేశానన్నారు. అనంతరం వివిధ జిల్లాల్లోనూ సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ఫ్రంట్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అయితే గురువారం సమావేశం ఏర్పాటు చేసి తనను అధ్యక్ష బాధ్యతల నుండి తొలగిస్తున్నట్లు ప్రకటించడం షాక్‌కు గురిచేసిందన్నారు. రెండు నెలల్లో తనతో రూ. 30 లక్షలకు పైగా ఖర్చుచేయించి ఇప్పుడు తనకు బీజేపీ నేతలతో సంభంధం ఉందని అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై రామకృష్ణయ్య బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ఎలాంటి కారణం చూపించకుండా పదవి నుంచి తొలగించలేరని, తానే ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతానని, ప్రధాన కార్యదర్శి వాసుకె యాదవ్, కోశాధికారి విద్యారాణి, యువజన విభాగం అధ్యక్షుడు గోపి యాదవ్, సాయి తనతోనే ఉన్నారని ఇదే కార్యవర్గం కొనసాగుతుందన్నారు.






ఐటీ హబ్‌ హైదరాబాద్‌లో సరికొత్త డిజిటల్‌ తుఫాన్‌ చెలరేగుతోంది. జోహో కార్పొరేషన్‌ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన అరట్టై మెసేజింగ్‌ యాప్‌ ఈ తరం ట్రెండ్‌గా సందడి చేస్తోంది. వాట్సాప్‌కు ప్రత్యామ్నాయంగా ఆదరణ పొందుతోన్న ఈ యాప్‌ రోజు రోజుకూ డౌన్‌లోడ్‌ల సంఖ్య పెంచుకుంటోంది.. తద్వారా యూజర్లు సైతం పెరుగుతున్నారు. అనతికాలంలోనే టాప్‌ రేటింగ్‌తో వావ్‌ అనిపిస్తోంది. సెప్టెంబర్‌ 2025లో 10వేలకు దిగువన ఉన్న డౌన్‌లోడ్‌ల సంఖ్య ఒక్క వారంలో 75 లక్షల చురుకో వడమే కాదు.. ప్రస్తుతం ఆ కౌంట్‌ కోటి దాటేసింది..! యాప్‌స్టోర్‌లో నెంబర్‌-1 ర్యాంక్‌, 4.8 రేటింగ్‌తో చాట్‌జీపీటీ, జెమినిలను అధిగమించింది. పలువురు యూనియన్‌ మంత్రులు, మహీంద్రా చైర్మన్‌ ఆనంద్‌ మహీంద్ర, పర్‌ప్లెక్సిటీ సీఈఓ అరవింద్‌ శ్రీనివాసులు ఈ అరట్టై యాప్‌ డౌన్‌లోడ్‌ చేసి స్వదేశీ గర్వాన్ని చాటుకున్నారు. జోహో సీఈఓ శ్రీధర్‌ వేంబు, 20 ఏళ్ల రీసెర్చ్‌ ఫలితం అరట్టై అని ఎక్స్‌లో పోస్ట్‌ చేశారు.

- సాక్షి, సిటీ బ్యూరో

అరట్టై.. అదిరేట్టు..

- సందడి చేస్తున్న తొలి స్వదేశీ మెసెంజర్‌ యాప్‌
- తెలుగుతో పాటు మరికొన్ని భారతీయ భాషలు
- సెప్టెంబర్‌ నెలలో కేవలం 10వేల లోపే యూజర్లు
- ప్రస్తుతం కోటి దాటేసిన యాప్‌ డౌన్‌లోడ్స్‌
- ఐటీ హబ్‌ హైదరాబాద్‌లో న్యూ ఫీచర్స్‌ సందడి

అరట్టై భారతదేశంలో తయారు చేసిన మొట్టమొదటి మెసెంజర్‌ యాప్‌ కావడం విశేషం. అరట్టై అంటే తమిళంలో చాట్‌ అని అర్థం. దీనిలోని ప్రత్యేకత ఏమిటంటే.. ఇది తెలుగు భాషతో పాటుగా విభిన్న భారతీయ భాషలకు మద్దతు ఇస్తుంది. దీని వల్ల భాగ్యనగరంతో పాటుగా మిగితా తెలుగు రాష్ట్రాల వినియోగదారులకీ ఈ యాప్‌ వాడకం సులభతరంగా ఉంటుంది. అరెట్టై యాప్‌ హైదరాబాద్‌ ప్రజలకు ఒక స్వదేశీ, భద్రతతో కూడిన, ఆధునిక కమ్యూనికేషన్‌ వ్యవస్థగా నిపుణులు సూచిస్తున్నారు. హైదరాబాద్‌లోని విద్యార్థులకు, ఉద్యోగులతో పాటు వ్యాపారవేత్తలకు ఈ యాప్‌ సౌకర్యంగా ఉండటమే కాకుండా భారతీయ సాంకేతికతకు మద్దతు అందించే అవకాశం కల్పించనుంది.



మల్టీ టాస్కింగ్‌ సదుపాయం..

ఈ యాప్‌లో టాలీవుడ్‌ న్యూస్‌, ఓఆర్‌ఆర్‌ ట్రాఫిక్‌ అప్‌డేట్స్‌ వంటి సమాచారాన్ని దాదాపు వెయ్యి మంది ఉన్న గ్రూప్‌ చాట్స్‌లో షేర్‌ చేయవచ్చు. జూమ్‌ లాంటి వీడియో మీటింగ్స్‌, పాకెట్‌ (పర్సనల్‌ స్టోరేజ్‌), స్టిక్కర్స్‌, థీమ్స్‌, మల్టీ-డివైజ్‌ సపోర్ట్‌ (5 డివైజ్‌లు) వంటి సదుపాయాలు ఈ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. ఆండ్రాయిడ్‌ టీవీలో చాట్‌ చేయడం వాట్సాప్‌లో లేని స్పెషల్‌ ఫీచర్‌. త్వరలో యుపీఐ పేమెంట్స్‌తో పాటు థర్డ్‌-పార్టీ యాప్‌ ఇంటిగ్రేషన్‌ రానున్నాయి. కానీ.. ఈ రోల్‌ అవుట్‌ ఆలస్యం, నెట్‌వర్క్‌ ఎఫెక్ట్స్‌ వంటి చాలెంజెస్‌ కూడా ఉన్నాయి. ఈ అట్టైర్‌ యాప్‌ ఆత్మ నిర్భర్‌ భారత్‌ స్ఫూర్తితో వాట్సాప్‌ను షేక్‌ చేస్తూ హైదరాబాదీల డిజిటల్‌ లైఫ్‌లో కొత్త అధ్యాయానికి తెరలేపేలా ఉందని సాంకేతిక నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

ఆకట్టుకునే ఫీచర్స్‌ ఇలా..

ఈ యాప్‌ ఫీచర్స్‌లో భాగంగా.. టెక్స్ట్‌, వాయిస్‌ మెసేజెస్‌, ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్‌లు షేర్‌ చేయడం సులభం. ఎండ్‌-టు-ఎండ్‌ ఎన్‌క్రిప్షన్‌తో ఆడియో, సురక్షితమైన వీడియో కాల్స్‌ అందుబాటులో ఉన్నాయి. అయితే ఎండ్‌ టు ఎండ్‌ టెక్ట్స్‌ మెసేజెస్‌కు ఎన్‌క్రిప్షన్‌ లేదు.. ఇది కాస్త అభద్రతను జోడిస్తున్నప్పటికీ అతిత్వరలో టెక్ట్స్‌ మెసేజెస్‌కూ ఎండ్‌ టు ఎండ్‌ టెక్ట్స్‌ మెసేజెస్‌ ఎన్‌క్రిప్షన్‌ అందుబాటులోకి వస్తుందని యాజమాన్యం తెలిపింది. యాడ్స్‌ లేకపోవడం, భారతీయ సర్వర్లలో డేటా భద్రతతో బ్యాండ్‌ విడ్త్‌ డిజైన్‌, స్లో నెట్‌వర్క్‌-బడ్జెట్‌ ఫోన్లలో సూపర్‌ ఫాస్ట్‌ వంటి ఫీచర్లతో నగరంతో పాటు తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోనూ అనువైన సేవల సౌలభ్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

వ్యక్తిగత క్లౌడ్‌ స్టోరేజ్‌..

- 'పాకెట్‌' ఫీచర్‌: ఇది యాప్‌లో ఉండే వ్యక్తిగత క్లౌడ్‌ స్టోరేజ్‌ వంటిది. ముఖ్యమైన మెసేజ్‌లు, ఫొటోలు, డాక్యుమెంట్లు, నోట్స్‌, చాట్‌ లాగ్‌లో కాకుండా ప్రత్యేకంగా 'పాకెట్‌' విభాగంలో సేవ్‌ చేసుకోవచ్చు. వాట్సాప్‌లో ఇలాంటి వాటి కోసం చాలా మంది వారికి వారే మెసేజ్‌ చేసుకునే గ్రూపులు క్రియేట్‌ చేసుకుంటారు. కానీ అరట్టైలో దీనికి ప్రత్యేక ఫీచర్‌ ఉంది.
- 'మనం చేరే వరకు' లొకేషన్‌ షేరింగ్‌: మనం మన లైవ్‌ లొకేషన్‌ షేర్‌ చేస్తున్నప్పుడు, గమ్యాన్ని సెట్‌ చేయవచ్చు. మనం ఆ గమ్యాన్ని చేరుకోగానే లొకేషన్‌ షేరింగ్‌ ఆటోమెటిక్‌గా ఆగిపోతుంది. ఇది వాట్సాప్‌లో ఉన్నట్లుగా కేవలం సమయ పరిమితి కాకుండా, మరింత సౌకర్యవంతమైన ఫీచర్‌.
- ప్రత్యేకమైన 'మీటింగ్స్‌' విభాగం: అరట్టై కేవలం మెసేజింగ్‌ కోసం మాత్రమే కాకుండా, ప్రత్యేకంగా మీటింగ్‌ల కోసం కూడా ఒక విభాగం ఉంది. దీని ద్వారా యూజర్లు యాప్‌లోనే ఆన్‌లైన్‌ మీటింగ్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు, జాయిన్‌ కావచ్చు లేదా షెడ్యూల్‌ చేయవచ్చు. దీనికి అదనంగా గూగుల్‌ మీట్‌ లేదా జూమ్‌ లాంటి వేదికలు అవసరం లేదు.
- యుజర్‌నేమ్‌ ఫీచర్‌ : మన వ్యక్తిగత మొబైల్‌ నంబర్‌ను పంచుకోకుండానే, కేవలం యుజర్‌నేమ్‌ ఉపయోగించి ఇతర వ్యక్తులతో చాట్‌ చేయడానికి అరట్టై అనుమతిస్తుంది. వాట్సాప్‌లో ఈ ఫీచర్‌ అందుబాటులో లేదు.







గ్లోబల్‌ వేదికగా హైదరాబాదీ ఫ్యాషన్‌..

- గ్లోబల్‌ ఇండియా కోచర్‌ వీక్‌లో హరీష్‌ అక్కిసెట్టి షో
- ఇండియన్‌ బ్రైడల్‌, కోచర్‌ ఫ్యాషన్‌లో సరికొత్త గుర్తింపు

సాక్షి, సిటీబ్యూరో: గ్లోబల్‌ ఇండియా కోచర్‌ వీక్‌లో భాగంగా నగరానికి చెందిన ప్రముఖ డిజైనర్‌ హరీష్‌ అక్కిసెట్టి ప్రదర్శించిన సరికొత్త కలెక్షన్‌ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇండియన్‌ బ్రైడల్‌, కోచర్‌ ఫ్యాషన్‌లో ప్రసిద్ధి చెందిన హైదరాబాదీ హరీష్‌ కలెక్షన్‌ జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో విస్తరించింది. ఈ సందర్భంగా డిజైనర్‌ హరీష్‌ అక్కిసెట్టి మాట్లాడుతూ.. టైమ్స్‌ ఫ్యాషన్‌ వీక్‌, ఇండియా ఫ్యాషన్‌ వీక్‌ లండన్‌ వరుసలో ప్రస్తుత గ్లోబల్‌ ఇండియా కోచర్‌ వీక్‌ కూడా హైదరాబాద్‌ డిజైనింగ్‌ వైభవాన్ని గ్లోబల్‌ వేదికగా ప్రదర్శించే అవకాశం కలిగిందని అన్నారు. వెడ్డింగ్‌ ట్రౌసో లైన్‌తో ఈ కలెక్షన్‌ను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఫ్యాషన్‌ షోలో వాకింగ్‌ చేస్తూ, బ్యాక్‌స్టేజ్‌ మేనేజ్‌మెంట్‌లో పనిచేస్తున్న డిజైనర్లతో ప్రయాణం చేసి నగరంలో వినూత్న డిజైనింగ్‌ స్టైలింగ్‌ అందించడం కోసం లేబుల్‌ ప్రారంభించానని హరీష్‌ వివరించారు.

నగరానికి.. స్పెయిన్‌ ప్రెస్టో..



సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచవ్యాప్తంగా దుస్తులు, యాక్సెసరీస్‌ సంరక్షణలో అగ్రగామిగా పేరుపొందిన ప్రెస్టో ఇండియా తొలిసారిగా హైదరాబాద్‌లో అడుగుపెట్టింది. బంజారాహిల్స్‌, హైటెక్‌ సిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన స్టోర్లతో తెలంగాణలో ప్రెస్టో సేవలు అందుబాటులోకి వచ్చాయి. పర్యావరణహిత సేవలందించడం ప్రెస్టో ఇండియా ప్రత్యేకత. మృదువైన క్లీనింగ్‌ విధానాలతో అత్యాధునిక పరికరాలను ఉపయోగించడం ద్వారా దుస్తుల జీవిత కాలాన్ని పెంచుతూ, వ్యర్థాలను తగ్గిస్తూ, పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గిస్తుంది. ఈ సందర్భంగా ప్రెస్టో ఇండియా మేనేజింగ్‌ డైరెక్టర్‌ య్వో మెట్‌జెలార్‌ మాట్లాడుతూ.. హైదరాబాద్‌ వాసులు అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన దుస్తుల సంరక్షణ సేవలను పొందడానికి అర్హులని తెలిపారు. వారికి తగిన సౌలభ్యం, నాణ్యతతో కూడిన సేవలు అందించడమే తమ లక్ష్యమని అన్నారు. సంస్థ అందించే సేవల్లో డ్రై క్లీనింగ్‌, లాండ్రీ, దుస్తుల మార్పులు (ఆల్టరేషన్స్‌), షూ, బ్యాగ్‌ సంరక్షణ వంటి సేవలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 25 దేశాల్లో 300కి పైగా స్టోర్లతో ఇప్పటి వరకూ 1.5 కోట్లకు పైగా దుస్తులు, యాక్సెసరీస్‌కు సేవలందించామని పేర్కొన్నారు.





మ్యూజియం జ్యువెలరీ కలెక్షన్‌..

ఈ నెల 18 వరకూ అందుబాటులో ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ భారతదేశపు తొలి లగ్జరీ జ్యువెలరీ మ్యూజియం కలెక్షన్‌ ప్రదర్శన జూబ్లీహిల్స్‌లో ఏర్పాటైంది. నగరానికి చెందిన వేగ జ్యువెలర్స్‌ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించిన ఈ ప్రదర్శన అక్టోబర్‌ 18 వరకూ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రత్యేక ప్రదర్శన ప్రారంభ కార్యక్రమంలో మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠం డీమ్డ్‌ టు బీ యూనివర్సిటీకి చెందిన డా.సీహెచ్‌.ప్రీతిరెడ్డి, ఫిక్కీ ఎఫ్‌ ఎల్‌ ఓ చైర్‌పర్సన్‌ ప్రతిభా కుందా, ప్రముఖ నటి తేజస్వి మదివాడ, మాల్వి మల్హోత్రా, ప్రాంతికా దాస్‌ తదితర నగర ప్రముఖులు పాల్గొన్నారు.



పికిల్‌బాల్‌ కో-ఓనర్‌గా ఫిల్మ్‌మేకర్‌..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న హైదరాబాద్‌ పికిల్‌బాల్‌ లీగ్‌ (హెచ్‌పీఎల్‌)లో ఉత్సాహభరితమైన ఫ్రాంచైజీలలో ఒకటైన 'ది రాప్టర్స్‌' జట్టుకు కో-ఓనర్‌గా టాలీవుడ్‌ డైరెక్టర్‌ తరుణ్‌ భాస్కర్‌ దాస్యం చేరినట్లు ప్రకటించారు. ఆయన, ఆర్బిట్‌ ఫ్లైట్‌ ట్రెనింగ్‌ సెంటర్‌ కో-ఫౌండర్లు కౌశిక్‌ మానేపల్లి, దివ్య ప్రియాంక రెడ్డితో కలిసి యాజమాన్య బృందంలో భాగమయ్యారు. ఈ సందర్భంగా తరుణ్‌ భాస్కర్‌ మాట్లాడుతూ.. క్రీడలకు, కథలు చెప్పడానికీ ఒక సారూప్యత ఉందని తాను నమ్ముతానని తెలిపారు. ఈ రెండింటికీ ప్రజలను ఏకంచేసే శక్తి ఉంది. దేశంలోనే మొట్టమొదటి ప్రొఫెషనల్‌ హైపర్‌-లోకల్‌ పికల్‌బాల్‌ లీగ్‌లో ఎనిమిది ఫ్రాంచైజీలు పోటీ పడుతున్నాయి. ఈ లీగ్‌లో సినిమా, వ్యాపారం, ఏవియేషన్‌ వంటి విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులు భాగస్వాములుగా ఉండటం విశేషం.



హైలైఫ్‌ బ్రైడ్స్‌..

హెచ్‌ఐసీసీ నోవోటెల్‌లో ప్రదర్శన ప్రారంభం

మాదాపూర్‌ : ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీ నోవోటెల్‌లో హైలైఫ్‌ బ్రైడ్స్‌ ఎగ్జిబిషన్‌ను సినీ నటీమణులు హెబ్బాపటేల్‌, ఆశురెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 350 మంది ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. యువతను ఆకట్టుకునే విధంగా ప్రత్యేక డిజైన్‌లు స్టాల్స్‌లో కొలువుదీరాయన్నారు. ఈనెల 12వ తేదీ వరకూ నిర్వహించనున్న ప్రదర్శనలో వివాహాధి శుభకార్యాలయాలకు డిజైన్స్‌ అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రదర్శనలోని డిజైనర్‌ వేర్‌ను మోడళ్లు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు డొమినిక్‌, పలువురు మోడల్స్‌, డిజైనర్లు పాల్గొన్నారు.





ఫెస్టివ్‌ సందడి..

కలెక్షన్‌ ఆవిష్కరించిన యాంకర్‌ సుమ

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం పండుగల నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లోని వారాహి సిల్క్స్‌ వేదికగా సంప్రదాయ వేడుకల సందడి మొదలైంది. ఈ నెల 19వ తేదీ వరకూ కొనసాగనున్న ఈ వార్షికోత్సవ ఆఫర్లను ప్రముఖ యాంకర్‌ సుమా కనకాల, మణిదీప్‌ యెచూరి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమ మాట్లాడుతూ.. వివాహ, పండుగల నేపథ్యంలో హస్తకళ వైవిధ్యంతో సరికొత్త కలెక్షన్‌తో నగరానికి కొత్త హంగులను అద్దుతోందని తెలిపారు.


ఆర్ట్‌గ్యాలరీలో ప్రాగిల్‌ టెర్రైన్స్‌..

- '2.0 బియాండ్‌ ది ఫ్రేమ్‌' పేరుతో మరో ప్రదర్శన
- ఆకట్టుకుంటున్న కళాకారుల చిత్రాలు

మాదాపూర్‌ : కళాకారులు వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ ఆర్ట్‌ గ్యాలరీలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రాగిల్‌ టెర్రైన్స్‌ పేరిట ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఇకేబనా మాస్టర్‌ ఎ.వినీత్‌, అనస్థిషియాలజిస్ట్‌ డాక్టర్‌ కమలా దేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాకారులు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. కళాకారులు వేసిన 72 చిత్రాలను ఈనెల 14వ తేదీ వరకూ ప్రదర్శనలో ఉంచనున్నట్లు తెలిపారు.

2.0 బియాండ్‌ ది ఫ్రేమ్‌..

కళాకారులు వేసిన 52 చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఆర్ట్‌ గ్యాలరీలో ఏర్పాటు చేసిన 2.0 బియాండ్‌ ది ఫ్రేమ్‌ ఎగ్జిబిషన్‌ను అలేఖ్య హోమ్స్‌ ఎండీ శ్రీనాథ్‌ కుర్రా ప్రారంభించారు. ఈ ప్రదర్శన 15వ తేదీ వరకూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్‌ ఆర్ట్‌ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి పాల్గొన్నారు. ప్రదర్శనలు ఉదయం 10.30 నుంచి రాత్రి 7గంటల వరకూ సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.





పారాహుషార్

రీసేల్ ప్రాపర్టీ కొనేముందు జాగ్రత్తలు అవసరం



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఏ ప్రాంతంలో ఇల్లు కొనుగోలు చేయాలన్నా.. కనీసం రూ.80 లక్షల నుంచి రూ.కోటి వెచ్చించాల్సిందే. అదే ఐటీ హబ్ పరిసరాలు, సిటీలోని ప్రధానమైన ప్రాంతాల్లో ఇల్లు కొనాలంటే మాత్రం కనీసం రూ.కోటిన్నరకు పైగా ఖర్చు చేయాల్సిందే. ఇక గేటెడ్ కమ్యూనిటీలు, ప్రీమియం ప్రాజెక్టలలో అయితే కోట్లు ఖర్చు చేయాల్సిందే. అందుకే చాలా మంది మధ్యతరగతి వారికి హైదరాబాద్‌లో సొంతిల్లు కలగానే మిగిలిపోతోంది. ఇటువంటి సమయంలో చాలా మంది పాత ఇళ్ల కొనుగోలుపై దృష్టి సారించారు. అందులోనూ పాత అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్స్ కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

- సెకండ్ సేల్స్ ఫ్లాట్స్‌ను కొనుగోలు చేసే సమయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. లేదంటే చిక్కులు ఎదుర్కోక తప్పదని రియల్టీ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాత అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్ కొనుగోలు చేసే సమయంలో పలు అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచిస్తున్నారు. సెకండ్ సేల్స్ ఫ్లాట్స్ కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం వల్ల డబ్బులను ఆదా చేసుకోవడంతో పాటు న్యాయపరమైన చిక్కుల నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

మార్కెట్ రేటు కనుక్కోండి..

రీసేల్ ప్రాపర్టీలు కొనుగోలు చేసే ప్రాంతంలో అసలు ఆ ప్రాంతంలో చ.అ. ధరలు ఎంత ఉన్నాయో ముందుగానే తెలుసుకుంటే మీరు ఆ ప్రాంతంలోని ధరను బట్టి బేరం ఆడుకునే అవకాశం ఉంటుంది. సాధారణంగా బ్రాండ్ న్యూ ఫ్లాట్ ధరతో పోలిస్తే పాత అపార్ట్‌మెట్లలోని ఫ్లాట్ ధరలో చాలా వ్యత్యాసం ఉంటుంది. చ.అ.కు ప్రాంతాన్ని బట్టి కనీసం 20-40 శాతం వరకు వ్యత్యాసం ఉంటుంది. అందుకే ఆ ప్రాంతంలో ఫ్లాట్స్ ధరలను తెలుసుకుని బేరమాడి తక్కువ ధరకు ఫ్లాట్ కొనుక్కోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

బ్రోకర్లపై ఆధారపడొద్దు..

ఫ్లాట్ కొనుగోలు కోసం బ్రోకర్లపై ఆధారపడకూడదని నిపుణులు సూచిస్తున్నారు. నేరుగా ఫ్లాట్ ఓనర్‌తో మాట్లాడుకొని డీల్ కుదుర్చుకుంటే ధర తగ్గే అవకాశం ఉంటుంది.

డాక్యుమెంట్లను పరిశీలించాలి

పాత అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్ కొనుగోలు సమయంలో డాక్యుమెంట్లను క్షుణ్నంగా పరిశీలించాలి. అవసరమైన న్యాయ నిపుణులను సంప్రదించాలి. యాజమాన్య హక్కులు, ప్రభుత్వ రంగ ఏజెన్సీల అనుమతులు, బ్యాంక్ రుణాలు వంటి వాటి గురించి తెలుసుకోవాలి. ప్రధానంగా బ్యాంక్‌లలో ఫ్లాట్‌లో ఎంత రుణం నేరుగా సంబంధిత బ్యాంక్‌ను సంప్రదించి కనుక్కోవాలి. కొనుగోలుకు ముందే అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన కమ్యూనిటీ నిబంధనలు తెలుసుకోవడం వల్ల నివాసిత సంఘంతో చిక్కులు లేకుండా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.



రూ.42 కోట్ల నుంచి రూ.177 కోట్ల వరకు..

రాయదుర్గం భూములకు హై డిమాండ్

8 ఏళ్లలో 320 శాతం పెరిగిన ధరలు	నగరంలో ప్రాజెక్ట్‌లకు అగ్రశ్రేణి డెవలపర్ల ఆసక్తి	పాన్ ఇండియా రియల్టీగా హైదరాబాద్

హైదరాబాద్‌లో భూముల ధరలు ఆకాశంలోకి దూసుకుపోయాయి. కోకాపేట, రాయదుర్గం వంటి పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాల్లోని స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. 2017లో రాయదుర్గంలో ప్రభుత్వం నిర్వహించిన వేలంలో ఎకరం రూ.42.59 కోట్లకు గౌరా వెంచర్స్ దక్కించుకోగా.. తాజాగా నాలెడ్జ్ సిటీలో ఎంఎస్ఎన్ సంస్థ ఏకంగా రూ.177 కోట్లు వెచ్చించింది. కేవలం 8 ఏళ్లలో రాయదుర్గంలో భూముల ధరలు 320 శాతం మేర పెరిగాయి. ఇది కేవలం ఒక లావాదేవీ మాత్రమే కాదు ఇది అభివృద్ధికి సంకేతం. నగర మౌలిక సదుపాయాలు, వాణిజ్య సాంద్రత, అభివృద్ధి, ప్రభుత్వ విధానాలపై సంస్థాగత, పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది.

– సాక్షి, సిటీబ్యూరో

పాన్ ఇండియా మూవీ లాగే..

బాహుబలి నుంచి తెలుగు సినీ పరిశ్రమ ఎలాగైతే పాన్ ఇండియా స్థాయి మొదలైందో.. అలాగే గత ప్రభుత్వ హయాంలో కోకాపేట భూముల వేలంలో ఎకరం రూ.100 కోట్లు పలకడంతో మొదలైంది. అగ్రశ్రేణి జాతీయ డెవలపర్లు నగరంలో భూములను దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు. నగరంలోని మౌలిక సదుపాయాలు, సాంకేతిక పర్యావరణ వ్యవస్థలు ముంబై, బెంగళూరు కంటే మెరుగ్గా ఉన్నాయి. రాయదుర్గం వేలంతో మన నగరం దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోటీ పడటం దాటి ముందుకు దూసుకుపోతుందనే సంకేతాన్ని అందిస్తోంది. పట్టణ విలువలను పునర్నిర్వచిస్తుంది.

అర్బన్ బ్రాండింగ్..

పారదర్శక వేలం, విధాన స్థిరత్వంతో హైదరాబాద్ ఇప్పుడు ప్రాంతీయ పవర్‌హౌస్ మాత్రమే కాదు ప్రపంచ వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందింది. నాలెడ్జ్ సిటీ ప్రాంతం దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్, ఇన్నోవేషన్ కారిడార్. ఇది హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాలకు చేరువలో ఉండటం అదనపు అడ్వాంటేజ్. గత ఆర్థిక సంవత్సరంలో నగరంలో 1.2 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలను నమోదు చేసింది. ఐటీ, ఐటీఈఎస్‌లో 52 శాతం, ఆరోగ్య సంరక్షణ, ఫార్మా రంగంలో 18 శాతం, రిటైల్, హాస్పిటాలిటీలో 12 శాతం ఉద్యోగ అవకాశాలు వచ్చాయి. ఇది రియల్టీ రంగానికి వైవిధ్యభరితమైన గ్రోత్ ఇంజిన్.



విశ్వాసం పెరుగుతోంది..

వేలంలో రికార్డ్ ధర పలకడం స్థానిక రియల్ ఎస్టేట్ సామర్థ్యానికి, పెట్టుబడిదారుల్లో విశ్వాసానికి సూచిక. అపరిమిత ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్(ఎఫ్ఎస్ఐ), క్లియర్ ల్యాండ్ టైటిల్స్, ఫాస్ట్ ట్రాక్ అనుమతులతో కూడిన ప్రైమ్ ల్యాండ్స్‌కు బడా నిర్మాణ సంస్థలు ఆసక్తి చూపిస్తుంటాయి. టెక్ సంస్థలు, కార్పొరేట్, సంస్థాగత పెట్టుబడిదారులు నుంచి నిరంతర డిమాండ్‌ను ముందుగానే అంచనా వేస్తున్నారనేది సూచిస్తుంది. రాయదుర్గంలో భూమి విలువ వృద్ధితో మాదాపూర్, గచ్చిబౌలి, కోకాపేట వంటి చుట్టుపక్కల ప్రాంతాలకు ప్రయోజనం చేకూరుతుంది.

వేలంతో ధరలు పెరుగుదల..

- అధిక ధరలకు భూములను కొనుగోలు చేసే ధోరణి దీర్ఘకాలంలో స్థిరాస్తి రంగానికి ఏమాత్రం మంచిది కాదు. 95 శాతం బిల్డర్లు, తుది వినియోగదారులు(ప్లాట్లు లేదా వాణిజ్య స్థల కొనుగోలుదారులు) ప్రతికూలమే. భూమి విలువలు స్థిరంగా పెరగాలే తప్ప రాత్రికి రాత్రే పెరిగితే తుది కొనుగోలుదారులకు అఫర్డబులిటీ ఉండదు. నగరం శివార్లకు విస్తరించే బదులుగా ఒకే ప్రాంతంలో కేంద్రీకృతమై ట్రాఫిక్ జామ్‌లు, మౌలిక సదుపాయాలపై ఒత్తిడికి దారి తీస్తుంది.
- ఏ ఉత్పత్తి ధర అనేది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. డిమాండ్, సరఫరా అనేది ఇందులో అత్యంత కీలకం. రియల్ ఎస్టేట్ విషయానికొస్తే అతి ముఖ్యమైనది ప్రాంతం. అందుకే దేశ ఆర్థిక రాజధానిలో దక్షిణ ముంబైలో ఫ్లాట్ కొనుగోలుకు అత్యధిక ధర చెల్లిస్తుంటారు. అక్కడ 10 నుంచి 45 నిమిషాల ప్రయాణ దూరంలోనే భారీ భూమి లభ్యత ఉన్నప్పటికీ, అనేక సమాంతర రోడ్లు అభివృద్ధి చేసినా, మురికివాడలు కొత్త రూపు సంతరించుకుంటున్నా, కొత్త విమానాశ్రయం వచ్చినా.. దక్షిణ ముంబైలోని ప్రాపర్టీలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. దేశంలోని అన్ని మెట్రో నగరాలదీ ఇదే కథ. సేమ్ అలాగే మన నగరంలో పశ్చిమ హైదరాబాద్ పరిస్థితి. మన దగ్గర భారీ మూలధనాన్ని సేకరించగల డెవలపర్లు చాలా తక్కువ. ధరలు అసాధారణంగా పెరిగి భారీ మూలధనం అవసరమైతే అది ధనవంతులైన కొద్ది మంది చేతుల్లోకి వెళ్లిపోతుంది. దీంతో స్థిరమైన డెవలపర్లు కూడా మార్కెట్ నుంచి వైదొలిగే పరిస్థితి ఏర్పడుతుంది.
- అపార్ట్‌మెంట్‌లో రూ.3-4 కోట్లతో ఫ్లాట్ కొనాలంటే మధ్యతరగతి ఉద్యోగులు జీవితకాలం ఈఎంఐ చెల్లించే పరిస్థితి. వేలం మధ్యతరగతి ప్రజలకు మంచిది కాదు. కేపీహెచ్‌బీ హౌసింగ్ బోర్డ్ తరహాలో ప్రభుత్వమే మహేశ్వరం, శామీర్‌పేట, మేడ్చల్, సంగారెడ్డి, కొత్తూరు, శంషాబాద్ ప్రాంతాలలో వెంచర్లను అభివృద్ధి చేయాలి. ల్యాండ్ పూలింగ్ విధానంతో ఉద్యోగులు, మధ్యతరగతి వర్గాలకు స్కీమ్‌లలో భారీ లేఅవుట్‌ను వేయాలి.



సాధారణ ఇళ్లకు కాలం చెల్లింది. ప్రైవసీ, ఆధునిక వసతులు ఉండే విలాసవంతమైన వాటికే ఆదరణ పెరుగుతోంది. ఏడాది కాలంలో దేశంలోని 8 ప్రధాన నగరాలలో 87,605 ఇళ్లు అమ్ముడుపోగా.. ఇందులో రూ.10-20 కోట్ల ధర ఉండే లగ్జరీ యూనిట్ల విక్రయాలు 170 శాతం వృద్ధి చెందగా.. రూ.50 లక్షలలోపు ధర ఉండే అఫర్డబుల్ హౌసింగ్ అమ్మకాలు 16 శాతం తగ్గాయి. కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టే డెవలపర్లు కూడా ప్రీమియం ఇళ్ల నిర్మాణానికే మొగ్గు చూపిస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

- ప్రీమియం ఇళ్ల విక్రయాల్లో 170 శాతం వృద్ధి
- 16 శాతం తగ్గిన అఫర్డబుల్ హౌసింగ్ సేల్స్
- ఈ క్యూ3లో 8 నగరాల్లో 87,605 యూనిట్ల అమ్మకాలు
- హైదరాబాద్‌లో 9,601 ఫ్లాట్ల విక్రయాలు
- నైట్‌ఫ్రాంక్ ఇండియా తాజా నివేదికలో వెల్లడి

ఇల్లంటే.. విలాసమే..

లగ్జరీ ఇళ్ల కొనుగోళ్లకే కస్టమర్ల ఆసక్తి

ప్రపంచవ్యాప్తంగా ప్రతికూలతలు కొనసాగుతున్నప్పటికీ.. స్థిరమైన దేశీయ వినియోగం, ప్రభుత్వ మూలధన వ్యయం కారణంగా భారత ఆర్థిక దృక్పథం స్థిరంగా ఉంది. ఈ ఏడాది రెండో త్రైమాసికం క్యూ2)లో స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) వృద్ధి అంచనాలను 7.8 శాతం వద్ద అధిగమించింది. స్థిరమైన దేశీయ పెట్టుబడులు, జీఎస్టీ సవరణలు, వడ్డీ రేట్ల తగ్గింపులతో దేశంలో స్థిరాస్తి విక్రయాలు ఆశాజనంగానే ఉన్నాయి. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికం (జులై-సెప్టెంబర్, క్యూ3)లో ప్రధాన నగరాలలో 87,605 ఇళ్ల సేల్ కాగా.. 88,655 యూనిట్లు లాంచ్ అయినట్లు నైట్‌ఫ్రాంక్ నివేదిక తెలిపింది.

పెరుగుతున్న ఇన్వెంటరీ..

2025 క్యూ3లో 87,603 యూనిట్లు అమ్ముడుపోయాయి. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 1 శాతం ఎక్కువ. పుణె మినహా అన్ని నగరాలలో విక్రయాలు స్థిరంగానే ఉన్నాయి. ముంబైలో అత్యధికంగా 24,706 యూనిట్లు అమ్ముడుపోయాయి. అమ్మకాల వృద్ధి స్థిరంగానే ఉన్నప్పటికీ అమ్ముడుపోని ఇన్వెంటరీ 2020 నుంచి స్థిరంగా పెరుగుతూనే ఉంది. విక్రయాల కంటే సరఫరా మించిపోతున్నాయి. ఈ ఏడాది క్యూ3 నాటికి దేశంలోని 8 ప్రధాన నగరాల్లో అమ్ముడుపోని ఇన్వెంటరీ 5,06429 యూనిట్లున్నాయి. వీటి విక్రయానికి 5.8 త్రైమాసికాల సమయం పడుతుంది. వీటిల్లో అత్యధికంగా రూ.50 లక్షల లోపు ధర ఉన్న ఇళ్లు 1,8,0616 ఉన్నాయి.



హైదరాబాద్‌లో..

హైదరాబాద్‌లో ఈ క్యూ3లో 9,601 యూనిట్లు అమ్ముడుపోయాయి. గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే ఇది 5 శాతం ఎక్కువ. అలాగే ఈ క్యూ3లో 9,764 యూనిట్లు లాంచ్ అయ్యాయి. గతేడాది క్యూ3తో పోలిస్తే 10 శాతం ఎక్కువ. నగరంలో ఏడాదితో ఇళ్ల ధరలు 13 శాతం మేర పెరిగాయి.

ఏడాదిలో ఇళ్ల ధరలు ఎంత పెరిగాయంటే? (శాతంలో)

ఎన్‌సీఆర్(న్యూఢిల్లీ)	19
బెంగళూరు	15
హైదరాబాద్	13
చెన్నై	9
కోల్‌కతా	8
ముంబై	7
పుణె	5
అహ్మదాబాద్	2

ఏ ఇళ్లు ఎన్ని అమ్ముడుపోయాయంటే?

ధర	యూనిట్లు	వృద్ధి
50 లక్షలలోపు	17,463	-16
50 లక్షల – కోటి	24,693	-5
1-2 కోట్లు	24,944	17
2-5 కోట్లు	14,982	2
5-10 కోట్లు	4,539	33
10-20 కోట్లు	860	170
20-50 కోట్లు	101	34
50 కోట్లపైన	20	36

నగరాల వారీగా ఇళ్ల విక్రయాలు, లాంచింగ్స్:

నగరం	విక్రయాలు	లాంచింగ్స్
ముంబై	24,706	19,145
బెంగళూరు	14,538	17,817
ఎన్‌సీఆర్	12,955	10,657
పుణె	12,118	15,234
హైదరాబాద్	9,601	9,764
అహ్మదాబాద్	4,694	5,797
చెన్నై	4,617	6,172
కోల్‌కతా	4,374	4,069

ఆఫీసు అధరహో..

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో సప్లయి చెయిన్‌లో నష్టాలు, ఇంధన వ్యయాలు, మూలధన ప్రవాహాలను ప్రభావితం చేయడంతో కార్యాలయ విభాగం కాస్త తడబడింది. 2025 క్యూ3లో 1.78 కోట్ల చ.అ. కార్యాలయ స్థల లావాదేవీలు జరిగాయి. వార్షిక ప్రాతిపదికన 6 శాతం క్షీణించినప్పటికీ.. 2024 క్యూ3తో పోలిస్తే మాత్రం అత్యధిక వృద్ధిని నమోదు చేసింది. బెంగళూరు, ముంబై, ఎన్‌సీఆర్‌లు లావాదేవీలలో సగం వాటాలను కలిగి ఉన్నాయి. 42 లక్షల చ.అ.లతో బెంగళూరు ముందంజలో ఉంది. ఈ త్రైమాసికంలో హైదరాబాద్, చెన్నైలు వ్యాల్యూమ్ వృద్ధిలో అత్యధిక వాటాలను కలిగి ఉన్నాయి. హైదరాబాద్ 45 శాతం, చెన్నై 51 శాతం వాల్యూమ్‌లను కలిగి ఉన్నాయి.

బ్యాక్ ఆఫీసు టు జీసీసీ..

ఒకప్పుడు బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలకు మాత్రమే పరిమితమైన ఇండియా.. నేడు గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు(జీసీసీ)లకు ప్రధాన కేంద్రంగా మారింది. ప్రతిభ, నైపుణ్యం కలిగిన కార్మికులు, తక్కువ జీవన వ్యయం, అందుబాటులో స్థిరాస్తి ధరలు, ప్రభుత్వ ప్రోత్సాహకర విధానాలు కారణంగా బహుళ జాతి సంస్థలు జీసీసీల ఏర్పాటుకు ఇండియాను ఎంచుకుంటున్నాయి. 2025 క్యూ3లో లీజుకు తీసుకున్న వ్యాల్యూమ్‌లో గ్రేడ్-ఏ ఆఫీసు లావాదేవీలు 88 శాతం వాటాను కలిగి ఉన్నాయి. రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(రీట్స్) విస్తరణ, గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు(జీసీసీ), ఫ్లెక్సిబుల్ ఆఫీస్‌లకు ప్రాధాన్యత పెరుగుతుండటమే ఈ డిమాండ్‌కు ప్రధాన కారణం. ఈ క్యూ3లో జీసీసీలు 57 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్‌ను లీజుకు తీసుకోగా. ఆ తర్వాత థర్డ్ పార్టీ/ఐటీ సర్వీస్ ప్రొవైడర్లు 32 లక్షల చ.అ., ఫ్లెక్సిబుల్ ఆఫీసు స్పేస్ 38 లక్షల చ.అ. లావాదేవీలు జరిగాయి.



100 కోట్ల చ.అ. స్టాక్..

ప్రస్తుతం 8 ప్రధాన నగరాలలో ఆఫీసు స్పేస్ స్టాక్ 100 కోట్ల చ.అ.లను దాటింది. ఈ క్యూ3లో 1.24 కోట్ల చ.అ. కార్యాలయ స్థలం పూర్తయ్యింది. ఈ త్రైమాసికంలో డెలివరీ అయిన కార్యాలయ స్థలంలో బెంగళూరు తొలి స్థానంలో నిలిచింది. ఈ నగరంలో 59 లక్షల చ.అ. స్థలంతో 48 శాతం వాటాను కలిగి ఉంది. అత్యధికంగా కోల్‌కతాలో 14 శాతం, ముంబైలో 11 శాతం, ఎన్‌సీఆర్(న్యూఢిల్లీ)లో 9 శాతం, బెంగళూరులో 6 శాతం మేర ఆఫీసు స్పేస్ అద్దెలు పెరిగాయి.

నగరంలో..

హైదరాబాద్‌లో ఈ క్యూ3లో 29 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరిగాయి. గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే ఇది 33 శాతం అధికం. అయితే 2025 క్యూ2లో 19 లక్షల చ.అ., క్యూ1లో 40 లక్షల చ.అ. లావాదేవీలు పూర్తయ్యాయి. అలాగే నగరంలో ఈ క్యూ3లో 16 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ డెలివరీ అయ్యింది. గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే ఇది 61 శాతం ఎక్కువ. నగరంలో ఈ క్యూ3లో ఆఫీసు స్పేస్ అద్దెలు 9 శాతం మేర పెరిగాయి.

రిటైల్ స్పేస్.. హై

తలసరి రిటైల్ స్పేస్ 3.6 లక్షల చ.అ.

నిర్మాణంలో 28 లక్షల చ.అ. మాల్స్ స్థలం

నగరంలో షాపింగ్ మాల్స్ స్టాక్ 35.1 లక్షల చ.అ.

సాక్షి, సిటీబ్యూరో: ఏటేటా హైదరాబాద్‌లో ప్రత్యేకంగా వస్తువులు, సేవలను విక్రయించే వాణిజ్య స్థలం(రిటైల్ స్పేస్) పెరుగుతోంది. దీంతో నగరంలో తలసరి రిటైల్ స్పేస్ 3.6 లక్షల చ.అ.లకు చేరింది. ప్రస్తుతం భాగ్యనగరంలో గ్రేడ్-ఏ, బీ షాపింగ్ మాల్స్ స్టాక్ 35.1 లక్షల చ.అ.లుగా ఉండగా.. ఇందులో వేకెన్సీ 1.85 శాతంగా ఉందని కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడించింది.

- నగరంలో ఈ ఏడాది మూడో త్రైమాసికం(క్యూ3)లో 5.1 లక్షల చ.అ. రిటైల్ స్పేస్ లీజుకు పోయింది. గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే ఇది 9.3 శాతం ఎక్కువ. కాగా.. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు నగరంలో 20.4 లక్షల చ.అ. రిటైల్ స్పేస్ లీజుకు పోయింది. గ్రేడ్-ఏ మాల్స్ సరఫరా పరిమితంగా కారణంగా ఈ త్రైమాసికంలో ఎక్కువ లీజులు హైస్ట్రీట్ ప్రాంతాలలో జరిగాయి. మొత్తం లీజులలో 42 శాతం కొంపల్లి, నల్లగండ్ల, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి సబర్బన్ కారిడార్లలో జరిగాయి. బంజారాహిల్స్, పంజగుట్ట, హిమాయత్‌నగర్ వంటి కోర్ సిటీలో 32 శాతం, సుచిత్ర, బోడుప్పల్ వంటి శివార్లలో 26 శాతం లీజులు జరిగాయి. ఫ్యాషన్, ఫుడ్ అండ్ బేవరేజెస్, యాక్ససరీస్ కేటగిరీల్లో రిటైల్ స్పేస్ లీజులు అధికంగా జరిగాయి. లైఫ్ స్టయిల్ విభాగం 16 శాతం, ఫర్నీచర్ 10 శాతం, హెల్త్ కేటగిరీలో 10 శాతం వాటాలను కలిగి ఉన్నాయి. మొత్తం లీజుల్లో దేశీయ బ్రాండ్లు 88 శాతం, అంతర్జాతీయ బ్రాండ్లు 12 శాతం వాటాలున్నాయి.

కొత్త మాల్స్..

ప్రస్తుతం నగరంలో 28 లక్షల చ.అ. కొత్త షాపింగ్ మాల్స్ నిర్మాణంలో ఉన్నాయి. ఇవి 2027 నాటికి పూర్తయ్యే అవకాశాలున్నాయి. ఈ ఏడాది నాల్గో త్రైమాసికం నాటికి 17 లక్షల చ.అ. గ్రేడ్-ఏ మాల్స్ స్థలం డెలివరీ అవుతుంది. కొంపల్లి, శంషాబాద్ వంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో నివాసితులు వినోద అవసరాలను తీర్చేందుకు ఈ మాల్స్, రిటైల్ స్పేస్ అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం కొంపల్లి, ఎంజీ రోడ్, దిల్‌సుఖ్‌నగర్, బంజారాహిల్స్, అబిడ్స్, హిమాయత్‌నగర్, అమీర్‌పేట, మాదాపూర్, నల్లగండ్ల, హబ్సిగూడ, కోకాపేట, మణికొండ వంటి ప్రాంతాలలో రిటైల్ స్పేస్ అద్దె నెలకు చ.అ.కు రూ.135-250 వరకున్నాయి.

నగరాల వారీగా షాపింగ్ మాల్స్.. (చ.అ. లక్షలలో)

నగరం	మాల్స్‌స్టాక్	తలసరి రిటైల్ స్పేస్
ఢిల్లీ	21.8 కోట్లు	6.7
ముంబై	1.2 కోట్లు	5
బెంగళూరు	1.1 కోట్లు	7.5
పుణె	68.4	9.1
చెన్నై	36.5	3
హైదరాబాద్	35.1	3.6
అహ్మదాబాద్	32.2	2.4
కోల్‌కతా	23.2	1.5

కల్తీ మద్యం దందా

పక్కా వ్యూహం ప్రకారమే..!

ఏపీలో నకిలీ మద్యం దందా తీగ లాగుతుంటే ఉండవల్లి కరకట్ట బంగ్లాలో డొంక కదులుతోంది. నకిలీ మద్యం వ్యవస్థీకృత దోపిడీకి కర్త, కర్మ, క్రియ ముఖ్య నేతేనని నిగ్గు తేలుతోంది. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో తంబళ్లపల్లె టీడీపీ టికెట్ జయచంద్రారెడ్డికి ఇవ్వడం దగ్గర మొదలైన ఈ వ్యవహారం... అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ మద్యం దుకాణాల రద్దు... బెల్టుషాపులకు పచ్చ జెండా... పర్మిట్ రూమ్‌లకు గేట్లెత్తి వ్యవస్థను నియంత్రణలోకి తెచ్చుకుని... నకిలీ మద్యం తయారీ ప్లాంట్‌లు నెలకొల్పి షాప్‌లకు సరఫరా చేయడం వరకు అంతా పక్కా వ్యూహంతో సాగిందని స్పష్టమవుతోంది. నాణ్యమైన మద్యం అందిస్తామని ఎన్నికలకు ముందు టీడీపీ కూటమి ఇచ్చిన హామీ వెనుక విస్తుపోయే 'ఆఫ్రికా మోడల్ నకిలీ మద్యం డీల్' వంటి భారీ కుట్ర ఉందని క్రమంగా అర్థమవుతోంది. మందుబాబుల బలహీనతను ఆసరాగా చేసుకుని నకిలీ మద్యం నిషా ఎక్కించి రూ.వేల కోట్లు కొల్లగొట్టే కుంభకోణం వెలుగుచూస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాల విధానాన్ని తొలగించి టీడీపీ సిండికేట్ ఆధ్వర్యంలో ప్రైవేటు మద్యం దుకాణాల నిర్వహణ వెనుక పన్నాగం ఉందని తేటతెల్లమవుతోంది.

ముఖ్య నేత ఆశీస్సులతో ప్రణాళిక అమలు

అక్రమ దందాకు పూర్తిగా ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహం

- ఉండవల్లి నుంచే చక్రం తిప్పుతున్న మాస్టర్‌మైండ్
- మద్యం విధానం వ్యవస్థీకృతం వెనుక ఆయనే
- 2024 ఎన్నికలకు ముందే ''ఆఫ్రికా మోడల్''కు పన్నాగం
- అందుకే సీనియర్లను కాదని జయచంద్రారెడ్డికి తంబళ్లపల్లె ఎమ్మెల్యే టికెట్
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దందా షురూ
- ఇందులోభాగంగానే ప్రభుత్వ మద్యం దుకాణాల తొలగింపు
- మద్యం తయారీ ప్లాంట్ నెలకొల్పి షాప్‌లకు డిస్ట్రిబ్యూషన్
- బెల్టుషాప్‌లు, పర్మిట్ రూమ్‌లతో వ్యవస్థపై పూర్తి నియంత్రణ
- టీడీపీ సిండికేట్ గుప్పిట్లోకి మొత్తం మద్యం నెట్‌వర్క్
- సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల రీతిలో రాష్ట్రమంతా కల్తీ యూనిట్లు
- ఎక్కడ మద్యం దొరికినా జయచంద్రారెడ్డి, జనార్దనరావుతో లింకులు
- అక్రమానికి పైస్థాయి నుంచి పూర్తిస్థాయిలో అండదండలు

సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి ప్రభుత్వ పెద్దలు సాగిస్తున్న నకిలీ మద్యం దందాకు నిరుటి ఎన్నికలకు ముందే కుట్ర పన్నారు. అధికారంలోకి రాగానే దోపిడీ విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నారు. తనకు టికెట్ ఇస్తే ''ఆఫ్రికా మోడల్'' నకిలీ సరుకు దందాను ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టి ముఖ్యనేత దోపిడీకి సహకరిస్తానని జయచంద్రారెడ్డి ఎన్నికలకు ముందే ఆఫర్ ఇచ్చారు. పెదబాబు, చినబాబు వెంటనే ఈ డీల్‌కు పచ్చజెండా ఊపారు. ఈ క్రమంలోనే మాజీ ఎమ్మెల్యేలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శంకర్‌యాదవ్‌లను సైతం పక్కనపెట్టారు. ఖర్చంతా తానే భరిస్తానని శంకర్‌యాదవ్ చెప్పినా టీడీపీ అధినాయకత్వం వినిపించుకోలేదు. ఆయనకు టికెటివ్వాలని కార్యకర్తలు కరకట్ట నివాసం వద్ద ధర్నాలు చేసినా ఒప్పుకోలేదు. క్యాడర్ వ్యతిరేకించినా జయచంద్రారెడ్డికే తంబళ్లపల్లె టికెట్ ఇచ్చారు. దీనివెనుక ఉద్దేశం... ''ఒక సీటు పోయినా ఫర్వాలేదు. ఒకవేళ అధికారంలోకి వస్తే ఆఫ్రికా మోడల్ నకిలీ మద్యం దందాతో భారీ దోపిడీకి పాత్రధారిగా జయచంద్రారెడ్డి ఉంటారు'' అనే ఆలోచనేనని స్పష్టమవుతోంది. ఇక తాజాగా పెద్ద ఎత్తున బయటపడిన నకిలీ మద్యం ఉదంతంలో జయచంద్రారెడ్డి పాత్ర ఉందని స్పష్టమైనా.. ఆయనను తూతూమంత్రంగా టీడీపీ నుంచి సస్పెండ్ చేశారు. ఇంతవరకు అరెస్టు చేయలేదు. దీన్నిబట్టే నకిలీ మద్యం దందాలో ప్రభుత్వ పెద్దల ప్రమేయం స్థాయిలో ఉందే నిర్ధారణ అవుతోంది.

అంతా గుప్పిట పట్టి.. భారీ స్కెచ్..

నాణ్యమైన మద్యం ఎంత అమ్మినా.. ఆ డబ్బు రాష్ట్ర ఖజానాకే పోతుంది. అట్టైతే తమ జేబులు నిండేదెలా? అని ముఖ్య నేత భావించారు. అందుకే నకిలీ మద్యాన్నే అధికారికంగా విక్రయించే కుట్రకు కూటమి ప్రభుత్వం రాగానే తెరతీశారు. ఈ నేపథ్యంలో... మద్యం వినియోగం తగ్గించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టి, పారదర్శకంగా అమలు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాల వ్యవస్థను తొలగించారు. వాటి స్థానంలో టీడీపీ సిండికేట్ ద్వారా 3,736 ప్రైవేటు దుకాణాలను ఏర్పాటు చేయించారు. అనుబంధంగా మరో 3,736 పర్మిట్ రూమ్‌లకు అనుమతిచ్చారు. టీడీపీ సిండికేట్ అనధికారికంగా ఏకంగా 75 వేల బెల్ట్ దుకాణాలను తెరిచింది. తాజాగా 540 బార్లనూ (త్వరలో మరో 300 కూడా) ఈ సిండికేట్‌కే కట్టబెట్టింది. మరోవైపు రాష్ట్రంలోని 20 మద్యం డిస్టిలరీలు దశాబ్దాలుగా టీడీపీ సీనియర్ నేతల కుటుంబాల ఆధీనంలోనే ఉన్నాయి. వాటిలో 14 డిస్టిలరీలకు గతంలో చంద్రబాబు ప్రభుత్వమే అనుమతులిచ్చింది. మిగిలిన ఆరింటికి అంతకుముందు ప్రభుత్వాలు అనుమతిచ్చాయి. 20



2024లో చంద్రబాబు నుంచి తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థిగా బి-ఫాం తీసుకుంటున్న జయచంద్రారెడ్డితో నిందితుడు జనార్దన్‌రావు

డిస్టిలరీలనూ ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ ద్వారా మద్యం కొనుగోళ్ల కోసం ఎంప్యానెల్ చేసింది టీడీపీ ప్రభుత్వమే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్తగా ఒక్క డిస్టిలరీకి అనుమతివ్వలేదు. ఈ విధంగా తయారీ నుంచి విక్రయాల వరకు నెట్‌వర్క్ అంతటినీ బిగ్‌బాస్ టీడీపీ మద్యం మాఫియా గుప్పిట్లో పెట్టారు.

పచ్చ సీసాలో నకిలీ మద్యం

కూటమి అధికారంలోకి రాగానే అత్యంత ప్రాధాన్యతతో కొత్త మద్యం విధానం ఎందుకు అమలు చేశారో లోగుట్టు బయటపడుతోంది. మొత్తం మద్యం నెట్‌వర్క్ తమ చేతుల్లోకి రావడంతో ముఖ్య నేత రెండో దశ కుట్రను అమలు చేశారు. జయచంద్రారెడ్డితో చినబాబు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఆఫ్రికా మోడల్ నకిలీ మద్యం దందాకు తెరతీశారు. మొత్తం నకిలీ ముఠాకు తనకు అత్యంత సన్నిహితుడైన అన్నమయ్య జిల్లాకు చెందిన ప్రభుత్వ కీలక నేతను చినబాబు సమన్వయకర్తగా పెట్టారు. రాష్ట్రంలో ప్రాంతాలవారీగా టీడీపీ నేతలకు నకిలీ మద్యం పంపిణీ బాధ్యతలు కట్టబెట్టారు. నర్సీపట్నానికి చెందిన సీనియర్ నేత కుటుంబానికి ఉత్తరాంధ్ర, ఏలూరు జిల్లాకు చెందిన వివాదాస్పద ప్రజాప్రతినిధికి ఉమ్మడి ఉభయ గోదావరి, బాపట్ల జిల్లాకు చెందిన ప్రభుత్వ కీలక నేతకు ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య జిల్లాలోని ప్రభుత్వ కీలక నేతకు రాయలసీమలో నకిలీ మద్యం దందా బాధ్యతలు అప్పగించారు. ఆ వెంటనే ఆఫ్రికా దేశాల్లో నకిలీ మద్యం తయారుచేసే విధానాన్ని ప్రవేశపెడుతూ రాష్ట్రవ్యాప్తంగా యూనిట్లను నెలకొల్పారు. కుటీర, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)ల రీతిలో జిల్లాలు, మండల స్థాయిలో నకిలీ మద్యం తయారీ యూనిట్లు ఏర్పాటు చేయడం గమనార్హం. టీడీపీ నేతలు జయచంద్రారెడ్డి, అద్దేపల్లి జనార్దన్‌రావు, కట్టా సురేంద్రనాయుడు ఒడిశా, బిహార్ తదితర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకొచ్చి నకిలీ మద్యం తయారీలో శిక్షణ ఇప్పించారు. ముఖ్య నేత సన్నిహితులైన టీడీపీ సీనియర్ నేతల కుటుంబాలకు చెందిన డిస్టిలరీల ద్వారా అక్రమంగా 'ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (వాడుక భాషలో స్పిరిట్ అంటారు)ను కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుంచి భారీగా కొని ఆ యూనిట్లకు తరలించారు.

రాష్ట్రమంతా నకిలీ బ్రాండ్లు

కేరళ మాల్ట్, బెంగళూరు బ్రాందీ, ఓల్డ్ అడ్మిరల్... ఇవీ ప్రస్తుతం రాష్ట్రంలో జోరుగా అమ్మకాలు సాగుతున్న మద్యం బ్రాండ్లు. ఎప్పుడూ వినని ఈ బ్రాండ్లు ఎక్కడివి అనే కదా మీ అనుమానం...? ఇవి ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతో ప్రవేశపెట్టిన ఆఫ్రికా మోడల్ నకిలీ మద్యం బ్రాండ్లు. వారి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జయచంద్రారెడ్డి, అద్దేపల్లి జనార్దన్‌రావు, సురేంద్రనాయుడులు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసిన ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి చేస్తున్న నకిలీ బ్రాండ్లే. అనకాపల్లి జిల్లా రాంబిల్లి, పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు, అన్నమయ్య జిల్లా ములకలచెరువు, ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం... ఇలా తనిఖీలు చేసిన ప్రతిచోట పట్టుబడినది టీడీపీ సిండికేట్ ప్లాంట్లలో తయారవుతున్న నకిలీ మద్యమే. గుట్టలుగుట్టలుగా నిల్వ చేసిన నకిలీ మద్యం బ్రాండ్ల సరుకు దొరకడం అధికారులనే విస్మయపరుస్తోంది. దీన్నిబట్టే ఎంత పక్కాగా, యథేచ్ఛగా ముఖ్య నేత ఆఫ్రికా మోడల్ నకిలీ దందాను నడిపిస్తున్నారో స్పష్టమవుతోంది.

మోగుతున్న మరణమృదంగం...

టీడీపీ కూటమి ప్రభుత్వం... బ్రాండెడ్ ముసుగులో విచ్చలవిడిగా విక్రయిస్తున్న నకిలీ మద్యం రాష్ట్రంలో మరణ మృదంగం మోగిస్తోంది. 60 నుంచి 75 శాతం వరకు ఆల్కహాల్ ఉండే నకిలీ మద్యం తాగడంతో గుండె, ఊపిరితిత్తులు, ఉదరం, మూత్రపిండాలు వేగంగా దెబ్బతింటున్నాయి. నాడీ వ్యవస్థపై దుష్ప్రభావంతో చిత్తచాంచల్యం ఆవహిస్తోంది. ఆరోగ్యంగా ఉన్నవారు వేగంగా తీవ్ర అనారోగ్యానికి గురై కొద్ది రోజుల్లోనే మృత్యువాత పడుతున్నారు. అంతుబట్టని మరణాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

- ఇటీవల ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, ఏలూరు జిల్లాల్లో వరుస హఠాన్మరణాలకు నకిలీ మద్యమే కారణమని ప్రాథమికంగా గుర్తించారు. దాంతో ఎక్సైజ్ శాఖ అధికారుల్లో ఆందోళన మొదలైంది. పరిస్థితి ఇలానే కొనసాగితే తమ మెడకు చుట్టుకుటుందని భావించారు. భవిష్యత్‌లో ఇబ్బంది రాకుండా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో తనిఖీలు, దాడులు చేసింది. ఏదో కిందిస్థాయి ముఠా దొరికితే కేసులు నమోదు చేసి ట్రాక్ రికార్డు కాపాడుకోవాలనుకుంది. కానీ, వారు ఊహించని రీతిలో నకిలీ మద్యం వెనుక ఉన్న వ్యవస్థీకృత మాఫియా బండారం బయటపడింది. ఈ మాఫియా డాన్ ప్రభుత్వ బిగ్‌బాసేనని తేలడంతో ఎక్సైజ్ శాఖ అధికారులకు నోట మాట రాలేదు. ప్రభుత్వ ముఖ్య నేత ఆదేశంతో నకిలీ మద్యం మాఫియా తీవ్రతను కప్పిపుచ్చేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. అయితే, నకిలీ మద్యం దారుణాలు రాష్ట్రవ్యాప్తంగా కనిపిస్తుండటంతో సర్వత్రా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

తొలి ఏడాది రూ.5,280 కోట్ల దోపిడీ

రాష్ట్రంలో అమ్ముడవుతున్న మద్యంలో మూడో వంతు నకిలీ అని ఎక్సైజ్ శాఖ వర్గాలు అంచనా వేయడం గమనార్హం. ఈ లెక్కన టీడీపీ కూటమి ప్రభుత్వంలో తొలి ఏడాది రూ.5,280 కోట్ల నకిలీ మద్యం అమ్మకాలు సాగాయి. మొత్తం మద్యం అమ్మకాల్లో నకిలీ మద్యం వాటాను 50 శాతం దాటించాలన్నది టీడీపీ సిండికేట్ లక్ష్యం. అంటే, రానున్న నాలుగేళ్లలో ఏడాదికి రూ.10 వేల కోట్లు చొప్పున రూ.40 వేల కోట్లు కొల్లగొట్టడానికి పన్నాగం పన్నింది. ఇందులో నకిలీ మద్యం దందాకు మూల విరాట్ అయిన ముఖ్యనేత కరకట్ట బంగ్లాకు 30 శాతం వాటాగా లెక్కతేల్చారు. మొత్తంమీద రూ.15 వేల కోట్లు కరకట్ట బంగ్లాకు కమీషన్‌గా చేరనుంది. ప్రాంతాలవారీగా పర్యవేక్షిస్తున్న టీడీపీ సీనియర్ నేతలకు 50 శాతం, మద్యం దుకాణాలు, బార్లు నిర్వహిస్తున్న టీడీపీ సిండికేట్‌కు 20 శాతం వాటా. ఇంత భారీ దోపిడీ కాబట్టే పెదబాబు, చినబాబు ఈ దందాను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

అప్పట్లో దుష్ప్రచారం... రాద్ధాంతం... ఇప్పుడు అంతటా మౌనం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాణ్యమైన మద్యాన్ని ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా విక్రయిస్తేనే టీడీపీ కూటమి, ఎల్లో మీడియా రాద్ధాంతం చేసింది. చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్, అయ్యన్నపాత్రుడు, రఘురామకృష్ణంరాజు తదితరులు దుష్ప్రచారమే పనిగా పెట్టుకున్నారు. మద్యం నాణ్యమైనది కాదని చెన్నైకు చెందిన ఓ ప్రైవేట్ ల్యాబ్ నివేదిక ఇచ్చిందని రఘురామ తప్పుదోవ పట్టించేందుకు యత్నించారు. అసలు తాము అటువంటి నివేదిక ఇవ్వలేదని ఆ ల్యాబ్ ప్రకటించంతో వారి కుట్ర బెడిసికొట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏపీలో విక్రయిస్తున్న మద్యం నాణ్యమైనదేనని ప్రకటించింది. అప్పట్లో రాద్ధాంతం చేసిన చంద్రబాబు, ఆయన గ్యాంగ్ ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం యూనిట్లు క్రమంగా బయటపడుతున్నా కిమ్మనడం లేదు. కఠిన చర్యలు తీసుకోవడం లేదు. రాష్ట్రంలో మద్యం దుకాణాలు, బార్లలో విక్రయిస్తున్న మద్యం నాణ్యతను ర్యాండమ్‌గా పరీక్షించాలని కూడా భావించడం లేదు. ఇదంతా చూస్తుంటే నకిలీ మద్యం మాఫియాకు ప్రభుత్వ పెద్దల దన్ను ఉందన్నదే స్పష్టమవుతోంది.

స్పిరిట్ .. మనుషులకు ప్రాణాంతకం!


వాస్తవానికి ఈ స్పిరిట్‌లో 100 శాతం ఆల్కహాల్ ఉంటుంది. ఇది మనుషులకు అత్యంత ప్రమాదకరం. పరిశ్రమలు తమ ఉత్పత్తుల (ఆహార సంబంధిత కాదు) తయారీకి ఈ స్పిరిట్‌ను ఉత్ప్రేరకంగా ఉపయోగిస్తాయి. ఇక బ్రాండెడ్ మద్యం కంపెనీల పరిశ్రమల్లో ఉండే అధునాతన, భారీ యంత్ర పరికరాలతో స్పిరిట్‌ను బాగా పలుచన (డైల్యూట్) చేసి ఆల్కహాల్‌ను 42 శాతానికి తగ్గిస్తాయి. తర్వాతే మద్యం తయారీకి ముడి సరుకుగా ఉపయోగిస్తారు. ఎందకంటే ఆల్కహాల్ 42 శాతం కంటే ఎక్కువ ఉండడం ఆరోగ్యానికి తీవ్ర హానికరం. కాగా, ఏడాదిగా టీడీపీ కూటమి పెద్దలు అక్రమంగా నెలకొల్పిన నకిలీ మద్యం యూనిట్లు ప్రమాణాలు ఏమీ పాటించలేదు. వీటిలోని చిన్నచిన్న యంత్రాలకు స్పిరిట్‌ను ప్రాసెస్ చేసే సామర్థ్యం లేదు.

- స్పిరిట్‌లోని ప్రమాదకర కారమిల్ ద్రావణం, రంగు నీళ్లు కలిపి నకిలీ మద్యం ఉత్పత్తి చేస్తున్నారు. అంతేకాదు బ్రాండెడ్ కంపెనీల మద్యం సీసాలు, మూతలు కూడా తయారు చేస్తున్నారు. నకిలీ మద్యంలో ఆల్కహాల్ శాతం 75 శాతం వరకు ఉంటోందని ఎక్సైజ్ వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి. అది ఎంత ప్రమాదకరమో ఊహకే అందడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సీసాల్లో నకిలీ మద్యం నింపి మూతలు బిగించి టీడీపీ సిండికేట్ గుప్పిట్లో ఉన్న 3,736 ప్రైవేట్ దుకాణాలు, 3,736 పర్మిట్ రూమ్‌లు, 75 వేల బెల్ట్ దుకాణాలు, ఇప్పటికి 540 బార్లలో (త్వరలో మరో 300 కూడా) యథేచ్ఛగా అమ్ముతున్నారు.

కోర్టు ఆదేశాలంటే లెక్కలేదా?

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తీరుపై హైకోర్టు ఆగ్రహం

- నాగారం భూముల్లో నిర్మాణాలు చేపడుతుంటే ఏం చేస్తున్నారంటూ నిలదీత
- వారంలోగా రిపోర్టు ఇవ్వాలని ఆదేశం; ఇదే చివరి అవకాశమని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: న్యాయస్థానాలు ఇచ్చిన ఆదేశాలంటే లెక్కలేదా అంటూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మహేశ్వరం మండలం నాగారంలోని గైరాన్ సర్కారీ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని తాము ఆదేశించామని, ఆ ఉత్తర్వులను ఉల్లంఘించి నిర్మాణాలు చేపడుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. దీనిపై సమగ్ర నివేదిక అందజేయాలని జూన్‌లో తాము ఆదేశించామని.. 4 నెలలు కావొస్తున్నా ఇప్పటివరకు ఎందుకు సమర్పించలేదని నిలదీసింది. ఆ భూముల వద్దకు వెళ్లి నిర్మాణాలు జరుగుతున్నాయా.. లేదా..పరిశీలించి నివేదిక సమర్పించడానికి ఏం ఇబ్బందని అడిగింది. కలెక్టర్ నుంచి ఇంత నిర్లక్ష్యాన్ని ఊహించలేదని ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఇది న్యాయస్థానం ఉత్తర్వుల ధిక్కరణే అవుతుందని స్పష్టం చేసింది. చివరి అవకాశం ఇస్తున్నామంటూ.. వారంలోగా నివేదిక అందజేయాలని, అందులో ఆలస్యానికి కారణాలను వెల్లడించాలని తేల్చిచెప్పింది.

ఇదీ కేసు..: నాగారం గ్రామంలోని సర్వే నంబర్ 181, 182, 194, 195లోని గైరాన్ భూములను కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌లు, వారి బంధువులు అక్రమంగా కొనుగోలు చేశారని బిర్లా మల్లేశ్ గతంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు ఆ భూములను విక్రయించడం గానీ, బదిలీ చేయడం గానీ, నిర్మాణాలు చేపట్టడం సహా ఎలాంటి మార్పులు చేయవద్దని ప్రతివాదులకు తేల్చిచెప్పింది. ఈ విధంగా న్యాయస్థానం ఉత్తర్వులున్నా వివాదాస్పద భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని మల్లేశ్ హైకోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. జూన్‌లో ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు.. రెండు వారాల్లో పిటిషనర్ లేవనెత్తిన అంశాలకు సమాధానమిస్తూ నివేదిక అందజేయాలని కలెక్టర్‌ను ఆదేశించింది. అయినా కలెక్టర్ నివేదిక దాఖలు చేయకపోవడంతో మహేశ్ మరో ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లపై శుక్రవారం విచారణ చేపట్టిన జస్టిస్ ఈవీ వేణుగోపాల్ కలెక్టర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ న్యాయవాది విజ్ఞప్తి మేరకు వారం గడువిస్తూ తదుపరి విచారణ ఈ నెల 17కు వాయిదా వేశారు.

పటాన్‌చెరు ఎమ్మెల్యేపై ఈపీ చెల్లదు

మహిపాల్‌రెడ్డికి హైకోర్టు ఊరట

సాక్షి, హైదరాబాద్: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిపై ఎన్నికల పిటిషన్ చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆధారాల్లేకుండా దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతించలేమంటూ కొట్టివేసింది. 2023 ఎన్నికల్లో పటాన్‌చెరు నుంచి బీఆర్ఎస్ తరఫున మహిపాల్‌రెడ్డి పోటీ చేసి విజయం సాధించారు. ఈ ఎన్నికను సవాల్ చేస్తూ కె.శ్రీనివాస్‌గౌడ్ హైకోర్టులో ఈపీ దాఖలు చేశారు. దీంతో ఎలాంటి ఆధారాల్లేకుండా వేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని ఎమ్మెల్యే మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) వేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.శరత్ విచారణ చేపట్టారు. వాదనలు విని శుక్రవారం తీర్పు వెలువరించారు. ఏడెకరాల భూములకు సంబంధించిన వివరాలు అఫిడవిట్‌లో పేర్కొనలేదని చెబుతున్న పిటిషనర్.. దీనిపై రిటర్నింగ్ అధికారికి ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు. దీనిపై కోర్టుకు సమర్పించిన ధరణి ఆన్‌లైన్ కాపీల్లో అధికారుల ధ్రువీకరణ లేదని, వీటిని పరిగణనలోకి తీసుకోలేమని తెలిపారు. నామినేషన్ సమయానికే ఆ భూమికి ఇతరులకు విక్రయించినట్లు ఎమ్మెల్యే ఆధారాలు అందజేశారన్నారు. బంక్ నుంచి వచ్చే ఆదాయం, విద్యార్హత, బ్యాంక్ రుణాలపై చేసిన ఆరోపణలకు సరైన ఆధారాలు సమర్పించడంలో పిటిషనర్ విఫలమయ్యారని చెప్పారు.



చేనేత అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వచ్చే నెల 15కల్లా ఇందిరా మహిళాశక్తి చీరలు

- చీరల ఉత్పత్తి ద్వారా 6,900 మంది నేత కార్మికులకు ఉపాధి కల్పన
- 6,780 మంది చేనేత కార్మికులకు రూ.లక్ష వరకు వ్యక్తిగత రుణమాఫీ : మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఇందిరా మహిళాశక్తి చీరలను వచ్చే నెల 15 నాటికి పంపిణీ చేస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఇప్పటివరకు తెలంగాణ చేనేత సహకార సంస్థ (టెస్కో) ఆధ్వర్యంలో 33.35 లక్షల చీరలు జిల్లా స్థాయి గోదాములకు సరఫరా చేసినట్టు వెల్లడించారు. సచివాలయంలో చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్‌తోపాటు ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల శుక్రవారం సమీక్షించారు. చీరల కోసం అవసరమైన వస్త్రోత్పత్తిలో 6,900 మంది నేత కార్మికులకు ఆరు నుంచి ఎనిమిది నెలల పాటు ఉపాధి దక్కిందన్నారు. చీరల ఉత్పత్తిని పూర్తి చేసి నవంబర్ 15లోగా జిల్లా స్థాయి గోదాముల నుంచి పంపిణీకి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

రుణమాఫీ ప్రక్రియ వేగవంతం: చేనేత కార్మికుల రుణమాఫీని వేగవంతం చేసి, త్వరగా వెరిఫికేషన్ పూర్తి చేసి లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు జమ చేయాలని తద్వారా 6,780 మందికి రూ.లక్ష వరకు రుణ విముక్తి లభిస్తుందని మంత్రి తుమ్మల వెల్లడించారు. తెలంగాణ చేనేత లేబుల్ ద్వారా వినియోగదారులకు నాణ్యమైన వస్త్రోత్పత్తులు అందుబాటులోకి వస్తాయన్నారు. తెలంగాణ నేతన్న భరోసా పథకం కింద చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు ఈ ఏడాది రూ.48.80 కోట్లు కేటాయించామని చెప్పారు. ఈ పథకం కింద ఇప్పటివరకు 13,371 మంది నమోదు చేసుకోగా మరో 3,966 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో తాత్కాలికంగా నడుస్తున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐటీహెచ్)ను పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్‌లోకి మార్చేందుకు వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

చెరువుల కబ్జాపై ఏం చర్యలు తీసుకున్నారు?

ఎమ్మెల్యే రమణారెడ్డి పిటిషన్‌పై ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లోని చెరువుల కబ్జా ఫిర్యాదుపై ఏం చర్యలు తీసుకున్నారో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. శాసనసభ్యుడైన పిటిషనర్ అసెంబ్లీలో ఈ అంశంపై చర్చించి, నేరుగా సర్కార్ పెద్దల దృష్టికి తీసుకెళ్లవచ్చు కదా? అని ప్రశ్నించింది. కామారెడ్డిలో ఎలాంటి ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు జరగడం లేదా? అని అడిగింది. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, హైడ్రా, రెరాతో పాటు ఆయా జిల్లాల కలెక్టర్లకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణ ఈనెల 30కి వాయిదా వేసింది. మూడు జిల్లాల పరిధిలోని కోట్ల రూపాయల విలువైన చెరువుల భూములను ఆక్రమించి.. హైరైజ్ భవనాలు నిర్మిస్తున్నారని, దీనిపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదంటూ కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది రాములు వాదనలు వినిపిస్తూ.. చెరువుల కబ్జాపై పిల్ దాఖలు చేయగా, రిట్ పిటిషన్ వేసుకోవాలని సీజే ధర్మాసనం సూచించిందన్నారు. ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ ఎమ్మెల్యే ఫిర్యాదును పరిశీలిస్తున్నామని చెప్పారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి 'రష్యన్ ఎనర్జీ వీక్'కు ఆహ్వానం



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ వేదిక నుంచి ఆహ్వానం అందింది. రష్యా రాజధాని మాస్కోలో జరగనున్న 'రష్యన్ ఎనర్జీ వీక్'8వ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనాల్సిందిగా రష్యా ప్రభుత్వం ఆయన్ను ఆహ్వానించింది. ఈనెల 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు ఈ కీలక సదస్సు జరగనుంది. ఈ మేరకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సలహాదారు, సదస్సు ఆర్గనైజింగ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ ఆంటన్ కొబ్యాకోవ్.. కిషన్‌రెడ్డికి రష్యా ఫెడరేషన్ రాయబారి కార్యాలయం ద్వారా అధికారికంగా ఆహ్వానం పంపారు. ఈ సదస్సుకు పలు దేశాల నుంచి పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, నిపుణులు హాజరుకానున్నారు.

జోర్డాన్‌లో చిక్కుకున్న వారిని వెనక్కి రప్పించాలి: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఉపాధి కోసం జోర్డాన్ దేశానికి వెళ్లి చిక్కుకున్న 12 మంది వలస కార్మికులను వెనక్కి తీసుకురావాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, సిద్దిపేటకు చెందిన కార్మికులు పరాయి దేశంలో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వదేశానికి తిరిగి రాలేక వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సీఎం రేవంత్‌తో పాటు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వారిని స్వదేశానికి రప్పించేలా చొరవ తీసుకోవాలని శుక్రవారం హరీశ్‌రావు ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవాస తెలంగాణ వాసుల సంక్షేమానికి అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ , అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. అధికారంలోకి వచ్చి 22 నెలలు కావస్తున్నా గల్ఫ్ కార్మికుల సంక్షేమం, ఎన్ఆర్ఐ పాలసీపై అధ్యయనం కోసం ఏర్పాటైన సలహా కమిటీ ఏం చేస్తోందని ప్రశ్నించారు.

డిజిటల్ వ్యవసాయంతో నూతన ఒరవడి సృష్టించాలి

- పురుగు మందులు, ఎరువుల వాడకం తగ్గాలి
- పంజాబ్‌లా తెలంగాణ మరో కేన్సర్ బెల్ట్ కాకూడదు
- జర్మనీ కంపెనీ ప్రతినిధులతో మంత్రి భేటీ

సాక్షి, హైదరాబాద్: డిజిటల్ వ్యవసాయంతో తెలంగాణలో నూతన ఒరవడి సృష్టించాలని, పురుగు మందులు, ఎరువుల వినియోగం తగ్గే విధంగా కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సచివాలయంలో ఆయన జర్మనీకి చెందిన ఏసీఏఆర్‌టీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'డిజిటల్ అగ్రికల్చర్ తెలంగాణ రోడ్‌మ్యాప్'ను మంత్రికి జర్మనీ కంపెనీ ప్రతినిధులు అందజేశారు. శాటిలైట్ డేటాతో నేలలోని పోషకాల లభ్యతను పరీక్షించే సాంకేతికతను వారు మంత్రికి వివరించారు. జర్మనీ-భారత్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసిన, ప్రపంచంలోని తొలి ఐటీయూ ప్రామాణికత డిజిటల్ వ్యవసాయ యూజ్‌కేస్‌ను వేములవాడలో విజయవంతంగా అమలు చేసినట్టు వివరించారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ నాణ్యమైన ఉత్పత్తులు వచ్చే విధంగా వ్యవసాయ విధానంలో సమూల మార్పులు తెచ్చే దిశలో తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలిపారు. పంజాబ్ తరహాలో తెలంగాణ మరో కేన్సర్ బెల్ట్ కాకూడదని, నేల ఆరోగ్యాన్ని, రైతు ఆదాయాన్ని, పర్యావరణాన్ని కాపాడే అనుకూల వ్యవసాయమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ భేటీలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి, అగ్రి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఆల్దాసు జానయ్య, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డితో పాటు జర్మనీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

3 ట్రిలియన్ ఎకానమీ సాధించేదెలా?

TELANGANA RISING

- ప్రతి జిల్లా అభివృద్ధి ఎలా సాధ్యం
- మెరుగైన జీవనమెలా సాధ్యం
- విద్య, నైపుణ్యాల అభివృద్ధి ఎలా
- పాలన, పౌర సేవలు ఎలా ఉండాలి

రాష్ట్రాభివృద్ధికి మీరేం సూచిస్తారంటూ 8 అంశాలతో రాష్ట్ర ప్రభుత్వ సర్వే

తెలంగాణ రైజింగ్ విజన్–2047 పేరుతో ఆన్‌లైన్‌లో అభిప్రాయ సేకరణ

ఈ నెల 25వ తేదీ వరకు అభిప్రాయాలు పంచుకునే అవకాశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధి కోణం ఎలా ఉండాలన్న దానిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణకు శ్రీకారం చుట్టింది. తెలంగాణ రైజింగ్ విజన్–2047 పేరుతో మొత్తం 8 అంశాలపై ఈ సర్వే నిర్వహిస్తోంది. ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ సర్వే 25వ తేదీ వరకు కొనసాగనుంది.ప్రజలు తమ విలువైన అభిప్రాయాలను ఆన్‌లైన్ ద్వారా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. తెలంగాణలోని ప్రతి పౌరుని జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే ఎజెండాగా ఈ రైజింగ్ కాన్సెప్ట్‌ను ముందుకు తీసుకెళుతోంది. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, జిల్లా, పట్టణం, నగరాల్లోని ప్రజల స్వరం, కలలు, ఆలోచనల ఆసరాగా భవిష్యత్ తెలంగాణ కోసం రూపొందిస్తోన్న ఈ విజన్ సాధ్యమని భావిస్తోంది. అందులో భాగంగానే 15 రోజులపాటు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి అభిప్రాయ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంది. సర్వేలో భాగంగా 8 ప్రశ్నలను రూపొందించింది. ప్రతి ప్రశ్నకు కొన్ని సమాధానాలిచ్చి వాటిలో ఎలా వెళితే బాగుంటుందో సూచించాలని కోరింది. https://www.telangana.gov. in/ telanganarising/ అనే వెబ్‌సైట్‌లో ఈ సర్వేను పొందుపరిచింది.

సర్వేలోని అంశాలివే

త్రీ ట్రిలియన్ ఎకానమీ: 2047 నాటికి త్రీ ట్రిలియన్ ఎకానమీ సాధించడంలో భాగంగా ఉద్యోగాలకు అవసరమైన రంగాల్లో కోర్సులు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో నూతన ఆవిష్కరణలు, పారిశ్రామిక వాతావరణం కల్పనలో భాగంగా విధానాల్లో సంస్కరణల అమలు, యువత నాయకత్వంలో వ్యాపారాలు.

మీ ఆలోచన మేరకు ఈ విజన్: వీలున్నంత సమీపంలో మంచి పాఠశాలలు, ఆస్పత్రుల ఏర్పాటు, మీమీ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార అవకాశాల కల్పన, మహిళల రక్షణ, మరిన్ని అవకాశాల కల్పన, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఆధునిక సేవలు.

అభివృద్ధి రంగాలు..: ఐటీ–ఏఐ–సైబర్ సెక్యూరిటీ, ఫుడ్ ప్రాసెసింగ్–అగ్రిటెక్–కోల్డ్ స్టోరేజీ, ఫార్మా–బయోటెక్–ఆరోగ్య ఆవిష్కరణలు, ఎలక్ట్రానిక్స్ మరియు సెమీకండక్టర్ల తయారీ, పర్యాటకం–సాంస్కృతిక–సినీ–సృజనాత్మకత, డ్రోన్స్–అంతరిక్ష శాస్త్రం–రక్షణ.

మెరుగైన జీవితం..: అందరికీ స్వచ్ఛమైన గాలి, నీటి లభ్యత, మెరుగైన పారిశుధ్యం, చివరి మైలు వరకు బస్సు, రైలు మార్గాల అనుసంధానం, రక్షిత, సరసమైన గృహ సదుపాయం.

ఆరోగ్యం, శ్రేయస్సు..: ప్రతి మండలానికి ఆస్పత్రి, మొబైల్ ఆరోగ్య వాహనం ఏర్పాటు, తక్కువ ధరలకే ఆరోగ్య పరీక్షలు, మందులు, టెలీమెడిసిన్ లభ్యత, పరిశుభ్రమైన నీరు, పారిశుధ్యం, వ్యాధి నియంత్రణ, సరసమైన ధరలకు మానసిక ఆరోగ్య కౌన్సెలర్ల లభ్యత, ఆరోగ్య బీమా.

విద్య, నైపుణ్యాలు..: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, వాతావరణ, పారిశ్రామిక రంగాలపై బోధన, ఆధునిక శిక్షణ పరికరాలు, సుశిక్షితులైన ఉపాధ్యాయులు, కళాశాలలు, ఐటీఐలలో నైపుణ్య ఆధారిత కోర్సులు, ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు సానుకూలత కల్పించడం, సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధి.

పాలన–పౌర సేవలు..: అన్ని రకాల ప్రభుత్వ సేవలకు ఒకటే పోర్టల్. ప్రజలకు అందుబాటులో ప్రతి ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల సమాచారం, తగినన్ని నిధులు, అధికారాలతో స్థానిక సంస్థల బలోపేతం.

2047లో తెలంగాణ ఎలా ఉండాలని ఊహించుకుంటున్నారు?..: (పైన పేర్కొన్న ఏడు అంశాలపై ప్రజల నుంచి ఆప్షన్లను కోరిన ప్రభుత్వం 8వ అంశానికి సంబంధించి తెలంగాణ ఎలా ఉండాలని ఊహించుకుంటున్నారో తమ ఆలోచనను అక్షర లేదా స్వర రూపంలో ఇవ్వాలని సర్వేలో కోరింది.)

కేవలం విధాన పత్రం కాదు.. ఉమ్మడి స్వప్నం

తెలంగాణ రైజింగ్ విజన్ 2047 అనేది కేవలం విధాన పత్రమే కాదు. తెలంగాణ ప్రజల ఉమ్మడి స్వప్నం కావాలి. రాష్ట్ర భవిష్యత్ నిర్మాతలు ప్రజలే. ప్రజలందరూ కొంత సమయాన్ని వెచ్చించి ఈ చారిత్రక కసరత్తులో భాగస్వాములై మీ విలువైన అభిప్రాయాలను అందించాలి.

–జయేశ్ రంజన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి



ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల బాదుడు

లేబొరేటరీ, లైబ్రరీ, జాబ్ ట్రైనింగ్ పేరుతో వసూళ్లు

డబ్బులు చెల్లించినా రశీదులు ఇవ్వని యాజమాన్యాలు

ఆధారాలు లేకుండా ఏమీ చేయలేమంటున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు లేబొరేటరీ, లైబ్రరీ ఫీజులు భారీగా పెంచాయి. ఒక్కో కాలేజీ ఒక్కో రకంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి.



ఈ విషయాన్ని కొంతమంది విద్యార్థులు ఇటీవల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఆధారాలు లేకుండా కాలేజీలను తాము కట్టడి చేయలేమని అధికారులు అంటున్నారు. అదనంగా కట్టించుకునే ఫీజులకు కాలేజీ యాజమాన్యాలు ఎలాంటి రశీదులు ఇవ్వడం లేదని విద్యార్థులు తెలిపారు. అదనపు ఫీజులు కట్టకపోతే క్లాసుకు హాజరైనా అటెండెన్స్ ఉండదని, ఫలితంగా పరీక్ష రాసే అవకాశం కోల్పోతారని బెదిరిస్తున్నట్టు విద్యార్థులు వాపోతున్నారు.

అసలు కన్నా...కొసరే ఎక్కువ

లైబ్రరీ, లేబొరేటరీ ఫీజు కింద అదనంగా ఏటా రూ.12 వేల వరకూ తీసుకోవాలని ప్రభుత్వం గతంలో జీఓ ద్వారా పేర్కొంది. కొన్నేళ్లుగా ఈ ఫీజులో ఎలాంటి మార్పూ లేదు. కానీ కొన్ని కాలేజీలు లైబ్రరీ, లేబొరేటరీ ఫీజు కింద గతేడాది రూ.20 వేల వరకూ వసూలు చేశాయి. ఈ ఏడాది నుంచి ఈ ఫీజును ఏకంగా రూ. 30 నుంచి రూ. 50 వేల వరకూ పెంచారు. క్యాంపస్ నియామకాలకు శిక్షణ ఇచ్చేందుకు కాలేజీలు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తున్నాయి.ఏటా రూ.30 నుంచి రూ.60 వేల వరకూ విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నాయి. వాస్తవానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థికి స్కిల్ నేర్పించడం కాలేజీల బాధ్యత. అవేమీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

కఠినచర్యలు తప్పవు



నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నట్టు ఆధారాలతో తమకు ఫిర్యాదు చేస్తే, ఆ కాలేజీలపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఉద్యోగం కోసం శిక్షణ పేరుతో డబ్బులు తీసుకుంటున్నారని ఇటీవల జేబీఐటీ కాలేజీలపై ఎస్టీ కమిషన్‌కు ఓ విద్యార్థి ఫిర్యాదు చేశారు. ఆ కాలేజీకి ఇప్పటికే నోటీసులు ఇచ్చాం.

– డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్

చంద్రబాబుతో భేటీకి రూ.10 వేలు!

ఏఐ టెక్నాలజీతో దుండగుడి ఫోన్లు

ఖమ్మం జిల్లా నాయకుడికి టోకరా

సత్తుపల్లి: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి దేవినేని ఉమా ఫొటోలతో వీడియో కాల్ చేసిన ఓ దుండగుడు ఖమ్మం జిల్లా టీడీపీ నేత నుంచి డబ్బు లాగిన వైనం ఆలస్యంగా వెలుగుచూసింది. సత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన టీడీపీ నాయకుడు కంచర్ల సతీష్‌తో పాటు పలువురికి సెప్టెంబర్ 30న దేవినేని ఉమా పీఏ పేరుతో ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. ఉమా మీకు వీడియో కాల్ చేస్తారని చెప్పాడు. కాసేపటికి దేవినేని ఉమా ముఖంతో పోలిన వ్యక్తి ద్వారా మాట్లాడించాడు. ఇందుకోసం దుండగుడు ఏఐ టెక్నాలజీ ఉపయోగించినట్లు తెలుస్తుండగా.. సదరు వ్యక్తి టీడీపీ కార్యకర్తల పిల్లల చదువు కోసమని మూడు బ్యాంకు నంబర్లకు రూ.35 వేలు జమ చేయించాడు. ఆపై కొద్దిరోజులకు ఫోన్ చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్ ఇప్పిస్తానని, కాసేపట్లో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు వీడియో కాల్ చేస్తారని చెప్పాడు. తర్వాత అతను చెప్పినట్టుగానే చంద్రబాబు ముఖం



చంద్రబాబు మాట్లాడుతున్నట్టుగా ఏఐ సాయంతో ఫోన్ కాల్

పోలిన వ్యక్తి వీడియోకాల్ చేశాడు. దీంతో సతీష్ నిజమేనని నమ్మాడు.

బీ ఫామ్ ఇప్పిస్తానని..

సదరు వ్యక్తి తిరిగి ఫోన్ చేసి విజయవాడకు వస్తే చంద్రబాబుతో బీ ఫామ్ ఇప్పిస్తానని చెప్పడంతో నమ్మిన సతీష్ సహా 18 మంది విజయవాడ వెళ్లారు. ఆ వ్యక్తిని ఫోన్‌లో సంప్రదించగా తాను టీడీపీ కార్యకర్తను చూడ్డానికి ఆస్పత్రికి వెళ్లానని, రూ.10 వేలు ఫోన్‌పే చేస్తే మళ్లీ ఇస్తానని చెప్పాడు. అందరి హోటల్ ఖర్చులు తామే చూసుకుంటామని నమ్మబలికాడు. సాయంత్రం ఫోన్ చేసి చంద్రబాబును కలిసేందుకు 8 మందికే అనుమతి ఉందని, ఒక్కొక్కరు రూ.10 వేలు చెల్లించాలని సూచించాడు. ఇంతలో ఫుడ్ బిల్లు విషయమై హోటల్ సిబ్బందితో టీడీపీ నాయకులకు వాగ్వాదం జరగగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడకు వచ్చిన పోలీసులు దేవినేని ఉమాకు ఫోన్ చేయగా తానెవరికీ ఫోన్ చేయలేదని చెప్పడంతో..తాము మోసపోయామని సత్తుపల్లి నాయకులు గ్రహించి వెళ్లిపోయారు. అయితే హోటల్‌లో బస, భోజనం బిల్లులు చెల్లించలేదని హోటల్ యజమాని ఫిర్యాదు చేయగా.. అక్కడి టీడీపీ నాయకులు సర్దుబాటు చేసినట్లు సమాచారం. కాగా ఏఐ టెక్నాలజీతో మోసం చేసిన వ్యక్తిని ఏలూరు జిల్లాకు చెందిన భార్గవ్‌గా గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.



గొత్తికోయల గుడిసెలను కూల్చివేస్తున్న అటవీశాఖ అధికారులు



గుడిసెను కూల్చి సామగ్రిని ధ్వంసం చేయడంతో రోదిస్తున్న తల్లి, బిడ్డ

గొత్తికోయల గుడిసెలు

తొలగించిన అటవీ శాఖ



వాహనానికి అడ్డంగా పడుకున్న సురేశ్‌ను పక్కకు తీసుకెళుతున్న అటవీ శాఖ సిబ్బంది

మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం ● ములుగు జిల్లాలో ఘటన

మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రానికి సమీపంలోని సండ్రోని ఒర్రె అటవీ ప్రాంతం శాంతినగర్ గొత్తికోయల గూడెంపై మంగపేట అటవీ శాఖ రేంజ్ అధికారి అశోక్, డిప్యూటీ రేంజ్ అధికారి కోటేశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. 14 ఏళ్ల క్రితం ఛత్తీస్‌గఢ్‌నుంచి వలసవచ్చిన సుమారు 17 గొత్తికోయ గిరిజన కుటుంబాలు ఈ ప్రాంతంలో 18 హెక్టార్లలో పోడు వ్యవసాయం చేసుకుంటూ అక్కడే గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల 12 కుటుంబాలకు చెందిన గిరిజనులు పంటలు సాగుచేస్తున్న భూముల్లో నివాసం ఉండేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన కొన్ని గుడిసెలను అటవీశాఖ అధికారులు కూల్చివేశారు. అయితే తమ గుడిసెలను కూల్చి, నిలువ నీడ లేకుండా చేశారని, తాము అడవిలో ఎలా బతకాలని అంటూ సోయం సురేశ్ అనే గిరిజనుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. కాగా, అతడిని అటవీ సిబ్బంది అడ్డుకున్నారు. అనంతరం అధికారులు అక్కడినుంచి వెళ్లిపోయారు. సురేశ్ వారి వెనకాలే పరుగెత్తుకుంటూ వెళ్లి మధ్యలో ఉన్న ఒర్రె నీటిలో పడిపోయాడు. వెంటనే గూడెంవాసులు అతడిని ఏటూరునాగారం ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు.

కొత్తగా వేసిన గుడిసెలను తొలగించాం

గతం నుంచి నివాసం ఉంటున్న ప్రాంతంలోనే ఉండాలని, కొత్తగా పోడు చేయొద్దని, గుడిసెలు నిర్మించొద్ద ని గొత్తికోయలను హెచ్చరించామని, అయినప్పటికీ వారు వినిపించుకోకుండా కొత్తగా గుడిసెలు వేయడంతో తొలగించామని అటవీశాఖ రేంజ్ అధికారి అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి పురుగు మందు తాగుతానని బెదిరించి ప్రభుత్వ వాహనంలోకి చొర బడి, తమ విధులకు ఆటంకం కలిగించాడని పేర్కొన్నా రు. అయినా మానవతా దృక్పథంతో మందలించి, పాత నివాసాల్లోనే ఉండాలని సూచించామన్నారు.

మావోయిస్టులు జనంలోకి రావాలి

- డీజీపీ శివధర్‌రెడ్డి పిలుపు
- లొంగిపోవడానికి స్వేచ్ఛాయుత వాతావరణం ఉంది
- డీజీపీ సమక్షంలో లొంగిపోయిన ముగ్గురు మావో నేతలు



లొంగిపోయిన మావోయిస్టులకు చెక్కును అందిస్తున్న డీజీపీ శివధర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలని డీజీపీ బి.శివధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మావోయిస్టులు లొంగిపోయేందుకు ఇప్పుడు రాష్ట్రంలో పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణం ఉందని, వారు తమ బంధువులు, స్నేహితుల ద్వారా, లేదా స్థానిక రెవెన్యూ అధికారుల ఎదుట, లేదంటే మీడియా ప్రతినిధుల ద్వారా కూడా పోలీసుల వద్దకు వచ్చి లొంగిపోవచ్చని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక కేంద్ర కమిటీ సభ్యుడు, నలుగురు రాష్ట్ర కమిటీ సభ్యులు సహా మొత్తం 412 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయినట్టు వెల్లడించారు. మావోయిస్టు పార్టీ దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీ ఇన్‌చార్జి కుంకటి వెంకటయ్య అలియాస్ వికాస్, దండకారణ్యం స్పెషల్ జోనల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మొగిలిచెర్ల వెంకటరాజు అలియాస్ రాజు, జనతన సర్కార్ దక్షిణబస్తర్ ఇన్‌చార్జి తోడెం గంగ అలియాస్ సోనిలు డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట శుక్రవారం లొంగిపోయారు. ఈ కార్యక్రమంలో ఈ ముగ్గురిపై ఉన్న రివార్డు మొత్తం నుంచి ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇంటెలిజెన్స్ అదనపు డీజీ విజయ్‌కుమార్, ఆర్గనైజేషన్స్ అదనపు డీజీ స్వాతిలక్రా, ఎస్ఐబీ చీఫ్, ఐజీ సుమతితో కలిసి డీజీపీ శివధర్‌రెడ్డి మాట్లాడారు. మావోయిస్టు పార్టీలో నాయకుల మధ్య విభేదాలున్నాయని ఇటీవల వారి లేఖల ద్వారా తెలుస్తోందని, మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రెటరీ ఎన్నిక ఇంకా జరగలేదని తమకు సమాచారం ఉందని తెలిపారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన 72 మంది మావోయిస్టులు పార్టీలో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్నారని ఆయన వెల్లడించారు. 12 మంది సెంట్రల్ కమిటీ సభ్యులలో ఎనిమిది మంది తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో కొన్ని నెలల క్రితం సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) మళ్లీ పుంజుకునేందుకు చేసిన ప్రయత్నాలను పూర్తిగా అడ్డుకున్నట్టు వెల్లడించారు.

సామాజిక మార్పులకు తగినట్టుగా పార్టీ మారలేదు..

దేశంలో వచ్చిన సామాజిక, ఆర్థిక మార్పులకు అనుగుణంగా మావోయిస్టు పార్టీ తన విధానాలను రూపొందించుకోవడంలో విఫలమైందని లొంగిపోయిన దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీ ఇన్‌చార్జి కుంకటి వెంకటయ్య అన్నారు. మారుతున్న పరిస్థితులకు తగ్గట్టు పనిచేసే అవకాశం మావోయిస్టు పార్టీలో లేదని, అదేవిధంగా అనారోగ్య పరిస్థితుల కారణంగా పోలీసులకు లొంగిపోయానని వెల్లడించారు.

రూ. 1,100 కోట్ల విలువైన భూములకు కంచె

12.5 ఎకరాలను పరిరక్షించిన హైడ్రా | హైదరాబాద్‌లోని నాలుగు చోట్ల ఆపరేషన్స్



అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగిస్తున్న హైడ్రా

సాక్షి, హైదరాబాద్: హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) నగరంలోని నాలుగు ప్రాంతాల్లో ఆపరేషన్స్ చేపట్టింది. కబ్జాకు గురైన ప్రభుత్వ, ప్రజావసరాలకు ఉద్దేశించిన, పార్కు స్థలాలను పరిరక్షించింది. కంచె వేసిన మొత్తం 12.5 ఎకరాల భూముల విలువ రూ.1,100 కోట్లు ఉంటుందని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

➤ బంజారాహిల్స్ రోడ్డు నంబరు 10లోని సర్వే నం.403లో ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చెర నుంచి విడిపించింది. దీని మార్కెట్ విలువ రూ.750 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. రికార్డుల్లో లేని సర్వే నంబర్ (403/52)కు పార్థసారథి అన్ రిజిస్టర్డ్ సేల్‌డీడ్‌ను సృష్టించారని రెవెన్యూ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. తాగునీటి వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఇందులో 1.20 ఎకరాల భూమిని జలమండలికి ప్రభుత్వం ఇచ్చినా, అక్కడ పనులు చేయకుండా అడ్డుకుంటున్నారనే మరో ఫిర్యాదు అందింది. ఈ రెండు ఫిర్యాదులపై హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ జరిపింది. అది ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకుని ఆక్రమణలను తొలగించింది. చుట్టూ ఫెన్సింగ్ వేసిన పార్థసారథి బౌన్సర్లతోపాటు వేటకుక్కలను కాపలా పెట్టి అందరినీ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈయనపై బంజారాహిల్స్ పీఎస్‌లో 4 క్రిమినల్ కేసులు కూడా నమోదయ్యాయి. కోర్టులో వివాదం ఉండగా ఐదు ఎకరాల భూమిని తన అధీనంలోకి తీసుకున్నాడు. షేక్‌పేట రెవెన్యూ అధికారుల లేఖ ఆధారంగా హైడ్రా భారీ బందోబస్తు మధ్య ఆక్రమణలను తొలగించింది. పార్థసారథి వేసిన ఫెన్సింగ్‌తోపాటు లోపల ఉన్న షెడ్లను నేలమట్టం చేసింది. చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డు ఏర్పాటు చేసింది.

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం మహాదేవపురంలో పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాలకు గురవుతున్నట్టు వచ్చిన ఫిర్యాదులతో హైడ్రా చర్యలు తీసుకుంది. ఆక్రమణకు గురైన 3.5 ఎకరాలను పరిరక్షించింది.

మేడ్చల్‌లో ఏజీ ఆఫీసు ఉద్యోగులకు చెందిన హౌసింగ్ సొసైటీ లేఔట్‌లో కూడా పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన భూమికి సంబంధించి మొత్తం మూడు ఎకరాల్లో కబ్జాలను తొలగించింది.

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ సమీపంలోని తట్టి అన్నారంలోనూ ఆపరేషన్ చేసింది. అక్కడి శ్రీలక్ష్మి గణపతి కాలనీలో 680 గజాల మేర విస్తరించి ఉన్న పార్కులో ఆక్రమణలను తొలగించింది. ఈ నాలుగు చోట్లా హైడ్రా ఫెన్సింగ్ వేసింది.

అమెరికా టాప్ యంగ్ డెంటిస్ట్‌ల జాబితాలో ఖమ్మం వాసి



కల్లూరు/కల్లూరు రూరల్: అమెరికాలో ప్రఖ్యాత ఎడ్జ్ పత్రిక నిర్వహించిన సర్వేలో ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన డాక్టర్ పసుమర్తి సందీప్ టాప్ యంగ్ డెంటిస్ట్–40 (టాప్ 40 – అండర్ 40) జాబితాలో స్థానం సాధించాడు. సందీప్ ఏపీలోని విజయవాడ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి బీడీఎస్ పూర్తిచేశాడు. ఆ తర్వాత అమెరికాలోని నోవా సౌత్ ఈస్టర్న్ యూనివర్సిటీలో ఉన్నత విద్యనభ్యసించి వర్జీనియాలోని షెనాడోవాలీలో దంత వైద్యుడిగా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రజలకు వైద్యం అందించాలనే ఉద్దేశంతో షెనాడోవాలీని ఎంపిక చేసుకున్నారు. దివ్యాంగులు, పునరావాస కేంద్రాల్లో ఉండే బాధితులకు వైద్యసాయం అందించడం, దంత పరిశోధనకు సంబంధించి క్రియాశీలక సహకారం అందిస్తున్న సందీప్‌కు ఎడ్జ్ పత్రిక జాబితాలో చోటు దక్కిందని ఆయన తండ్రి చందర్‌రావు తెలిపారు.

క్లుప్తంగా...

నేడు కోయంబత్తూరులో మోటార్ స్పోర్ట్స్ ప్రారంభం

ముఖ్య అతిథిగా కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు శనివారం కోయంబత్తూరులో జరిగే 10వ 'ఎఫ్ఎంఏఈ నేషనల్ స్టూడెంట్ మోటార్ స్పోర్ట్స్ కాంపిటీషన్ 2025' ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కుమారగురు ఇన్స్టిట్యూషన్స్‌లో నిర్వహించే ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు. ఈ జాతీయ స్థాయి పోటీలు యువతలో ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు, మోటార్ స్పోర్ట్స్ రంగంలో కొత్త ప్రతిభను వెలికితీసే వేదికగా నిలుస్తాయి. విద్యార్థుల సాంకేతిక ఆలోచనలకు ఈ కార్యక్రమం ప్రేరణగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: రెండో శనివారం సందర్భంగా సెలవు ఉన్నప్పటికీ శనివారం మద్యం షాపుల ఏర్పాటు కోసం ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు స్వీకరించనుంది. పంచమి తిథి ఉన్న నేపథ్యంలో ఎక్కువ మంది దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చే అవకాశమున్నందున రాష్ట్రంలోని అన్ని ఎక్సైజ్ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించాలని ఎక్సైజ్ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది.

యాదాద్రిలో 13,178 ఎకరాల్లో రాజ్‌కొండ ఫారెస్ట్ బ్లాక్ రిజర్వ్

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: యాదాద్రి భువనగిరి జిల్లాలో 13,178 ఎకరాల్లో (సుమారు 5,333 హెక్టార్లు) రాజ్‌కొండ (రాచకొండ) ఫారెస్ట్ బ్లాక్‌ను రిజర్వ్ చేస్తూ రాష్ట్రప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణ్‌పూర్ తాలూకా చౌటుప్పల్ రేంజ్‌లోని రాజ్‌కొండ (రాచకొండ), మొహమ్మదాబాద్, కుర్మకేసరం (నారాయణ్‌పూర్) గ్రామాల పరిధిలోని భూములను ఈ రాజ్‌కొండ ఫారెస్ట్ బ్లాక్ కోసం రిజర్వ్ చేశారు. దీనికి సంబంధించి ఈనెల 16న ప్రత్యేకంగా తెలంగాణ గెజిట్ లో పబ్లిష్ చేయాలని సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఈ నోటిఫికేషన్‌ను జిల్లా గెజిట్‌లో ప్రచురించడంతో పాటు తెలంగాణ అటవీచట్టం–1967 (యాక్ట్ నెం.1 ఆఫ్ 1967) రీడ్ విత్ సెక్షన్ 20 ఆఫ్ భారత అటవీ చట్టం, 1927 (సెంట్రల్ యాక్ట్ 16 ఆఫ్ 1927) ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ ఫారెస్ట్ బ్లాక్ రిజర్వ్‌కు సంబంధించి అటవీశాఖ పీసీసీఎఫ్ నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించాక ఫారెస్ట్‌బ్లాక్ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీచేసినట్టు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్ ఉత్తర్వులు జారీ చేశారు.

వేసవికి ముందస్తు సిద్ధం

విద్యుత్ అధికారులతో ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ



సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది వేసవిలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగే అవకాశముందని, దీనిని దృష్టిలో ఉంచుకొని ఇప్పట్నుంచే అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ స్పష్టం చేశారు. సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్షించారు. వచ్చే ఏడాది 19,500 మెగావాట్ల నుంచి 20,000 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ ఉంటుందన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో 5,000 మెగావాట్లకు చేరే వీలుందని తెలిపారు. ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని దక్షిణ డిస్కం పరిధిలో 3,866 అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, 431 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయిని పెంచాలని నిర్ణయించినట్టు చెప్పారు. సమావేశంలో ట్రాన్స్‌కో డైరెక్టర్లు సంపత్‌కుమార్, లతావినోద్, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్లు డాక్టర్ నరసింహులుతోపాటు పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.

వైద్య శాఖలో పెండింగ్ పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వండి

తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని సర్జన్ పోస్టుల కోసం ఉత్తర్వులు జారీ చేయడంలో తీవ్ర ఆలస్యమవుతోందని, తద్వారా డాక్టర్ల హక్కులకు భంగం కలుగుతోందని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) ఆవేదన వ్యక్తం చేసింది. సివిల్ సర్జన్ పోస్టుల కోసం ఆర్డర్లు ఇవ్వడం లేదని, దీని కారణంగా డిప్యూటీ సివిల్ సర్జన్ల పోస్టింగులు ఆలస్యమవుతున్నాయని, పదోన్నతుల ప్రక్రియ పూర్తయినా ఉత్తర్వులు రాకపోవడంతో వైద్యుల్లో ఉత్సాహం దెబ్బతింటోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.నరహరి, సెక్రటరీ జనరల్ లాలూ ప్రసాద్ రాథోడ్, కోశాధికారి ఎం.కె.రవూఫ్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంటనే సివిల్, డిప్యూటీ సివిల్ సర్జన్ల పోస్టింగ్ ఆర్డర్లను విడుదల చేయాలని, తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలో పనిచేస్తున్న వైద్యులకు సకాలంలో జీతాలు చెల్లించడానికి ఆ సంస్థను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ (డీఎస్‌హెచ్ ఎస్)గా మార్చాలని, వేతనాలను 010 పద్దు పరిధిలోకి తీసుకురావాలని కోరారు.

ఖాతా ఒకరిది.. ఆధార్ మరొకరిది!



పలు జిల్లాల్లో దారిమళ్లుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిధులు

- లబ్ధిదారుల ఆధార్ అనుసంధానంలో భారీగా తప్పిదాలు
- ప్రభుత్వానికి భారీగా అందుతున్న ఫిర్యాదులు

• నల్లగొండ జిల్లా దామరచర్లకు చెందిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు మమత (పేరు మార్చాం) ఇటీవల బేస్‌మెంట్ వరకు ఇంటి నిర్మాణం చేపట్టి ఇందిరమ్మ యాప్‌లో ఫొటో, ఇతర వివరాలు నమోదు చేశారు. దీంతో తొలి విడతలో ఆమెకు రూ. లక్ష విడుదలైంది. కానీ డబ్బు మాత్రం ఆమె ఖాతాలో పడలేదు. దీనిపై ఆమె అధికారులకు ఫిర్యాదు చేయగా వారి పరిశీలనలో అది నిజమేనని తేలింది. ఆ సొమ్ము లబ్ధిదారు బ్యాంకుకు బదులు మరో వ్యక్తికి చెందిన బ్యాంకు ఖాతాలో పడ్డట్టు తేలింది. ఆమె ఆధార్ నంబర్ మరో వ్యక్తికి చెందిన బ్యాంకు ఖాతాతో అనుసంధానమై ఉండటమే అందుకు కారణమని విచారణలో వెలుగుచూసింది. అయితే డబ్బు డ్రా చేసుకున్న ఆ వ్యక్తి ఇంటికి తాళం వేసి పరారవడం గమనార్హం.

• ఆదిలాబాద్‌కు చెందిన వెంకటమ్మ అనే లబ్ధిదారుకు రావాల్సిన నిధులు ఇందిరమ్మ పథకం లబ్ధిదారు కాని వెంకటమ్మ అనే మరో మహిళ ఖాతాలోకి జమయ్యాయి. అక్కడ కూడా ఆధార్ నంబర్ అనుసంధానం సమయంలో ఇద్దరి పేర్లు ఒకటిగానే ఉండటంతో ఒకరి ఖాతాకు బదులు మరొకరి ఖాతాకు అనుసంధానమైంది.

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులకు అందాల్సిన నిధులు కొన్ని చోట్ల దారిమళ్లుతున్నాయి. పలు జిల్లాల్లో కొందరు లబ్ధిదారుల పేర్లకు వారి ఆధార్ నంబర్ల బదులు ఇతరుల ఆధార్ నంబర్లను అనుసంధానిస్తూ బ్యాంకు సిబ్బంది చేసిన పొరపాట్లు, తప్పిదాలు గందరగోళానికి దారితీస్తున్నాయి. ఆయా ఆధార్ నంబర్లు ఉన్న బ్యాంకు ఖాతాలకే డబ్బు జమ అవుతుండటంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. జగిత్యాల, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లోనూ పలుచోట్ల ఆధార్ నంబర్లు మారిపోవడంతో ఇందిరమ్మ ఆర్థిక సాయం నిధులు లబ్ధిదారుల ఖాతాల్లోకి కాకుండా ఇతరుల ఖాతాలకు జమయ్యాయి.

ఇందిరమ్మ కమిటీ సభ్యుల వసూళ్లు!

ఇందిరమ్మ పథకం అమల్లో భాగంగా తమ పట్టు ఉండాలన్న ఉద్దేశంతో ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల ఒత్తిళ్లతో ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీల పేరుతో వారి అనుచరులకు లబ్ధిదారుల ఎంపిక బాధ్యత ఇచ్చింది. అనర్హుల చేతికి ఇందిరమ్మ ఇళ్లు చిక్కొద్దన్న ఉద్దేశంతో వారిని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం అప్పట్లో పేర్కొంది. కానీ ఇప్పుడు క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఇందిరమ్మ అర్హుల జాబితాలో చోటు దక్కాలంటే రూ. 10 వేల నుంచి రూ. 30 వేల వరకు కమీషన్ ఇవ్వాలంటూ కమిటీ సభ్యులు వేధిస్తున్నారని టోల్ ఫ్రీ నంబర్‌కు లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ ఫిర్యాదులపై అధికారులు విచారణ జరిపి ఆరోపణలు నిజమని తేలిన ఉదంతాలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామానికి చెందిన కొండా లింగన్న భార్య పేరుతో ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇందుకు రూ. 10 వేలు ఇవ్వాలంటూ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు ఒకరు వారిని వేధించటం ప్రారంభించారు. దీనిపై ఆ కుటుంబం టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయగా, బహిరంగ విచారణ జరిపి అది నిజమేనని తేల్చారు. జనగామ జిల్లా దేవరుప్పల మండలం పడమటి తండాకు చెందిన శివమ్మ అనే లబ్ధిదారును ఇందిరమ్మ కమిటీ సభ్యుడు రూ. 30 వేల కోసం వేధిస్తుండటంతో వారు ఫిర్యాదు చేశారు.

కాంగ్రెస్ బుజ్జగింపులు షురూ

- జూబ్లీహిల్స్ ఆశావహుల వద్దకు ఇన్‌చార్జ్ మంత్రులు, ఏఐసీసీ కార్యదర్శి
- అంజన్‌కుమార్, సీఏ రెడ్డి తదితరుల వద్దకు వెళ్లి సర్ది చెప్పిన నేతలు

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ టికెట్ దక్కక అలకబూనిన అసంతృప్తవాదులు హైకమాండ్ రంగంలోకి దిగడంతో శాంతించారు. శుక్రవారం ఏకంగా ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్‌లో గల మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ క్యాంప్ ఆఫీస్‌కు వెళ్లి ఆయన్ను బుజ్జగించారు. జూబ్లీహిల్స్ టికెట్ ఏ పరిస్థితుల్లో నవీన్‌కు కేటాయించాల్సి వచ్చిందనే విషయాన్ని ఆయనకు వివరించారు. భవిష్యత్‌లో కచ్చితంగా ప్రాధాన్యం ఇస్తామని మీనాక్షీ నటరాజన్, మంత్రులు హామీ ఇవ్వడంతో వెనక్కి తగ్గారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ సెక్రటరీ విశ్వనాథన్, కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఫహీమ్ ఖురేషీలు కలిసి రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, యూసుఫ్‌గుడా మాజీ కార్పొరేటర్ సంజయ్ గౌడ్‌ల నివాసాలకు వెళ్లారు. వారితో చర్చించి పరిస్థితిని వివరించారు. భవిష్యత్‌లో సముచిత ప్రాధాన్యం ఉంటుందని హామీ ఇచ్చారు.



అంజన్‌కుమార్ నివాసంలో మీనాక్షి, వివేక్, పొన్నం, విశ్వనాథన్, అనిల్‌కుమార్ యాదవ్

లోకల్, నాన్ లోకల్ సమస్యేంటి: అంజన్

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో లోకల్, నాన్ లోకల్ సమస్య ఎందుకు వచ్చిందని తన క్యాంప్ ఆఫీస్‌కు వచ్చిన కాంగ్రెస్ నేతలను మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ సూటిగా ప్రశ్నించారు. గతంలో కామారెడ్డి, మల్కాజ్‌గిరిలలో పోటీ చేసినప్పుడు ఇది గుర్తుకు రాలేదా అంటూ పరోక్షంగా సీఎం రేవంత్‌రెడ్డికి చురక అంటించారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి, పార్టీ కోసం పనిచేసింది తానని, ఉపఎన్నిక నేపథ్యంలో పార్టీ చర్యలతో మనస్తాపానికి గురయ్యానని, పార్టీ వెంట ఉన్న తనను ఇప్పుడు పక్కన పెడతారా అని ఆవేదన వ్యక్తం చేశారు.

నగరంలో కాంగ్రెస్‌కు పెద్దదిక్కు అంజన్న : పొన్నం

నగరంలో కాంగ్రెస్‌కు పెద్దదిక్కు మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో ఆయన పోటీ చేయాలని భావించారని.. నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా అధిష్టానం నవీన్‌కు టికెట్ కేటాయించిందన్నారు. కరోనా సమయంలో అంజన్‌కుమార్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్‌రావు. చిత్రంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

3 పేర్లతో బీజేపీ జూబ్లీహిల్స్ అభ్యర్థుల జాబితా

సాక్షి, హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు ముగ్గురి పేర్లతో బీజేపీ జాబితా ఖరారైంది. ఈ జాబితాను జాతీయ నాయకత్వానికి పంపించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు శనివారం ఢిల్లీ వెళ్లనున్నారు. ఆదివారం బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమై బిహార్ అసెంబ్లీ అభ్యర్థుల జాబితాతోపాటు జూబ్లీహిల్స్ ఇతర ఉప ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల పేర్లను ప్రకటించనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. శుక్రవారం జరిగిన రాష్ట్ర ఎన్నికల సమావేశంలో రాంచందర్‌రావుతోపాటు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్రపార్టీ ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ పాల్గొన్నారు. ఈ భేటీలో ఉపఎన్నిక బరిలో ఎవరిని దింపాలనే చర్చ సందర్భంగా లంకెల దీపక్‌రెడ్డి, జూటూరు కీర్తిరెడ్డి, వీరపనేని పద్మ పేర్లపై ఏకాభిప్రాయం కుదిరినట్టుగా తెలుస్తోంది. వీరితోపాటు బీసీ మహిళకు కూడా అవకాశం ఇవ్వదలిస్తే ఆకుల విజయ పేరును కూడా పరిగణనలోకి తీసుకోవాలనే అభిప్రాయం వెల్లడైనట్టు తెలిసింది. అయితే ఈ మేరకు నాలుగు పేర్లతో జాబితాను పంపించారా లేదా అన్నదానిపై స్పష్టత కొరవడింది. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్ రావు అధ్యక్షతన జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు సంబంధించి భాగ్యనగరంలోని 8 జిల్లాల ప్రధాన నాయకుల సమావేశంలో...ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహం, బూత్ స్థాయి సమన్వయం వంటి కీలక అంశాలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ ఉపఎన్నికలో పార్టీ అభ్యర్థిని గెలిపించి ప్రధాని మోదీకి గిఫ్ట్‌గా ఇవ్వాలని ఆయన కోరారు.

గురుకులాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్ : సంక్షేమ గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో భద్రతా వ్యవస్థను కట్టుదిట్టం చేయాలని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఆయన సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, గురుకుల కార్యదర్శులు కృష్ణ ఆదిత్య, షఫీయుల్లా, సీతాలక్ష్మి తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పలు సూచనలు చేశారు. హాస్టళ్ల ఆధునీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, గురుకులాలు, హాస్టళ్లలో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ హాజరు వ్యవస్థలు, డిజిటల్ మానిటరింగ్ మెకానిజం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని, హాస్టళ్లలో ఏ సమస్య వచ్చినా తక్షణమే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. వసతి గృహాలు పరిశుభ్రంగా ఉండాలని, పోషకాహారంతో కూడిన భోజనం, పరిశుభ్రమైన వంటగదులు, సురక్షితమైన తాగునీటి సదుపాయం కల్పించాలని అన్నారు. సంక్షేమ విద్యాసంస్థల్లో ఆహార నాణ్యత, సరఫరాపై అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని మంత్రి ఆదేశించారు.

గురుకుల సొసైటీలకు ప్రత్యేక నిధి

రూ.60 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో కీలక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధిని కేటాయించింది. ఇందులో భాగంగా రూ.60 కోట్లు విడుదల చేసింది. అత్యవసర సమయంలో ఈ నిధిని వినియోగించుకోవాలని ప్రభుత్వం సొసైటీలను ఆదేశించింది. ఇందులో భాగంగా బీసీ, ఎస్సీ గురుకుల సొసైటీలకు ఒక్కోదానికి రూ.20 కోట్ల చొప్పున రూ.40 కోట్లు విడుదల చేసింది. ఎస్టీ, మైనార్టీ గురుకుల సొసైటీలకు ఒక్కో సొసైటీకి రూ.10 కోట్ల చొప్పున రూ.20 కోట్లు విడుదల చేసింది. అద్దె, ఇతర వసతులకు వీటిని ఖర్చు చేయవచ్చని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.

క్రీడలు టీమ్ స్పిరిట్‌ను పెంపొందిస్తాయి

అటవీ సిబ్బంది జోనల్ క్రీడా పోటీలను ప్రారంభించిన పీసీసీఎఫ్ సువర్ణ

సాక్షి, హైదరాబాద్: క్రీడలు శారీరక, మానసిక దృఢత్వానికే కాకుండా, మనలో టీమ్ స్పిరిట్, సమన్వయం వంటి విలువలను పెంపొందిస్తాయని పీసీసీఎఫ్ సువర్ణ అన్నారు. అటవీ సిబ్బంది ఎప్పుడూ అడవుల్లో కష్టమైన పరిస్థితుల్లో పనిచేస్తుంటారని, అలాంటి వారికి శారీరక దృఢత్వం చాలా అవసరమని తెలిపారు. శుక్రవారం దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో రాష్ట్రవ్యాప్త అటవీ సిబ్బంది జోనల్ క్రీడా పోటీలను పీసీసీఎఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీలను అటవీ సిబ్బందిలో క్రీడాస్ఫూర్తిని పెంచి ఒకరిపట్ల మరొకరు పరస్పర అవగాహన, టీమ్ స్పిరిట్‌ను బలోపేతం చేసేలా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పోటీల్లో భాగంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, స్విమ్మింగ్‌తో పాటు ఇతర ఇండోర్ గేమ్స్ నిర్వహించారు.

రిటర్న్ ఫైలింగ్‌తో సమస్యల పరిష్కారం

ప్రిన్సిపల్ సీసీఐటీ దేబ్ జ్యోతి దాస్

సాక్షి, హైదరాబాద్: చారిటీలు, ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లు, మతపరమైన సొసైటీలు సకాలంలో పన్ను రిటర్న్‌లు ఫైల్ చేస్తే.. పన్ను మినహాయింపులకు సంబంధించిన సగం సమస్యలు సమసిపోతాయని ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్‌ట్యాక్స్ (మినహాయింపులు) దేబ్ జ్యోతి దాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ట్యాక్స్ బార్ అసోసియేషన్ సభ్యులు, వివిధ పన్ను మినహాయింపు సంస్థల ప్రతినిధులతో హైదరాబాద్‌లోని ఏసీ గార్డ్స్‌లోని ఇన్‌కమ్ ట్యాక్స్ టవర్స్ లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో న్యూఢిల్లీ నుంచి ప్రధాన ముఖ్య ఆదాయపు పన్ను కమిషనర్ (మినహాయింపులు) దేబ్ జ్యోతి దాస్ ప్రతినిధులతో చర్చించారు. రిటర్న్‌లు, ఆడిట్ నివేదికలు, రిజిస్ట్రేషన్ ఫాంల దాఖలులో ఎదురవుతున్న సమస్యలను ట్యాక్స్ బార్, ట్రస్టీల ప్రతినిధులు దేబ్‌జ్యోతి దాస్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. అన్ని పక్షాలు నిర్దేశిత గడువులను కచ్చితంగా పాటించాలని సూచించారు. సమావేశంలో ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ వేముల, సలహాదారు రామ్‌దేవ్ భూటాడ, కార్యదర్శి ఆశిష్ జోషి, శ్రీశైలం దేవస్థానం ట్రస్టీ దేవరాజ్ రెడ్డి, ఐటీ కమిషనర్ (మినహాయింపులు) బి.బాలకృష్ణ, అడిషనల్ కమిషనర్ ఆఫ్ ఐటీ (మినహాయింపులు) సుమిత పరమట, పాల్గొన్నారు.

వానలతో రోడ్లకు రూ.1,278 కోట్ల నష్టం

- 1,100 ప్రాంతాల్లో 1,400 కి.మీ మేర దెబ్బతిన్న రహదారులు
- కేంద్ర బృందాలకు వివరించిన రాష్ట్ర అధికారులు



సాక్షి, హైదరాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెలంగాణలో రాష్ట్ర రహదారులకు జరిగిన నష్టాన్ని కేంద్ర బృందాలు పరిశీలించాయి. ఢిల్లీ నుంచి వచ్చిన నాలుగు బృందాలు మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, జగిత్యాల, వికారాబాద్, సిద్దిపేట, సంగారెడ్డి.. తదితర ప్రాంతాల్లో పర్యటించాయి. 1,100 ప్రాంతాల్లో 1,400 కి.మీ. మేర రోడ్లు దెబ్బతిన్నట్టు రాష్ట్ర అధికారులు వారికి వివరించారు. వీటి తాత్కాలిక మరమ్మతులకు రూ.75 కోట్లు ఖర్చు చేశామని, వాటికి శాశ్వత ప్రాతిపదికన మరమ్మతు చేయటానికి రూ.1,278 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేసినట్టు తెలిపారు. అయితే కేంద్ర ప్రభుత్వం నిబంధనలను అనుసరించి రూపొందించిన ఈ అంచనా కంటే రాష్ట్ర ప్రభుత్వ అంచనా మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు చేసి పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు రూ.2,400 కోట్ల వరకు ఖర్చవుతుందని అంటున్నారు.

గత ఏడాది నయా పైసా రాలే..

గత ఏడాది భారీ వర్షాలకు జరిగిన నష్టం రూ.2,300 కోట్లుగా అంచనా వేశారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వ బృందాలు రాష్ట్రంలో పర్యటించి నష్టాన్ని పరిశీలించి వెళ్లినా, కేంద్రం నుంచి నయా పైసా సాయం అందలేదని అధికారులు పేర్కొంటున్నారు. అప్పుడు పునరుద్ధరణ వ్యయం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి వచ్చిందని, ఈసారైనా వీలైనన్ని ఎక్కువ నిధులు అందజేయాలని అధికారులు కోరుతున్నారు. ఈ మేరకు రెండురోజుల్లో పూర్తిస్థాయి నివేదికను ఢిల్లీకి పంపనున్నారు. ఇక జాతీయ రహదారులకు రూ.25 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్టు ఆ విభాగం అధికారులు అంచనా వేశారు. తాత్కాలిక మరమ్మతులకు రూ.4.8 కోట్లు ఖర్చు కాగా, రోడ్ల నిర్వహణ బాధ్యత ఉన్న కాంట్రాక్టర్లే ఆ మొత్తాన్ని భరించటంతో ప్రభుత్వంపై ఆ భారం లేకుండా పోయింది.

అమ్మా.. క్షమించు

- నా మీద పగ...నా భార్య పిల్లలపై చూపించకు
- తల్లిని కొట్టిన వీడియో వైరల్ కావడంతో బీజేపీ నేత ఆత్మహత్య



రెవెల్లి రాజు (ఫైల్)

బీబీనగర్/ఉప్పల్: 'అమ్మా..తప్పని పరిస్థితుల్లో నిన్ను కొట్టాను. నన్ను క్షమించు.. చేతులెత్తి నమస్కరిస్తున్న నాపై పగబట్టినట్టు నా భార్య పిల్లలపై పగబట్టకు' అని ఓ కుమారుడు సెల్ఫీ వీడియో తీసి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని ఉప్పల్ విజయపురికాలనీకి చెందిన బీజేపీ నేత రెవెల్లి రాజు(40) ఈ నెల 9న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా, శుక్రవారం బీబీనగర్ పెద్దచెరువులో మృతదేహం తేలి ఉండటంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడు రాజుగా గుర్తించారు.

అవమానాన్ని భరించలేక..

ఇటీవల జరిగిన గొడవల కారణంగా రాజు తన తల్లిపై చేయి చేసుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో కుటుంబ సభ్యుల్లో ఒకరు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. రాజకీయంగా, సమాజంలో పలుకుబడి ఉన్న రాజు అది చూసి తట్టుకోలేకపోయాడు. తన పరువు పోయిందని మానసికంగా కుమిలిపోయి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్య చేసుకునే ముందు సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. 'అమ్మా నన్ను క్షమించు. తప్పని పరిస్థితుల్లో నిన్ను కొట్టాను. సమాజమంతా నన్ను చిన్నచూపు చూస్తోంది. అమ్మా నువ్వు నన్ను మోసం చేస్తావని ఊహించలేదు. నిన్ను కొట్టినప్పుడు ఎవరు వీడియో తీశారో నీకు, తమ్ముడికి తెలుసు. దీంతో నేను చచ్చే పరిస్థితి వచ్చింది. అమ్మ నామీద పగబట్టినట్టు నా భార్య, పిల్లలపై పగపట్టకు. చేతులెత్తి మొక్కుతున్నా. నిన్ను కొట్టి చనిపోతున్నా. పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషులు నా కుటుంబ సభ్యులకు అండగా ఉండాలని కోరుకుంటున్నా' అని రాజు వీడియోలో మాట్లాడిన మాటలు వైరల్ అయ్యాయి.

బీజేపీ మండల అధ్యక్షుడి ఆత్మహత్య

కాంగ్రెస్ నాయకుల వేధింపులే కారణమని మృతుని వద్ద సూసైడ్ నోట్ లభ్యం



మధుకర్ (ఫైల్)

వేమనపల్లి: మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం నీల్వాయి కొత్తగూడెం గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ (47) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాంగ్రెస్ పార్టీ నాయకుల తప్పుడు కేసులే తన మృతికి కారణమంటూ మృతుడి వద్ద సూసైడ్ నోట్ లభించింది. స్థానికుల కథనం ప్రకారం.. ఐదు రోజుల క్రితం గ్రామంలో కాంగ్రెస్, బీజేపీ వర్గాల మధ్య గొడవ జరిగింది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు మధుకర్‌తోపాటు రెండు పార్టీల కార్యకర్తలపై కేసు నమోదు చేశారు. అయితే రాజకీయ ఒత్తిళ్లతోనే తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారని మధుకర్ మనస్తాపం చెందాడు. శుక్రవారం ఉదయం చెన్నూర్‌కు వెళ్తున్నానని ఇంట్లో భార్యకు చెప్పి మోటార్‌సైకిల్‌పై బయటకు వెళ్లాడు. అనంతరం గ్రామ సమీపంలోని చెన్నూర్–నీల్వాయి రహదారి పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. కాగా, తనను రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ పార్టీ నాయకులు తనపై తప్పుడు కేసు పెట్టించారని మధుకర్ జేబులో సూసైడ్ నోట్ లభించింది. మధుకర్ మృతి విషయం తెలుసుకున్న అతని కుటుంబ సభ్యులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, ఇతర నాయకులు సంఘటన స్థలం వద్ద రోడ్డుపై ధర్నా చేశారు. బాధ్యులపై కేసులు నమోదు చేసే వరకు మృతదేహాన్ని అక్కడినుంచి తీసుకెళ్లనీయమని రాత్రి వరకు అక్కడే బైఠాయించారు. మధుకర్ ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి, మంచిర్యాల ఏసీపీలు రవికుమార్, ప్రకాశ్ బీజేపీ నాయకులు, కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

తండ్రి మందలించాడని కుమారుడి బలవన్మరణం



చరణ్ (ఫైల్)

దంతాలపల్లి: దసరా సెలవులు ముగియడంతో తిరిగి పాఠశాలకు వెళ్లాలని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ బాలుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం వాల్యతండాలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రాజు కథనం ప్రకారం.. తండాకు చెందిన బానోతు నాగు, పద్మల కుమారుడు చరణ్ (12) నర్సింహులపేట మండలం పెద్దనాగారం గ్రామంలోని ఓ ప్రైవేట్ రెసిడెన్షియల్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. దసరా పండుగ సెలవులకు ఇంటికి వచ్చాడు. సెలవులు ముగియడంతో గత బుధవారం పాఠశాలకు వెళ్లాలని తండ్రి నాగు, కుమారుడు చరణ్‌కు చెప్పారు. అందుకు చరణ్ నిరాకరించడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన చరణ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స కోసం బాలుడిని తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో చరణ్ గురువారం రాత్రి మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు శుక్రవారం తెలిపారు.

తల్లిని గెంటేసి.. ఇంటికి తాళం

ఆస్తి కోసం కన్నకొడుకు దురాగతం



తాళం వేసిన ఇంటి ముందు నిద్రిస్తున్న బాధితురాలు ఇందిరమ్మ

నాగర్‌కర్నూల్ క్రైం: ఆస్తి కోసం కన్నతల్లిని ఇంటి నుంచి వెళ్లగొట్టి తాళం వేశాడొక కొడుకు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన ఈ సంఘటనపై బాధితురాలి కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సాదత్ స్ట్రీట్‌కు చెందిన ఇందిరమ్మ భర్త శ్రీనివాసాచారి 15 ఏళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో ఇందిరమ్మ తన భర్తకు చెందిన ఇంట్లోనే నివసిస్తోంది. ఆమె కుమారుడు చైతన్య తల్లి బాగోగులు చూసుకోకుండా వేరుగా నివాసం ఉంటున్నాడు. అయితే 14 నెలలుగా తల్లి నివసిస్తున్న ఇంటిని విక్రయించాలని వేధిస్తున్నాడు. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం తల్లిని బయటికి గెంటేసి తాళం వేశాడు. ఇంటి ముందు నిస్సహాయ స్థితిలో గుర్తించిన ఆమెను స్థానికులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. కుమారుడు పట్టించుకోకపోవడంతో రూ.5 భోజనంతో కాలం వెళ్లదీస్తూ.. తాళం వేసిన ఇంటి ముందే నిద్రిస్తున్నానని బాధితురాలు వాపోయింది. గతంలోనే న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా.. కుల పెద్దల వద్ద పంచాయితీ పెట్టినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించింది. ఈ విషయమై ఎస్ఐ గోవర్ధన్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. ఇందిరమ్మతోపాటు అతని కుమారుడిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామని, బాధితురాలికి న్యాయం చేస్తామని తెలిపారు.

రూ. 5 లక్షలు దహనం.. ఆత్మహత్య

మతిస్థిమితం లేని మహిళ అఘాయిత్యం

సిద్దిపేట కమాన్: మతిస్థిమితం లేని ఒక మహిళ రూ.5 లక్షలు దహనం చేసి ఆత్మహత్యకు పాల్పడింది. సిద్దిపేట టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. నర్సాపూర్‌కు చెందిన యాపరాల లావణ్య (24)కు మానసిక స్థితి సరిగ్గా లేక ఇంట్లో ఉన్న రూ.5 లక్షలు తగులబెట్టి.. భయంతో గురువారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది.

నూరేళ్లయినా.. కళర్‌ఫుల్



ముంబైకి చెందిన నటి, అక్రిలిక్ కళాకారిణి నళిని మెహతా సృజనాత్మకతకు, సంతోషానికి వయస్సు అడ్డంకి కాదని నిరూపిస్తున్నారు. ఆమె సృజనాత్మక ప్రయాణం దాదాపు ఎనిమిది దశాబ్దాల క్రితం 1946లో యునైటెడ్ స్టేట్స్‌లో యాక్రిలిక్ కార్వింగ్ క్రాఫ్ట్ నేర్చుకోవడంతో ప్రారంభమైంది. అప్పటి నుండి, ఆమె బాటిక్, పెయింటింగ్, శిల్పకళతో సహా అనేక కళా రూపాలలో ప్రావీణ్యం సంపాదించి భారతదేశంలోని బహుముఖ ప్రజ్ఞాశాలురలలో ఒకరిగా దేశమంతా తనను తాను తీర్చిదిద్దుకున్నారు.

కొంతమంది అరవై దాటేసరికి వయసు మీదపడిపోయిందన్న ఫీలింగ్‌తో ముక్కుతూ మూలుగుతూ ఉంటే ఇంకొంతమంది మాత్రం ఎంత వయసొచ్చినా యంగ్‌గా.. ఉత్సాహం, ఉల్లాసం ఉరకలు వేస్తున్నట్లుంటారు. జాతీయ పురస్కార గ్రహీత యాక్రిలిక్ కార్వింగ్ కళాకారిణి నళిని మెహతా రెండో కోవకు చెందుతారు. విశేషం ఏమిటంటే ఆమె వయసు అక్షరాలా వంద. అయితేనేం మరింత ఉత్సాహంగా తన అభిరుచులను కొనసాగిస్తూ పరిపూర్ణమైన జీవితాన్ని కొనసాగిస్తున్నారు. మరో మహిళ రూత్ వందేళ్లు దాటాయన్న విషయాన్ని కూడా పక్కన పెట్టేసి వారంలో మూడు రోజుల పాటు ఎంతో హుషారుగా జిమ్‌లో వర్కవుట్స్ చేసేస్తూ యూత్‌లో ఉత్సాహాన్ని రగిలిస్తున్నారు.

వందేళ్ల ఉల్లాసం

ఈ ఏడాది జూలైలో ఆమె తన 100వ పుట్టిన రోజున తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో తన దినచర్యను పంచుకుంటూ, ఇలా వెల్లడించింది, 'నేను సాధారణంగా 6 గంటలకు లేస్తాను, తర్వాత అందరం కలిసి టీ, అల్పాహారం తీసుకుంటాము. ఆ తర్వాత నేను నా గదికి వస్తాను, ఆపై నేను ఏదైనా చదువుతూనో, రాస్తూనో గడుపుతాను. అగాథా క్రిస్టీ, పెర్రీ మాసన్ వంటి డిటెక్టివ్ కథలు ఎక్కువ ఇష్టం. కుట్టుపని, వంట, ఎంబ్రాయిడరీ అన్నీ ఇష్టంగా చేస్తాను. వాటితోపాటు పెయింటింగ్ కూడా చేస్తాను. శిల్పం కూడా చేస్తాను. అంటే, నేను ఎప్పుడూ ఏదో ఒకటి



చేస్తూనే ఉంటాను. ఎందుకంటే నేను పని చేయడాన్ని ముఖ్యంగా కళారాధనను ఇష్టపడతాను. బహుశా అవే నన్ను యంగ్‌గా ఉండేలా చేస్తున్నాయి'' అని పేర్కొన్నారు. అది చూసి నెటిజనులు ఆమెపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

యూజర్ ఇలా వ్యాఖ్యానించారు, ''60 ఏళ్లొచ్చేసరికే ఇక నేను చేయడానికి ఏం లేదు, నా శరీరంలో శక్తి అంతా అయిపోయింది అని భావించే నా లాంటి మహిళలకు ఆమె ఎంతో ఆదర్శం!'' అని అంటే మరొకరు ''వంద ఏళ్లొచ్చినా మీ చేతులు వణకకుండా ఇంకా దృఢంగా ఉన్నాయంటే అది మీ చేతల వల్లే కావచ్చు. భగవంతుడు మీకు మరింత శక్తిని ఇవ్వాలని కోరుకుంటున్నాను అమ్మమ్మా!'' అని వ్యాఖ్యానించారు. ఇంకొక యూజర్ 'ఆమెకు 100 ఏళ్లు అంటే నమ్మలేకపోతున్నాను! నాకు ఈరోజు 21 ఏళ్లు నిండాయి, నేను కూడా ఇంత యాక్టివ్‌గా లేను!' అని రాశారు.

మొత్తం మీద ఆమె సెంచరీ దాటటంతోపాటు తన చేతల ద్వారా కళలో కూడా హిట్ కొట్టారు.

వందలోనూ వండర్స్

100 ఏళ్ల మహిళ జిమ్ వర్కౌట్స్ చేసే వీడియో వైరల్ అయ్యింది. ఇంత వయసులోనూ ఆమె అంత యాక్టివ్‌గా వర్కవుట్స్ చేయడం చూసిన నెటిజనులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



ఆరోగ్య విషయాలపై దృష్టి సారించే ఇన్‌స్టాగ్రామ్ పేజ్ ఎవ్రీడే క్లబ్ శతాధికురాలైన రూత్ లెమే వ్యాయామం చేస్తున్న వీడియోను షేర్ చేయడంతో ఆమె సోషల్ మీడియాలో స్టార్ అయ్యారు. ఆమె తన దినచర్యను వివరించే క్లిప్‌కు దాదాపు 600,000కు పైగా లైక్‌లు వచ్చాయి.


100 ఏళ్ల వయసులోనూ ఆమె వారానికి మూడు సార్లు జిమ్‌లో గడుపుతుంది. గంటసేపు స్టేషనరీ బైక్ నడుపుతుంది. ఆపై ట్రాక్‌పై మైలు కంటే ఎక్కువ దూరం నడుస్తుంది. అంతేకాదు, ఆమె తన ఇంట్లో తానే స్వయంగా వండుకుని తినడాన్ని ఇష్టపడుతుందని 78 ఏళ్ల ఆమె కుమార్తె పార్కర్ చెప్పారు.

సెంటెనరీ మెనూలో అరటిపండు, పాలతో కొవ్వు లేని పెరుగు, వాల్‌నట్‌లు, ఓట్‌మీల్ లేదా టోస్ట్‌తో గిలకొట్టిన గుడ్లు ఉంటాయి. ఆమె ప్రొటీన్ సాధారణంగా చికెన్, టర్కీ లేదా సీఫుడ్ ఎర్ర ద్రాక్ష, బ్లూబెర్రీస్ వంటి పండ్లు స్ట్రింగ్ బీన్స్, కార్న్ ఆన్ ది కాబ్, క్యాబేజీ, పిక్లింగ్ బీట్‌రూట్‌లు, టమోటా, లెట్యూస్, స్క్వాష్, ఉల్లిపాయలతో సహా కూరగాయలతో కూడి ఉంటుంది.

"నాకు కూరగాయలు చాలా ఇష్టం. నేను పల్లెటూరిలో పెరిగాను. మా నాన్న అన్ని రకాల కూరగాయలను పండించాడు. ఎరువులు వేయకుండా స్వాభావికంగా పెంచిన ఆ పంటను తినడం కూడా నా ఆరోగ్య రహస్యాలలో ఒకటి అని లెమే చెప్పింది.

● యోగా

రన్నర్లకు దన్ను



పరుగెత్తడం వల్ల కేలరీలు ఖర్చవుతాయి. శక్తి పెరుగుతుంది. గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. రన్నర్‌గా శక్తి పెరగాలంటే కాళ్లు బలంగా ఉండాలి. కీళ్ల కదలికలు ఫ్లెక్సిబుల్‌గా ఉండాలి. శ్వాస, మానసిక ఏకాగ్రత బాగుండాలి. అందుకు శరీరానికి సరైన యోగా సాధన, సమతుల్యత అవసరం. రోజూ కొన్ని యోగాసనాలను సాధన చేయడం వల్ల రన్నర్స్‌లో ఓర్పు, శక్తి పెరుగుతుంది. గాయాల ప్రమాదం తగ్గుతుంది. అలాంటి యోగాసనాలలో...

లో ట్రీ పోజ్

ఈ ఆసనం హిప్ భాగాన్ని సాగదీస్తుంది. నడుము కింది దిగువ శరీరాన్ని బలంగా మారుస్తుంది. దీని వల్ల రన్నింగ్‌లో శక్తికి సహాయపడుతుంది.

- ముందు నిటారుగా నిల్చొని, ఎడమ మోకాలిని నేలపైన, కుడి పాదాన్ని ముందుకు ఉంచాలి.
- చేతులను పైకి ఎత్తేటప్పుడు హిప్ భాగాన్ని కిందికి నొక్కి పట్టినట్టుగా ఉంచాలి.

కోబ్రాపోజ్

ఈ ఆసనం పొట్ట భాగాన్ని ఫిట్‌గా మారుస్తుంది. శరీరం స్ట్రెచ్ అయ్యి చేతులు, భుజాలు శక్తిని పుంజుకుంటాయి.

- కోబ్రా భంగిమలో ఉండే ఈ ఆసనంలో మ్యాట్ పైన కాళ్లు చాచి, పొట్టపైన పడుకోవాలి.
- భుజాల కింద అరచేతులను ఉంచి, మ్యాట్‌ను నొక్కుతూ మోచేతులను శరీరానికి దగ్గరగా ఉంచి, తలను నెమ్మదిగా ఎత్తాలి. తర్వాత 5 దీర్ఘ శ్వాసలు తీసుకొని, వదిలి, తిరిగి యథా స్థితికి రావాలి.

చెయిర్ పోజ్

ఇది తొడలు, కోర్ బలాన్ని పెంచుతుంది. అదే సమయంలో దీర్ఘకాలిక పరుగులకు అవసరమైన సమతుల్యతను, శక్తిని ఇస్తుంది.

- పాదాలు, తుంటి వెడల్పుతో నిటారుగా నిలబడాలి.
- దీర్ఘ శ్వాస తీసుకుంటూ చేతులను పైకి ఎత్తాలి, అరచేతులు ఒకదానికొకటి ఎదురుగా ఉంచాలి.
- కంటికి కనిపించని కుర్చీలో కూర్చున్నట్లుగా మోకాళ్లను వంచాలి.
- వెన్నును నిటారుగా, తొడలను స్థిరంగా ఉంచాలి.

● మెనోపాజ్

స్త్రీలకు సోయా సాయం

మహిళల్లో మెనోపాజ్ మూలంగా తలెత్తే సమస్యలను తగ్గించేందుకు సోయా సహాయపడుతుందని కొన్ని పరిశోధనలు వెల్లడించాయి. సోయాలో ఐసోఫ్లేవోన్స్ అనే మొక్కల ఆధారిత ఈస్ట్రోజెన్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఈస్ట్రోజెన్ ప్రభావాలను పెంపొందించగలవు. అయితే కొన్ని పరిశోధనలు మాత్రం సోయాకూ, మెనోపాజ్ సమస్యల పరిష్కారానికి ఏం సంబంధం లేదని చెబుతున్నాయి. ఏమైనా, విటమిన్ సప్లిమెంట్ల కంటే టోఫు వంటి సోయా ఆహారాలను తినడం ఉత్తమం అని న్యూట్రిషియనిస్టులు చెబుతున్నారు. ఎందుకంటే సోయాలో ఫైటోఈస్ట్రోజెన్లు, ఐసోఫ్లేవోన్లు పుష్కలంగా ఉంటాయి కాబట్టి యాభై ఏళ్లు దాటిన మహిళలు వీటిని తీసుకోవడం వల్ల వారి శరీరంలో వచ్చే వేడి ఆవిర్లను తగ్గించడానికి దోహద పడుతుందని చెబుతున్నారు.



స్త్రీలలో ఇందుకేనా ఈ కుంగుబాటు!

పురుషుల కంటే స్త్రీలలో డిప్రెషన్ జన్యువులు రెండింతలు ఉంటాయని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ఎందుకంటే పురుషులతో పోల్చితే స్త్రీలలో జన్యుపరంగా క్లినికల్ డిప్రెషన్ ప్రమాదం ఎక్కువగా ఉండటమే అందుకు కారణమని ఆస్ట్రేలియన్ పరిశోధకులు ఇటీవల ప్రచురించిన ఒక అధ్యయనంలో పేర్కొన్నారు.

శాస్త్రవేత్తలు, డిప్రెషన్ ఉన్న దాదాపు రెండు లక్షల మంది వ్యక్తుల డీఎన్ఎ ద్వారా ఉమ్మడి జన్యు భేదాలను గుర్తించడానికి పరిశీలించారు. ఆస్ట్రేలియాకు చెందిన బెర్గోఫర్ మెడికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నేతృత్వంలోని ప్రాజెక్ట్ సభ్యులైన జోడి థామస్ ''పురుషుల కంటే స్త్రీలలో డిప్రెషన్‌తో సంబంధం ఉన్న జన్యు చిహ్నాలు దాదాపు రెండింతలు ఎక్కువగా ఉన్నాయి. సంబంధిత పెరిమెనోపాజ్ మూలాన మానసిక ఆరోగ్య ప్రమాదాలు మొదటిసారిగా గుర్తించబడ్డాయి. పురుషులు, స్త్రీలలో ఉమ్మడిగా ఉన్న, ప్రత్యేకమైన



జన్యుపరమైన కారకాలను అన్‌ప్యాక్ చేయడం ద్వారా డిప్రెషన్‌కు కారణమయ్యే వాటి గురించి మనకు స్పష్టత వస్తుంది అని థామస్ చెబుతున్నారు. పురుషులలో 7,000 మార్కర్లతో పోలిస్తే, దాదాపు 13,000 జన్యు మార్కర్లు మహిళల్లో డిప్రెషన్‌తో ముడిపడి ఉన్నాయని పరిశోధకులు కనుగొన్నారు.

ఈ జన్యు మార్పులలో కొన్ని జీవక్రియ లేదా హార్మోన్ ఉత్పత్తికి సంబంధించిన జీవ మార్గాలను మార్చగలవు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 300 మిలియన్లకు పైగా ప్రజలు డిప్రెషన్‌తో బాధపడుతున్నట్లు పీర్-రివ్యూడ్ జర్నల్ నేచర్ కమ్యూనికేషన్స్ పేర్కొంటోంది.

సాక్షి సినిమా

అందుకే నేను సినిమాల్లోకెళ్లినా...



● కయాదు, విశ్వక్ సేన్

'చిన్నప్పుడు అమ్మ చెప్పిన మాటలు వినలేదురా మనం' అనే డైలాగ్‌తో 'ఫంకీ' మూవీ టీజర్ ఆరంభమైంది. విశ్వక్ సేన్, కయాదు లోహర్ జోడీగా 'జాతి రత్నాలు' మూవీ ఫేమ్ అనుదీప్ కేవీ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఫంకీ'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ని శుక్రవారం విడుదల చేశారు. 'నేను ఈ రోజు ఇంత పెద్ద డైరెక్టర్ అవడానికి కారణం ఈ స్కూల్‌లో చదువుకోవడమే. ఈ స్కూల్‌లో చదువుకున్నాను కాబట్టే నాకు చదువంటే విరక్తి పుట్టింది... అందుకే నేను సినిమాల్లోకెళ్లినా...' (విశ్వక్ సేన్), 'అవున్రా... సినిమాలో మా తాత ఫొటో పెడితే తీసేశావంట ఎందుకు?' (కయాదు లోహర్), 'అంటే మీ తాతని చూస్తే కొంచెం చీప్ లుక్ వస్తోందని' (విశ్వక్ సేన్)... వంటి పలు డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ''ఫంకీ' చిత్రం ద్వారా తనదైన శైలిలో 'జాతి రత్నాలు' చిత్రానికి మించిన రెట్టింపు వినోదాన్ని అందించబోతున్నారు అనుదీప్. ఈ సినిమాలో విశ్వక్ సేన్ దర్శకుడి పాత్రను పోషిస్తున్నారు'' అని చిత్రబృందం పేర్కొంది.

స్పెయిన్ టు ఫ్రాన్స్



● రవితేజ

స్పెయిన్‌లో వెంట వెంటనే లొకేషన్స్ షిఫ్ట్ అవుతున్నారు హీరో రవితేజ. ఆయన కెరీర్‌లోని 76వ సినిమా చిత్రీకరణ ఇటీవల స్పెయిన్‌లో ప్రారంభమైన సంగతి తెలిసిందే. స్పెయిన్‌లోని వాలెన్షియా, సమీప దీవుల్లో ఈ సినిమా చిత్రీకరణ జరిగింది. ఈ సినిమా మరో షూటింగ్ షెడ్యూల్ శుక్రవారం ప్రారంభమైనట్లు యూనిట్ పేర్కొంది. జెనీవా, ఫ్రాన్స్ లొకేషన్స్‌లో కూడా కీలక సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశామని మేకర్స్ తెలిపారు. మొత్తం ఈ 25 రోజుల ఫారిన్ షెడ్యూల్‌లో కీలకమైన టాకీ పార్టుతో పాటు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో రెండు పాటలను కూడా చిత్రీకరించనున్నారు. కిశోర్ తిరుమల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాను వచ్చే సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

మహిళలకూ 8 గంటల పని వెసులుబాటు కల్పించాలి

- దీపికా పదుకోన్



భారతీయ సినీ పరిశ్రమలో పని గంటల విషయంలో హీరోయిన్స్‌పై వివక్ష ఉందని హీరోయిన్ దీపికా పదుకోన్ పేర్కొన్నారు. మేల్ సూపర్ స్టార్స్ 8 గంటలే పని చేస్తున్నారని, హీరోయిన్స్‌కు కూడా ఈ వెసులుబాటు కల్పించాలని దీపిక వ్యాఖ్యానించారు. దీపికా పదుకోన్ ప్రారంభించిన 'ది ఎల్ఎల్ఎల్' (లివ్ లవ్ లాఫ్) ఫౌండేషన్‌కు పదేళ్లు పూర్తయ్యాయి. అలాగే అక్టోబరు 10న వరల్డ్ మెంటల్ హెల్త్ డే. ఈ సందర్భంగా జాతీయ మీడియాతో దీపికా పదుకోన్ ఫిల్మ్ ఇండస్ట్రీ గురించి మాట్లాడిన విషయాలు చర్చనీయాంశమయ్యాయి. ఈ ఇంటర్వ్యూలో చిత్రపరిశ్రమలో మహిళలు ఎనిమిది గంటలు మాత్రమే పని చేసే వెసులుబాటు కల్పించాలనే అంశం గురించి దీపికా పదుకోన్ మాట్లాడుతూ– ''నేను మహిళను కాబట్టి ఏదో ఒత్తిడితో మాట్లాడుతున్నానని లేదా నాది దూకుడు స్వభావం అని... ఇలా నా గురించి ఎలా అనుకున్నా ఫర్వాలేదు. కానీ నిజం ఏంటంటే... భారతీయ చిత్ర పరిశ్రమలో ఎన్నో సంవత్సరాలుగా మేల్ సూపర్ స్టార్స్ 8 గంటలే పని చేస్తున్నారు. అయితే హెడ్‌లైన్స్‌గా ఎప్పుడూ వార్తల్లో నిలవలేదు. చాలా మంది సూపర్ స్టార్స్ వారాంతాల్లో పని చేయరు. సోమవారం నుంచి శుక్రవారం వరకు 8 గంటలే పని చేస్తారు. ఇండస్ట్రీలో మహిళలకు ఇలా ఎందుకు లేదో నాకు తెలియదు. 8 గంటలే పని చేస్తున్న వాళ్ల పేర్లు చెబితే మొత్తం విషయం మరోవైపునకు మళ్లుతుంది. అందుకే వాళ్ల పేర్లు ప్రస్తావించాలనుకోవడం లేదు. అలాగే ఇటీవల తల్లులైన కొందరు నటీమణులు 8 గంటలే పని చేస్తున్నారు. ఆశ్చర్యకరంగా ఈ అంశం కూడా ఎక్కడా వార్తల్లో హెడ్‌లైన్స్‌గా రావడం లేదు. ఇండస్ట్రీలో మహిళలపై వివక్ష తగ్గేలా మార్పులు రావాలి'' అని పేర్కొన్నారు. ఇంకా చెబుతూ – ''నాకు నిశ్శబ్ద యుద్ధం చేయడం మాత్రమే తెలుసు. ఎన్నో పోరాటాలను నిశ్శబ్దంగా ఎదుర్కొన్నా. అలా చేస్తేనే గౌరవంగా, హుందాగా ఉంటుంది. కానీ కొన్ని కారణాల వల్ల అవి బహిర్గతమవుతుంటాయి'' అని చెప్పుకొచ్చారు దీపిక. గత ఏడాది సెప్టెంబరు 8న దీపిక ఓ పాపకు జన్మనిచ్చారు. తల్లిగా తన బాధ్యతలు నిర్వర్తించాలనుకునే క్రమంలో ఆమె '8 గంటలు' మాత్రమే పని చేయాలనే నిర్ణయం తీసుకుని ఉంటారని ఊహించవచ్చు. దీపిక '8 గంటల' నిర్ణయాన్ని సమర్థిస్తున్నవారూ... వ్యతిరేకిస్తున్నవారూ ఉన్నారు. అయితే ఎవరేం అనుకున్నా, తానేం ఫీల్ కానని అంటున్నారు దీపిక. దానికి కారణం తన తండ్రి ప్రకాశ్ పదుకోన్ అంటున్నారు. ప్రకాశ్ బ్యాడ్మింటన్ ప్లేయర్ అనే సంగతి తెలిసిందే. అథ్లెటిక్ నేపథ్యం కావడంతో ఏ విషయాన్నయినా పెద్దగా మనసుకి తీసుకోకుండా తేలికగా తీసుకునే అలవాటైందని దీపిక పేర్కొన్నారు. ఇక ఈ ఎయిట్ అవర్స్ వర్కింగ్ విధానం, పారితోషికం, తన సిబ్బంది ఖర్చులు... వంటి విషయాల వల్లే తెలుగు చిత్రాలు 'కల్కి 2, స్పిరిట్' దీపిక చేజారాయనే ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. మరోవైపు షారుక్ ఖాన్, అల్లు అర్జున్ సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తూ ఆమె బిజీగా ఉన్నారు.

తొలి మెంటల్ హెల్త్ అంబాసిడర్‌గా...

దీపికా పదుకోన్ 'మెంటల్ హెల్త్ అంబాసిడర్'గా నియమితులయ్యారు. ''భారత కేంద్ర ఆరోగ్య–కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు తొలి మెంటల్ హెల్త్ అంబాసిడర్‌గా సేవ చేసే అవకాశం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆరోగ్య–కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డాగార్ల నేతృత్వంలో పని చేసేందుకు ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నా'' అని దీపికా పదుకోన్ పేర్కొన్నారు.

నా డైరెక్షన్‌లోనే ఆ బయోపిక్ ఉంటుంది

- శరత్‌కుమార్



''ప్రస్తుతం షూటింగ్ సమయంలో షాట్ ఓకే అయిన తర్వాత నటీనటులు వెళ్లి తాము ఎలా చేశామో అని మానిటర్‌లో చూస్తుంటారు. ప్రతిసారీ వెళ్లి మానిటర్ చూడటం వల్ల సమయం వృథా అని నా భావన. మానిటర్ చూడటం డైరెక్టర్ పని. ఆయనకి సన్నివేశం బాగా వచ్చిందంటే ఓకే.. లేకుంటే మరో టేక్ చెబుతారు'' అని శరత్ కుమార్ తెలిపారు. ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు జంటగా నటించిన చిత్రం 'డ్యూడ్'. కీర్తీశ్వరన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సినిమాలో కీలక పాత్ర చేసిన శరత్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ–''నేనెప్పుడూ కథలో ముఖ్య భాగమయ్యే పాత్రలు చేయడానికే ఇష్టపడతాను. డైరెక్టర్ కీర్తీశ్వరన్ 'డ్యూడ్' కథ చెప్పినప్పుడు ప్రదీప్‌కి మావయ్య పాత్ర అన్నారు. నా పాత్ర కథలో చాలా కీలకం. ఒక కుటుంబంలో ఇలాంటి ఓ ఘటన జరిగితే సమాజం ఎలా స్పందిస్తుంది? అనే కోణంలో 'డ్యూడ్'ని డైరెక్టర్ చాలా అద్భుతంగా చూపించారు. వినోదం, భావోద్వేగాలు కొత్తగా ఉంటాయి. నా పాత్రలో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. సెట్స్‌లో ఉన్నప్పుడు సీనియర్‌ని అనే ఆలోచనతో కాకుండా నేను కేవలం శరత్ కుమార్ అనే ఆలోచనతో ఉంటాను. ఇంట్లో నేను, రాధిక, వరలక్ష్మి సినిమాల గురించి మాట్లాడుతుంటాం. వరలక్ష్మి ఇప్పుడు డైరెక్టర్ అవుతోంది. తన కథని రెండు మూడు రోజుల్లో వింటాను. ఇన్నేళ్ల కెరీర్‌లో ఎన్నో పాత్రలు చేశాను. అయితే సుభాష్ చంద్రబోస్‌గారి బయోపిక్ చేయాలని ఉంది. ఈ సినిమాకి నేనే దర్శకత్వం వహిస్తాను. ప్రస్తుతం 'మిస్టర్ ఎక్స్' సినిమా చేస్తున్నాను. బాలీవుడ్‌లో ఓ మూవీ, గౌతమ్ మీనన్‌తో ఒక సినిమా చేస్తున్నాను'' అని చెప్పారు.

ఓటీటీలో హృతిక్ స్టార్మ్



● హృతిక్ రోషన్

ఓటీటీలో హృతిక్ రోషన్ 'స్టార్మ్' మొదలైంది. పార్వతి తిరువోత్తు, అలియా .ఎఫ్, శ్రిష్టి శ్రీవాత్సవ, సబా ఆజాద్ ప్రధాన పాత్రల్లో నటించనున్న వెబ్ సిరీస్ 'స్టార్మ్' (వర్కింగ్ టైటిల్). ముంబై నేపథ్యంలో సాగే ఈ థ్రిల్లర్ సిరీస్‌కు అజిత్ పాల్ సింగ్ దర్శకత్వం వహిస్తారు. ప్రైమ్ వీడియో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానున్న ఈ సిరీస్‌కు హృతిక్ రోషన్ నిర్మాతగా వ్యవహరించనున్నారు. శుక్రవారం ఈ 'స్టార్మ్' సిరీస్‌ను ప్రకటించి త్వరలోనే షూటింగ్ ఆరంభించనున్నట్లుగా మేకర్స్ తెలిపారు. హృతిక్ రోషన్‌కు నిర్మాతగా ఓటీటీలో తొలి ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం. ''భారతీయ వినోద రంగంలో నేను నిర్మాతగా పరిచయం అవుతున్నాను. ఇండస్ట్రీలో నటుడిగా నేను 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఇలా కొత్త అడుగు వేయడం చాలా సంతోషంగా ఉంది. యూనివర్సల్ అప్పీల్ ఉన్న 'స్టార్మ్' సిరీస్ కథనం ఆకట్టుకుంటుంది'' అని హృతిక్ రోషన్ పేర్కొన్నారు.

ఇదొక నవ్వుల ప్రయాణం

- కల్యాణ్ మంతెన, భాను ప్రతాప



''మిత్ర మండలి' బడ్డీస్ కామెడీ మూవీ. అందుకే కొందరు 'జాతి రత్నాలు'తో పోల్చుతున్నారు. అయితే 'జాతి రత్నాలు' కథకు, మా సినిమా కథకు సంబంధం లేదు. ఆ మూవీని ఎంతలా ఎంజాయ్ చేశారో మా చిత్రాన్నీ ప్రతి ఒక్కరూ అంతకు మించి ఎంజాయ్ చేస్తారు'' అని నిర్మాతలు కల్యాణ్ మంతెన, భాను ప్రతాప తెలిపారు. ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎం జోడీగా నటించిన చిత్రం 'మిత్ర మండలి'. విజయేందర్. ఎస్ దర్శకత్వంలో బన్నీ వాసు సమర్పణలో కల్యాణ్ మంతెన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కల్యాణ్ మంతెన, భాను ప్రతాప విలేకరులతో మాట్లాడుతూ– ''నిర్మాత బన్నీ వాసుతో గీతా ఆర్ట్స్‌లో మేం చాలా కాలం పని చేశాం. 'కోట బొమ్మాళీ పీఎస్, ఆయ్, తండేల్, సింగిల్'... ఇలా చాలా చిత్రాలు చేశాం. వాసుగారి ద్వారా 'మిత్ర మండలి' కథ మా వద్దకు వచ్చింది. ఆద్యంతం వినోదాన్ని అందిస్తూనే సెటైరికల్‌గా ఉండే ఈ కథ మాకు నచ్చడంతో వెంటనే ఓకే చెప్పాం. విజయేందర్ అద్భుతంగా తీశాడు. ఈ మూవీ కోసం డైరెక్టర్ క్రియేట్ చేసిన జంగ్లీ పట్టణంలో జరిగే కథ, పాత్రలు ఆకట్టుకుంటాయి. ప్రియదర్శి, నిహారిక పాత్రలు యూత్‌కు రిలేట్ అవుతాయి. హీరోయిన్‌గా కొందర్ని అనుకున్నప్పటికీ నిహారికను చూసిన వెంటనే అల్లు అరవింద్‌గారు ఓకే చేశారు. బ్రహ్మానందంగారు 'జంబర్ గింబర్ లాలా' పాటలో కనిపిస్తారు. ఈ సినిమా చూస్తున్నంత సేపూ ప్రేక్షకులకు నవ్వుల ప్రయాణం చేసినట్లు అనిపిస్తుంది. త్వరలోనే హారర్ మూవీ ప్రారంభించనున్నాం'' అని చెప్పారు.

తెలంగాణ నుంచి మరిన్ని చిత్రాలు రావాలి

- విజయశాంతి



● చాణక్య, కళా శ్రీనివాస్, విజయశాంతి, మౌనిక

''ప్రజా ఉద్యమాలతో సంబంధం ఉన్న రచయిత, ప్రజా కళాకారుడు కళా శ్రీనివాస్ నిర్మించిన 'దక్కన్ సర్కార్' సినిమా ప్రజల్లోకి వెళ్లాలి. తెలంగాణ ప్రాంతం నుంచి ఇలాంటి మరిన్ని చిత్రాలు రావాలి... ఇందుకు ప్రభుత్వం కూడా సహకరిస్తుంది'' అని నటి, ఎమ్మెల్సీ విజయశాంతి చెప్పారు. చాణక్య, మౌనిక నటించిన చిత్రం 'దక్కన్ సర్కార్'. కళా శ్రీనివాస్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా పోస్టర్‌ని విజయశాంతి ఆవిష్కరించారు. కళా శ్రీనివాస్ మాట్లాడుతూ–''ప్రజల జీవన స్థితిగతుల నేపథ్యంలో వాస్తవ ఘటనల ఆధారంగా నిర్మించిన చిత్రం 'దక్కన్ సర్కార్'' అని తెలిపారు. ''తెలంగాణ అస్తిత్వానికి అద్దం పట్టే ఇలాంటి సినిమాల నిర్మాణం జరగాలి'' అని కళాకారుల జేఏసీ అధ్యక్షుడు మురళీధర్ దేశ్‌పాండే అన్నారు. ''ఈ సినిమా సక్సెస్ మాకు అవసరం'' అని చాణక్య, మౌనిక పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	329	82,501
నిఫ్టీ ▲	104	25,285

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	22,476	▽	550
డోజోన్స్	45,780	▽	578
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,423	▽	81
డాక్స్	24,270	▽	342
షాంఘై	3,897	▽	37
నికాయ్	48,088	▽	492

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.35	89.37
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	117.71	120.69
€	యూరో	ఎస్‌బీఐ	102.08	104.88
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.28	59.97
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.51	59.78
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.35	70.07
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.79	24.28
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.29	24.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.59	13.42

రుణమే.. బంగారమాయెనే!

- ధరల పెరుగుదలతో పసిడి రుణాలకు డిమాండ్
- 2026 మార్చి నాటికి రూ.15 లక్షల కోట్లు
- రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా

న్యూఢిల్లీ: బంగారం ధరలు ఊహించని విధంగా పెరిగిపోతున్న తరుణంలో వాటిపై రుణం తీసుకునేందుకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. అతి తక్కువ వడ్డీకి రుణ సాయం లభిస్తుండడంతో ఎక్కువ మంది పసిడి రుణాలవైపు అడుగులు వేస్తున్నారు. దీంతో సంఘటిత రంగంలో (ఆర్‌బీఐ కింద నమోదైన బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు) బంగారం రుణాల మార్కెట్ 2026 మార్చి నాటికి రూ.15 లక్షల కోట్లకు చేరుకుంటుందని రేటింగ్ సంస్థ ఇక్రా అంచనా వేసింది. నిజానికి 2027 మార్చి నాటికి సంఘటిత పసిడి రుణాల మార్కెట్ ఈ స్థాయికి చేరుకుంటుందని 2024 సెప్టెంబర్‌లో ఇక్రా అంచనా వేయగా.. ఇప్పుడు ఏడాది ముందుగానే ఇది సాధ్యపడుతుందని పేర్కొంది. 2027 మార్చి నాటికి రూ.18 లక్షల కోట్లకు చేరుకోవచ్చని పేర్కొంది. 2025 మార్చి నాటికి మొత్తం మీద బంగారం రుణాల మార్కెట్ రూ.11.8 లక్షల కోట్లుగా ఉన్నట్టు తెలిపింది. ''బంగారం ధరలు స్థిరంగా పెరుగుతుండడం వల్లే మా అంచనాను సవరించాల్సి వచ్చింది. ధరలు కొత్త గరిష్టాలకు చేరుకోవడంతో బంగారం రుణాల మార్కెట్ అంచనాలకు మించి వేగంగా వృద్ధి చెందుతోంది. ఈ విభాగంలో బ్యాంకులు తమ ఆధిక్యాన్ని బలోపేతం చేసుకుంటున్నాయి. వృద్ధిలో ఎన్‌బీఎఫ్‌సీలను వెనక్కి నెట్టేస్తున్నాయి'' అని ఇక్రా తన నివేదికలో పేర్కొంది.

బ్యాంకుల ఆధిపత్యం..

సంఘటిత బంగారం రుణ మార్కెట్లో బ్యాంకులు మరింత బలంగా మారుతున్నాయి. 2025 మార్చి నాటికి తమ వాటాను 82 శాతానికి పెంచుకున్నట్టు ఇక్రా తెలిపింది. 2019–20 నుంచి 24–25 కాలంలో బ్యాంకుల వాటా ఏటా 26% చొప్పున కాంపౌండెడ్‌గా పెరిగినట్టు వెల్లడించింది. ఇదే కాలంలో బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీల) వాటా ఈ మార్కెట్లో ఏటా 20% వృద్ధిని చూసినట్టు తెలిపింది. బ్యాంకుల రుణ పోర్ట్‌ఫోలియోలోనూ కీలక మార్పును ఈ నివేదిక ప్రస్తావించింది. 2025 మార్చి నాటికి రిటైల్/వ్యక్తిగత పసిడి రుణాలు బ్యాంకుల మొత్తం పసిడి రుణాల్లో 18%కి చేరాయని, ఏడాది ముందు ఇవి 11%గానే ఉన్నట్టు తెలిపింది. బంగారంపై తీసుకునే సాగు, ఇతర అవసరాలకు ఉద్దేశించిన రుణాలు 70% నుంచి 63%కి తగ్గినట్టు పేర్కొంది. ఎన్‌బీఎఫ్‌సీల నిర్వహణలోని బంగారం రుణ ఆస్తుల విలువ 2025–26లో 30–35 శాతం పెరగొచ్చని ఇక్రా అంచనా వేసింది. బంగారం ధరలు పెరిగిపోవడం, అన్‌సెక్యూర్డ్ రుణాల్లో వృద్ధి తగ్గడాన్ని ప్రస్తావించింది. 2025 జూన్ నాటికి ఎన్‌బీఎఫ్‌సీల నిర్వహణలోని బంగారం రుణాల విలువ రూ.2.4 లక్షల కోట్లుగా ఉండొచ్చని తెలిపింది.

ఆకర్షించే వడ్డీ రేట్లు..

బంగారం రుణాలపై బ్యాంకులు వసూలు చేస్తున్న ఆరంభ వడ్డీ రేటు 8 శాతం (వార్షిక)గా ఉంది. వ్యక్తిగత రుణాల్లో ఇంత తక్కువ రేటుకు మరే రుణం కూడా లభించడం లేదు. ఎన్‌బీఎఫ్‌సీలు మాత్రం బంగారం రుణాలపై 12 శాతం నుంచి వడ్డీ రేటును వసూలు చేస్తున్నాయి. దీంతో కస్టమర్లు బ్యాంకుల్లో బంగారంపై రుణం తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పైగా ఎన్‌బీఎఫ్‌సీలతో పోల్చినప్పుడు బ్యాంకులపై ఎక్కువ మందిలో విశ్వాసం ఉండడం కూడా ఒక కారణంగా కనిపిస్తోంది. బంగారం, ఆధార్, పాన్ డాక్యుమెంట్లతో వెళితే అరగంట, గంట–గంటలోపే బ్యాంకుల్లో రుణం మంజూరవుతుంది.



సిల్వర్ రూ.8,500 జంప్

ఢిల్లీలో కిలో ధర రూ.1,71,500

న్యూఢిల్లీ: వెండి ధర రాకెట్ వేగాన్ని తలపిస్తోంది. ఢిల్లీ మార్కెట్లో శుక్రవారం కిలోకి రూ.8,500 ఎగసి రూ.1,71,500 స్థాయికి చేరింది. ముఖ్యంగా గత మూడు పనిదినాల్లోనే వెండి కిలోకి రూ.17,500 పెరగడం డిమాండ్‌ను తెలియజేస్తోంది. ప్రధానంగా పెట్టుబడిదారుల నుంచి ఎక్కువ డిమాండ్ కనిపిస్తోంది. మరోవైపు బంగారం ధర (99.9 శాతం స్వచ్ఛత) 10 గ్రాములకు రూ.600 నష్టపోయి రూ.1,26,000 వద్ద స్థిరపడింది. సురక్షిత సాధనాల్లో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు మొగ్గు చూపించడం, సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లు ధరల పెరుగుదలకు మద్దతుగా నిలుస్తున్నట్టు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పార్మర్ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ వెండి ధర ఔన్స్‌కు 51 డాలర్లకు చేరుకోగా, స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 17 డాలర్ల మేర పెరిగి 3,993 డాలర్ల వద్ద ట్రేడయ్యింది.

దేశవ్యాప్తంగా కార్నివాల్స్‌పై కసరత్తు

శ్రేయాస్ మీడియా ఫౌండర్ శ్రీనివాసరావు



హైదరాబాద్: గిన్నిస్ రికార్డులకెక్కిన తమ విజయవాడ ఉత్సవ్ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా కార్నివాల్స్‌ను నిర్వహించనున్నట్లు శ్రేయాస్ మీడియా వెల్లడించింది. దేశ, విదేశీ కళాకారులతో ఏపీలోని అరకు, గండికోట వంటి ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో ఏడాది పొడవునా వేడుకలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సంస్థ ఫౌండర్ గంధ్ర శ్రీనివాసరావు తెలిపారు. 30 పైచిలుకు భారీ కాన్సర్ట్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మహా కుంభమేళా ప్రకటనల హక్కులను దక్కించుకుని, వేలాది బ్రాండ్స్‌ని కోట్ల మందికి చేరువ చేసినట్లు శ్రీనివాస్ చెప్పారు. తాజాగా సెప్టెంబర్‌లో 11 రోజుల పాటు సాగిన విజయవాడ ఉత్సవ్‌లో 15 లక్షల మంది పైగా పాల్గొనగా, స్థానికంగా రూ. 1,000 కోట్ల వ్యాపారం జరిగిందని అంచనాలున్నట్లు తెలిపారు. ఎక్స్‌పోలో 600 స్టాల్స్ ఏర్పాటు చేయగా, ప్రత్యక్షంగా, పరోక్షంగా 25,000 మందికి ఉపాధి లభించిందన్నారు. వచ్చే అయిదేళ్లలో విజయవాడ ఉత్సవ్‌తో రూ. 5,000 కోట్ల వ్యాపార లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా తలపెట్టిన కార్నివాల్స్‌కి పలు బ్రాండ్స్ ముందుకొస్తున్నాయని తెలిపారు.

టీటీకే ప్రెస్టీజ్ జగన్నాథన్ కన్నుమూత



న్యూఢిల్లీ: 'కిచెన్ మొఘల్'గా పేరొందిన 'టీటీకే ప్రెస్టీజ్' గౌరవ చైర్మన్ టీటీ జగన్నాథన్ (77) శుక్రవారం బెంగళూరులో కన్నుమూశారు. ఆయన ఆకస్మిక మరణంపై పరిశ్రమ వర్గాలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశాయి. ఆయన మరణం కంపెనీకి తీరని నష్టమని టీటీకే ప్రెస్టీజ్ పేర్కొంది. ఐఐటీ చెన్నై గోల్డ్ మెడలిస్ట్ అయిన జగన్నాథన్ అమెరికా కార్నెల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. తాతగారైన కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి, దివంగత టీటీ కృష్ణమాచారి 1928లో నెలకొల్పిన టీటీకే ప్రెస్టీజ్ బోర్డులో గత 50 ఏళ్లుగా ఆయన సేవలందించారు. 1975లో మేనేజింగ్ డైరెక్టరుగా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి చిన్న ఉపకరణాల మార్కెట్లో కంపెనీని అగ్రగామిగా నిలపడంలో సారథ్యం వహించారు. కంపెనీ నిర్వహణలోనే కాకుండా కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణలోనూ జగన్నాథన్ కీలక పాత్ర పోషించారు. టీటీకే గ్రూప్‌ను రుణరహిత సంస్థగా మార్చారు. దివాలా స్థితి నుంచి దిగ్గజంగా ఎదగడం వరకు కంపెనీ ప్రస్థానాన్ని వివరిస్తూ 'డిస్‌రప్ట్ అండ్ కాంకర్– హౌ టీటీకే ప్రెస్టీజ్ బికేమ్ ఏ బిలియన్ డాలర్ కంపెనీ' పుస్తకం కూడా రాశారు.

1975 నుంచి 2000 వరకు 26 ఏళ్ల పాటు టీటీకే ప్రెస్టీజ్ ఎండీగా జగన్నాథన్ బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత 2019 వరకు 19 ఏళ్ల పాటు ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా, ఆ తర్వాత నుంచి 2025 మార్చి 25 వరకు నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా వ్యవహరించారు.

ఇక ఎస్‌బీఐ ఎండీగా ప్రైవేట్ అభ్యర్థులు!

- పీఎస్‌బీల్లో ఈడీలుగా కూడా చాన్స్
- టాప్ పోస్టుల భర్తీకి మార్గదర్శకాలు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ (పీఎస్‌బీ) దిగ్గజం ఎస్‌బీఐలో ఒక ఎండీ పోస్టుతో పాటు ఇతర పీఎస్‌బీల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లలాంటి టాప్ హోదాలకు ప్రైవేట్ రంగ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకునేలా నియామకాలపై క్యాబినెట్ కమిటీ (ఏసీసీ) మార్గదర్శకాలను సవరించింది. వీటి ప్రకారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో (ఎస్‌బీఐ) ఒక మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) పోస్టుతో పాటు పీఎస్‌బీల్లో ఈడీ పోస్టులకు ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థల్లో పని చేస్తున్న వారే కాకుండా ప్రైవేట్ రంగానికి చెందిన వారు కూడా పోటీపడొచ్చు. ఎస్‌బీఐ ఎండీకి సంబంధించి ప్రైవేట్ అభ్యర్థులకు బ్యాంకు బోర్డు స్థాయిలో కనీసం రెండేళ్లు, 15 ఏళ్ల బ్యాంకింగ్ అనుభవం సహా మొత్తం మీద కనీసం 21 ఏళ్ల అనుభవం ఉండాలి. ఎస్‌బీఐలో నాలుగు ఎండీ పోస్టులు ఉండగా, కొత్త మార్గదర్శకాల ప్రకారం వాటిల్లో ఒకటి ఓపెన్‌గా ఉంటుంది. సాధారణంగా ఎండీ, చైర్మన్ పోస్టులను అంతర్గత సిబ్బందితోనే భర్తీ చేయడం ఆనవాయితీగా ఉంటోంది. ప్రస్తుతం ఎస్‌బీఐ కాకుండా పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్ మొదలైన 11 పీఎస్‌బీలు ఉన్నాయి. అటు పీఎస్‌బీల్లో ఈడీ పోస్టులకు సంబంధించి ప్రైవేట్ అభ్యర్థులకు బ్యాంకు బోర్డు స్థాయిలో మూడేళ్ల సహా బ్యాంకింగ్ రంగంలో 12 ఏళ్లు, మొత్తం మీద కనీసం 18 ఏళ్ల అనుభవం ఉండాలి.

యూనియన్ల నుంచి వ్యతిరేకత..

ఏసీసీ మార్గదర్శకాలను వ్యతిరేకిస్తున్నట్లు తొమ్మిది బ్యాంక్ యూనియన్ల సమాఖ్య యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) వెల్లడించింది. దీనిపై కేంద్రానికి నిరసన తెలిపింది. ప్రభుత్వ రంగ సంస్థల స్వభావాన్ని దెబ్బతీసేందుకు జరుగుతున్న దాడిగా దీన్ని అభివర్ణించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..	
ఈక్విటీ ఫండ్స్ పెట్టుబడుల్లో తగ్గిన జోరు	టాటా సన్స్‌ని లిస్ట్ చేయాల్సిందే..

రెండో రోజూ లాభాలు

- బ్యాంకులు, ఫార్మా షేర్లలో కొనుగోళ్లు
- 329 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- 25,250 స్థాయిపైకి నిఫ్టీ



ముంబై: బ్యాంకులు, ఫార్మా షేర్లు రాణించడంతో దేశీయ స్టాక్ మార్కెట్ రెండో రోజూ లాభపడింది. ఇజ్రాయెల్, హమాస్ మధ్య కాల్పుల విరమణ అమల్లోకి రావడం, అమెరికా–భారత్‌ల మధ్య వాణిజ్య చర్చల పురోగతి అంశాలు సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 329 పాయింట్లు పెరిగి 82,501 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 104 పాయింట్లు బలపడి 25,285 వద్ద నిలిచింది. ఆసియాలో హాంగ్ కాంగ్, జపాన్ ఇండెక్సులు లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు బలహీనంగా ముగిశాయి. చైనా, యూరప్‌పై ట్రంప్ మరిన్ని టారిఫ్ హెచ్చరికలతో అమెరికా సూచీలు 2.5% భారీ నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- వియ్‌వర్క్ ఇండియా మేనేజ్‌మెంట్ లిస్టింగ్ మెప్పించలేకపోయింది. ఇష్యూ ధర (రూ.648)తో పోలిస్తే బీఎస్‌ఈలో 0.30% డిస్కౌంటుతో రూ.646 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 5% పతనమై రూ.615 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 3.50% నష్టపోయి రూ.625 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.8,373 కోట్లుగా నమోదైంది.



భారత్‌కు కాంస్య పతకం

సొంతగడ్డపై సత్తా చాటుకున్న భారత యువ బ్యాడ్మింటన్ జట్టు ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని దక్కించుకుంది. గువాహటిలో జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌లో శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 0–2 (35–45, 21–45)తో ఇండోనేసియా జట్టు చేతిలో ఓడిపోయింది. మరో సెమీఫైనల్లో చైనా 2–1 (45–42, 38–45, 45–42) జపాన్‌పై నెగ్గి ఇండోనేసియాతో టైటిల్ పోరుకు సిద్ధమైంది. సెమీఫైనల్లో ఓడిన భారత్, జపాన్ జట్లకు కాంస్య పతకాలు ఖరారయ్యాయి. కాంస్యం నెగ్గిన భారత జట్టులో అరిగెల భార్గవ్ రామ్, గొబ్బూరు విశ్వతేజ్, కలగోట్ల వెన్నెల, జ్ఞానదత్తు, ఉన్నతి హుడా, రౌనక్, లాల్‌రామ్‌సాంగా, విశాఖ టొప్పో, రేషిక, ఆన్య, ఏంజెల్, సుమిత్, భవ్య ఛాబ్రా, హమర్ లాల్‌థాజువాలా, మిథిలేశ్, సూర్యాక్ష్ రావత్, మానస రావత్, రక్షిత శ్రీ, తన్వీ శర్మ, తారిణి సభ్యులుగా ఉన్నారు.

న్యూజిలాండ్ బోణీ

- 100 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై గెలుపు
- రాణించిన బ్రూక్ హాలిడే, సోఫీ డివైన్


బ్రూక్ హాలిడే

గువాహటి: ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్‌లో మాజీ చాంపియన్ న్యూజిలాండ్ ఆలస్యంగా బోణీ చేసింది. వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిన కివీస్ జట్టు శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో 100 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై భారీ విజయాన్ని నమోదు చేసింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ మహిళల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు సుజీ బేట్స్ (29; 6 సిక్స్‌లు), ప్లిమర్ (4), అమెలియా కెర్ (1) విఫలమవడంతో 38 పరుగులకే ఆ జట్టు మూడు వికెట్లు పడ్డాయి. ఈ దశలో కెప్టెన్ సోఫీ డివైన్ (85 బంతుల్లో 63; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బ్రూక్ హాలిడే (104 బంతుల్లో 69; 5 ఫోర్లు, 1 సిక్స్) నాలుగో వికెట్‌కు 112 పరుగులు జోడించడంతో కివీస్ కుదురుకుంది. అయితే 29 పరుగుల వ్యవధిలో వీళ్లిద్దరు అవుటయ్యాక న్యూజిలాండ్ మళ్లీ తడబడింది. ఆఖరి ఓవర్లలో మ్యాడీ గ్రీన్ (25; 3 ఫోర్లు), జెస్ కెర్ (0), రోజ్‌మేరీ (2), ఇసాబెల్లా గేజ్ (12) వికెట్లను కోల్పోయింది. ప్రత్యర్థి బౌలర్లలో రబియా ఖాన్ 3 వికెట్లు పడగొట్టింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన బంగ్లాదేశ్ జట్టు 39.5 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. ఫాహిమా ఖాతూన్ (34; 2 ఫోర్లు), రబియా ఖాన్ (25; 2 ఫోర్లు) రాణించారు. జెస్ కెర్, లీ తహుహు చెరో 3 వికెట్లు తీయగా, రోజ్‌మేరీకి 2 వికెట్లు దక్కాయి. **కొలంబోలో నేడు జరిగే మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టుతో శ్రీలంక తలపడుతుంది.**

పోరాడి ఓడిన హైదరాబాద్ బ్లాక్‌హాక్స్



సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్‌లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ 10–15, 14–16, 15–17తో ఢిల్లీ తూఫాన్స్ చేతిలో పోరాడి ఓడిపోయింది. ఈ లీగ్‌లో ఆడిన తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన ఢిల్లీ జట్టు మూడో మ్యాచ్‌లో తొలి విజయాన్ని అందుకుంది. మ్యాచ్ మొత్తంలో హైదరాబాద్ 39 పాయింట్లు సాధించగా... ఇందులో సొంత సర్వీస్‌లో 10 పాయింట్లు, స్పైక్ షాట్‌లతో 17 పాయింట్లు వచ్చాయి. అంతకుముందు తెలంగాణ రాష్ట్ర క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) చైర్మన్ శివసేనా రెడ్డి ఈ మ్యాచ్‌కు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. హైదరాబాద్ బ్లాక్ హాక్స్ యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి వీరిద్దరికి స్వాగతం పలికి ఆటగాళ్లను పరిచయం చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని... దేశంలోని పలు నగరాల్లో జరగాల్సిన ఈ సీజన్ పీవీఎల్ పోటీలు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు మొత్తం హైదరాబాద్‌లోనే నిర్వహించడానికి చొరవ తీసుకున్న హైదరాబాద్ జట్టు యజమాని అభిషేక్ రెడ్డిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. మరో మ్యాచ్‌లో అహ్మదాబాద్ డిఫెండర్స్ 12–15, 15–12, 15–12, 16–14తో డిఫెండింగ్ చాంపియన్ కాలికట్ హీరోస్‌పై గెలిచింది.

జైస్వాల్ కదంతొక్కడంతో...

రెండో టెస్టులో భారీస్కోరు దిశగా భారత్

తొలి రోజే క్లీన్‌స్వీప్‌నకు పునాది • తొలి ఇన్నింగ్స్‌లో 318/2 • రాణించిన సాయి సుదర్శన్

రెండో టెస్టు తొలిరోజే... ఓపెనర్ యశస్వి జైస్వాల్ దృష్టి ద్విశతకంపై పడితే, భారత జట్టు అడుగులు క్లీన్‌స్వీప్‌పై పడ్డాయి. ఓవర్లు పడుతున్నా... బౌలర్లు అదేపనిగా మారినా... సెషన్లు పూర్తయినా... భారత బ్యాటర్ల ఆట మాత్రం మారనేలేదు. నిలకడగానే కొనసాగింది. జైస్వాల్‌తో పాటు వన్‌డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్ వెస్టిండీస్ బౌలర్ల భరతం పట్టాడు. ఇద్దరు భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో టీమిండియా చివరి టెస్టు మొదలైన రోజే అలవోకగా 300 పైచిలుకు పరుగుల్ని సాధించింది.

న్యూఢిల్లీ: తొలిటెస్టులో మూడు పదుల స్కోరుతో సరిపెట్టుకున్న ఓపెనర్ యశస్వి జైస్వాల్ రెండో టెస్టులో ప్రత్యర్థి జట్టును ముప్పుతిప్పలు పెడుతున్నాడు. సాయి సుదర్శన్‌తో చెప్పుకోదగ్గ భాగస్వామ్యాన్ని నమోదు చేసిన జైస్వాల్ అజేయ శతకంతో కదంతొక్కాడు. దీంతో భారత్ భారీ స్కోరు దిశగా పయనిస్తుంది. అతని జోరు రెండో రోజు కొనసాగినా, లేదంటే సహచరుల్లో ఒకరిద్దరు రాణించినా టీమిండియా ఈ టెస్టులోనూ ఇన్నింగ్స్ విజయానికి అవసరమైన స్కోరును అవలీలగా చేస్తుంది. ఇదే జరిగితే 1–0 ఆధిక్యంతో శుక్రవారం మొదలైన ఆఖరి టెస్టు చివరకు 2–0తో వెస్టిండీస్‌ను వైట్‌వాష్ చేయడం ఈ రోజే దాదాపు ఖాయమవుతుంది! ఏడు సార్లు టాస్‌కు వెళ్లిన భారత కెప్టెన్ శుబ్‌మన్ గిల్ తొలిసారి టాస్ గెలిచాడు. మొదట బ్యాటింగ్ ఎంచుకోవడంతో... తొలిరోజు ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 318 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (253 బంతుల్లో 173 బ్యాటింగ్; 22 ఫోర్లు) అజేయ శతకం సాధించగా... సాయి సుదర్శన్ (165 బంతుల్లో 87; 12 ఫోర్లు) సెంచరీని చేజార్చుకున్నాడు. భారత్ కోల్పోయిన రెండు వికెట్లు విండీస్ స్పిన్నర్ జోమెల్ వారికెన్ ఖాతాలో చేరాయి.

శుభారంభంతో...

బ్యాటింగ్ మొదలుపెట్టిన యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ (54 బంతుల్లో 38; 5 ఫోర్లు, 1 సిక్స్) ఓపెనింగ్ వికెట్‌కు 58 పరుగులతో మంచి ఆరంభమే ఇచ్చారు. క్రీజులో ఉన్నంత సేపు కాస్త దూకుడు ప్రదర్శించిన రాహుల్ అలాగే ఆడేందుకు యత్నించి వారికెన్ బౌలింగ్‌లో స్టంపౌట్ అయ్యాడు. దీంతో తొలి సెషన్‌లో జైస్వాల్‌కు సాయి సుదర్శన్ జతయ్యాడు. గత టెస్టులో విఫలమైన సుదర్శన్ తాపీగా ఆడుతూ జైస్వాల్‌కు అండగా నిలిచాడు. దీంతో కరీబియన్ బౌలర్లకు ఈ సెషన్‌లో మరో సాఫల్యం సాధ్యమవలేదు. 94/1 వద్ద భారత్ లంచ్ విరామానికి వెళ్లింది. రెండో సెషన్ మొదలైన కాసేపటికే భారత్ 100 పరుగులు దాటగా, యశస్వి అర్ధశతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అతనితోపాటు సుదర్శన్ కూడా క్రీజులో పాతుకుపోవడంతో భారత్‌కు పరుగులు, కరీబియన్‌కు కష్టాలు తప్పలేదు. సగటున ఓవర్‌కు 3.5 పైచిలుకు రన్‌రేట్‌తో పరుగులు రావడంతో 41వ ఓవర్లోనే జట్టు స్కోరు 150 దాటగా... కాసేపటికే సాయి సుదర్శన్ 87 బంతుల్లో ఫిఫ్టీ సాధించాడు. భాగస్వామ్యం బలపడటంతో ఈ సెషన్‌లో వెస్టిండీస్‌కు వికెట్ భాగ్యమే కరువైంది. జైస్వాల్ 145 బంతుల్లో టెస్టుల్లో ఏడో శతకాన్ని పూర్తి చేసుకోగా... జట్టు స్కోరు 200 పరుగులకు చేరింది. రెండో సెషన్ 220/1 స్కోరు వద్ద ముగిసింది.

ఆఖరి సెషన్‌లోనూ జోరు...

ఓపెనర్ జైస్వాల్, సుదర్శన్ ఇద్దరు పరుగులు చక్కబెడుతూ స్కోరు బోర్డును సాఫీగా లాగిస్తుండగా ఎట్టకేలకు ఈ సెషన్‌లో వెస్టిండీస్ శిబిరానికి కాస్త ఊరటగా ఒక వికెట్ దక్కింది. సెంచరీ దిశగా పరుగు పెడుతున్న సాయి సుదర్శన్‌ను వారికెన్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో రెండో వికెట్‌కు 193 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత జైస్వాల్‌కు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (68 బంతుల్లో 20 బ్యాటింగ్; 3 ఫోర్లు) జతయ్యాడు. ఈ జోడీ కూడా పాతుకుపోయిందే తప్ప ఏ దశలోనూ పడిపోలేదు. 82 ఓవర్లయ్యాక కొత్తబంతి తీసుకున్నారు. కానీ ఓపెనర్ యశస్వి, కెప్టెన్ శుబ్‌మన్ ఆ బంతి ప్రయోజనాన్ని ఇవ్వకుండా క్రీజ్‌ను అట్టిపెట్టుకొని పరుగులు సాధించారు. యశస్వి 150 పరుగులు పూర్తి చేసుకొని డబుల్ సెంచరీపై కన్నేశాడు. ప్రత్యర్థి జట్టు రోజంతా కలిపి రెండే వికెట్లు తీసినా... మూడు సెషన్లలో 90 ఓవర్ల కోటా పూర్తి చేసిన విండీస్ బౌలర్లు ఒక్క వైడ్ గానీ, నోబాల్ గానీ వేయలేదు. దీంతో ఎక్స్‌ట్రాల రూపంలో భారత్‌కు ఒక్క పరుగైనా రాలేదు. స్కోరు బోర్డులో ఉన్న 318 పరుగులు బ్యాటర్లు బాదినవే! తొలిరోజు ఆట ముగిసే సరికి జైస్వాల్, గిల్ అజేయంగా నిలిచారు.


సాయి సుదర్శన్, యశస్వి జైస్వాల్

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (బ్యాటింగ్) 173; రాహుల్ (స్టంప్డ్) ఇమ్లాచ్ (బి) వారికెన్ 38; సాయి సుదర్శన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వారికెన్ 87; శుబ్‌మన్ గిల్ (బ్యాటింగ్) 20; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (90 ఓవర్లలో 2 వికెట్లకు) 318.** **వికెట్ల పతనం:** 1–58, 2–251. **బౌలింగ్:** సీల్స్ 16–1–59–0, ఫిలిప్ 13–2–44–0, గ్రీవెస్ 8–1–26–0, పియర్ 20–1–74–0, వారికెన్ 20–3–60–2, రోస్టన్ చేజ్ 13–0–55–0.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఏదో తింటున్నారంతే!

కౌమార దశలోని బాలికల్లో, మహిళల్లో పౌష్టికాహార లోపం ఎంతకూ తగ్గుముఖం పట్టకపోవటాన్ని ఐరాస సంస్థ 'యునిసెఫ్' ప్రపంచ సంక్షోభంగా గుర్తించింది. బాలికలు, మహిళల్లో ఈ పోషకాహార లేమికి ప్రధాన కారణాలుగా ఉంటున్న పోషక, సూక్ష్మ పోషకాల లోపాలను, రక్తహీనతనూ నివారించేందుకు తక్షణమే విధానపరమైన మార్పులు అవసరం అని సూచించింది. ప్రభుత్వాలు ఇందుకోసం తగినంతగా పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

బలహీనంగా కౌమార దశలోని బాలికలు, మహిళలు

- వేధిస్తున్న పోషకాహార లోపాలు, రక్తహీనత
- ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి అంటున్న యునిసెఫ్
- భారతీయ మహిళలు ప్రోటీన్ వనరులను అరుదుగా మాత్రమే వినియోగిస్తున్నారు
- సగం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు
- ప్రభుత్వాలు గుడ్లు, చేపలు, మాంసం వంటి బలవర్ధకమైన ఆహారం సబ్సిడీతో అందజేయాలంటున్న ఐరాస సంస్థ



యునిసెఫ్ తాజా నివేదిక ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మందికి పైగా కౌమార దశలోని బాలికలు, మహిళలు పోషకాహార లోపాలు, రక్తహీనతతో బాధపడుతున్నారు. 25 ఏళ్ల క్రితం 8 శాతంగా ఉన్న 'బరువు తక్కువ' బాలికలు నేటికీ దాదాపుగా అదే శాతంలో ఉన్నట్లు యునిసెఫ్ గుర్తించింది. మహిళల్లో మాత్రం ఈ శాతం 12 నుంచి 10 శాతానికి తగ్గింది. 2030 నాటికి బాలికలు, మహిళల్లో ఈ లోపాలను పూర్తిగా తగ్గించాలని పెట్టుకున్న లక్ష్యాలను చేరుకునే దిశగా ప్రపంచంలోని ఏ దేశమూ లేకపోవటంపై అంతర్జాతీయ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది.



ధరలు, ఘర్షణలు, వాతావరణం

పెరుగుతున్న ఆహార దినుసుల ధరలు, దేశాల మధ్య ఘర్షణలు, వాతావరణంలోని ప్రతికూల మార్పులు అన్నీ కలిసి బాలికలు, మహిళలను పౌష్టికాహారానికి దూరం చేస్తున్నాయని నివేదిక పేర్కొంది. పూట గడవని ఇళ్లలో చాలామంది మహిళలు తాము తీసుకోవలసిన కనీస ఆహారాన్ని కూడా తగ్గించవలసి వస్తోందని తెలిపింది. దీనివల్ల వారికి, వారి పిల్లలకు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం పెరుగుతుందని యునిసెఫ్ హెచ్చరించింది.

భారత్‌లో పండ్లు, మాంసం తినటం లేదు

యునిసెఫ్ నివేదిక ప్రకారం.. మన దేశంలో మహిళలు ఎక్కువగా ఆకుకూరలు, పప్పుధాన్యాలు, బీన్స్ మాత్రమే ఉపయోగిస్తున్నారు. 50 శాతం మంది మహిళలు ప్రతిరోజూ పప్పుధాన్యాలు తీసుకుంటుండగా.. 43 శాతం మంది వారానికి, 52 శాతం మంది ప్రతిరోజూ ఆకుకూరలు తీసుకుంటున్నారు. 49 శాతం మంది మహిళలు రోజూ పాలు లేదా పెరుగు వినియోగిస్తుండగా, 24 శాతం మంది వారానికి ఒకసారి మాత్రమే పాలు తీసుకుంటున్నారు. పండ్లు తినటం కూడా బాలికల్లో, మహిళల్లో బాగా తక్కువగా ఉంది. 49 శాతం మంది మహిళలు అప్పుడప్పుడు పండ్లు తీసుకుంటున్నారు. చికెన్, మాంసం, చేపలు గుడ్లు వంటి జంతు ఆధారిత ప్రోటీన్ వనరులను అరుదుగా మాత్రమే వినియోగిస్తున్నారు. ఈ కారణంగా భారతీయ మహిళల్లో పౌష్టికాహార లోపం ఎక్కువగా కనిపిస్తోందని నివేదిక వివరించింది.



అనీమియా ముక్త్ భారత్

కౌమార దశలో ఉన్న బాలికలు, మహిళల్లో రక్తహీనతను తగ్గించే లక్ష్యంతో భారతదేశ జాతీయ పోషకాహార మిషన్ 'అనీమియా ముక్త్ భారత్' ప్రాజెక్టును 2018లో ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా దేశంలోని మొత్తం 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 10 కోట్లకు పైగా లబ్ధిదారులను చేరుకోవడానికి 14 లక్షల మంది అంగన్‌వాడీ కార్యకర్తల సేవలను ప్రభుత్వం తీసుకుంటోంది. వీరు ఇంటింటికీ తిరిగి బాలికలకు, మహిళలకు పోషకాహారం ఎందుకు ముఖ్యమైనదో వివరిస్తున్నారు. ఆహార సంబంధ సేవలను అందిస్తున్నారు.

యునిసెఫ్ సిఫార్సులు

కౌమార దశలోని బాలికలు, మహిళల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు యునిసెఫ్ విధానపరమైన కొన్ని సిఫారసులు చేసింది. అవి:

- ప్రభుత్వాలు సబ్సిడీతో పండ్లు, కూరగాయలు, గుడ్లు, చేపలు, మాంసం వంటి వాటిని, ఇతర బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలి.
- బాలికలు, మహిళలకు ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులోకి తెచ్చేందుకు ఆహారాన్ని తప్పనిసరిగా లేబులింగ్ (లోపల ఏయే పోషకాలు ఉన్నదీ సూచించే సమాచారం) చేయాలి.
- బాలికలు, మహిళలకు పోషకాహారం తీసుకోవలసిన అవసరం గురించి, పోషకాహారం లభ్యత గురించిన సమాచారాన్ని విస్తృతం చేయాలి.
- కౌమారదశలో ఉన్న బాలికలు, మహిళలకు ఇవ్వవలసిన ఆహారం , ఆరోగ్య సేవల మెరుగుదలపై పరిశోధనలకు ప్రభుత్వాలు పెట్టుబడి పెట్టాలి.

నివేదికలోని మరికొన్ని ముఖ్యాంశాలు

- ప్రపంచ వ్యాప్తంగా 64–80 శాతం మంది మహిళల్లో విటమిన్ డీ లోపం ఉంటుండగా, భారతీయ మహిళల్లో జింక్ లోపం 41 నుంచి 65 శాతం మందిలో ఉంది.
- భారతదేశంలో సగానికి పైగా మహిళలు (15 – 49 మధ్య) రక్తహీనతతో బాధపడుతున్నారు. 40 శాతం మంది తక్కువ బరువుతో, 25 శాతం మంది అధిక బరువు / ఊబకాయంతో ఉంటున్నారు. ఈ అనారోగ్యాలు పోషకాహార లేమి ప్రభావాన్ని మూడు రెట్లు ఎక్కువగా పెంచుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.
- కౌమారదశలో ఉన్న బాలికలకు, మహిళలకు సగటున రోజువారీగా 2,500 కిలో కేలరీలు అవసరం అని, రెండవ, మూడవ త్రైమాసికంలో గర్భిణులకు రోజుకు అదనంగా 350 కిలో కేలరీలు, పాలిచ్చే తల్లులకు రోజుకు 520-600 అదనపు కిలో కేలరీలు అవసరం అని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ సిఫార్సు చేస్తోంది. అయితే బాలికలు, మహిళలు ఈ సిఫారసుల కంటే చాలా తక్కువగా ఆహారం తీసుకుంటున్నారు.



'బిర్లా'లో సింగరేణి పెవిలియన్

నేడు ప్రారంభించనున్న సీఎండీ బలరాంనాయక్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఆదిమానవుడి ఆవిర్భావానికి ముందే తెలంగాణ ప్రాంతంపై అనేక జీవరాశులు నడయాడాయి.ఈ ఆనవాళ్లను యావత్ ప్రపంచానికి పరిచయం చేసేలా సింగరేణి ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ప్రఖ్యాత బిర్లా ఆర్కియాలాజికల్, ఆస్ట్రోనామికల్, సైంటిఫిక్ రీసెర్చ్ సెంటర్(హైదరాబాద్)తో జత కట్టింది. అందులో భాగంగా బిర్లా సైన్స్ సెంటర్‌లో సింగరేణి పెవిలియన్ పేరుతో ప్రత్యేక ప్రదర్శనశాల ఏర్పాటుకు నిర్ణయించారు. సింగరేణి తవ్వకాల్లో లభించిన వందలాది పురాతన శిలాజాల్లో యాభైకి పైగా శిలాజాలను కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో ప్రదర్శనకు పెట్టనున్నారు. అందులో స్టెగోడాన్ జాతికి చెందిన ఏనుగు దంతాలు కూడా ఉన్నాయి. ఈ మేరకు పెవిలియన్‌ను శనివారం సింగరేణి సీఎండీ బలరాంనాయక్ ప్రారంభించనున్నారు.

'హవాలా కింగ్‌పిన్' అరెస్ట్

- డ్రగ్స్ సొమ్ము రూ.3 కోట్లు సీజ్
- ముంబై సహా ఐదు రాష్ట్రాల్లో హవాలా నెట్‌వర్క్

సాక్షి, హైదరాబాద్ : భారీమొత్తంలో మత్తు ముఠాల సొమ్మును ఈగల్ (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) టీం స్వాధీనం చేసుకుంది. నైజీరియన్ డ్రగ్స్ ముఠాలు ఇక్కడ మత్తు పదార్థాల విక్రయాలతో కూడబెట్టిన సొమ్మును హవాలా మార్గంలో విదేశాలకు తరలిస్తున్న ముంబైకి చెందిన హవాలా వ్యాపారి భరత్‌కుమార్ చగన్‌లాల్ అండ్ కంపెనీ ట్రేడర్స్ నిర్వాహకుడు దర్గరామ్ రతజి ప్రజాపతిని గురువారం అరెస్ట్ చేసింది. ఈ హవాలా నెట్‌వర్క్‌లో రతజి ప్రజాపతిని ప్రధాన ఆపరేటర్‌గా గుర్తించింది. ఇతని వద్ద రూ.3 కోట్ల హవాలా డబ్బును స్వాధీనం చేసుకున్నట్టు ఈగల్ డైరెక్టర్ సందీప్‌శాండిల్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాచకొండ పరిధిలో కేసు లింకులతో...

హైదరాబాద్‌తోపాటు సిటీ శివారు ప్రాంతాల్లో కొకైన్, ఎక్సటసీ డ్రగ్‌ను విక్రయిస్తున్న నైజీరియన్ మ్యాక్స్‌వెల్‌ను గతంలో రాచకొండ నార్కొటిక్స్ ఈగల్ టీం పోలీసులు అరెస్ట్ చేశాయి. ఆ సమయంలోనే విదేశాలకు మనీలాండరింగ్ జరుగుతున్నట్టు గుర్తించారు. ఇదంతా భరత్‌కుమార్ చగన్‌లాల్ అండ్ కంపెనీ హవాలా నెట్‌వర్క్ ద్వారా జరుగుతున్నట్టు ఈగల్ ఫోర్స్ దర్యాప్తులో వెలుగు చూసింది. ఈ హవాలా నెట్‌వర్క్ రాకెట్ వివరాలతో సెప్టెంబర్‌లో మహారాష్ట్ర, రాజస్తాన్, గుజరాత్, గోవా, ఢిల్లీలోని హవాలా వ్యాపారులపై వరుస ఆపరేషన్లు నిర్వహించారు. భరత్‌కుమార్ చగన్‌లాల్ అండ్ కంపెనీ ఆధ్వర్యంలో హవాలా చేస్తున్న ముంబైకి చెందిన చేతన్ మమానియా, ఉత్తమ్‌సింగ్, చేతన్‌సింగ్ సహా 20 మంది డ్రగ్ మనీలాండర్లను వారి అనుచరులను, ఏజెంట్లను ఇప్పటికే అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న రతజి ప్రజాపతి తప్పించుకున్నాడు. అయితే ఆయనపై నిఘా పెట్టిన ఈగల్ బృందం పక్కా సమాచారంతో ముంబైలో అతడిని అరెస్ట్ చేసింది.

రాష్ట్రాభివృద్ధిలో బిల్డర్లు భాగస్వాములే..

నరెడ్కో ప్రాపర్టీ షో ప్రారంభంలో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) తెలంగాణ 15వ ప్రాపర్టీ షో మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథులుగా మంత్రులు భట్టి విక్రమార్క, జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. మూడ్రోజుల ఈ ప్రాపర్టీ షోలో వందకు పైగా డెవలపర్లు, 150కి పైగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధిలో బిల్డర్లు భాగస్వామ్యులేనని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఆతిథ్యానికి ఇచ్చేంత ప్రాముఖ్యత దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఉండదని చెప్పారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున టూరిజం ప్రాంతాలున్నాయని, వీటిల్లో డెవలపర్లు భాగస్వామ్యులు కావాలని, ఎకో టూరిజం, వాటర్ ఫాల్స్, టైగర్ రిజర్వ్ ఫారెస్టులు, దేశవ్యాప్తంగా ప్రచారం కల్పించాలని సూచించారు. అనంతరం జూపల్లి మాట్లాడుతూ.. స్థిరాస్తి రంగం ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు.



ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో జూపల్లి కృష్ణారావు

'తుడుందెబ్బ నాయకుడు అరుణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోండి'

సాక్షి, హైదరాబాద్: లంబాడీలను కించపరుస్తూ యావత్ జాతిని అవమానించేలా వ్యాఖ్యలు చేస్తున్న తుడుందెబ్బ నాయకుడు మైపతి అరుణ్ కుమార్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్ కుమార్ జాదవ్, లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర ఉద్యోగుల సమన్వయకర్త మంగీలాల్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీజీపీ శివధర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. 'లంబాడీల సంస్కృతి సం ప్రదాయాలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, జాతిని దూషిస్తూ, అవమానపరుస్తూ, తెగల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్న అరుణ్ కుమార్‌పై ఫిర్యాదు చేశాం' అని రాజ్‌కుమార్ తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సివిల్స్ శిక్షణకు బ్రేక్

ఏపీ స్టడీ సర్కిల్ నిర్వీర్యం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ యువతకు కూటమి సర్కారు దగా
- యూపీఎస్సీ, గ్రూపు–1, 2లకు దక్కని శిక్షణ
- వైఎస్సార్ సీపీ హయాంలో మూడు ధపాలు సివిల్స్, గ్రూప్స్ పరీక్షలకు శిక్షణ
- గత ప్రభుత్వ ప్రోత్సాహంతో పలువురు అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపిక



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఇంటికో ఉద్యోగం లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామని నమ్మబలికిన చంద్రబాబు సర్కారు ఉద్యోగాలు కాదు కదా.. కనీసం నిరుద్యోగ యువతకు శిక్షణ కూడా ఇవ్వకుండా అడ్డుపడుతోంది. వైఎస్సార్ సీపీ హయాంలో ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు అందించిన ఏపీ స్టడీ సర్కిల్ మనుగడనే కూటమి సర్కారు ప్రశ్నార్థకంగా మార్చేసింది. యూపీఎస్సీ సివిల్స్, ఏపీపీఎస్సీ గ్రూప్–1, 2 శిక్షణ తరగతులను పూర్తిగా ఎత్తి వేయడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ గ్రాడ్యుయేట్లకు ఉచిత శిక్షణ అందకుండా పోయింది. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఏపీ స్టడీ సర్కిల్‌కు పునరుజ్జీవం కల్పించింది. మన రాష్ట్రానికి చెందిన యువత కోసం విశాఖలో ఏపీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణాన్ని చేపట్టింది. రుషికొండ ప్రాంతంలో రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించి సుమారు రూ.3 కోట్లతో అత్యాధునిక హంగులతో స్టడీ సర్కిల్ భవనాన్ని 2021లో నిర్మించింది. పరిపాలన భవనంతో పాటు వసతి గృహానికి సంబంధించి రెండు భవనాలను జీ+2 విధానంలో అందుబాటులోకి తెచ్చింది. గత ప్రభుత్వం వరుసగా మూడేళ్ల పాటు ఈ కేంద్రంలో సివిల్స్ పరీక్షలకు సిద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించగా పలువురు ఉద్యోగాలు కూడా సాధించారు.

నిరుద్యోగుల పడిగాపులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏపీ స్టడీ సర్కిల్ తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ గ్రాడ్యుయేట్లకు ఉచిత శిక్షణ తరగతులను నిలిపివేసింది. 2024–25లో సివిల్స్ ఉచిత వసతి శిక్షణ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. స్టడీ సర్కిల్ నోటిఫికేషన్ కోసం వందల మంది నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు పడిగాపులు కాస్తున్నారు. వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏపీ స్టడీ సర్కిల్స్ స్టూడెంట్స్ ఫోరం ప్రతినిధులు ఆందోళనకు దిగుతున్నారు.

ఉద్యమించేందుకు సన్నద్ధం..

ఏపీ స్టడీ సర్కిల్ నోటిఫికేషన్ కోసం నిరుద్యోగులు మొత్తుకుంటున్నా ఆలకించని కూటమి సర్కారు అంబేడ్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా సాధారణ పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని చెబుతోంది. సివిల్స్, గ్రూప్స్ శిక్షణకు అవకాశం కల్పించకుండా కేవలం ఐబీపీఎస్, ఆర్‌ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకు ఉద్యోగాల పరీక్షలకు ఇటీవల దరఖాస్తులు ఆహ్వానించింది. అది కూడా ప్రిలిమ్స్ కాకుండా కేవలం మెయిన్స్ మాత్రమే శిక్షణ ఇవ్వాలని నిర్ణయించడం పట్ల నిరుద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. కూటమి ప్రభుత్వం ఏపీ స్టడీ సర్కిల్‌ను నిర్వీర్యం చేస్తోందని మండిపడుతున్నారు. దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమవుతున్నారు.

వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలి..

తక్షణమే ఏపీ స్టడీ సర్కిల్ నోటిఫికేషన్ విడుదల చేయాలి. నోటిఫికేషన్ రాకపోవడంతో నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు సివిల్స్, గ్రూప్స్ పరీక్షల శిక్షణకు దూరమవుతున్నారు. ప్రైవేట్ సంస్థల్లో శిక్షణ పొందే స్థోమత లేక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం సివిల్స్ ఉచిత వసతి శిక్షణ నోటిఫికేషన్ వెంటనే ఇవ్వాలి.

– కొల్లు ఆనంద్‌కుమార్, అధ్యక్షుడు, ఏపీ స్టడీ సర్కిల్ స్టూడెంట్స్ ఫోరం

మందుపాతరలతో సహజీవనం

బాణసంచా కేంద్రాల్లో భద్రత లేని కూలీలు



బాణసంచా కేంద్రాల్లో పనిచేస్తున్న కార్మికుల ఒంటికి పట్టిన రసాయనాలు (ఫైల్)

కనీస రక్షణ కరవు
చుట్టూ పేలుడు పదార్థాలు
ఒంటి మీద కూడా రసాయనాలే
అందుకే ప్రమాదం నుంచి తప్పించుకోలేకపోతున్న కార్మికులు
ఘటనా స్థలంలోనే మృత్యువాత
నిపుణులు కూడా కొరత
దీపావళి సమయంలో తాత్కాలికంగా కూలీల నియామకం
ఆర్డర్ల పేరుతో విశ్రాంతి లేకుండా పనులు

సాక్షి, అమలాపురం: మందుగుండు సామగ్రి తయారు చేసే బాణసంచా తయారీ కేంద్రాలలో పని చేయడం అంటే ప్రాణాలను పణంగా పెట్టడమే. మిగిలిన చోట్ల ఏమోకాని.. బాణసంచా తయారీ కేంద్రంలో పనిచేయడం అంటే మృత్యువుతో నిత్యం చెలగాటం ఆడడమే. అది తెలిసి కూడా కార్మికులు, కూలీలు పొట్ట కూటికోసం వీటిలో పనిచేసేందుకు వెళుతున్నారు. మందుపాతర మీద కూర్చుని జీవన పోరాటం సాగిస్తున్నారు. దురదృష్టవశాత్తూ ప్రమాదాలు జరిగితే మృత్యువు బారిన పడుతున్నారు. గాయాలతో బయట పడినా జీవచ్ఛవాలుగా మారుతున్నారు.

అనుమతి లేని కేంద్రాలే అధికం

కోనసీమ జిల్లా రాయవరంలో శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో బుధవారం పెను విస్ఫోటం జరిగి ఎనిమిది మంది మృత్యువాత పడగా, మరో ఇద్దరు తీవ్ర గాయాలై ప్రాణాలతో పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో బాధితులంతా అతి పేద కుటుంబాలకు చెందినవారే కావడం గమనార్హం. జీవనోపాధి కోసం ప్రాణాలు పణంగా పెట్టి మరీ వీరు ఇక్కడ పని చేస్తున్నారు. కోనసీమ జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రాలు అధికారికంగా 18 వరకు ఉండగా, ఒక స్టోరేజ్ కేంద్రం ఉంది. కాని వాస్తవంగా అనుమతి లేని కేంద్రాలు చాలా ఉన్నాయి. అనుమతి ఉన్న కేంద్రాలలో మాత్రమే అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమతి లేని తయారీ కేంద్రాలు, అమ్మకం దుకాణాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇటీవల అయినవిల్లి మండలం విలసలో ఇంటిలో నిల్వ ఉంచిన బాణసంచా పేలడం వల్ల ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే.

కార్మికుల రక్షణ పట్టని అధికారులు

- నిబంధనల ప్రకారం అన్ని రక్షణ **చర్యలు తీసుకుంటేనే** అనుమతులు ఇస్తున్నా**మని అధికా**రులు చెబుతున్నారు. అయితే ఇం**దులో** పనిచేస్తున్న కార్మికుల రక్షణ విషయాన్ని మాత్రం అధికారులు పట్టిం**చు**కోవడంలేదు.
- బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం జరిగితే తొలుత బలైపోతున్నది కార్మికులు. ఇక్కడ పని చేసే వారిలో 90 శాతం మంది రోజువారీ కూలీలే. వీరెవ్వరూ వృత్తి నైపుణ్యం ఉన్నవారు కాదు. అనుభవం ఉన్న కార్మికులకు సైతం బాణసంచాకు ఉపయోగించే రా మెటీరియల్‌పై అవగాహన ఉండదు. ఎటువం**టి** రసాయనాల సమ్మేళనం వల్ల పేలుడు **సం**భవిస్తుందనే అవగాహన సైతం వారికి **లేదు.**
- బాణసంచాలో పెద్ద శబ్దాలు వచ్చేం**దుకు అమో**నియం నైట్రేట్‌ను అధికంగా విని**యోగిస్తున్నారు.** ఇది కొద్దిపాటి ఒత్తిడి పెరిగితే పేలి**పోయే** స్వభావం ఉంటుంది. అయితే పనిచేసే వారికి ఈ అవగాహన లేకుండా పోతోంది.
- **పొటాషియం నైట్రేట్, మెగ్నీషియం పౌడర్, నల్ల ర్ రసాయనాలు అధికంగా వాడతారు. ఇవి వాడేటప్పుడు కనీస రక్షణ చర్యలు తీసుకోవాలి. పౌడర్‌గా తగు పాళ్లలో కలిపి క్రేకర్స్ తయారు చేయాల్సి ఉంది.**
- **బాణసంచా తయారు కేంద్రాల్లో అన్ని రసాయనాలు కలిపి నూరడం వల్ల పేలుడుకు దారి తీస్తాయి. విడివిడిగా ఫార్ములా తయారు చేయాలి. అన్‌స్కిల్డ్ లేబర్‌తో నూరిస్తున్నారు. అదే పేలుళ్లకు దారి తీస్తోంది.**
- **బాణసంచా తయారు చేసే ప్రతి కార్మికునికి చేతులకి గ్లౌజులుండాలి. అగ్ని బారిన పడకుండా ప్రత్యేక వస్త్రాలు వేసుకోవడంతోపాటు తలకు హెల్మెట్ పెట్టుకోవాలి. ముఖానికి మాస్క్ తప్పనిసరి. తయారు చేస్తున్న బాణసంచా, దానికి వాడే రసాయనాలు, వాటిని ఎలా కలపాలి అనే దానిపై కార్మికుడికి అవగాహన కల్పించాల్సి ఉంది. కాని ఎక్కడా ఇటువంటివి పాటించడం లేదు.**
- బాణసంచా తయారు చేస్తున్నప్పుడు కార్మికులు, కూలీల ఒంటికి రసాయనాలు దట్టంగా పట్టేస్తు**న్నాయి. కాళ్లు, చేతులు, ముఖం, వేసుకున్న దుస్తులకు రసాయనాలు పట్టడం వల్ల పేలుడు సమయంలో వారు కూడా పూర్తిగా కాలిపోతున్నారు. ఒకవేళ తీవ్ర గాయాలై ప్రాణాలతో బయటపడినా రసాయనాల వల్ల మండిపోయిన శరీరంతో జీవచ్ఛవాలుగా మారుతున్నారు. కనీసం గుర్తుపట్టేందుకు కూడా వీలు లేకుండా వారి శరీరాలు** మారిపోతున్నాయి. జిల్లాలో ఇంచుమిం**చు ప్రతి** బాణసంచా కేంద్రంలోనూ ఇదే **పరిస్థితి** నెలకొంది.
- **రసా**యనాలతో బాణసంచా తయారు చేసేట**ప్పుడు** ప్రతీ కార్మికుని ముఖానికి మాస్క్ **తప్ప**నిసరి. అయితే ఒక్కచోట కూడా ఈ **పద్ధ**తి అవలంబించట్లేదు. దీనివల్ల కార్మి**కు**లు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఊపిరితిత్తులు దెబ్బ తినడంతో పాటు చర్మవ్యాధులు ప్రబలుతున్నాయి. కొంతమంది చిన్న వయసులోనే క్యాన్సర్ల బారిన పడుతున్నారు.
- దీపావళి సమయంలో పెద్ద ఎత్తున **వచ్చే** ఆర్డర్ల కోసం తయారీదారులు అప్పటి**కప్పు**డు సాధారణ కూలీలను కూడా పనిలో **పెట్టు**కుంటున్నారు. ఇలా చేయడం వల్ల **ప్రమా**దాలు ఎక్కువగా జరుగుతున్నాయి. **వీరికి త**యారు చేసే అనుభవం లేకపోవడం వల్ల **పేలుళ్లు** సంభవిస్తున్నాయి.
- **చిన్న పిల్ల**లను, మహిళలను మందుగుండు **సామగ్రి** తయారు చేసేందుకు అనుమతించకూడదు. కానీ రాయవరంలో జరిగిన పేలుడులో మృతి చెందినవారిలో ఐదుగురు మహిళలే.
- **ఇంత జరుగుతున్నా** వీటిపై నిఘా పెట్టాల్సిన **రెవెన్యూ, పోలీసు,** అగ్నిమాపక, కార్మిక, వైద్య **శాఖలు వీటి వైపు** కన్నెత్తి చూడడం లేదు. వారి **నిర్లక్ష్యమే కార్మికుల** పాలిట శాపంగా మారింది.

తనిఖీ చేసిన కేంద్రంలోనే భారీ ప్రమాదం

తయారీ కేంద్రాల వద్ద తీసుకుంటున్న రక్షణ చర్యలు, అధికారుల తనిఖీలు కూడా లోపభూయిష్టంగా ఉంటున్నాయి. ఉండాల్సిన స్థాయిలో వాటర్ ట్యాంకులు ఉన్నాయా? ఇసుక నిల్వలు ఉంచారా? తయారీ కేంద్రం ఊరికి దూరంగా ఏర్పాటు చేశారా లేదా? మంటలను ఆర్పే కార్బన్ డయాక్సైడ్ కిట్లు ఉందా లేదా చూసి లైసెన్సులు రెన్యువల్ చేయడం, కొత్తగా ఏర్పాటు చేసుకుంటే అనుమతులు మంజూరు చేస్తున్నారు. రాయవరంలో ప్రమాదానికి గురైన బాణసంచా తయారీ కేంద్రాన్ని కూడా అధికారులు ఇటీవల తనిఖీ చేసి రెన్యువల్ చేశారు. అటువంటి చోటే భారీ ప్రమాదం చోటు చేసుకోవడం గమనార్హం.



రసాయనాల పట్ల అవగాహన ఉండాలి

బాణసంచా **త**యారు చేసేందుకు వాడే **రసాయనాలపై** ప్రతి కార్మికునికి, కూలీ**లకు అవగాహన** ఉండాలి. ఇందుకు **ప్రభుత్వం ఆధ్వర్యం**లో వారికి ప్రత్యేక **శిక్షణ ఇవ్వాల్సి** ఉంది. రసాయనా**లను కలిపే** సమయంలో జాగ్రత్తలు **తీసుకోవడం** లేదు. ఇవన్నీ మండే **కారకాలే. కార్మి**కుల ఒంటి నిండా **రసాయనాలు** ఉంటున్నాయి. ఈ **కారణంగానే** చిన్న నిప్పురవ్వ రాజుకున్నా **పేలుడు** సంభవించడం, కార్మి**కుల చనిపోవడం** పరిపాటిగా మారింది.

– పెన్మెట్స కృష్ణ కిషోర్, రసాయన శాస్త్ర **అధ్యాపకుడు**, గోదావరి కాలుష్యంపై **అధ్యయనకర్త**, అమలాపురం

సెంట్రల్ లైబ్రరీ డిజైన్‌కు పోటీలు

సాక్షి, అమరావతి: అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో డిజైన్ పోటీలను నిర్వహిస్తామని గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. ప్రముఖ ఆర్కిటెక్చర్లు కూడా నిర్మాణ ఆకృతులను అందించాలని కోరారు. శుక్రవారం లైబ్రరీ నమూనా, నిర్మాణ రూపకల్పన అంశాలపై వర్క్ షాపు నిర్వహించామన్నారు.

16, 17 తేదీల్లో మూడో దశ మాన్యువల్ కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని ఉద్యాన కళాశాలల్లో ప్రవేశం కోసం ఈనెల 16, 17 తేదీల్లో మూడో దశ మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 16న 1,346 నుంచి 21,946 ర్యాంకర్లకు, 17న 60,497 ర్యాంకర్ల వరకు ఈ కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. విద్యార్థులు నేరుగా ధ్రువీకరణ పత్రాలతో వెంకటరామన్నగూడెంలోని వర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్‌లలో హాజరు కావాలన్నారు. వివరాల కోసం https://drysrhu.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ కోర్సులకు మాన్యువల్ కౌన్సెలింగ్

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలోని కాలేజీల్లో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన రెండో దశ ఎన్నారై కోటా, బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ కోర్సులకు మాన్యువల్ కౌన్సెలింగ్‌ను ఈనెల 13న నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంపీ రమణ శుక్రవారం తెలిపారు. గుంటూరు శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వివరాలకు www.angrau.ac.in సందర్శించాలని సూచించారు.

జీవో 90 ప్రకారమే డీఎస్సీ కౌన్సెలింగ్ చేపట్టాలి

బహుజన టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: జీవో 90 ప్రకారం ఎంపిక జాబితాను రీ ఆర్గనైజేషన్ చేసి మెరిట్ కమ్ రోస్టర్ ప్రకారం డీఎస్సీ–2025 కౌన్సెలింగ్ నిర్వహించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బొల్లిపో మనోజ్ కుమార్, చిట్టేటి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో 90ను పక్కన పడేసి కేవలం విద్యాశాఖ కమిషనర్ ఇచ్చిన నియమాలను అనుసరించి కౌన్సెలింగ్ నిర్వహించడం దారుణమన్నారు. ఫలితంగా రిజర్వ్ కేటగిరీ అభ్యర్థులు, దివ్యాంగులు, మహిళలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రిజర్వేషన్ వర్గాల వారికి తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు.

మహిళపై దాడికి ఉబర్ ఆటో డ్రైవర్ యత్నం !

శివాజీనగర(బెంగళూరు): ఉబర్ ఆటో డ్రైవర్ ఒకరు తనపై దాడికి పాల్పడ్డాడని ఈశాన్య భారత దేశానికి చెందిన ఓ మహిళ తన ఇన్‌స్టాలో ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ 2న ఈ ఘటన బెంగళూరులో జరిగిందని, ఆటోడ్రైవర్ కన్నడంలో దుర్భాషలాడుతూ తనపై దాడికి యత్నించాడని ఆరోపించారు. ఆమె పోస్టుచేసిన వీడియో వైరలైంది. ఆమె కథనం ప్రకారం.. అక్టోబర్ 2న ఆ మహిళ ఉబర్ ఆటోను బుక్ చేసుకున్నారు. అయితే ఆటో రాకపోవడంతో ఆమె బుకింగ్ రద్దు చేసుకుని మరో ఆటో ఎక్కారు. ఇంతలో ముందు బుక్ చేసుకున్న ఆటో వచ్చింది. ఆ ఆటోడ్రైవర్ హెచ్ఎస్ పవన్ రావడంతోనే మహిళ ఎక్కిన ఆటోను అడ్డుకున్నాడు. ఆమెను డబ్బులు డిమాండ్‌చేసి దూషించాడు. కొట్టేందుకు యత్నించాడు. ఆమెను వీడియోసైతం తీశాడు. బాధిత మహిళ ఇన్‌స్టా పోస్టును చూసిన బెంగళూరు పోలీసులు ఆమెను వివరాలు కోరారు. ఉబర్ సంస్థ కూడా మహిళకు క్షమాపణలు చెప్పింది.

90 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలివ్వాలి

ఏపీ రైతు, కౌలు రైతుల సంఘాలు డిమాండ్

సాక్షి, అమరావతి: కరువు ప్రాంతాల రైతులకు మేలు కలగాలంటే కనీసం 90 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు అందించాలని టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ఏపీ రైతు, కౌలు రైతుల సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆ సంఘాల రాష్ట్ర కార్యదర్శులు కె.ప్రభాకరరెడ్డి, ఎం.హరిబాబు శుక్రవారం ప్రకటనలు విడుదల చేశారు. రబీ సీజన్ ప్రారంభమైనా విత్తనాల సరఫరాపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని మండిపడ్డారు. సబ్సిడీ విత్తనాలు సరఫరా చేయకపోవడం వల్ల బహిరంగ మార్కెట్‌లో కొనాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 25 శాతం సబ్సిడీతో రైతులకు విత్తనాలు అందిస్తామంటున్న ధరకు.. బహిరంగ మార్కెట్ ధర దాదాపు సమానంగా ఉందని మండిపడ్డారు.

సూపర్ జీఎస్టీ ప్రచారం కోసంరూ.15కోట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను ప్రజలకు చేరువచేయడానికి సూపర్‌జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పేరిట రాష్ట్రంలో భారీ ఎత్తున కార్యక్రమాలు చేపట్టడానికి రూ.30 కోట్లు కేటాయించాల్సిందిగా రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ ఆర్థిక శాఖను కోరింది. 26 జిల్లాలకు రూ.26 కోట్లు, స్టేట్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్‌కి రూ.4 కోట్ల చొప్పున మొత్తం రూ.30 కోట్లు కేటాయించాల్సిందిగా కోరింది. ఈ లేఖను పరిశీలించిన రాష్ట్ర ఆర్థిక శాఖ రూ.15 కోట్లు కేటాయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అమరావతిలో ప్రవాస భారతీయ దివస్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎన్నారై పెట్టుబడులను ఆకర్షించడానికి అమరావతిలో 'ప్రవాస భారతీయ దివస్' నిర్వహించాల్సిందిగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. అవరావతిలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యాలయంతో పాటు ఎన్నారైలకు అవసరమైన సేవలన్నీ ఒకే చోట కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'విదేశ్ సంపర్క్ కార్యక్రమాన్ని' నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ.. విదేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొనే కార్మికులు, మరణించిన కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమష్టి కృషి అవసరమన్నారు. థాయిలాండ్, లావోస్, కాంబోడియా వంటి దేశాల్లో మోసపూరిత రిక్రూటర్ల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు ఎంబసీల నుంచి మరింత సహకారం అందించాలని అభ్యర్థించారు. విదేశీ విద్యార్థులకు పాస్‌పోర్ట్ సేవలు వేగవంతంగా అందించాలని, రాయలసీమ ప్రాంతానికి కడపలో కొత్త ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు.

16న కర్నూలు, శ్రీశైలంలో ప్రధాని పర్యటన

ఐదుగురు ఉన్నతాధికారులకు బాధ్యతలు

సాక్షి, అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 16న కర్నూలు, శ్రీశైలంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం, వీధి దీపాలు, సుందరీకరణ పనుల పర్యవేక్షణకు సీడీఎంఏ పి.సంపత్‌కుమార్, ఎస్‌ఏసీ ఎండీ అనిల్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ టి.గాయత్రీ దేవి, పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సీ ప్రభాకర్, ఏపీజీబీసీ ఎండీ ఎంకేవీ శ్రీనివాసుకు బాధ్యతలను అప్పగిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధాని పర్యటన సందర్భంగా పారిశుద్ధ్యం, వీధి దీపాలు, సుందరీకరణ పనుల కోసం రాయలసీమలోని 18 కార్పొరేషన్, మున్సిపాల్టీల కమిషనర్ల నేతృత్వంలో 80 మంది సూపర్‌వైజర్లు, 800 మంది కార్మికులు కర్నూలు, శ్రీశైలానికి వెళ్లాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 14న కర్నూలు కార్పొరేషన్ కమిషనర్ వద్ద 18 కార్పొరేషన్, మున్సిపాల్టీల కమిషనర్లు రిపోర్టు చేయాలని ఆదేశించారు. కర్నూలు కార్పొరేషన్ కమిషనర్ సమన్వయ అధికారిగా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ (అనంతపురం) పర్యవేక్షణ అధికారిగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికులు, సూపర్‌వైజర్లను కర్నూలు, శ్రీశైలానికి తరలించడానికి అయ్యే వ్యయాన్ని సంబంధిత కార్పొరేషన్‌లు, మున్సిపాల్టీలే భరించాలని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఏపీలో టెక్స్‌టైల్స్‌కు ఉజ్వల భవిష్యత్తుః మంత్రి సవిత

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టెక్స్‌టైల్స్ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని మంత్రి ఎస్.సవిత తెలిపారు. టెక్స్‌టైల్స్ రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి కూటమి ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందన్నారు. రాష్ట్ర సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో అమెల్ సీఆల్డ్ కన్సార్షియం ప్రతినిధులు ఆమెను శుక్రవారం కలిశారు. హిందూపురంలోని ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్స్ పార్క్‌లో పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నట్లు ఆ కంపెనీ ప్రతినిధులు డాక్టర్ చక్రవర్తి, సతీష్ తెలిపారు.

శ్రీశైలం, శ్రీకాళహస్తి ఆలయాలకు కొత్త పాలకమండళ్లు

సాక్షి, అమరావతి: నంద్యాల జిల్లా శ్రీశైలం శ్రీ భ్రమరాంబిక, మల్లికార్జున స్వామి, తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ఆలయాల కొత్త పాలకమండళ్ల(ట్రస్టు బోర్డు)ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో ట్రస్టు బోర్డులో 17 మంది చొప్పున సభ్యులను నియమించింది. కమిటీల్లో ఆలయాల్లో సీనియర్ అర్చకులుగా పనిచేసే ఒక్కొక్కరు అదనంగా ఎక్స్ అఫీషియో సభ్యునిగా కొనసాగుతారని దేవదాయ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి హరిజవహర్‌లాల్ ఆదేశాల్లో పేర్కొన్నారు. ట్రస్టు బోర్డు సభ్యులుగా బాధ్యత చేపట్టిన నాటి నుంచి రెండేళ్ల పాటు వీరంతా పదవుల్లో కొనసాగుతారని ఆదేశాల్లో స్పష్టం చేశారు.

పీఎం ధన ధాన్య కృషి యోజనకు నాలుగు జిల్లాలు ఎంపిక

సాక్షి, అమరావతి: పీఎం ధనధాన్య కృషి యోజన అమలు కోసం రాష్ట్రంలో నాలుగు జిల్లాలను ఎంపిక చేశారు. అల్లూరి, అనంతపురం, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాలు ఎంపికయ్యాయి. శనివారం ఢిల్లీలో ప్రధాని మోదీ ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ పథకం అమలు కోసం రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తూ శుక్రవారం వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆరేళ్ల పాటు అమలు చేయనున్న ఈ పథకం కోసం ఎంపిక చేసిన జిల్లాల్లో వ్యవసాయ ఉత్పాదకతకు ఆర్థిక చేయూత, పంట మళ్లింపు, పంటమార్పిడి అమలు, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, పంట కోత అనంతర నిల్వ సౌకర్యాల అభివృద్ధి, దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాల లభ్యతను సులభతరం చేయడం వంటి కార్యక్రమాలు చేపడతారు. రాష్ట్ర వ్యాప్తంగా కృషి విజ్ఞాన కేంద్రాల వద్ద పథకంపై శనివారం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు వెల్లడించారు.

ఏపీపీఎస్సీ చైర్మన్‌గా శశిధర్ బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) చైర్మన్‌గా సి.శశిధర్, కార్యదర్శిగా పి.రవి సుభాష్ శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఏపీపీఎస్సీ చైర్మన్ అనురాధ పదవీ కాలం ముగియడంతో సర్వీస్ కమిషన్‌లో జూనియర్ సభ్యుడైన శశిధర్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పెంపు

సాక్షి, అమరావతి: ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును ఇంటర్మీడియట్ విద్యా మండలి పొడిగించింది. జనరల్, ఒకేషనల్ విద్యార్థులు ఆలస్య రుసుము లేకుండా ఈ నెల 22లోగా ఫీజులు చెల్లించాలని సూచించింది. రూ.వెయ్యి ఆలస్య రుసుముతో ఫీజులు చెల్లించేందుకు 30వ తేదీ వరకు అవకాశమిచ్చినట్లు ఇంటర్మీడియట్ విద్యా కార్యదర్శి భరత్‌గుప్తా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

'ఉపాధి'లో తప్పనిసరిగా నీటి సంరక్షణ

ఉపాధి పథకం చట్టం నిబంధనల్లో మార్పులు చేస్తూ కేంద్రం గెజిట్

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం అమలులో అన్ని గ్రామ పంచాయతీల్లో నీటి సంరక్షణ పనులను తప్పనిసరి చేస్తూ కేంద్రం ఉపాధి హామీ పథక చట్టంలో మార్పులు చేసింది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటి వరకు భూగర్భ జలాలు అతి తక్కువగా ఉండే ఓవర్ హెక్స్‌ప్లాయిటెడ్, క్రిటికల్ కేటగిరీలో పేర్కొనే గ్రామ పంచాయతీల్లో మాత్రమే నీటి సంరక్షణకు 65 శాతం నిధులు ఉండేవి. అయితే, మిగిలిన అన్ని గ్రామ పంచాయతీల్లోనూ నిర్ణీత శాతం మేర నీటి సంరక్షణ పనులను తప్పనిసరి చేస్తూ కేంద్రం తాజాగా విడుదల చేసిన గెజిట్‌లో పేర్కొంది. భూగర్భ జల శాతం పరంగా సెమీ క్రిటికల్ కేటగిరి గ్రామ పంచాయతీల్లో 40 శాతం, ఇతర సేఫ్ కేటగిరీ పంచాయతీల్లో 30 శాతం పనులు నీటి సంరక్షణకు చేపట్టాలి.

పశుసంవర్ధక శాఖలోనూ పీ-4 అమలు

- వచ్చే ఏడాది నుంచి ప్రధానమంత్రి పశుబీమా పథకం
- ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్

సాక్షి, అమరావతి: ప్రభుత్వం అమలు చేస్తోన్న 'పీ–4' పథకం ద్వారా పశుపోషకులకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని పశుసంవర్థక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. విజయవాడలో పశు సంవర్థక శాఖాధికారులతో రాజశేఖర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేకలు, గొర్రెల సహకార సంఘాలను కార్పొరేట్ సంస్థలతో అనుసంధానించి అవసరమైన ఆర్థిక తోడ్పాటునందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం పీ–4 విధానంతో నూతన సాంకేతికతను జోడించి కార్పొరేట్ విధానంలో గొర్రెలు, మేకల సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు. ప్రతి జిల్లాలో సామూహిక పశు వసతి గృహాల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. 2026లో ప్రారంభిస్తున్న ప్రధాన మంత్రి పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పశుసంవర్థక శాఖ డైరెక్టర్ డాక్టర్ తానికొండ దామోదరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉంది

మంత్రి సవిత

గుంటూరు మెడికల్: గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం అనపర్రు బీసీ బాలుర వసతి గృహంలో అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, చేనేత సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను శుక్రవారం మంత్రి సవిత ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ హాస్టల్లో 108 మంది విద్యార్థులు ఉండగా శుక్రవారం 56 మంది అస్వస్థతకు గురయ్యారని వివరించారు. అధికారులు వెంటనే స్థానికంగానే ప్రాథమిక చికిత్స అందించారని తెలిపారు. అధిక జ్వరం ఉన్న 16 మందిని మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారని పేర్కొన్నారు.

పని గంటల పెంపు బిల్లు ఉపసంహరించాలి

సాక్షి, అమరావతి: పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో 8 గంటల పనిని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించిన బిల్లును ఉపసంహరించుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ.నల్లప్ప, ఆండ్ర మాల్యాద్రి శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రం అమలులోకి తెచ్చిన లేబర్ కోడ్‌లను అమలు చేయడంలోనే భాగంగానే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పని గంటల పెంపు నిర్ణయాన్ని తీసుకుందన్నారు. కార్మికుల శ్రమను యాజమాన్యాలు మరింత దోచుకోవడానికి అవకాశం కల్పించిందని మండిపడ్డారు.

• వండర్ వరల్డ్

బుజ్జి హిప్పో పుట్టింది



తల్లి పక్కన పసికళ్లతో చూస్తున్న ఈ బుల్లి హిప్పో అక్టోబర్ 6న బెర్లిన్ జూలో పుట్టింది. వాళ్లమ్మ పేరు 'నల'. ఆమె వయసు 13 సంవత్సరాలు. కవల పిల్లలు పుట్టారుగానీ ఒకటి చనిపోతే ఈ బుజ్జిది మిగిలి ఇలా తల్లి పక్కన నిలబడింది. బుజ్జి హిప్పో బరువు 26 కిలోలు ఉంది. హిప్పో పిల్లలు పుట్టినప్పుడు 40 కిలోల వరకూ ఉంటాయి. ఇది బరువు తక్కువ అన్నమాట. హిప్పోలు అంతరించిపోతున్న జీవుల్లో ఒకటిగా గుర్తించబడ్డాయి. అంటే వాటి సంతతి క్షీణిస్తున్నదన్నమాట. మనం పర్యావరణాన్ని కాపాడితే అన్నీ జీవరాశులు బతగ్గలుతాయి. అది గుర్తు పెట్టుకోవాలి మనం. మన దేశంలో 9000 ఏళ్ల క్రితం వరకు హిప్పోలు ఉండేవట. ఆ తర్వాత అవి అంతరించాయి. ఇప్పుడు కేవలం జూలలో మాత్రమే కనిపిస్తున్నాయి.

• వండర్ కిడ్

క్లైమేట్ వారియర్ షాల్వి

ఇక్కడ కనిపిస్తున్న అమ్మాయిని చూశారా? ఆ అమ్మాయి పేరు షాల్వి. ఫిజి దేశంలో పర్యావరణం కోసం పని చేస్తున్న చిన్నారి క్లైమేట్ వారియర్. ఆమె ఇలా ఎందుకు పని చేస్తున్నదో తెలుసా? 2016, ఫిబ్రవరి 20న ఉష్ణమండల తుఫాను ఫిజి దేశాన్ని తాకింది. గంటకు185 మైళ్ల వేగంతో గాలులు వీచాయి. రెండు రోజుల వ్యవధిలోనే ఫిజి దేశం అతలాకుతలమై పోయింది. విటి లెవు, వనువా లెవు అనే రెండు పెద్ద దీవులు సైతం తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఇది సుమారు 5.40 లక్షల మందిని ప్రభావితం చేసింది.

ఆ సమయంలో షాల్వి స్కూల్ విద్యార్థిని. ఆనాటి రోజుల్ని ఇప్పుడు గుర్తుచేసుకున్నా ఆమె ఉలిక్కిపడుతుంది. 'నా స్కూల్ తోటి విద్యార్థుల్లో కొందరు తమ ఇళ్లను కోల్పోయి మా పాఠశాలలోనే ఉండాల్సి వచ్చింది. తినడానికి తిండి గురించి ఆలోచించే వీలు లేదు. కనీసం తాగేందుకు నీరు కూడా దొరకలేదు' అని ఆమె వివరిస్తుంది. ఈ సమయంలో షాల్వికి ఫిజి దేశంలో జరుగుతున్న వాతావరణ మార్పులు ఆలోచనలు రేపాయి. నేల క్షీణత, పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా సముద్రపు నీరు వేడెక్కుతూ విస్తరిస్తోందని, తద్వారా మరో 60 సంవత్సరాల్లో ఫిజిలోని దీవులు కనుమరుగవుతాయని శాస్త్రవేత్తలు చెప్పిన మాటలు ఆమెలో కొత్త ఆలోచనలు రేకెత్తించాయి. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని తీర్మానించుకుంది.

పరిస్థితులు చక్కబడి, తిరిగి పాఠశాలకు వెళ్లడం మొదలయ్యాక పర్యావరణ మార్పుల గురించి మరిన్ని విషయాలు తెలుసుకోవడం మొదలుపెట్టింది షాల్వి. స్థానిక వక్తృత్వ పోటీలో పాల్గొని 'వాతావరణంలో మార్పు' అనే అంశం గురించి మాట్లాడింది. అందర్నీ తన ప్రసంగంతో ఆకట్టుకుంది. ఆమె ప్రతిభ, పట్టుదల ఏకంగా ప్రధానమంత్రి ముందు వెళ్లేలా చేశాయి. ఆ తర్వాత ఐక్యరాజ్యసమితి ఇ౹23లో ప్రసంగించడానికి ఆమెను ఆహ్వానించారు. ఆ సమావేశానికి హాజరైన అతి పిన్న వయస్కురాలు ఆమే కావడం విశేషం. అక్కడ ఆమె మాట్లాడుతూ వాతావరణంలోకి గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేయడాన్ని ఆపాలని ప్రపంచ నాయకులను కోరారు. ప్రస్తుతం షాల్వికి 13 ఏళ్లు. పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రసంగిస్తూ ఫిజి దేశ పరిస్థితులను వివరిస్తోంది.



• వండర్ వరల్డ్

మంచు నిండిన ఊరు

హిమాచల్ ప్రదేశ్ స్పిటి వ్యాలీలోని కోమిక్ గ్రామం గురించి విన్నారా? సంవత్సరంలో కొన్ని రోజులు తప్ప ఇక్కడ ఎప్పుడూ మంచే ఉంటుంది. ఇక్కడ ఎంత మంది నివశిస్తారో తెలుసా? కేవలం 130 మంది. వారిలో 90 మంది పురుషులు, 40 మంది స్త్రీలు. మన దేశంలో అత్యంత తక్కువ జనాభా ఉన్న కొండ పల్లె ఇదే.

సముద్ర మట్టానికి 15,000 అడుగుల ఎత్తులో ఉండే కోమిక్ ఆకాశాన్ని తాకే ఎత్తులో, చుట్టూ తెల్లటి హిమకొండలతో, పచ్చిక బయలను తనలో నింపుకుని ప్రకృతి ప్రేమికులను ఎంతగానో మైమరిపిస్తుంటుంది. ఇది బౌద్ధ సంప్రదాయాలకు నెలకొలువు. ఇక్కడి తంగ్యుద్ మఠం ఒక ఆధ్యాత్మిక కేంద్రం. 500 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ మఠం సాక్య సెక్ట్‌కు చెందినది. మాత్రే బుద్ధ (ఫ్యూచర్ బుద్ధ) విగ్రహాన్ని కలిగిన ఏకైక ప్రాంతం ఈ కోమిక్. ప్రతి 60 సంవత్సరాలకు ఒకసారి తెరిచే రహస్య భాండాగారాలైన డ్రాగన్ గుడ్డు, యూనికార్న్ శృంగం వంటి అద్భుతాలు సందర్శకులను ఆశ్చర్యపరుస్తాయి. ఈ మఠం భారతదేశంలోని అత్యంత ఎత్తైన మఠాల్లో ఒకటి.

కోమిక్ కేవలం ఆధ్యాత్మిక కేంద్రం మాత్రమే కాదు. ప్రకృతి ప్రేమికులకి ఇదొక స్వర్గం. హిమాలయాల మధ్య హైకింగ్ చేస్తూ, ఫాసిల్స్ శోధిస్తూ, స్థానిక యాక్ మిల్క్ టీ సిప్ చేస్తూ, గ్రామస్థుల ఆతిథ్యాన్ని ఆస్వాదించవచ్చు. స్పిటియన్ వంటకాలు, బటర్ టీ రుచి చూడటం ఒక అద్భుత అనుభవం. ఢిల్లీ నుండి మనాలీ లేదా షిమ్లా మీదుగా 700–800 కి.మీ. ప్రయాణించి కాజా నుండి ఒక గంటలో కోమిక్ చేరుకోవచ్చు. మే నుండి సెప్టెంబర్ వరకు సందర్శనకు ఉత్తమ సమయం. ఎందుకంటే శీతాకాలంలో మంచు రోడ్లను కప్పివేసి ప్రయాణాన్ని జటిలం చేస్తుంది. కోమిక్ ఒక అద్భుత ప్రపంచం. ఇక్కడ గడిపే ప్రతి క్షణం జీవితానికి ఒక మధురానుభూతిని ఇస్తుంది.





• మన పుస్తకాలు

మొక్కల ప్రాధాన్యం తెలిపే 'ఏ వాక్ ఆన్ ది టుండ్రా'

ఇనుజాక్ అనే చిన్న అమ్మాయి తన అమ్మమ్మతో కలిసి మంచుతో కప్పబడిన ప్రాంతంలో ప్రయాణిస్తుంది. అక్కడ ఇనుజాక్‌కు చిన్న చిన్న మొక్కలు కనిపిస్తాయి. మొదట వాటిని పెద్దగా పట్టించుకోని ఆ పాప అనంతరం ఆ మొక్కల ప్రాముఖ్యత తెలుసుకుంటుంది. ఆ తర్వాత ఏం చేసిందనేది ఈ పుస్తకంలోని కథ. ఆర్కిటిక్ ప్రాంతంలో విస్తృతంగా కనిపించే మొక్కల గురించి శాస్త్రీయ సమాచారం, ఛాయాచిత్రాలు ఈ పుస్తకానికి ప్రత్యేక ఆకర్షణ.




నీతి బోధించే కథలు 'అనగనగా'

పిల్లలకు కథలంటే చాలా ఇష్టం. వారికోసం రచయిత మాగంటి వంశీ మోహన్ కూర్చిన కథల సంపుటి 'అనగనగా'. ఇందులో కొన్ని కథలు ఆయన స్వయంగా రాసినవి కాగా, మరికొన్ని వివిధ దేశాల జానపద కథలకు స్వేచ్ఛానువాదాలు. ప్రతి కథలోనూ ఓ విశేషాన్ని చెప్తూ పిల్లలకు నీతి బోధించే కథలివి. చిన్న పిల్లలతోపాటు, పెద్దవాళ్లని కూడా ఆసక్తిగా చదివించే శైలితో రాశారు.



• మహనీయులు

తెలుగువారి కథాఖ్యాతి... శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి



పిల్లలూ! కథలు రాసేవారిని కథకులు అంటారని తెలుసుగా? అలాంటి తెలుగు కథకుల్లో విశిష్ట స్థానాన్ని పొందినవారు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి. 20వ శతాబ్దపు తెలుగు కథకులలో చెప్పుకోదగ్గ రచయిత. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 1891 ఏప్రిల్ 23న తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం పొలమూరులో జన్మించారు. తల్లిదండ్రులు మహాలక్ష్మి సోదెమ్మ, లక్ష్మీపతి సోమయాజులు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి వేదం, జ్యోతిష్యం, ధర్మశాస్త్రాలను చదివారు. చిన్ననాటి నుంచి తెలుగు భాష పట్ల మక్కువతో మెలిగారు. ఆయన మొదటి కథ 'ఇరువురము ఒక్కచోటికే పోదాము' 1915లో ప్రచురితమైంది. 1923 వరకు శ్రీపాద గ్రాంథిక భాషలో రచనలు చేశారు. ఆ తర్వాత పూర్తిగా వ్యావహారిక భాషలో రాయడం మొదలుపెట్టారు. మొత్తం 75 కథలు రాశారు. ప్రతి కథలోనూ ఓ భిన్నమైన విషయాన్ని పాఠకులకు అందించేవారు. కుటుంబ జీవితం గురించి, సమాజంలోని రుగ్మతల గురించి ఆయన కథల్లో చర్చించారు. శ్రీపాద తొమ్మిదేళ్ళ పాటు ప్రబుద్ధాంధ్ర అనే పత్రిక నిర్వహించారు. వివిధ కలం పేర్లతో అనేక వ్యాసాలు రాశారు. అష్టావధానాలు చేయడంలో ఆయన దిట్ట. తన జీవితంలో జరిగిన విశేషాలను 'అనుభవాలూ–జ్ఞాపకాలూను' పేరిట ఆత్మకథగా రాశారు. తెలుగువారంతా తప్పక చదవాల్సిన పుస్తకంగా అది పేరు పొందింది. శ్రీపాద కథల్లో కలుపు మొక్కలు, గులాబీ అత్తరు, మార్గదర్శి, ఇలాంటి తవ్వాయి వస్తే, షట్కర్మయుక్తా, పుల్లంపేట జరీచీర, వడ్లగింజలు, అరికాళ్ళకింద మంటలు, గుర్రప్పందాలు తదితర కథలు ప్రసిద్ధి పొందాయి. 1961 ఫిబ్రవరి 25న మరణించారు.


• మీకు తెలుసా?

గొంగడి గురించి మీకు తెలుసా?











పిల్లలూ! 'గొంగడి' గురించి మీకు తెలుసా? మీ ఇంట్లో గొంగడి ఉందా? ఒకప్పుడు ప్రతి ఒక్కరి ఇళ్లల్లో గొంగడి ఉండేది. వ్యవసాయ, పాడి ఆధారిత కుటుంబాల్లో తప్పకుండా కనిపించే వస్తువు ఇది. ప్రస్తుతం పట్టణాల్లో దీని వాడకం తగ్గినా పల్లెల్లో ఇంకా వాడుతున్నారు. ముఖ్యంగా పశువుల కాపర్లు జీవాలను మేతకు తీసుకువెళ్లే సమయంలో గొంగడిని తమ వెంట తీసుకువెళ్తుంటారు. భారతదేశానికి వస్త్ర పరిశ్రమ రంగంలో గొంగడికి కీలకమైన స్థానం ఉంది. గొంగడి అనేది ఉన్నితో తయారు చేసిన దుప్పటి. మరాఠీలో దీన్ని 'ఘొంగడి' అంటారు. దీన్ని చేత్తో తయారు చేస్తారు. దీనికి అపారమైన ఆరోగ్య ప్రయోజనాలు, సాంస్కృతిక విలువలు ఉన్నాయి. గతంలో వ్యవసాయ ఆధారిత కుటుంబాల్లో వివాహ ప్రతిపాదనలు ఏర్పాటు చేసేటప్పుడు గొంగడిని వినియోగించేవారు. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు కూర్చోడానికి, విశ్రమించడానికి దీన్ని వాడేవారు. ఎండ, వాన, చలి నుంచి రక్షణగా నిలిచేందుకు ఇదెంతో సౌకర్యవంతంగా ఉంటుంది. వర్షంలో ఈ గొంగడి కప్పుకుంటే గొంగడి తడిసిపోయినా లోపలున్నవారికి ఆ తడి తగలదు. అది గొంగడి విశిష్టత. మహారాష్ట్రలోని పలు గ్రామాల్లో అతిథులను స్వాగతించడానికి నేటికీ ఈ గొంగడిని ఉపయోగిస్తారు. అతిథుల్ని గొంగడిపై కూర్చోబెట్టడం గౌరవప్రదంగా భావిస్తారు. జూన్–ఆగస్టు నెలల మధ్య గొంగడి తయారీ ప్రారంభమవుతుంది. ఈ నెలల్లో గొర్రెల నుండి ఉన్నిని తీస్తారు. దాన్ని రంగుల ఆధారంగా వేరు చేస్తారు. సాధారణంగా ఉన్ని నలుపు, తెలుపు, గోధుమ రంగులలో ఉంటుంది. ఇందులో తెల్ల రంగు గొంగడి చాలా అరుదుగా కనిపిస్తుంది. 8 అడుగుల గొంగడిని తయారు చేయడానికి 350 గజాల ఉన్ని అవసరం. 10, 12 అడుగుల గొంగడికి 400, 450 గజాల ఉన్ని అవసరం అవుతుంది. చేతి మగ్గంపై ఒక గొంగడిని నేయడానికి ఎనిమిది నుండి పది గంటల సమయం పడుతుంది. నేయడం పూర్తయ్యాక దుప్పటికి చింతపండు గింజల రసం పూసి, రెండు నుండి మూడు రోజులు ఎండలో ఉంచుతారు. ఆ తర్వాత గొంగడి వినియోగానికి సిద్ధమైనట్లే.

• కథ

రాతి రథం





విదర్భ రాజ్యాన్ని చంద్రసేన మహారాజు పరిపాలిస్తున్నాడు. దైవభక్తి కలిగిన ఆయన రాజ్యం మధ్యలో పెద్ద వైష్ణవాలయాన్ని కట్టించాడు. స్వామికి రాతి రథం చేయించాలని ఎన్నో రోజుల నుంచి అనుకుంటున్నా అందుకు తగ్గ శిల్పి దొరకడం లేదు. చివరకు నారాయణాచారి అనే శిల్పి గురించి చంద్రసేనుడికి తెలిసింది. ఆయన రాతిరథం అద్భుతంగా తయారు చేయగలడని చంద్రసేనుడు భావించాడు. వెంటనే నారాయణాచారిని ఆస్థానానికి పిలిపించి ఆలయానికి రాతి రథం చేయమని కోరాడు. 'రాజా! శిల్ప కళ నాదే అయినా, నాకు ఆ కళను ప్రసాదించింది ఆ భగవంతుడు. నేను ఇంటికి వెళ్లి భగవంతుణ్ని ధ్యానిస్తాను. ఆయన అనుమతి ఇస్తే తప్పక రథం చేస్తాను. లేదంటే నేను ఆ పని చేయలేను' అని చెప్పాడు నారాయణాచారి. చంద్రసేనుడు సరేనన్నాడు. ఇంటికి వెళ్లిన నారాయణాచారి భగవత్ ధ్యానంలో మునిగిపోయాడు. మూడు రోజులు గడిచినా ఆయన ధ్యానం నుంచి బయటకు రాలేదు. ఆయన చెప్పే సమాధానం కోసం చంద్రసేనుడు ఎదురుచూస్తున్నాడు.

నాలుగో రోజు నారాయణాచారి ధ్యానంలోనుంచి బయటకు వచ్చాడు. నేరుగా చంద్రసేనుడి దగ్గరకు వెళ్లి రాతి రథం చేసేందుకు ఒప్పుకున్నాడు. దీంతో రాజు సంతోషించి అందుకు తగిన ఏర్పాట్లు చేశాడు. మూడు నెలలు శ్రమించి నారాయణాచారి రాతి రథం తయారు చేశాడు. నాలుగు అంతస్తుల ఎత్తులో భారీగా ఉన్న ఆ రథాన్ని రాచవీధిలో ఉంచారు. ప్రజలంతా ఆ రథాన్ని చూస్తూ నారాయణాచారి ప్రతిభను గొప్పగా పొగిడారు. చంద్రసేనుడు సంతోషంతో తబ్బిబ్బయ్యాడు. నారాయణాచారి దగ్గరికి వెళ్లి 'రథం తయారు చేసినందుకు ఏం కావాలో కోరుకోండి సమర్పిస్తాను' అని వినమ్రంగా అడిగాడు. 'ఏదడిగినా కాదనకూడదు' అని శిల్పి షరతు పెట్టాడు. 'నా రాజ్యం మొత్తం ఇమ్మన్నా ఇచ్చేస్తాను. మాట తప్పను' అని చంద్రసేనుడు వాగ్దానం చేశాడు. 'అయితే రథాన్ని ప్రారంభించే రోజు అడుగుతాను' అన్నాడు నారాయణాచారి.

రథాన్ని ప్రారంభించేందుకు పండితులు ముహూర్తం పెట్టారు. రథాన్ని ప్రారంభించే ముందు చంద్రసేనుడు నారాయణాచారిని ఏం కావాలో కోరుకొమ్మని అడిగాడు. 'ఈ ఒక్క రోజు ఈ రాజ్యానికి నేను రాజుగా ఉండాలి' అని అడిగాడు శిల్పి. ఆ మాటతో అక్కడున్నవారందరూ ఆశ్చర్యపోయారు. చంద్రసేనుడు మాత్రం తాను ఇచ్చిన మాట తప్పను అంటూ నారాయణాచారిని ఆ ఒక్క రోజు తన రాజ్యానికి రాజుగా ప్రకటించారు. రథం ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆ రాజ్యానికి రాజుగా ఉన్న వ్యక్తి రథాన్ని ముందుగా లాగాలి. ఆ తర్వాత ప్రజలంతా లాగి పురవీధుల్లో తిప్పుతారు. దీంతో ఆ ఒక్క రోజు రాజుగా ఉన్న నారాయణాచారి రథానికున్న తాడును పట్టుకుని ముందుకు లాగాడు. ఆయన వెంట ప్రజలంతా ఆ తాడు పట్టుకొని ముందుకు కదిలారు. భారీ రథం ముందుకు కదిలింది. కొద్దిదూరం వెళ్లగానే చక్రాలు అదుపు తప్పి రథం ప్రజల మీదకు దూసుకెళ్లింది. రథానికి ముందుగా ఉన్న నారాయణాచారి కింద పడగా ఆయన మీద నుంచి రథం వెళ్లి ఆగిపోయింది.

హుటాహుటిన ఆయన్ను పక్కకి తీసుకెళ్లి సపర్యలు చేశారు. ఆయన చంద్రసేనుణ్ని పిలిచి 'రాజా! నాకు శిల్పకళతోపాటు జోతిష్యం కూడా తెలుసు. ఈ రథాన్ని ప్రారంభించిన రోజే ఈ రాజ్యప్రభువు మరణిస్తాడని కనుగొన్నాను. అందుకే ఈ ఒక్క రోజు నేను రాజుగా ఉంటానని కోరాను. నా కోరికను మీరు మన్నించారు. మీవంటి రాజు దేశానికి, ప్రజలకు ఎంతో అవసరం. మిమ్మల్ని కాపాడుకున్నానన్న తృప్తితో కన్ను మూస్తున్నాను' అంటూ నారాయణాచారి మరణించారు. ఆయన త్యాగనిరతికి కన్నీరు పెట్టిన చంద్రసేనుడు ఆ రాతి రథంపై నారాయణాచారి పేరు చెక్కించి ఆయనను కలకాలం గుర్తుంచుకునేలా చేశారు.

బిజినెస్ రీల్

700 బిలియన్ డాలర్ల దిగువకు ఫారెక్స్ నిల్వలు



ముంబై: విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు రెండో వారమూ కరిగిపోయాయి. అక్టోబర్ 3వ తేదీతో ముగిసిన వారంలో 276 మిలియన్ డాలర్లు తగ్గి 699.96 బిలియన్ డాలర్లకు పరిమితయ్యాయి. అంతకుముందు వారంలో ఇవి 2.334 బిలియన్ డాలర్లు తగ్గి 700.236 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు ఆర్‌బీఐ డేటా తెలిపింది. సమీక్షా వారంలో, విదేశీ కరెన్సీ ఆస్తులు 4.049 బిలియన్ డాలర్లు తగ్గి 577.708 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. బంగారం నిల్వల విలువ 3.753 బిలియన్ డాలర్లు పెరిగి 98.77 బిలియన్ డాలర్లకు చేరాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్(ఎస్‌డీఆర్) 25 మిలియన్లు పెరిగి 18.814 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) వద్ద భారత ద్రవ్య నిల్వలు 4 మిలియన్ డాలర్లు తగ్గి 4.6669 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

టీటీకే ప్రెస్టీజ్ టీవీసీ ప్రచార ప్రకటనలు

హైదరాబాద్: వంట సామాగ్రి బ్రాండ్ టీటీకే ప్రెస్టీజ్ 'సెలబ్రేటింగ్ ఎవ్రీ కైండ్ ఆఫ్ కుక్' పేరుతో కొత్త టీవీసీ ప్రచారాన్ని డీడీబీ ముద్ర గ్రూప్ కలిసి ప్రారంభించింది. ప్రచారంలో భాగంగా ఒకటి రజత్ కపూర్ నటించిన 'ఎండురా ప్రో మిక్సర్ గ్రైండర్', మరొకటి 'స్వచ్ఛ గ్యాస్ స్టవ్' గురించి ప్రకటనలు ఉన్నాయి. వంటగదిలో మీరు ఎలాంటి ఆలోచనల్లో నిమగ్నమై ఉన్నా.., మీ కోసం ఒక ప్రెస్టీజ్ ఉంటుంద సందేశం ప్రకటనలు తెలియజేస్తాయి. 'ప్రతి వంట అనుభవాన్ని మరింత సులభం చేసేందుకు ప్రెస్టీజ్ ఉత్పత్తులు ఎల్లప్పుడూ ముందుంటాయి' అని టీటీకే ప్రెస్టీజ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ శ్రీ అనిల్ గుర్నాని తెలిపారు.

భారత్‌లో ట్రావెల్ కార్డుపై వైజ్ కసరత్తు



న్యూఢిల్లీ: కరెన్సీ మార్పిడి సమయంలో మరింత అధిక విలువ లభించేలా, రియల్ మిడ్–మార్కెట్ ఎక్స్ఛేంజ్ రేటు ప్రయోజనాలను అందించే ట్రావెల్ కార్డును భారత్‌లో ప్రవేశపెట్టడంపై గ్లోబల్ ఫిన్‌టెక్ సంస్థ వైజ్ కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించిన వైజ్ ట్రావెల్ కార్డ్ వెయిట్‌లిస్టును ప్రారంభించినట్లు సంస్థ తెలిపింది. దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టే ఈ తరహా కార్డుతో 40 కరెన్సీలవ్యాప్తంగా ప్రయోజనాలు పొందవచ్చని పేర్కొంది. హిడెన్ చార్జీల సమస్యలు ఉండవంది. ఇటీవలే హైదరాబాద్‌లో కార్యాలయాన్ని ప్రారంభించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-10-2025

విశాఖ	515-00
చిత్తూరు	538-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.80

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
CIPLA	1,568.00	3.63
SBIN	881.25	2.22
MARUTI	16,285.00	1.88
BAJAJ-AUTO	8,943.00	1.51
DRREDDY	1,264.00	1.44

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATASTEEL	173.85	-1.46
TCS	3,028.00	-1.1
HDFCLIFE	748.8	-0.74
JSWSTEEL	1,167.80	-0.63
SHRIRAMFIN	665	-0.61

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,211
ఎన్ఎస్ఈ	94,005
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,55,210
ఎఫ్ఐఐ	+ 459
డీఐఐ	+ 1,708

ముడిచమురు... (బ్యారల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	65.53	$	65.24
బ్రెంట్	66.85	$	66.69

ఈక్విటీ ఫండ్స్ ▸ పెట్టుబడుల్లో తగ్గిన జోరు

- సెప్టెంబర్లో రూ.33,430 కోట్లు రాక
- 9 శాతం తగ్గుముఖం
- 'సిప్'లకు కొనసాగుతున్న ఆదరణ
- గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌లోకి భారీ పెట్టుబడులు



న్యూఢిల్లీ: మార్కెట్లలో ఆటుపోట్లు, అంతర్జాతీయ అనిశ్చితుల మధ్య ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల్లో జోరు తగ్గినట్టు కనిపిస్తోంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడుల రాక వరుసగా రెండో నెలలోనూ తగ్గుముఖం పట్టింది. సెప్టెంబర్ నెలలో నికరంగా రూ.30,421 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఆగస్ట్‌లో వచ్చిన రూ.33,430 కోట్లతో పోల్చి చూస్తే 9 శాతం తగ్గాయి. ఈ ఏడాది జూలైలో వచ్చిన రూ.42,703 కోట్లు నెలవారీ ఆల్‌టైమ్ గరిష్ట పెట్టుబడులుగా ఉన్నాయి. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) ఈ వివరాలను విడుదల చేసింది. వరుసగా 55వ నెలలోనూ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ నికరంగా పెట్టుబడులను ఆకర్షించడం గమనార్హం. దీర్ఘకాలంలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ మెరుగైన పనితీరు చూపిస్తాయనే విషయంలో ఇన్వెస్టర్లలో విశ్వాసానికి ఇది నిదర్శనమని నిపుణులు పేర్కొంటున్నారు. ఈక్విటీ ఫండ్స్‌లోకి పెట్టుబడుల రాక తగ్గడం అన్నది సైక్లికల్ తప్ప (తాత్కాలికం) నిర్మాణాత్మకం కాదని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ మేనేజర్ నేహల్ మెష్రామ్ పేర్కొన్నారు. పెట్టుబడులు మోస్తరు స్థాయికి పరిమితం కావడం వెనుక థీమ్యాటిక్ ఫండ్స్ నిధుల సమీకరణ తగ్గడమే కారణమని శామ్కో మ్యూచువల్ ఫండ్ సీఈవో విరాజ్ గాంధీ తెలిపారు.

సిప్ రూపంలో రూ.29,361 కోట్లు

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లోకి సెప్టెంబర్ నెలలో రూ.29,361 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇన్వెస్టర్లు దీర్ఘకాల దృష్టితో పెట్టుబడులకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఇది తెలియజేస్తోంది. ఆగస్ట్‌లో సిప్ పెట్టుబడులు రూ.28,265 కోట్లుగా ఉన్నాయి. సిప్ ఖాతాల సంఖ్య ఆగస్ట్ చివరికి ఉన్న 8.99 కోట్ల నుంచి 9.25 కోట్లకు చేరింది. ఒక ఇన్వెస్టర్‌కు ఒకటికి మించిన ఖాతాలు ఉండొచ్చు. ఒక పథకంలో పెట్టుబడిని ఒక ఖాతా (ఫోలియో) కింద పరిగణిస్తారు. సిప్ రూపంలోని మొత్తం నిర్వహణ ఆస్తుల విలువ రూ.15.52 లక్ష లకోట్లకు చేరింది.

విభాగాల వారీగా..


- ఈక్విటీ ఫండ్స్ అన్నింటిలోకి ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ అత్యధికంగా రూ.7,029 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. ఈ విభాగంలోకి పెట్టుబడులు బలంగా రావడం వరుసగా మూడో నెలలోనూ కనిపించింది. మార్కెట్ క్యాప్‌తో సంబంధం లేకుండా మెరుగైన పెట్టుబడుల అవకాశాలు ఎక్కడ ఉన్నా ఫ్లెక్సీక్యాప్ ఇన్వెస్ట్ చేస్తుంటాయి.
- మిడ్‌క్యాప్ ఫండ్స్ రూ.5,085 కోట్లు, స్మాల్ క్యాప్ ఫండ్స్ రూ.4,363 కోట్ల చొప్పున నికరంగా ఆకర్షించాయి.
- లార్జ్‌క్యాప్ ఫండ్స్‌లోకి వచ్చిన పెట్టుబడులు రూ.2,319 కోట్లుగా ఉన్నాయి.
- సెక్టోరల్/థీమ్యాటిక్ ఫండ్స్‌లోకి పెట్టుబడుల రాక రూ.1,220 కోట్లకు పరిమితమైంది.
- పన్ను ఆదాకు ఉపకరించే ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ నుంచి రూ.308 కోట్లు, డివిడెండ్ ఈల్డ్ ఫండ్స్ నుంచి రూ.168 కోట్లు చొప్పున బయటకు వెళ్లాయి.
- హైబ్రిడ్ ఫండ్స్ రూ.2,014 కోట్లు, ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్ రూ.1,747 కోట్లు, ఆర్బిట్రేజ్ ఫండ్స్ రూ.988 కోట్ల చొప్పున ఆకర్షించాయి.
- డెట్ మ్యూచువల్ ఫండ్స్ నుంచి సెప్టెంబర్‌లో రూ.1.02 లక్షల కోట్లను ఇన్వెస్టర్లు ఉపసంహరించుకున్నారు. ఆగస్ట్‌లో డెట్ ఫండ్స్ నుంచి ఉపసంహరణలు రూ.7,980 కోట్లుగానే ఉన్నాయి. దీంతో పోల్చితే ఉపసంహరణలు గణనీయంగా పెరిగాయి.
- మొత్తం మీద మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ సెప్టెంబర్ నెలలో రూ.43,146 కోట్ల పెట్టుబడులను కోల్పోయింది. పరిశ్రమ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.75.61 లక్షల కోట్లకు చేరింది. ఆగస్ట్ చివరికి ఇది రూ.75.12 లక్షల కోట్లుగా ఉంది.

గోల్డ్ ఫండ్స్‌కు డిమాండ్

బంగారం ధరలు ఇటీవలి కాలంలో స్థిరమైన ర్యాలీ చేస్తుండడం ఇన్వెస్టర్లను ఆకర్షిస్తోంది. ఇందుకు నిదర్శనంగా సెప్టెంబర్‌లో రూ.8,363 కోట్ల పెట్టుబడులు గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి (గోల్డ్ ఈటీఎఫ్‌లు) వచ్చాయి. ఒక నెలలో అత్యధిక పెట్టుబడులు రాక ఇదే. ఆగస్ట్‌లో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి వచ్చిన పెట్టుబడులు రూ.2,190 కోట్లుగా ఉన్నాయి. దీంతో గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ రూ.90,000 కోట్ల మార్క్‌ను చేరుకుంది. ''బంగారం బలమైన ర్యాలీ చేయడం ఈ పెట్టుబడుల ధోరణికి కారణమని ఏంజెల్ వన్ ఏఎంసీ ఈడీ, సీఈవో హేమెన్ భాటియా తెలిపారు. సిల్వర్ (వెండి) ఈటీఎఫ్‌లు సైతం మెరిశాయి. ఇటీవలి కాలంలో వెండి ధరలు సైతం భారీగా పెరగడం చూస్తున్నాం. దీంతో సెప్టెంబర్‌లో సిల్వర్ ఈటీఎఫ్‌ల్లోకి రూ.5,342 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. సిల్వర్ ఈటీఎఫ్ నిర్వహణ ఆస్తులు రూ.36,461 కోట్లకు చేరాయి. ఈక్విటీ, డెట్‌తోపాటు బంగారం వెండిలోనూ పెట్టుబడులు పెట్టే – మల్టీ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్‌లోకి రూ.4,982 కోట్లు వచ్చాయి.

మన గురించి మనమే చెప్పుకోవాలి

- లేకపోతే వేరే వాళ్లు మన తలరాత రాస్తారు
- మౌనం వహిస్తే లొంగిపోయినట్లే..
- విజ్లింగ్ ఉడ్స్ కార్యక్రమంలో గౌతమ్ అదానీ



న్యూఢిల్లీ: సినిమాలు, కొత్త టెక్నాలజీలు మొదలైన మాధ్యమాల ద్వారా అసమాన వృద్ధి గాథను అంతర్జాతీయంగా భారత్ స్వయంగా చాటి చెప్పాల్సిన అవసరం ఉందని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ తెలిపారు. 'మౌనం వహించడమనేది వినయం కాదు. లొంగిపోవడం. మన గురించి మనమే చెప్పుకోకపోతే, వేరే వాళ్లు మన గురించి ఇష్టమొచ్చినట్లుగా రాస్తారు' అని ఫిలిం, కమ్యూనికేషన్స్, ఆర్ట్స్ సంస్థ విజ్లింగ్ ఉడ్స్ ఇంటర్నేషనల్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఉద్బోధించారు. పాశ్చాత్య దృష్టికోణంతో తీసిన గాంధీ, స్లమ్‌డాగ్ మిలియనీర్‌లాంటి చిత్రాలే దీనికి నిదర్శనమన్నారు. తన కథను ప్రపంచానికి చెప్పడంలో భారత్ విఫలమైనందునే, ఇతరులు వాస్తవ పరిస్థితులను మార్చేసి లబ్ధి పొందేందుకు ఆస్కారం లభించిందని అదానీ పేర్కొన్నారు. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. స్టోరీటెల్లింగ్ అనేది రెండు వైపులా పదునున్న కత్తిలాంటిదని ఆయన తెలిపారు. 2023లో అమెరికన్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో అదానీ గ్రూప్ మార్కెట్ విలువ ఎకాయెకిన 100 బిలియన్ డాలర్లు పడిపోయిందని, దశాబ్దాల కష్టం ఏ విధంగా తప్పుడు కథనాలతో రాత్రికి రాత్రి తుడిచిపెట్టుకుపోతుందనడానికి ఇది నిదర్శనమని అదానీ వ్యాఖ్యానించారు.

'కొద్ది రోజుల వ్యవధిలోనే మా మార్కెట్ విలువ 100 బిలియన్ డాలర్లు పైగా పడిపోయింది. ఇదేదో ఫండమెంటల్స్ మారడం వల్లో లేక వాస్తవ పరిస్థితుల వల్లో జరిగినది కాదు. కేవలం ఒక తప్పుడు కథనాన్ని ఆయుధంగా మార్చుకోవడం వల్ల జరిగినది. నేటి ప్రపంచంలో నిజాన్ని గట్టిగా అరిచి చెప్పాలని ఈ అనుభవం నాకు నేర్పింది. ఎందుకంటే మనం మౌనం వహిస్తే, మన తలరాతను ఇతరులు రాసేందుకు అస్కారం ఇచ్చినట్లవుతుంది' అని ఆయన పేర్కొన్నారు. టాప్‌గన్, ఇండిపెండెన్స్ డే, బ్లాక్ హాక్ డౌన్‌లాంటి అమెరికన్ సినిమాలు కేవలం చిత్రాలే కాదని, శక్తి సామర్థ్యాల ప్రదర్శన కూడా అని అదానీ చెప్పారు. రాబోయే రోజుల్లో సినిమా భవిష్యత్తును కృత్రిమ మేథ సరికొత్తగా తీర్చిదిద్దుతుందని ఆయన తెలిపారు. ఈ సాధనాలను ఉపయోగించుకుని భారత గాథను ప్రామాణికంగా ప్రపంచానికి చాటి చెప్పాలని యువ క్రియేటర్లకు సూచించారు.

ఫిబ్రవరి నాటికి సావరీన్ ఏఐ నమూనా

ఎలక్ట్రానిక్స్, ఐటీ కార్యదర్శి ఎస్ కృష్ణన్ వెల్లడి



న్యూఢిల్లీ: భారతదేశపు సావరీన్ కృత్రిమ మేథ (ఏఐ) నమూనాపై కసరత్తు జరుగుతోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్ తెలిపారు. ఫిబ్రవరిలో జరిగే ఏఐ ఇంపాక్ట్ సమిట్ నాటికి ఆవిష్కరించే అవకాశం ఉందని ఇండియా మొబైల్ కాంగ్రెస్ 2025లో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. ఈ ఏడాది ఆఖరు నాటికి ఫౌండేషనల్ మోడల్ సిద్ధం కాగలదని కృష్ణన్ వివరించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 19, 20 తేదీల్లో ఏఐ ఇంపాక్ట్ సదస్సు రెండు రోజులపాటు జరగనుంది. ఏ దేశమైనా పూర్తిగా సొంత మౌలిక సదుపాయాలు, సిబ్బంది, వనరులతో రూపొందించే ఏఐ మోడల్‌ను సావరీన్ ఏఐ మోడల్‌గా వ్యవహరిస్తారు. కృత్రిమ మేధ ప్రభావాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని, అందరూ పాలుపంచుకునేందుకు వీలుండే ప్లాట్‌ఫాంలను రూపొందించే ప్రయత్నాలు జరుగుతున్నాయని కృష్ణన్ చెప్పారు. ఏఐలోకి ఆలస్యంగా అడుగుపెట్టినప్పటికీ, 38,000 జీపీయూలతో (గ్రాఫిక్స్ ప్రాసెసింగ్) కంప్యూట్ మౌలిక సదుపాయాలను భారత్ వేగంగా పెంచుకుందని ఆయన పేర్కొన్నారు. భారత్ అవసరాలకు తగ్గట్లు, రంగాలవారీగా పనికొచ్చే చిన్న మోడల్స్ రూపకల్పనను ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని, ఇలాంటివి ఉత్పాదకతను పెంచుకునేందుకు సహాయకరంగా ఉంటాయని కృష్ణన్ వివరించారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0 కింద కీలక లక్ష్యాల్లో స్వదేశీ జీపీయూ రూపకల్పన కూడా ఒకటని ఆయన పేర్కొన్నారు.

లండన్‌లో టీసీఎస్ ఏఐ జోన్

మూడేళ్లలో 5,000 ఉద్యోగాలు



న్యూఢిల్లీ: ఐటీ సేవల దేశీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) లండన్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఎక్స్‌పీరియన్స్ జోన్‌కు తెరతీయనుంది. ఏఐ కేంద్రంతోపాటు డిజైన్ స్టుడియోను ఏర్పాటు చేయనున్నట్లు టీసీఎస్ పేర్కొంది. తద్వారా యూకేలో పెట్టుబడులను కొనసాగించనున్నట్లు తెలియజేసింది. ఈ నేపథ్యంలో రానున్న మూడేళ్లలో అక్కడ దేశవ్యాప్తంగా 5,000 ఉద్యోగాలను కల్పించనున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం యూకేలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 42,000 మందికి పైగా మద్దతిస్తున్నట్లు తెలియజేసింది. అకాడమిక్ ఇన్‌స్టిట్యూషన్స్, స్టార్టప్స్‌సహా ఇతర భాగస్వామ్యాలతో నెలకొల్పిన ఇన్నొవేషన్ ఎకోసిస్టమ్‌ను వినియోగించుకోనున్నట్లు వివరించింది.

టాటా సన్స్‌ని లిస్ట్ చేయాల్సిందే..

ఎస్‌పీ గ్రూప్ చైర్మన్ షాపూర్‌జీ పల్లోంజీ మిస్త్రీ పునరుద్ఘాటన

న్యూఢిల్లీ: టాటా ట్రస్ట్స్ ట్రస్టీల మధ్య విభేదాలు నెలకొన్న తరుణంలో, టాటా సన్స్‌ను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేయాలన్న డిమాండ్‌ను ఎస్‌పీ గ్రూప్ చైర్మన్ షాపూర్‌జీ పల్లోంజీ మిస్త్రీ పునరుద్ఘాటించారు. సంస్థ లిస్టింగ్‌తోనే వ్యవస్థాపకుడు జంషెట్జీ టాటా కోరుకున్న పారదర్శకత సాధ్యపడుతుందని, ఉద్యోగులు, ఇన్వెస్టర్లు, ప్రజల్లో నమ్మకం కూడా పెరుగుతుందని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. టాటా సన్స్‌ను లిస్టింగ్ చేయాలంటూ తాము ఎప్పటినుంచో కోరుతున్నామని వివరించారు. ఈ నేపథ్యంలో టాటా సన్స్‌ను అప్పర్ లేయర్ సంస్థగా లిస్ట్ చేయాలంటూ రిజర్వ్ బ్యాంక్ విధించిన గడువును సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఘనమైన వారసత్వాన్ని నిలబెట్టుకునేందుకు, భవిష్యత్తులో ముందుకు సాగేందుకు పారదర్శకత అత్యంత కీలకమనేది తమ నమ్మకమని మిస్త్రీ వివరించారు. ఆర్‌బీఐ ఒక రాజ్యాంగబద్ధమైన, స్వతంత్ర సంస్థగా సమానత్వం, న్యాయం, ప్రజాప్రయోజన సూత్రాలను నిలబెట్టే నిర్ణయాలు తీసుకుంటుందని తాము విశ్వసిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టాటా సన్స్ పబ్లిక్ లిస్టింగ్ కేవలం ఆర్థికపరమైనదే కాకుండా నైతిక, సామాజిక బాధ్యతని మిస్త్రీ తెలిపారు.



టాటా గ్రూప్ ప్రమోటర్, హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్‌లో షాపూర్‌జీ పల్లోంజీ కుటుంబానికి 18.37 శాతం, టాటా ట్రస్ట్స్‌కి 66 శాతం వాటాలు ఉన్నాయి. టాటా సన్స్‌లో వాటాలను వినియోగించుకుని, రుణభారాన్ని తగ్గించుకునేందుకు ఎస్‌పీ గ్రూప్ ప్రయత్నాలు చేస్తోంది.

ప్రశాంతంగా టాటా ట్రస్ట్స్ బోర్డు సమావేశం

ట్రస్టీల మధ్య ఆధిపత్య పోరు నేపథ్యంలో శుక్రవారం టాటా ట్రస్ట్స్ బోర్డు భేటీ అయ్యింది. అయితే, ఇందులో వివాదాస్పద అంశాల ప్రస్తావనేమీ రాలేదని, సమావేశం సజావుగానే సాగిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. దాతృత్వ కార్యకలాపాలు, ఆరోగ్య సంరక్షణ ప్రాజెక్టులకు నిధులు తదితర అంశాలను సమీక్షించినట్లు పేర్కొన్నాయి. బోర్డులో నియామకాలు, గవర్నెన్స్ అంశాలపై టాటా ట్రస్ట్స్ ట్రస్టీల మధ్య విభేదాలు నెలకొనడం, చైర్మన్ నోయల్ టాటా తదితరులు కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్‌తో భేటీ కావడం తెలిసిందే.

ఐపీవో స్ట్రీట్

మిడ్‌వెస్ట్ @ రూ. 1,014-1,065

- ఈ నెల 15-17 మధ్య ఐపీవో
- రూ. 451 కోట్ల సమీకరణకు రెడీ



న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాలలో కార్యకలాపాలు విస్తరించిన తెలంగాణ సంస్థ మిడ్‌వెస్ట్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి రూ. 1,014–1,065 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 15న ప్రారంభమై 17న ముగియనుంది. ఇష్యూలో భాగంగా రూ. 250 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 201 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా రూ. 451 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 14న షేర్లను కేటాయించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 14 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది.

నిధుల వినియోగమిలా

ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 130 కోట్లను అనుబంధ సంస్థ మిడ్‌వెస్ట్ నియోస్టోన్ క్వార్ట్జ్ సౌకర్యాల రెండో దశ విస్తరణకు మిడ్‌వెస్ట్ వినియోగించనుంది. అంతేకాకుండా ఎలక్ట్రిక్ డంప్ ట్రక్కులకు రూ. 26 కోట్లు, ఎంపిక చేసిన గనుల్లో సోలార్ ఎనర్జీ ఇంటిగ్రేషన్‌కు రూ. 3 కోట్లు చొప్పున వెచ్చించనుంది. మరో రూ. 56 కోట్లు రుణ చెల్లింపులకు కేటాయించనుంది. 2025 జూన్‌కల్లా కంపెనీ కన్సాలిడేటెడ్ రుణాలు రూ. 270 కోట్లుగా నమోదయ్యాయి. నాలుగు దశాబ్దాలుగా నేచురల్ స్టోన్ పరిశ్రమలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీ తొలి దశ ప్లాంటు ద్వారా గ్రానైట్ నుంచి క్వార్ట్జ్ ప్రాసెసింగ్‌లోకి ప్రవేశించింది. ఇంజినీర్డ్ స్టోన్, సోలార్ గ్లాస్ విభాగాలకు ఉత్పత్తులు అందిస్తోంది. వీటితోపాటు హెవీ మినరల్ శాండ్స్ అన్వేషణ, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ప్రాసెసింగ్‌ను సైతం చేపడుతోంది. కంపెనీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో 16 గ్రానైట్ గనులను నిర్వహిస్తోంది. గ్లోబల్ రియల్టీ ప్రాజెక్టులలో వినియోగించే ప్రీమియం బ్లాక్ గలాక్సీ, ప్రత్యేక బ్లాక్ గ్రానైట్‌ను ఉత్పత్తి చేస్తోంది. గతేడాది(2024–25) ఆదాయం రూ. 626 కోట్లను తాకగా.. నికర లాభం రూ. 133 కోట్లను అధిగమించింది. ఈ నెల 24న స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యే వీలుంది.

ఐపీవోకు ఇంటెగ్రిస్ మెడ్‌టెక్

- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు
- రూ. 4,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ మెడికల్ టెక్నాలజీ ప్లాట్‌ఫామ్ ఇంటిగ్రిస్ మెడ్‌టెక్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. వీటి ప్రకారం రూ. 925 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 2.16 కోట్ల షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా రూ. 3,500–4,000 కోట్లు సమీకరించే యోచనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రధానంగా కార్డియాక్ స్టెంట్ల తయారీ, పంపిణీ చేపట్టే కంపెనీ రూ. 11,000–13,000 కోట్ల విలువను ఆశిస్తున్నట్లు తెలియజేశాయి. పీఈ సంస్థ ఎవర్‌స్టోన్ క్యాపిటల్‌కు పెట్టుబడులున్న కంపెనీ ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీ విస్తారిత మెడికల్ పరికరాల తయారీతో పాటు, సంబంధిత సొల్యూషన్లు అందిస్తోంది. కార్డియోవాస్కులర్ పరికరాలు, క్లినికల్ డయాగ్నోస్టిక్స్‌సహా ల్యాబొరేటరీ సొల్యూషన్లు సమకూరుస్తోంది. గతేడాది(2024–25) ఆదాయం 24 శాతం ఎగసి రూ. 1,960 కోట్లకు చేరగా.. రూ. 71 కోట్ల నికర లాభం ఆర్జించింది.

అసోసియేటెడ్ పవర్..

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: ఏకీకృత తయారీ, ఈపీసీ సంస్థ అసోసియేటెడ్ పవర్ స్ట్రక్చర్స్ పబ్లిక్ ఇష్యూ బాటలో సాగుతోంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ. 400 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా ప్రమోటర్లు 71.43 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 320 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. మిగిలిన నిధులు సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. 1996లో ఏర్పాటైన అసోసియేటెడ్ పవర్ ప్రధానంగా విద్యుత్ ప్రసారం, పంపిణీ, పవన విద్యుత్, టెలికం రంగాలలో వినియోగించే లాటిస్ స్ట్రక్చర్ల డిజైన్, ప్రొడక్షన్ తదితర సర్వీసులు సమకూర్చుతోంది. గతేడాది (2024–25) ఆదాయం రూ. 1,216 కోట్లకు చేరగా.. రూ. 63 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2025 మార్చికల్లా రూ. 3,790 కోట్ల విలువైన ఆర్డర్‌బుక్‌ను కలిగి ఉంది.

మ్యాన్‌ఫ్లీట్ పార్ట్‌నర్స్...



న్యూఢిల్లీ: ఢిల్లీ కేంద్రంగా రవాణా పరిష్కారాలు, కార్ల అద్దె వ్యాపారంలోని మ్యాన్‌ఫ్లీట్ పార్ట్‌నర్స్ సెబీ వద్ద ఐపీవోకు అనుమతి కోరుతూ ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. 64.10 లక్షల షేర్లను తాజా జారీ చేయడంతోపాటు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో 16 లక్షల షేర్లను ప్రమోటర్లు అమ్రిత్ పాల్ సింగ్ మన్, పరమ్‌జీత్ మన్ విక్రయించనున్నారు. తాజా షేర్ల జారీ ద్వారా సమీకరించే నిధుల్లో రూ.63.78 కోట్లతో వాహనాలు కొనుగోలు చేయనుంది. మరో రూ.18.76 కోట్లలో కొంత మొత్తాన్ని రుణ చెల్లింపులకు, కార్పొరేట్ అవసరాలకు కేటాయించనున్నట్టు ముసాయిదా పత్రాల్లో పేర్కొంది. భారత్‌తోపాటు, యూఏఈ, సౌదీ అరేబియా, ఇంగ్లండ్‌లోని 83 పట్టణాల్లో డ్రైవర్ సహా కార్లను ఈ సంస్థ అద్దెకిస్తోంది.



ఆనంద్‌పై ఆధిక్యంలో కాస్పరోవ్

సెయింట్ లూయిస్ (అమెరికా): భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌తో జరుగుతున్న క్లచ్ చెస్ లెజెండ్స్ మ్యాచ్‌లో రష్యా దిగ్గజం గ్యారీ కాస్పరోవ్ ఐదు పాయింట్ల ఆధిక్యంలోకి వెళ్లాడు. ఈ ఇద్దరు దిగ్గజాల మధ్య మొత్తం 12 గేమ్‌లు నిర్వహిస్తుండగా... ఇప్పటికి ఎనిమిది గేమ్‌లు ముగిశాయి. తొలి రోజు నాలుగు గేమ్‌లు పూర్తయ్యాక కాస్పరోవ్ 2.5–1.5తో ఆనంద్‌పై ఆధిక్యంలో ఉండగా... రెండో రోజు ఎనిమిది గేమ్‌లు ముగిశాక కాస్పరోవ్ 8.5–3.5తో తన ఆధిక్యాన్ని ఐదు పాయింట్లకు పెంచుకున్నాడు. రెండో రోజు జరిగిన నాలుగు గేముల్లో కాస్పరోవ్ రెండింటిలో గెలిచి, రెండింటిని 'డ్రా' చేసుకున్నాడు. ఐదో గేమ్‌లో కాస్పరోవ్ 32 ఎత్తుల్లో గెలిచి... ఆరో గేమ్‌ను 40 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. ఏడో గేమ్‌లో కాస్పరోవ్ కేవలం 18 ఎత్తుల్లో ఆనంద్‌ను ఓడించగా... ఎనిమిదో గేమ్‌ను 38 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు.

ఈ పోరు నిబంధనల ప్రకారం తొలి రోజున గేమ్‌లో గెలిస్తే ఒక పాయింట్.. 'డ్రా' చేసుకుంటే అర పాయింట్ కేటాయిస్తారు. ఇక రెండో జరిగిన గేమ్‌లో గెలిస్తే 2 పాయింట్లు, 'డ్రా' చేసుకుంటే ఒక పాయింట్ లభిస్తుంది. ఫలితంగా కాస్పరోవ్ ఆధిక్యం ఐదు పాయింట్లకు చేరింది. ఇక చివరిదైన మూడో రోజున గేమ్‌లో గెలిస్తే 3 పాయింట్లు, 'డ్రా' చేసుకుంటే 1.5 పాయింట్లు లభిస్తాయి.



సెమీస్‌లో అన్‌మోల్

వాంటా (ఫిన్‌లాండ్): అర్కిటిక్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత రైజింగ్ స్టార్ అన్‌మోల్ ఖరబ్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 62వ ర్యాంకర్ అన్‌మోల్ 21–15, 21–14తో అమెలియా షుల్జ్ (డెన్మార్క్)పై విజయం సాధించింది. 36 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో అన్‌మోల్ రెండు గేముల్లోనూ పూర్తి ఆధిపత్యం చలాయించింది. తొలి గేమ్‌లో స్కోరు 12–12 వద్ద ఉన్నపుడు అన్‌మోల్ ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఆరు పాయింట్లు గెలిచి 18–12తో ఆధిక్యంలోకి వెళ్లింది. అదే జోరులో గేమ్‌ను దక్కించుకుంది. రెండో గేమ్‌లో స్కోరు 16–14 వద్ద ఉన్నపుడు అన్‌మోల్ ఈసారి వరుసగా ఐదు పాయింట్లు నెగ్గి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్, ప్రపంచ నాలుగో ర్యాంకర్ అకానె యామగుచి (జపాన్)తో అన్‌మోల్ తలపడుతుంది. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తనీషా క్రాస్టో–ధ్రువ్ కపిల (భారత్) ద్వయం పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో తనీషా–ధ్రువ్ జోడీ కేవలం 25 నిమిషాల్లో 7–21, 10–21తో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ జంట జియాంగ్ జెన్ బాంగ్–వె యా జిన్ (చైనా) జోడీ చేతిలో ఓడిపోయింది.



బీడబ్ల్యూఎఫ్ అథ్లెట్స్ కమిషన్‌లో సింధు

మూడోసారి చోటు దక్కించుకున్న భారత షట్లర్

న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్ పీవీ సింధు... బ్యాడ్మింటన్ ప్రపంచ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) అథ్లెట్స్ కమిషన్‌లో మూడోసారి చోటు దక్కించుకుంది. 2025 నుంచి 2029 నవంబర్ వరకుగానూ బీడబ్ల్యూఎఫ్ శుక్రవారం సభ్యుల పేర్లను వెల్లడించింది. సింధు 2017 నుంచి కమిషన్‌లో కొనసాగుతోంది. ఇక 2020 బీడబ్ల్యూఎఫ్ సమగ్రత అంబాసిడర్‌గానూ ఉంది. తాజాగా అన్ సె యంగ్ (కొరియా), దోహా హానీ (ఈజిప్ట్), జియా యి ఫ్యాన్ (చైనా), డెబోరా జిల్లే (నెదర్లాండ్స్)తో కలిసి సింధు అథ్లెట్స్ కమిషన్‌కు ఎంపికైంది. ఎలాంటి పోటీ లేకపోవడంతో వీరంతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 'బీడబ్ల్యూఎఫ్‌నకు అథ్లెట్లే కీలకం. మేం తీసుకునే ప్రతి నిర్ణయ ప్రభావం వారిపైనే పడుతుంది. బీడబ్ల్యూఎఫ్ అథ్లెట్స్ కమిషన్... ప్రపంచ బ్యాడ్మింటన్ సమాజాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు దోహదపడుతుంది. కొత్త సభ్యులకు శుభాకాంక్షలు. వీరి చేరికతో కమిషన్ మరింత బలోపేతం అవుతుంది. మనందరం కలిసి బ్యాడ్మింటన్‌ను ప్రపంచంలోని ప్రముఖ క్రీడల్లో ఒకటిగా నిలిపేందుకు కృషి చేయాలి. భవిష్యత్తు కార్యచరణ రూపొందించడంలో వారి సహకారాన్ని ఆశిస్తున్నాము' అని బీడబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు ఖున్‌యింగ్ పటామా లీస్వాడ్రకుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెట్స్ కమిషన్ బీడబ్ల్యూఎఫ్ కౌన్సిల్‌కు సంప్రదింపుల సంస్థగా పనిచేస్తుంది. టోర్నమెంట్‌ల నియమ నిబంధనలు, అథ్లెట్ల సంక్షేమం, అంతర్జాతీయ సర్క్యూట్‌లో ఎదురయ్యే సవాళ్లు ఇలా పలు కీలక అంశాలపై కమిషన్ సూచనలు చేయనుంది. ప్రస్తుతం కమిషన్‌లో ఐదుగురు సభ్యులు ఉండగా... కో ఆప్షన్ మెంబర్‌ను ఎంపిక చేయడం ద్వారా ఆ సంఖ్యను ఆరుకు పెంపొందించుకునే అవకాశం బీడబ్ల్యూఎఫ్‌నకు ఉంది. కొత్తగా ఏర్పడిన కమిషన్... త్వరలో చైర్మన్‌ను ఎన్నిక చేసుకోనుంది.

ఫినిషర్!

- భారత జట్టులో కీలకంగా ఎదిగిన రిచా ఘోష్
- నిలకడగా మెరుపు ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్న కీపర్


రిచా ఘోష్

భారత మహిళల క్రికెట్ జట్టు తరఫున వన్డేల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్లలో రిచా ఘోష్ 30 సిక్సర్లతో మూడో స్థానంలో ఉంది. హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన మాత్రమే ఆమెకంటే ముందుండగా... వారిద్దరు 155, 111 వన్డేలు ఆడారు. రిచా ఇప్పటికి 46 వన్డేలు మాత్రమే ఆడింది. ఆమె వన్డేల్లో అరంగేట్రం చేసిన 2021 నుంచి చూస్తే ప్రపంచవ్యాప్తంగా ముగ్గురు బ్యాటర్లు మాత్రమే రిచాకంటే ఎక్కువ సిక్స్‌లు బాదారు. మిడిలార్డర్‌లో ఆడుతూ ఫీల్డర్ల పరిమితులు లేని సమయంలో 22 ఏళ్ల రిచా చూపిస్తున్న దూకుడు ఆమెను ప్రత్యేకంగా నిలబెడుతోంది. గురువారం దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో కూడా అలవోకగా నాలుగు సిక్సర్లు బాది తన సత్తాను మళ్లీ చూపించింది. వన్డేల్లో భారత్ తరఫున వేగవంతమైన అర్ధసెంచరీ (26 బంతుల్లో), టి20ల్లో 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీతో ప్రపంచ రికార్డు తన పేరిట లిఖించుకున్న రిచా తక్కువ వ్యవధిలో జట్టులో కీలకంగా మారింది.

సాక్షి క్రీడా ప్రతినిధి

సరిగ్గా ఏడాది క్రితం రిచా ఘోష్ 12వ తరగతి పరీక్షల కారణంగా న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ నుంచి తప్పుకుంది. అటు తానియా భాటియా, ఇటు ఉమ ఛెత్రివంటి వికెట్ కీపర్లతో తీవ్రంగా పోటీ ఉండి కొంత కాలం ఆటకు దూరమైతే జట్టులో స్థానం కోల్పోయే ప్రమాదం ఉన్న స్థితిలో కూడా రిచా తనంతట తాను తప్పుకుంది. తన ఆటపై రిచాకు ఉన్న నమ్మకం, ఎలాగైనా స్థానం కాపాడుకోగలననే విశ్వాసం ప్రదర్శించిన ఆమె మళ్లీ జట్టులోకి తిరిగొచ్చింది. ఇప్పుడు రిచా కీపింగ్‌కంటే కూడా అలవోకగా భారీ షాట్లు కొట్టి ఆమె బ్యాటింగే భారత్‌కు ప్రధాన బలంగా మారింది.

> చిన్నప్పుడు క్రికెట్ ఆడటం మొదలు పెట్టిన రోజుల నుంచి నాకు సిక్సర్లు కొట్టడం అంటే చాలా ఇష్టం. అదే ఇప్పుడు నా ఆటలో కనిపిస్తుందని నమ్ముతాను. అయితే అలాంటి దూకుడైన షాట్లే కాకుండా అన్ని రకాల పరిస్థితుల్లోనూ బాగా బ్యాటింగ్ చేయగలననే నమ్మకం నాకుంది. భారీ షాట్లు ఆడబోయి పలు కీలక సమయాల్లో అవుటయ్యా. సిక్స్‌లు కొట్టడం మాత్రమే కాదు. జట్టును గెలిపించడం ముఖ్యం అని అర్థమైంది. అందుకే నా సాంకేతికంగా నా ఆటలో మార్పులు చేసుకొని గ్రౌండ్ షాట్‌లు కూడా చాలా ఆడుతున్నాను.
>
> -రిచా ఘోష్



ఫినిషర్‌గా నిరూపించుకొని...

1, 2, 3, 4, 5, 6, 7, 8... రిచా 46 వన్డేల తన స్వల్ప కెరీర్‌లో ఇలా ఎనిమిది స్థానాల్లో బ్యాటింగ్‌కు దిగడం విశేషం. రెండేళ్ల క్రితం ఆస్ట్రేలియాతో జరిగిన వన్డేలో కోచ్ అమోల్ మజుందార్ ప్రయోగాత్మకంగా మూడో స్థానంలో ఆడిస్తే 96 పరుగులతో (రిచా అత్యధిక స్కోరు) అదరగొట్టింది. అయితే టీమ్ కూర్పు, చివర్లో మన బలహీనతలను దృష్టిలో ఉంచుకుంటూ రిచాను కోచ్ మిడిలార్డర్‌కు మార్చడంతో పాటు ఫినిషర్ బాధ్యతలు అప్పగించారు. 2025 డబ్ల్యూపీఎల్ తొలి మ్యాచ్‌లో గుజరాత్‌పై బెంగళూరు 202 పరుగుల రికార్డు లక్ష్యాన్ని ఛేదించడంలో రిచా ఆడిన ఇన్నింగ్స్ (27 బంతుల్లో 64 నాటౌట్) కూడా మజుందార్ ఆలోచనకు మరింత బలం చేకూర్చింది. ప్రస్తుత వరల్డ్ కప్‌లోనే దాని ప్రభావం కనిపించింది. దక్షిణాఫ్రికాపై కుప్పకూలే స్థితి నుంచి జట్టుకు మెరుగైన స్కోరు అందించిన రిచా... అంతకుముందు పాకిస్తాన్‌తో మ్యాచ్‌లోనూ 20 బంతుల్లోనే 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో అజేయంగా 35 పరుగులు చేసింది.

కీపింగ్ నైపుణ్యంపై దృష్టి పెట్టి...

కెరీర్ ఆరంభంలో తన బ్యాటింగ్‌తోనే రిచా భారత జట్టులోకి వచ్చింది. ఆమె దూకుడుపై సెలక్టర్లకు ఉన్న నమ్మకమే అందుకు కారణం. మూడు మ్యాచ్‌లలో మరో కీపర్ జట్టులో ఉండగా, ఆమె స్పెషలిస్ట్ బ్యాటర్‌గా బరిలోకి దిగింది. నిజాయితీగా చెప్పాలంటే రిచా కీపింగ్‌లో చాలా బలహీనంగా ఉండేది. దేశవాళీలో ఆమె ఎక్కువగా కీపింగ్ చేయకపోవడం కూడా అందుకు కారణం. బెంగాల్ తరఫున ఆడినప్పుడు జట్టులో అప్పటికే స్థిరంగా ఉన్న సీనియర్ కీపర్లు ఉండటంతో ఆమెకు అవకాశాలు రాలేదు. దాంతో రిచా మీడియం పేస్ బౌలింగ్ కూడా చేసేది. అయితే టి20ల్లో బ్యాటర్‌గా తనకు గుర్తింపు వచ్చిన తర్వాత మాజీ పేసర్ జులన్ గోస్వామి ఇచ్చిన సలహాలు, సూచనలతో కీపింగ్‌ను మెరుగుపర్చుకోవడంపై దృష్టి పెట్టింది. ఫలితంగా తన తొలి వన్డేలోనే పాకిస్తాన్‌పై ఐదుగురు బ్యాటర్లను అవుట్ చేసి కీపర్‌గానూ నిరూపించుకుంది. అయితే మూడేళ్ల క్రితం ఫిట్‌నెస్ సరిగా లేకపోవడంతో రిచా వన్డే, టి20 జట్లలో స్థానం కోల్పోయింది. 19 ఏళ్ల అమ్మాయి అధిక బరువు, కీపర్‌గా కదలికలు కష్టం కావడం చిన్న విషయం కాదు. దీనిని ఆమె వెంటనే అర్థం చేసుకుంది. పూర్తిగా ఫిట్‌నెస్‌పైనే దృష్టి పెట్టి తనను తాను కొత్తగా కనిపించేలా చేసుకుంది. కొద్ది రోజులకే మళ్లీ టీమిండియాలో చోటు దక్కించుకోగలిగింది.

చిన్న వయసులోనే రికార్డులతో...

16 ఏళ్లకే భారత సీనియర్ జట్టు తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన రిచా తక్కువ వ్యవధిలోనే టి20 వరల్డ్ కప్, వన్డే వరల్డ్ కప్ ఆడేసింది. ఆ తర్వాత ఆమె అండర్–19 వరల్డ్ కప్ బరిలోకి దిగడం విశేషం. 2023 జనవరిలో జరిగిన ఈ టోర్నీలో భారత జట్టు విజేతగా నిలవడంలో రిచా కీలక పాత్ర పోషించింది. డబ్ల్యూపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) టైటిల్ సాధించడంలో కూడా రిచా బ్యాటింగ్ ప్రధాన కారణంగా నిలిచింది. రిచా విధ్వంసకర బ్యాటింగ్ నైపుణ్యమే 'బిగ్‌బాష్ లీగ్'లో హోబర్ట్ హరికేన్స్... 'హండ్రెడ్' లీగ్‌లో బర్మింగ్‌హామ్ ఫోనిక్స్, లండన్ స్పిరిట్ జట్ల తరఫున ఆడే అవకాశం కల్పించాయి.

పరిస్థితులను బట్టి తన ఆటను మార్చుకోగలనని కూడా దక్షిణాఫ్రికాతో పోరులో రిచా నిరూపించింది. మహిళల వన్డేల్లో 100కు పైగా స్ట్రయిక్ రేట్ అంటే అసాధారణ విషయం. ఇదే జోరును ముున్ముందూ కొనసాగించగలిగితే రిచా సుదీర్ఘ కాలం భారత జట్టు తరఫున అద్భుత ప్రదర్శనలు ఇవ్వగలదు.



ప్లే ఆఫ్స్‌కు దబంగ్ ఢిల్లీ

గుజరాత్ జెయింట్స్‌పై ఘనవిజయం

చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో అదరగొడుతున్న దబంగ్ ఢిల్లీ 'ప్లే ఆఫ్స్' బెర్త్‌ను ఖరారు చేసుకుంది. తద్వారా తాజా సీజన్‌లో ఈ ఘనత సాధించిన తొలి జట్టుగా నిలిచింది. సీజన్ ఆరంభం నుంచి తిరుగులేని ప్రదర్శన కనబరుస్తున్న దబంగ్ ఢిల్లీ శుక్రవారం జరిగిన పోరులో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. రెయిడర్లు రాణించడంతో దబంగ్ ఢిల్లీ 39–33 పాయింట్ల తేడాతో గుజరాత్‌పై గెలుపొందింది. దబంగ్ ఢిల్లీ తరఫున అక్షిత్ ధుల్ 12 పాయింట్లతో సత్తా చాటాడు. గుజరాత్ జెయింట్స్ తరఫున హిమాన్షు 11 పాయింట్లు సాధించాడు. అషు మలిక్ గైర్హాజరీలో అక్షిత్ సూపర్ రెయిడ్‌లతో చెలరేగడంతో ఢిల్లీ విజయం ఖాయమైంది. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 23 రెయిడ్ పాయింట్లు సాధిస్తే... జెయింట్స్ 16కే పరిమితమైంది. ట్యాక్లింగ్‌లో గుజరాత్ 15 పాయింట్లు ఖాతాలో వేసుకోగా... ఢిల్లీ 10 పాయింట్లు సాధించింది. తాజా సీజన్‌లో 14 మ్యాచ్‌లాడిన ఢిల్లీ 12 విజయాలు, 2 పరాజయాలతో 24 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక 'టాప్'లో నిలిచింది. శనివారం నుంచి పీకేఎల్ పోటీలు ఢిల్లీ వేదికగా జరగనుండగా... సొంతగడ్డపై అడుగుపెట్టకముందే ఢిల్లీ జట్టు 'ప్లే ఆఫ్స్' బెర్తు ఖరారు చేసుకుంది. గుజరాత్ జెయింట్స్ 13 మ్యాచ్‌ల్లో 4 విజయాలు, 9 పరాజయాలతో 8 పాయింట్లు సాధించి పట్టిక పదో స్థానంలో కొనసాగుతోంది. మరో మ్యాచ్‌లో యు ముంబా 48–29 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌పై నెగ్గింది. యు ముంబా తరఫున సందీప్ కుమార్ 13, అజిత్ చవాన్ 12 పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. బెంగాల్ వారియర్స్ తరఫున దేవాంక్ 14 పాయింట్లతో ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. ఈ విజయంతో యు ముంబా పాయింట్ల పట్టికలో నాలుగో స్థానానికి ఎగబాకగా... బెంగాల్ వారియర్స్ 9వ స్థానంలో ఉంది. లీగ్‌లో భాగంగా శనివారం బెంగళూరు బుల్స్‌తో జైపూర్ పింక్ పాంథర్స్, తమిళ్ తలైవాస్‌తో పుణేరి పల్టన్ తలపడనున్నాయి.

సెమీఫైనల్ రేసులో కాకతీయ నైట్స్

న్యూఢిల్లీ: ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో తెలంగాణకు చెందిన కాకతీయ నైట్స్ జట్టు సెమీఫైనల్ రేసులో నిలిచింది. శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో కాకతీయ నైట్స్ 5–1 (76–72, 79–76, 76–76) పాయింట్ల తేడాతో చోళ చీఫ్స్ జట్టును ఓడించింది. ఈ గెలుపుతో కాకతీయ నైట్స్ నాలుగు పాయింట్లతో సెమీఫైనల్ అవకాశాలను సజీవంగా నిలబెట్టుకుంది. మరోవైపు పృథ్వీరాజ్ యోధాస్, రాజ్‌పుతానా రాయల్స్, మైటీ మరాఠాస్ జట్లు సెమీఫైనల్లోకి దూసుకెళ్లాయి. చివరిదైన నాలుగో సెమీఫైనల్ బెర్త్ కోసం కాకతీయ నైట్స్, చోళ చీఫ్స్ బరిలో ఉన్నాయి.

ఈ నెల 31న పీకేఎల్ ఫైనల్

ఢిల్లీ వేదికగా అక్టోబర్ 25 నుంచి ప్లే ఆఫ్స్



న్యూఢిల్లీ: హోరాహోరీ పోరాటాలతో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్న ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్ ఫైనల్ ఈ నెల 31న జరగనుంది. శనివారం నుంచి ఢిల్లీ అంచె పోటీలు ప్రారంభం కానుండగా... లీగ్ దశ ముగిసిన అనంతరం ప్లే ఆఫ్స్ కూడా ఢిల్లీలోనే నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం పీకేఎల్ నిర్వాహకులు ప్లే ఆఫ్స్ షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 23తో లీగ్ దశకు తెరపడనుండగా... పాయింట్ల పట్టికలో తొలి 8 స్థానాల్లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు చేరుతాయి. జట్ల మధ్య మరింత పోటీ పెంచేందుకు... తాజా సీజన్ నుంచి పీకేఎల్‌లో పలు మార్పులు చేశారు. ఈ నెల 25 నుంచి జరగనున్న 'ప్లే ఇన్స్'లో పట్టికలో 5వ స్థానం నుంచి 8వ స్థానం వరకు నిలిచిన జట్లు తలపడతాయి. అందులో గెలిచిన జట్టు ప్లేఆఫ్స్‌లో అడుగు పెడుతుంది. అక్టోబర్ 26 నుంచి 29 వరకు ప్లే ఆఫ్స్ జరుగుతాయి. తొలి రోజు ఎలిమినేటర్–1, మినీ క్వాలిఫయర్... మరుసటి రోజు ఎలిమినేటర్–2, క్వాలిఫయర్–1 నిర్వహిస్తారు. అక్టోబర్ 28న ఎలిమినేటర్–3, 29న క్వాలిఫయర్–2 నిర్వహిస్తారు. ఇందులో మెరుగైన ప్రదర్శన చేసిన జట్లు ఈ నెల 31 శుక్రవారం జరగనున్న ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. తాజా సీజన్‌లో మొత్తం 12 జట్లు పాల్గొంటుండగా... అభిమానుల్లో ఆసక్తి పెంపొందించేందుకే ఎక్కువ జట్లు ప్లే ఆఫ్స్ చేరే విధంగా టోర్నీని మార్చారు. దీంతో హోరాహోరీ పోరాటాలు పెరగడంతో పాటు... ప్రతి జట్టుకు ఫైనల్‌కు చేరేందుకు అవకాశం ఉంటుంది. ఢిల్లీలో ఫైనల్ నిర్వహించనుండటం ఇది నాలుగోసారి. ఇక ఈ సీజన్‌లో విజృంభిస్తున్న దబంగ్ ఢిల్లీ జట్టు... ఇప్పటికే టాప్–8 చోటు ఖాయం చేసుకుంది.

భారత జట్టులో శ్రీజ, స్నేహిత్

నేటి నుంచి ఆసియా టేబుల్ టెన్నిస్ టీమ్ చాంపియన్‌షిప్


శ్రీజ


స్నేహిత్

భువనేశ్వర్: ఆసియా టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ చాంపియన్‌షిప్ పోటీలకు రంగం సిద్ధమైంది. నేటి నుంచి ఈ నెల 15 వరకు భువనేశ్వర్ వేదికగా జరగనున్న ఈ టోర్నమెంట్‌లో తెలంగాణ ప్లేయర్లు ఆకుల శ్రీజ, సురావజ్జుల స్నేహిత్ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరితో పాటు స్టార్ ప్లేయర్లు మనికా బత్రా, దియా చిటాలే, స్వస్తిక ఘోష్, మానవ్ ఠక్కర్ జాతీయ జట్టు తరఫున బరిలోకి దిగనున్నారు. అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య, ఆసియా టేబుల్ టెన్నిస్ యూనియన్, భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య సంయుక్తంగా ఈ టోర్నీ నిర్వహిస్తున్నాయి. చైనా, జపాన్, కొరియా, చైనీస్ తైపీ, బంగ్లాదేశ్ సహా మొత్తం 22 దేశాలకు చెందిన 500 మందికి పైగా ప్లేయర్లు ఇందులో పాల్గొంటున్నారు. ఇప్పటికే భారత్‌కు చేరుకున్న పలువురు అంతర్జాతీయ స్టార్‌లు ప్రాక్టీస్‌లో నిమగ్నమయ్యారు. ఈ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన జట్టు 2026లో లండన్ వేదికగా జరగనున్న ప్రపంచ టేబుల్ టెన్నిస్ టీమ్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించనుంది.

భారత జట్టు: మహిళల విభాగం: ఆకుల శ్రీజ, మనిక బత్రా, దియా చిటాలే, యశస్విని, స్వస్తిక ఘోష్. **పురుషుల విభాగం:** మానవ్ ఠక్కర్, మనుశ్ షా, స్నేహిత్, అంకుర్ భట్టాచార్య, పాయస్ జైన్.



గాజాలోని ఖాన్‌యూనిస్‌లో ఇజ్రాయెల్ దాడుల్లో నేలమట్టమైన ఓ నివాసం వద్ద శుక్రవారం పరుపులపై పడుకున్న పాలస్తీనా బాలుడు




అమెరికాలోని ఉటాహ్‌లో ఉన్న డెడ్ హార్స్ పాయింట్ స్టేట్ పార్క్‌లో భారీ వర్షం తర్వాత ఉషోదయాన ఆకాశంలో ఆవిష్కృతమైన హరివిల్లు



పారాచూట్ ద్వారా నాసా పంపించిన పరిశోధన పరికరాలు టెక్సాస్ రాష్ట్రం ఎడ్మాన్సన్ వద్ద పడిపోగా, వాటి వద్ద ఆన్ వాల్టర్ అనే స్థానికురాలు ఫొటోకిలా పోజిచ్చారు

ట్రం‘పూనకాలు’!

సోషల్ మీడియాలో వెల్లువెత్తిన మీమ్స్



ఆయన సొంత డబ్బా లిస్ట్ ఇదే..

- ఇజ్రాయెల్–హమాస్, ఆర్మేనియా–అజర్‌బైజాన్ మధ్య కాల్పుల విరమణకు తానే మధ్యవర్తిత్వం వహించారట!
- కంబోడియా–థాయిలాండ్ గొడవలు కూడా ఆయనే పరిష్కరించారట!
- అంతేకాదు, ఆపరేషన్ సింధూర్ తర్వాత భారత్–పాకిస్తాన్ మధ్య కూడా శాంతి ఒప్పందానికి కృషి చేశానని చెప్పుకొన్నారు (అసలు అదెప్పుడు చేశారో ఎవరికీ తెలియదు).
- ఇక, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో–రువాండా, ఈజిప్ట్–ఇథియోపియా, సెర్బియా–కొసావో మధ్య ఉద్రిక్తతలు కూడా ఆయన వల్లే శాంతించాయట!

అన్యాయం! ఘోరం! ట్రంప్ గారికి నోబెల్ రాలేదు! నోబెల్ శాంతి బహుమతి 2025 ప్రకటించారు. డొనాల్డ్ ట్రంప్ గారికి మాత్రం దక్కలేదు! ఇందులో ఆశ్చర్యమేమీ లేదు, కానీ ఆ తర్వాత సోషల్ మీడియాలో వచ్చిన మీమ్స్, జోకులు చూస్తే మాత్రం పగలబడి నవ్వకుండా ఉండలేం. ఈ వార్త వినగానే, ఏం జరిగిందో ఊహించగలం కదా? అవును, ట్రంప్ స్పందనను ఊహిస్తూ 'క్లాస్ పీకుతున్న' మీమ్స్ సోషల్ మీడియాలో వెల్లువెత్తాయి.

మనసు గెలిచిన మచాడో..

ఈసారి బహుమతిని వెనెజులా ప్రతిపక్ష నాయకురాలు మారియా కొరినా మచాడో గెలుచుకున్నారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న ఈమెకు 'వెనెజులా ఉక్కు మహిళ' అనే పేరు కూడా ఉంది. ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నప్పటికీ, టైమ్ మ్యాగజైన్ '2025లో అత్యంత ప్రభావవంతమైన 100 మంది' జాబితాలో 'మచాడో' పేరు ఉందంటే ఆమె ప్రభావాన్ని ఊహించుకోవచ్చు.

ట్రంప్ గారే టాక్ ఆఫ్ ది టౌన్!

కానీ, ఆన్‌లైన్‌లో జనాలు 'మచాడో' గురించి మాట్లాడకుండా, కేవలం ట్రంప్ కలల బహుమతి గురించి మాత్రమే జోకులు వేసుకున్నారు. ట్రంప్ నోబెల్ గెలవనందుకు ఎంత నిరాశ చెందారో చూపిస్తూ.. ఎక్స్ ప్లాట్‌ఫాం నిండిపోయింది. ట్రంప్ చిన్న పిల్లాడిలా అలిగి, చిందులు తొక్కుతున్నట్లు మార్ఫింగ్ చేసిన ఫొటోలు, ఆయనకు బహుమతి దక్కనందుకు ప్రపంచం అంతా పండుగ చేసుకుంటున్న వీడియోలు.. అబ్బో! నెటిజన్లు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, ఈ అవకాశాన్ని 'ఇంటర్నెట్ గోల్డ్'గా మార్చడానికి అస్సలు ఆలస్యం చేయలేదు.

ట్రంప్ 'శాంతి' ప్రకటనలు: కామెడీకి కొత్త నిర్వచనం

నిజానికి, 2025 నోబెల్ శాంతి బహుమతి ప్రకటనకు ముందు, ట్రంప్ చాలా పకడ్బందీగా ప్రచారం కూడా చేశారు. ప్రపంచంలో అనేక శాంతి కార్యక్రమాలలో తన పాత్ర ఉందని, అందుకే ఈ గౌరవం తనకే దక్కాలని ఆయన పట్టుబట్టారు.

నిజమా?.. మీరే చేసారా?

ఆయన నోటి నుంచి ఈ మాటలు వస్తున్నప్పుడు, అంతర్జాతీయ నిపుణులు, విశ్లేషకులు ముఖాలు ఎలా పెట్టుకున్నారో ఊహించుకుంటే చాలు. అన్నీ విన్నాక, 'నిజంగా మీరు ఇవన్నీ చేసేసారా?' అని అందరూ నవ్వుకుంటూనే ప్రశ్నించారట!. ఏదేమైనా, నోబెల్ శాంతి బహుమతి ఆయనకు దక్కకపోయినా, ఆయన వల్ల మాత్రం నెటిజన్లకు భారీ వినోదం మాత్రం దక్కింది.

నోబెల్ రాకున్నా శాంతికోసం ట్రంప్ ఆరాటం

- అమెరికా అధ్యక్షుడిని ప్రశంసించిన రష్యా అధ్యక్షుడు పుతిన్
- కొందరికి నోబెల్ ఎందుకిస్తారో కూడా అర్థంకాదని వ్యాఖ్య

మాస్కో: ప్రపంచంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న సాయుధ ఘర్షణలకు ముగింపు పలికి శాంతి నెలకొల్పటంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విశేష కృషి చేస్తున్నారని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసించారు. నోబెల్ శాంతి పురస్కారం రాకపోయినా ఆయన గాజా ఘర్షణ వంటి క్లిష్టమైన సమస్యకు పరిష్కారం చూపారని కొనియాడారు. తజకిస్తాన్‌లోని దుశాంబేలో పూర్వపు సోవియట్ యూనియన్ భాగస్వామ్య దేశాల సదస్సు సందర్భంగా ఆయన మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఈ విధంగా సమాధానమిచ్చారు. ఏళ్లు, దశాబ్దాలుగా కొనసాగుతున్న క్లిష్టమైన సంక్షోభాలను పరిష్కరించటంలో ట్రంప్ నిజంగా గొప్ప కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వెనెజువెలా ప్రతిపక్ష నేత మరియాకు నోబెల్ శాంతి బహుమతి ప్రకటించటంపై పుతిన్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. 'నోబెల్ కమిటీ శాంతి పురస్కారం అందించిన వ్యక్తుల్లో పలువురు ప్రపంచ శాంతి కోసం అసలు ఏమీ చేయనివారు కూడా ఉన్నారు. మంచివారో చెడ్డవారో.. ఎవరో ఒకరు వస్తారు. ఒకటిరెండు నెలల్లోనే పురస్కారం పొందుతారు. అది ఎందుకు ఇస్తారో తెలియదు. వాళ్లు శాంతి కోసం ఏమీ చేసినవారు కాదు. ఇలాంటి నిర్ణయాలు ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి నష్టం కలిగిస్తాయి' అని ట్రంప్ పేర్కొన్నారు.

జిన్‌పింగ్‌తో భేటీతో ఉపయోగం ఉండదు

అరుదైన ఖనిజాలపై చైనా ఆంక్షలు విధించటంపై ట్రంప్ ఫైర్

వాషింగ్టన్: అమెరికన్ కంపెనీలకు అరుదైన ఖనిజాల (రేర్ ఎర్త్ మినరల్స్) సరఫరాపై చైనా ఆంక్షలు విధించటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిచర్యగా చైనాపై మరిన్ని పన్నులు వేస్తామని శుక్రవారం హెచ్చరించారు. 'అమెరికా కంపెనీలకు అవసరమైన రేర్ ఎర్త్ ఖనిజాల సరఫరాపై చైనా ఆంక్షలు విధించిన తర్వాత త్వరలో దక్షిణ కొరియాలో జరిగే సమ్మిట్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో నేను సమావేశం కావటంలో అర్థమే ఉండదు. చైనా నిర్ణయం నాకే కాదు.. స్వేచ్ఛా వాణిజ్యాన్ని కోరుకునే ప్రపంచ దేశాధినేతలందరినీ ఆశ్చర్యపరిచింది. టెక్నాలజీ, కంప్యూటర్ చిప్స్, లేజర్లు, ఇతర పరిశ్రమలకు కీలకమైన రేర్ ఎర్త్ మూలకాలపై గుత్తాధిపత్యం సాధించాలని భావిస్తోంది. చైనా నిర్ణయానికి ప్రతిస్పందనగా ఆ దేశం నుంచి వచ్చే వస్తువులపై దిగుమతి పన్నులను భారీగా పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నారు' అని ట్రంప్ పేర్కొన్నారు.

ఐపీఎస్ ఆత్మహత్యపై సిట్

ఆరుగురు సభ్యుల ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు

చండీగఢ్ ఐజీ పుష్పేంద్ర కుమార్ నాయకత్వం

చండీగఢ్: హరియాణాకు చెందిన సీనియర్ పోలీస్ అధికారి వై.పూరణ్ కుమార్ ఆత్మహత్య కేసులో సత్వర, నిష్పక్షపాత, సమగ్ర దర్యాప్తు కోసం చండీగఢ్ పోలీసులు శుక్రవారం ఆరుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. ఈ దర్యాప్తును నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. సిట్‌కు చండీగఢ్ ఐజీ పుష్పేంద్ర కుమార్ నాయకత్వం వహిస్తారు. చండీగఢ్ ఎస్ఎస్‌పీ కన్వర్‌దీప్ కౌర్, సిటీ ఎస్పీ కేఎం ప్రియాంక, డీఎస్‌పీ చరణ్‌జిత్ సింగ్ విర్క్, ఎస్‌డీపీవో (సౌత్) గుర్జిత్ కౌర్, సెక్టార్ 11 పోలీస్ స్టేషన్ (వెస్ట్) ఎస్‌హెచ్‌వో జైవీర్ రాణా సభ్యులుగా ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఐపీఎస్ అధికారి పూరణ్ కుమార్ మంగళవారం చండీగఢ్‌లోని తన నివాసంలో తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడం తెలిసిందే. ఆయన ఒక సూసైడ్ నోట్ కూడా రాశారు. 'కేసులోని ఆరోపణల తీవ్రత, సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకుని... ఐజీపీ, యూటీ, చండీగఢ్ పర్యవేక్షణలో కేసుపై సత్వర, నిష్పక్షపాత, సమగ్ర దర్యాప్తు నిర్వహించడానికి సిట్ ఏర్పాటు చేశాం..' అని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఎఫ్ఐఆర్ నంబర్ 156/2025లోని అన్ని అంశాలపై సిట్ దర్యాప్తు చేయాలని, ఇందులో సాక్ష్యాధారాల సేకరణ, సాక్షుల విచారణ, నిపుణుల అభిప్రాయాలు, న్యాయ సలహాలు వంటివి కాలపరిమితిలో చేపట్టి, పూర్తయ్యాక తుది నివేదికను సిద్ధం చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

అసంపూర్తి ఎఫ్ఐఆర్..

పూరణ్ కుమార్ ఆత్మహత్యపై ఎఫ్ఐఆర్ నమోదైన ఒకరోజు తర్వాత, ఆయన భార్య, సీనియర్ ఐఏఎస్ అధికారి అమనీత్ పి.కుమార్ స్పందిస్తూ.. ఎఫ్ఐఆర్‌లో సమాచారం అసంపూర్తిగా ఉందని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్‌ను సవరించి, నిందితులందరి పేర్లు ఉండేలా రూపొందించాలని ఆమె పోలీసులను కోరారు. ఈ మేరకు చండీగఢ్ ఎస్ఎస్‌పీ కన్వర్‌దీప్ కౌర్‌కు రాసిన లేఖలో, ఎఫ్ఐఆర్‌లో చేర్చిన బలహీనమైన ఎస్సీ/ఎస్టీ చట్టం సెక్షన్లను సవరించాలని విజ్ఞప్తి చేశారు. మృతి చెందిన ఐపీఎస్ అధికారి.. తన ఎనిమిది పేజీల సూసైడ్ నోట్‌లో కొంతమంది అధికారులు కుల వివక్షతో చేసిన వేధింపుల వివరాలను కూడా పేర్కొన్నారు. బుధవారం చండీగఢ్ పోలీసులకు అమనీత్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదులో, హరియాణా డీజీపీ, రోహ్‌తక్ ఎస్పీపై సెక్షన్ 108 బీఎన్ఎస్, 2023 (ఆత్మహత్యకు ప్రేరణ), షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నివారణ) చట్టంలోని ఇతర నిబంధనల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి, వారిని తక్షణమే అరెస్టు చేయాలని అభ్యర్థించారు. పూరణ్ కుమార్, ఇటీవల రోహ్‌తక్ సునారియాలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్ (పీటీసీ) ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. హరియానా ప్రభుత్వ ప్రతినిధి బృందంతో జపాన్‌లో పర్యటిస్తున్న అమనీత్ కుమార్ భర్త ఆత్మహత్య సమాచారం తెలిసి, బుధవారం హుటాహుటిన చండీగఢ్‌కు చేరుకున్నారు. ఉన్నత స్థాయి అధికారుల వ్యవస్థీకృత వేధింపులే తన భర్త మృతికి కారణమని ఆమె ఆరోపించారు. ఐపీఎస్ అధికారి పూరణ్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడిన స్థలం నుంచి పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్న వస్తువులలో వీలునామా, సూసైడ్ నోట్ ఉన్నాయి.

సూసైడ్ నోట్‌లో డీజీపీ, రోహతక్ ఎస్పీ

ఆత్మహత్యకు పాల్పడిన పూరణ్ కుమార్.. తన సూసైడ్ నోట్‌లో అనేక మంది సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లను పేర్కొన్నారు. ప్రధానంగా హరియాణా డీజీపీ శత్రుజీత్ కపూర్, రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజార్నియా తనను వేధించారని, అపఖ్యాతి పాలు చేశారని ఆరోపించారు. దీని ఆధారంగా చండీగఢ్ పోలీసులు ఆత్మహత్యకు ప్రేరేపించడం, ఎస్సీ, ఎస్టీ చట్టంలోని కొన్ని నిబంధనల కింద గురువారం సాయంత్రం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సూసైడ్ నోట్‌లో పేర్కొన్న నిందితులపై సెక్షన్ 108 ఆర్/డబ్ల్యు 3(5) (ఆత్మహత్యకు ప్రేరణ), 3 (1) (ఆర్) పీవోఏ (అకృత్యాల నివారణ) ఎస్సీ/ఎస్టీ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు చండీగఢ్ పోలీసులు గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో వెల్లడించారు.

భారత్‌లో అమెరికా కొత్త రాయబారి పర్యటన

న్యూఢిల్లీ: భారత్‌లో అమెరికా కొత్త రాయబారిగా నియమితులైన సెర్జియో గోర్ తొలిసారి భారత్‌లో పర్యటిస్తున్నారు. ఆయన వెంట అమెరికా మేనేజ్‌మెంట్ అండ్ రిసోర్సెస్ డిప్యూటీ మంత్రి మైకేల్ జే రిగాస్ కూడా ఉన్నారు. ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు గోర్, రిగాస్ భారత్‌లో పర్యటిస్తున్నట్లు అమెరికా విదేశాంగశాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. గోర్ నియామకాన్ని అమెరికా సెనేట్ ఇటీవలే ఆమోదించింది. పర్యటనలో భాగంగా వారు భారత్–అమెరికా మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం జరుగుతున్న చర్చలపై దృష్టి సారించనున్నారు. ఈ ఇద్దరు భారత అధికారులతో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు జరుపుతారని అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు భారత్‌తో కలిసి అమెరికా పనిచేస్తుంది. ఇండో పసిఫిక్ ప్రాంతం మరింత శక్తిమంతంగా, భద్రంగా, సుసంపన్నంగా మారేందుకు కృషిచేస్తాం' అని పేర్కొంది.

హిందూ బాలికపై అత్యాచారం, పెళ్లి

కాజీ, ఇద్దరు సాక్షుల అరెస్ట్‌కు కోర్టు ఆదేశం

కరాచీ: పాకిస్తాన్‌లో హిందువులు సహా మైనారిటీ వర్గాలపై అత్యాచారాలు కొనసాగుతున్నాయి. తాజాగా, సింధ్ ప్రావిన్స్‌కు చెందిన ఓ 15 ఏళ్ల హిందూ బాలికను తనను ఓ వృద్ధుడు అపహరించి, అత్యాచారానికి పాల్పడ్డాడని తెలిపింది. బలవంతంగా ఇస్లాంలోకి మార్చి ఇష్టం లేకున్నా పెళ్లి చేసుకున్నాడని కోర్టుకు పేర్కొంది. తన కుటుంబాన్ని చేరుకునే అవకాశం కల్పించాలని వేడుకుంది. గత నెలలో జరిగిన ఈ ఘటనపై మిర్పూర్‌ఖాస్ జిల్లాలోని సెషన్స్ కోర్టు విచారణ చేపట్టింది. తుది తీర్పు వెలువడే వరకు ఆమెను సురక్షితంగా ఉంచాలని అధికారులను ఆదేశించింది. గత నెలలో తన కుమార్తెను తమ నివాసానికి సమీపంలో ఉండగా షార్ వర్గానికి చెందిన కొందరు కిడ్నాప్ చేశారని ఆమె తల్లి నిర్మల్ మెఘ్వార్ పేర్కొంది. 'అప్పటి నుంచి ఆ వర్గం వాళ్లు మమ్మల్ని బెదిరిస్తున్నారు. కోర్టుకు నా కుమార్తె బర్త్ సర్టిఫికెట్ అందివ్వకుండా అడ్డుకున్నారు. మొదటి వాయిదా విచారణకు వచ్చిన సమయంలో కోర్టు వద్దే మాపై దాడి చేశారు. నా కుమార్తె గురువారం ధైర్యంతో కోర్టులో వాంగ్మూలం ఇచ్చింది' అని ఆమె పేర్కొంది. దీంతో, పెళ్లి జరిపించిన కాజీని, ఇద్దరు సాక్ష్యులను అరెస్ట్ చేయాలని కోర్టు ఆదేశించింది. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో హిందువులు, క్రైస్తవులు సహా మైనారిటీ వర్గాలకు చెందిన కనీసం వెయ్యి మంది బాలికలకు ఇలా బలవంతంగా పెళ్లిళ్లవుతున్నాయని అంచనా.

పాక్‌కు అమ్రామ్ మిసైళ్లు ఇవ్వటంలేదు: అమెరికా

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌కు అత్యాధునిక అమ్రామ్ (ఏఎంఆర్ఏఏఎం) క్షిపణను అమ్మటం లేదని అమెరికా శుక్రవారం ప్రకటించింది. ఈ మీడియం రేంజ్ క్షిపణలను పాక్‌కు అమెరికా అందించేందుకు ఒప్పందం కుదిరిందని వచ్చిన వార్తలను భారత్‌లో అమెరికా రాయబార కార్యాలయం ఖండించింది. సెప్టెంబర్ 31న పాక్‌తో కుదిరిన ఆయుధాల ఒప్పందం విడిభాగాల కోసమేనని పేర్కొంది. అమ్రామ్‌లు మీడియం రేంజ్ ఎయిర్ టు ఎయిర్ మిసైళ్లు. పాక్ వద్ద ఇప్పటికే ఈ రకం క్షిపణులు ఉన్నాయి. అయితే, గత నెలలో కుదిరిన ఒప్పందం ప్రకారం పాతవాటికంటే అత్యాధునికమైన క్షిపణులు అందిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. దీంతో అమెరికా ఎంబసీ వివరణ ఇచ్చింది. ఆ ఒప్పందంలో పాక్‌లో ప్రస్తుతం ఉన్న అమెరికా ఆయుధాలను ఆధునీకరించే ఎలాంటి అగ్రిమెంట్ లేదని పేర్కొంది.

దగ్గు సిరప్ మరణాలపై విచారణకు సుప్రీం నో

సాక్షి, న్యూఢిల్లీ: దగ్గు సిరప్ తాగి చిన్నారులు చనిపోతున్న ఘటనలపై విచారణను సీబీఐకి అప్పగించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. సీనియర్ న్యాయవాది విశాల్ తివారీ వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)ను కొట్టివేసింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ఇటీవల జరిగిన మరణాలకు కారణమైన కలుషిత సిరప్‌లలో డైఇథిలీన్ గ్లైకాల్(డీఈజీ), ఇథిలీన్ గ్లైకాల్ (ఈజీ) అనే విషపూరిత రసాయనాలున్నట్లు తేలిందని తివారీ తన పిల్‌లో తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం తొలుత ఆయా రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసేందుకు అంగీకరించింది. అయితే, కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా..'మీడియాలో వస్తున్న వార్తల ఆధారంగా పిటిషనర్లు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. నేను ప్రస్తుతం ఏ రాష్ట్రానికీ ప్రాతినిధ్యం వహించడం లేదు. అయితే ఇదే అంశంపై తమిళనాడు, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలు తగు చర్యలు తీసుకుంటున్నాయి. మనం వాటిని విస్మరించలేం' అని తెలిపారు. రాష్ట్రాలే విచారణ చేసుకుంటున్న సమయంలో సీబీఐ జోక్యం అవసరం లేదని, ప్రస్తుత పరిస్థితుల్లో సీబీఐ విచారించాల్సిన అవసరం లేదని వివరించారు. 'మిస్టర్ తివారీ, ఇప్పటి వరకు మీరెన్ని పిల్‌లు దాఖలు చేశారు' అంటూ సీజేఐ ప్రశ్నించారు. ఎనిమిది లేదా తొమ్మిది పిటిషన్‌లు అంటూ ఆయన సమాధానమివ్వడంతో.. ఈ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రాలు నిర్వహిస్తున్న విచారణలు సరిపోతాయని, ఈ దశంలో కేంద్రం జోక్యం అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది.

బాణసంచాపై సంపూర్ణ నిషేధం కష్టం: సుప్రీం

న్యూఢిల్లీ: ఢిల్లీ–దేశ రాజధాని ప్రాంతం(ఎన్‌సీఆర్) పరిధిలో బాణసంచా కాల్చడంపై సంపూర్ణ నిషేధం విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సంపూర్ణ నిషేధం 'ఆచరణసాధ్యం కాదు, సరైన చర్య కాదు' అని పేర్కొంది. ఇటువంటి ఆంక్షలు ఉల్లంఘనకు గురవుతాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం పేర్కొంది. ఢిల్లీ– ఎన్‌సీఆర్ పరిధిలో గ్రీన్ క్రాకర్స్‌కు అనుమతివ్వాలంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. దీనిద్వారా బాణసంచా కాల్చడంపై ఆంక్షలను సడలించే అవకాశమున్నట్లుగా భావిస్తున్నారు. బాణసంచా కాల్చడంపై ఢిల్లీ–ఎన్‌సీఆర్ పరిధిలో 2018 నుంచి సంపూర్ణ నిషేధం అమలవుతున్నప్పటికీ గాలి నాణ్యతలో ఎలాంటి మార్పు రాలేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. అందుకే నిషేధాన్ని ఎత్తివేయాలంటూ ఆయన వాదనలు వినిపించారు. చిన్న పిల్లలు దీపావళి, గురుపూర్ణిమ, క్రిస్టమస్‌ల వంటి పండగల సందర్భంగా కనీసం రెండు రోజులైన బాణసంచా కాల్చేందుకు అనుమతివ్వాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచుతున్నట్లు ప్రకటించింది.

'విచారణ ఖైదీలకు ఓటు'పై కేంద్రానికి సుప్రీం నోటీస్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జైళ్లలో మగ్గుతున్న సుమారు 4.5 లక్షల మంది విచారణ ఖైదీలకు ఓటు హక్కు కల్పించాలంటూ దాఖలైన పిల్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్రం, ఎన్నికల కమిషన్(ఈసీ)లకు నోటీసులు జారీ చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లోని సెక్షన్ 62(5)కింద అండర్ ట్రయల్ ఖైదీలకు ఓటు హక్కు నిరాకరించడం రాజ్యాంగమిచ్చిన హామీలను, అంతర్జాతీయ ప్రజాస్వామిక నిబంధనలను ఉల్లంఘించడమేనంటూ పంజాబ్‌కు చెందిన సునీతా శర్మ పిటిషన్ వేశారు. అండర్ ట్రయల్ ఖైదీల్లో అవినీతి ఆరోపణలు లేని వారు, నేర చరిత్ర లేని వారు పెద్ద సంఖ్యలో ఉన్నారని అందులో పేర్కొన్నారు. వీరిలో కొందరు దశాబ్దాలుగా జైళ్లలోనే ఉండిపోతున్నారన్నారు. వీరికి ఓటు హక్కును నిరాకరించడం సరికాదని తెలిపారు. వీరి కోసం స్థానిక జైళ్లలో పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం, పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించడం వంటివి చేపట్టాలన్నారు. పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టారు. దీనిపై సమాధానమివ్వాలంటూ ధర్మాసనం కేంద్ర న్యాయ శాఖ, ఎన్నికల కమిషన్‌లకు నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపింది.

నాటో నుంచి స్పెయిన్‌ను గెంటేయండి

మిలిటరీ వ్యయం విషయంలో ట్రంప్ గరంగరం

బార్సిలోనా: నాటో సభ్యదేశమైన స్పెయిన్ తన మిలిటరీ కోసం తక్కువ వ్యయం చేస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కటువుగా మాట్లాడటం రెండు దేశాల మధ్య వివాదంగా మారింది. గురువారం ఓవల్ కార్యాలయంలో ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో సమావేశమైన ట్రంప్.. 'మీరు స్పెయిన్‌తో మాట్లడాల్సి ఉంది. మీరు వాళ్లకు ఫోన్ చేసి ఎందుకు వెనుకబడ్డారో (మిలిటరీ వ్యయంలో) అడగండి. ఈ పనికి వారికి క్షమించేదే లేదు. నిజం చెప్పాలంటే వాళ్లను (స్పెయిన్) కూటమి నుంచి బయటకు వెళ్లగొట్టాలి' అని స్టబ్‌కు చెప్పారు. ట్రంప్‌కు స్పెయిన్ రక్షణ మంత్రి మార్గరీటా రోబ్లెస్ కూడా గట్టిగానే బదులిచ్చారు. 'మేమేమీ భయపడటం లేదు. నాటోలో నిబద్ధతగల సభ్యదేశాల్లో స్పెయిన్ ఒకటని ట్రంప్ తెలుసుకుంటారని ఆశిస్తున్నాను' అని మాడ్రిడ్‌లో శుక్రవారం పేర్కొన్నారు.

13న ఎన్‌డీయే తొలి జాబితా..?

బీజేపీ, మిత్రపక్షాల మధ్య పొత్తులు కొలిక్కి

- చర్చలు సానుకూలమన్న చిరాగ్ పాశ్వాన్
- రేపు బీజేపీ ఎన్నికల కమిటీ కీలక భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల పంపకాలపై విస్తృత చర్చలు కొనసాగుతుండగానే ఏకాభిప్రాయం కుదిరిన స్థానాల్లో తొలి జాబితా విడుదల చేసేందుకు ఎన్‌డీయే పక్షాలు సిద్ధమవుతున్నాయి. అన్నీ కుదిరితే ఎన్‌డీయే పార్టీలు ఈ నెల 13న తొలి జాబితా విడుదల చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. అంతకుముందే బీజేపీ తన అభ్యర్థుల ఎంపిక కోసం శని, ఆదివారాల్లో కీలక భేటీలు జరుపనుంది. బిహార్‌లోని 243 స్థానాలకు గాను బీజేపీ, జేడీయూలు చెరో వంద స్థానాల్లో పోటీ చేసేందుకు ఇప్పటికే నిర్ణయించాయి. లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), హిందుస్తానీ ఆవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్ సమతా పార్టీలకు కేటాయించాల్సిన సీట్లపై ఎటూ తేలలేదు. లోక్‌జనశక్తి పార్టీ నేత చిరాగ్ పాశ్వాన్ మొన్నటివరకు 40 స్థానాలను డిమాండ్ చేయగా, బీజేపీ ఎన్నికల ఇంఛార్జి ధర్మేంద్ర ప్రధాన్‌తో భేటీ అనంతరం ఆయన కొద్దిగా మెత్తబడ్డట్లు తెలుస్తోంది. 35 సీట్లకు ఆయన దిగొచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా, బీజేపీ ఆయన పార్టీకి 28–30 సీట్లు ఇచ్చేందుకు సుముఖత చూపుతోంది. ఇక చిరాగ్ పార్టీ పోటీ చేసే 20 స్థానాలపై స్పష్టత వచ్చినట్లు సమాచారం. హెచ్ఏఎంకు ఇవ్వాల్సిన 7 స్థానాలు, ఆర్ఎల్ఎంకి ఇవ్వనున్న మరో 6 స్థానాలపై ఇప్పటికే ఒక అంగీకారం కుదిరినట్లు కూడా తెలుస్తోంది. ఇక ఇప్పటికే బీజేపీ, జేడీయూలు పోటీ చేసే స్థానాల సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నాయి. సుమారు 80కి పైగా స్థానాల్లో స్పష్టత ఏర్పడింది. స్పష్టత ఉన్న స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక కోసం ఈ నెల11న ఢిల్లీలో బీజేపీ బిహార్ కోర్ గ్రూప్ సమావేశం కానుంది,. మరుసటి రోజున పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం జరగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర సీనియర్ నాయకులు ఈ భేటీకి హాజరు కానున్నారు. ఈ సమావేశాల తర్వాత అభ్యర్థుల జాబితాకు తుది ఆమోదం లభిస్తుందని, అక్టోబర్ 13న తొలి ఉమ్మడి జాబితా విడుదలయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. గత ఎన్నికల్లో బీజేపీ 110 సీట్లలో పోటీ చేసి 74 స్థానాలను గెలుచుకుంది. ఇందులో 9మంది మహిళలు ఉన్నారు. ఈసారి కూడా 8–10 సిట్టింగ్ స్థానాలు మినహా మిగతావి పాతవారికే ఇవ్వనున్నట్లుగా తెలుస్తోంది.

'సోషల్' ఖాతాల సస్పెన్షన్‌పై మార్గదర్శకాలకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ: సోషల్ మీడియా ఖాతాల సస్పెన్షన్, రద్దుపై ఆయా సామాజిక మాధ్యమ వేదికల నిర్వాహకులకు మార్గదర్శకాలు జారీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. తమ క్లినిక్, డయాగ్నొస్టిక్ సెంటర్ వినియోగదారులతో టచ్‌లో ఉండేందుకు తాము ఏర్పాటు చేసుకున్న వాట్సాప్ ఖాతాను బ్లాక్ చేశారంటూ దాఖలైన పిటిషన్లపై శుక్రవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ చేపట్టింది. వాట్సాప్ ఖాతాను ఎందుకు బ్లాక్ చేశారంటూ పిటిషనర్లను ప్రశ్నించగా వారు తమకు కారణం తెలపలేదని బదులిచ్చారు. ఈ విషయంలో దేశవ్యాప్తంగా అమలయ్యేలా మార్గదర్శకాలను జారీ చేయాలని వారు కోరారు. స్పందించిన ధర్మాసనం.'వాట్సాప్‌ను వాడుకోవడం ప్రాథమిక హక్కెలా అవుతుంది? వాట్సాప్ లేకుంటే.. అనేక ఇతర సామాజిక మాధ్యమాలున్నాయి...వాటిని ఉపయోగించుకోవచ్చుకదా' అని వారికి సలహా ఇచ్చింది.

పాక్‌లో ఇద్దరు మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులు హతం

పెషావర్: పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తున్వా ప్రావిన్స్‌లో బలగాలు శుక్రవారం చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో ఇద్దరు కరడుగట్టిన ఉగ్రవాదులు హతమయ్యారు. నిఘా వర్గాల సమాచారం మేరకు బన్ను జిల్లా డొమయిల్ ప్రాంతంలో చేపట్టిన కూంబింగ్ సందర్భంగా 25 నిమిషాలపాటు ఇరువర్గాల మధ్య కాల్పులు కొనసాగాయి. అనంతరం ఆ ప్రాంతంలో మలంగ్ యార్, ఖాలిద్ ఉస్మాన్ అనే వాంటెడ్ ఉగ్రవాదుల మృతదేహాలను గుర్తించామని అధికారులు తెలిపారు. తప్పించుకున్న వారి కోసం గాలింపు కొనసాగుతోందన్నారు.

ఆంధ్రుల గురించి పేర్కొన్న అశోకుని శాసనం?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

హిస్టరీ

శాతవాహనులు

మౌర్య సామ్రాజ్యం పతనంతో పాటు, భారతదేశంలో వాయవ్య దిశలో కుషాణులు, పశ్చిమ దిశలో 'క్షాత్రపులు', దక్షిణా పథంలో ప్రాచీనచోళులు, ఆంధ్ర శాతవాహనులు స్వతం త్ర రాజ్యాలు స్థాపించారు. శాతవాహనుల పరిపాలనకు పూర్వమే దక్షిణాపథం రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందినట్లు గ్రీకు రచనల ద్వారా తెలుస్తోంది. పెరిప్లస్ ఆఫ్ ఎరిత్రియన్ సీ, టాలమీ రచించిన 'జాగ్రఫీ' మెగస్తనీసు 'ఇండికా' వంటి గ్రంథాలు వింధ్య పర్వతాలకు దక్షిణాన వివిధ జాతుల వారు పరిపాలించి నట్లు విశద పరుస్తున్నాయి. శాతవాహనుల యుగచరిత్ర క్రీ.పూ. 2వ శతాబ్దం నుంచి, క్రీ.శ. 2వ శతాబ్దం వరకూ దక్షిణాపథ రాజకీయ చరిత్రకు శ్రీకారం చుట్టింది. వీరు ఉత్తర-దక్షిణ దేశాల మధ్య సాంస్కృతిక వారధిని నిర్మించారు. సుమారు నాలుగున్నర శతాబ్దాలపాటు 33 మంది రాజులు ప్రతిష్ఠానపురం, అమరావతులను రాజధానులుగా చేసుకొని పాలించారు. భారతదేశ చరిత్రలోనే అతి సుదీర్ఘంగా పాలించిన రాజవంశంగా శాతవాహనులు ప్రసిద్ధి చెందారు. వివిధ ఆధారాల ప్రకారం వీరి పాలన క్రీ.పూ. 271లో ఆరంభమై క్రీ.శ. 174లో పతనమైంది.

శాతవాహనుల చరిత్రకు ప్రధాన ఆధారాలు

- ఐతరేయ బ్రాహ్మణం.
- మత్స్య, వాయు, బ్రహ్మాండపురాణాలు.
- కుంతల శాతకర్ణి కాలానికి చెందిన 'శర్వవర్మన్' సంస్కృత భాషలో రాసిన కాతంత్ర వ్యాకరణ గ్రంథం.
- గుణాఢ్యుడు ప్రాకృతభాషలో రచించిన బృహత్కథ.
- మహారాష్ట్ర ప్రాకృతభాషలో శాతవాహన రాజైన హాలుడు రచించిన గాథసప్తశతి.
- బౌద్ధమత మహాయాన సిద్ధాంతకర్త ఆచార్య నాగార్జునుడు సంస్కృతభాషలో రచించిన సుహృల్లేఖ, ప్రజ్ఞాపారమిత వంటి గ్రంథాలు.
- గ్రీకు రచయితలు మెగస్తనీసు-'ఇండికా', టాలమీ-'ఎ గైడ్ టు జాగ్రఫీ'.
- చైనా యాత్రికుడు హ్యూయాన్‌త్సాంగ్ రచించిన సీ-యూ-కీ గ్రంథం
- అజ్ఞాత రచయిత రచించిన 'పెరిప్లస్ ఆఫ్ ఎరిత్రియన్-సీ' గ్రంథం
- అశోకుడు వేయించిన శిలా శాసనాలు (ప్రాకృతం) ఎర్రగుడి, రాజుల మందగిరి (కర్నూలు జిల్లా), మస్కీ (రాయచూర్).
- శాతవాహన రాజు మొదటి శాతకర్ణి భార్య 'నాగనిక' వేయించిన 'నానాఘాట్ శిలాశాసనం' (ప్రాకృతభాష)
- గౌతమీ పుత్రశాతకర్ణి తల్లి గౌతమీ బాలశ్రీ వేయించిన 'నాసిక్' శిలా శాసనం.
- రెండో శాతకర్ణి సమకాలికుడైన కళింగా ధిపతి ఖారవేలుడు వేయించిన 'హాతీగుంఫా శిలా శాసనం (ఒడిశా).
- శకరాజైన రుద్రదమనుడు మొదటిసారిగా సంస్కృతభాషలో వేయించిన క్రీ.శ. 150 నాటి గిర్నార్ శాసనం.
- క్షాత్రపు రుద్రదత్తుడు వేయించిన నాసిక్, కన్హేరి శిలాశాసనాలు.
- 'వాసిష్ఠీ పుత్రపులోమావి'కి సంబంధించిన నాసిక్ గుహ శాసనం. ఇవి కాకుండా, పురావస్తు అవశేషాలు, స్థూపాలు, చైత్యగృహాలు, విహారాలు, నాణేలు ముఖ్య ఆధారాలు. అశోకుడు, శాతవాహన రాజులు వేయించిన శాసనాలన్నీ ప్రాకృత భాష, బ్రాహ్మీ లిపిలో ఉన్నాయి.

ఆంధ్రులు-ప్రశస్తి:
తెలుగుకంటె ఆంధ్రశబ్దం ప్రాచీనమైంది. ఋగ్వేదానికి వ్యాఖ్యానంగా రాసిన 'ఐతరేయబ్రాహ్మణం'లో ఆంధ్రులు విశ్వా మిత్రుని సంతతిగా పేర్కొంటూ 'ఆంధ్రశబ్దం' ప్రశస్తి ఉంది. ఐతరేయ బ్రాహ్మణం క్రీ.పూ. 1200 నాటిది. అశోకుని 13వ శిలాశాసనం ఆంధ్రులు మౌర్య సామ్రాజ్యంలో నివసించేవారని పేర్కొంది. ఆంధ్రుల నివాసం గురించి బౌద్ధ జాతక కథల్లో వివరణ ఉంది. భీమసేనజాతకం 'ఆంధ్రపదాన్ని' ప్రస్తావించింది. సెరివణిజ జాతకం తేలి వాహన నదిపై (కృష్ణానది)ఉన్న నగరం 'ఆంధ్రనగరి' అని ప్రస్తావించింది. క్రీ.శ. 4వ శతాబ్దం మైదవోలు శాసనం 'ఆంధ్ర పదం' అని పేర్కొంది. తూర్పు చాళుక్యుల శాసనాల్లో ఆంధ్ర పేరుంది. క్రీ.శ. 13వ శతాబ్దం నాటి హన్మకొండ శాసనం (వరంగల్) 'ఆంధ్రవాణీమండన' అని పేర్కొంది. క్రీ.శ. 14వ శతాబ్దంలో 'ఆంధ్రఖండమండలం' అని పేర్కొన్నారు. శక్తి సంగ్రమతంత్రం ప్రకారం ఆంధ్ర - తెలింగ దేశంగా పేర్కొంది. తర్వాత త్రిలింగశబ్దం వచ్చింది. కాళేశ్వరం, ద్రాక్షారామం, శ్రీశైలం త్రిలింగాలుగా పేరుగాంచాయి.

జన్మస్థలంపై - భిన్నాభిప్రాయాలు:
ఆంధ్ర శాతవాహనుల జన్మస్థానం, జాతి, కులం, పరిపాలనా కాలం, ముఖ్య పట్టణాల గురించి చరిత్ర కారుల్లో భిన్నాభిప్రాయా లున్నాయి. శాతవాహనులు గోదావరి, కృష్ణా మండల వాసులని, అశోకుని మరణానంతరం స్వతంత్రులై పశ్చిమాన నాసిక్ (మహారాష్ట్ర) వరకు రాజ్యాన్ని విస్తరించిన వీరు ఆంధ్రులేనని ఆచార్య గుర్తి వెంకటరావు, ఆచార్య మారేమండరామారావు, వి.ఎ.స్మిత్, రాయ్‌చౌదరి, ఆర్.జి. భండార్కర్ వంటి చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. శాతవాహనుల జన్మభూమి విదర్భ ప్రాంతమని వాసుదేవ విష్ణుమిరాశీ పేర్కొన్నారు. శాతవాహనుల ఆదిమ నివాసం మహారాష్ట్ర (నాసిక్) అని పి.టి. శ్రీనివాస అయ్యం గారు, కె. గోపాలా చారి, ప్రసాల్కర్‌లు పేర్కొన్నారు. వీరి ప్రథమ నివాసం 'బళ్లారి' అని వి.ఎస్. సుక్తాంకర్ అభిప్రాయపడ్డారు. శాతవాహనులు, ఆంధ్రులు కారని, ఆంధ్రులకు 'భృత్యులు' అని ఆర్.జి. భండార్కర్ అభిప్రాయం.

శాతవాహనుల ప్రాచీన రాజధాని శ్రీకాకుళం (కృష్ణా జిల్లా), ఆ తర్వాత ధాన్యకటకం (అమరావతి, గుంటూరు జిల్లా), ఆ తర్వాత ప్రతిష్ఠానపురం (పైథాన్, మహారాష్ట్ర) అని డాక్టర్ ఎల్.డి. బార్నెట్ అభిప్రాయ పడ్డారు. వీరి మొదటి రాజధాని ధాన్యకటకం అని భండార్కర్ అభిప్రాయం.

రాజ్యస్థాపన:
స్వతంత్ర శాతవాహన రాజ్యస్థాపకుడు శ్రీముఖుడు (సీముకుడు). క్రీ.పూ. 271 నుంచి 248 వరకు 23ఏళ్లు పాలించాడు. ఇతను మొదట జైనమతం స్వీకరించాడు. శ్రీముఖుని నాణేలు (తగరం) కరీంనగర్ జిల్లా కోటిలింగాల, ధూళికట్ట ప్రాంతాల్లో లభ్యమయ్యాయి. మెదక్ జిల్లా లో సంగారెడ్డి, కొండాపూర్‌ల్లో కూడా లభించాయి. కర్ణాటకలోని 'సన్నతి', మహారాష్ట్రలోని నెవాస, జున్నార్, అకోల ప్రాంతాల్లో తగరపు నాణేలు అధిక సంఖ్యలో లభ్యమయ్యాయి.

మొదటి శాతకర్ణి:
శ్రీముఖుని తర్వాత అతడి సోదరుడు కన్హ(కృష్ణుడు) కొద్దికాలం పాలించాడు. ఇతడు నాసిక్, కన్హేరి గుహలను తొలిపించాడు. ఇతడి అన్న శ్రీముఖుని కుమారుడు మొదటి శాతకర్ణి తర్వాత రాజ్యానికొచ్చాడు. ఇతడు క్రీ.పూ. 180 నుంచి క్రీ.పూ. 170 వరకు పాలించాడు. ఇతడి భార్య నాగనిక వేయించిన నానాఘాట్ శిలాశాసనం ఇతడి విజయాలను వర్ణిస్తుంది. ఈ శాసనం ప్రకారం మొదటి శాతకర్ణికి 'ఏకవీరుడు, శూరుడు, దక్షిణాపథపతి'గా బిరుదులున్నాయి. రెండు అశ్వమేధయాగాలు, ఒక రాజసూయ యాగం చేసిన మొట్టమొదటి శాతవాహన రాజు ఇతడే! ఇతడి రాజ్యం ఉత్తరాన మాళ్వా నుంచి దక్షిణాన మైసూరు వరకు విస్తరించి ఉంది. 'అప్రతిహతచక్ర' అనే బిరుదు పొందాడు. ఇతడు బలమైన పుష్యమిత్ర శుంగుని ఓడించి, అందుకు గుర్తుగా ఉజ్జయినీ పట్టణ గుర్తుతో నాణేలను ముద్రించాడు. మొదటి శాతకర్ణి బ్రాహ్మణులకు కార్షాపణలు (వెండినాణేలు) విరివిగా దానం చేశాడు. ఇతడు మాళ్వా నుంచి విదిశ (మధ్యప్రదేశ్) వరకు రాజ్యాన్ని విస్తరించాడు.

రెండో శాతకర్ణి:
శాతవాహన వంశంలో 6వ రాజైన రెండో శాతకర్ణి క్రీ.పూ. 184 నుంచి క్రీ.పూ. 128 వరకు 56 ఏళ్లు పాలించాడు. కణ్వ వంశంలో చివరివాడైన 'సుశర్మను' ఓడించి పాటలీ పుత్రాన్ని జయించాడు. దీనికి గుర్తుగా రెండో శాతకర్ణి నాణేలు పాటలీపుత్రలోని 'కుమ్రాయ' వద్ద లభ్యమ య్యాయి. ఇతడు కళింగాధిపతి (ఒడిశా) ఖారవేలుని చేతిలో ఓడాడని, ఖారవేలుని మరణానంతరం కళింగను జయించాడని తెలుస్తోంది. ఇతడు మధ్యప్రదేశ్‌లోని సాంచీస్తూపానికి దక్షిణ తోరణాన్ని నిర్మించాడు.

కుంతల శాతకర్ణి:
శాతవాహన రాజుల్లో 13వ వాడు 'కుంతల శాతకర్ణి' రాజ్యానికొచ్చాడు. శాతవాహనుల సమకాలీకులైన శకులను ఓడించి, మాళ్వా, మహారాష్ట్ర లను తిరిగి సంపాదించాడు. ఇతడి కాలంలోనే ప్రాకృతభాష స్థానంలో సంస్కృతం రాజభాషగా మారింది. ఇతడు



తన నాణేలపై పాటలీపుత్ర చిహ్నాన్ని ముద్రించాడు. వాత్స్యాయనుడు రచించిన 'కామసూత్రం' గ్రంథంలో కుంతల శాతకర్ణిని ప్రస్తావించాడు. ఇతని ఆస్థానంలో శర్వవర్మన్ సంస్కృతభాషలో 'కాతంత్ర వ్యాకరణ' గ్రంథాన్ని రచించాడు. ఇతడి కాలంలోనే గుణాఢ్యుడు పైశాచిక ప్రాకృతభాషలో బృహత్కథను రచించాడు. ఈ గ్రంథ మే పంచతంత్రాన్ని సంస్కృత భాషలో 'విష్ణుశర్మ' రచించడానికి ఆధారమైంది. బృహత్కథ ఆధారంగా, క్షేమేంద్రుడు బృహత్కథా మంజరి, హరిసేనుని బృహత్కథాకోశం, వరాహమిహిరుని - బృహత్ సంహిత వంటి గ్రంథాలకు కూడా గుణాఢ్యుని బృహత్కథ ఆధారమైంది.

హాలుడు:
శాతవాహన రాజుల్లో 17వ వాడు. ఏడాది మాత్రమే రాజ్యపాలన చేశాడు. హాలుడు ప్రాకృతభాషలో 700 శృంగార గాథలను 'గాథసప్తశతి' పేరుతో సంకలనం చేశాడు. ఈయనకు 'కవివత్సలుడు' అనే బిరుదు ఉంది. కుతూహలుడు రచించిన 'లీలావతి పరిణయం' కావ్యం ప్రకారం హాలుడు సింహళ రాకుమారి లీలావతిని గోదావరి తీరం ద్రాక్షారామంలో వివాహం చేసుకున్నట్లు తెలుస్తోంది. వాత్స్యాయన కామసూత్రం, రాజశేఖరుని 'కావ్యమీమాంస' గ్రంథాలు హాలుడిని ప్రస్తావించాయి.

గౌతమీ పుత్రశాతకర్ణి:
క్రీ.శ. 62-86 మధ్య కాలంలో పాలించిన 23వ శాతవాహన రాజు గౌతమీపుత్ర శాతకర్ణి. ఇతడు శాతవాహన రాజుల్లో అగ్రగణ్యుడు. గొప్పవిజేత. తన తల్లి గౌతమీబాలశ్రీ వేయించిన నాసిక్ శిలా శాసనం ఇతడి విజయాలను వర్ణిస్తుంది. శాతవాహన రాజుల్లో పేరుకు ముందు తల్లిపేరును పెట్టుకునే సంప్రదాయం గౌతమీపుత్ర శాతకర్ణితోనే ప్రారంభమైంది. శక-శాతవాహనుల మధ్య సముద్ర వ్యాపారం కోసం జరుగుతున్న పోరాటాన్ని అంతం చేసి శకరాజైన నహపాణుడ్ని హతమార్చి, 'క్షహరాట వంశనిరవశేషకార' అనే బిరుదును పొందాడు. తాను అధికారంలోకి రావడానికి గుర్తుగా క్రీ.శ. 78లో 'శాలివాహన శకాన్ని' ప్రారంభించాడు. శక రాజుల్లో నహపాణుడు గొప్ప విజేతగా పేరు పొందాడు. నహపాణుడి రాజ్యం కతియవాడ్ (గుజరాత్), ఉత్తర-దక్షిణ-మహారాష్ట్ర ప్రాంతం, కొంకణ ప్రాంతాల వరకు విస్తరించింది. ఈయన రాజధాని మిన్నగార (మందసా). ఇది ఉజ్జయినీ-బ్రోచ్‌ల మధ్య ప్రాంతం. శాతవాహనుల నుంచి నహపాణుడు మహారాష్ట్ర ప్రాంతాన్ని జయించాడు. కానీ గౌతమీపుత్ర శాతకర్ణి తిరిగి జయిం చి స్వాధీనం చేసుకున్నాడు. నహపాణునితో క్షహరాట వంశం అంతమైంది. నహపాణుడు వేయించిన సుమారు 13,270 వెండినాణేలు మహారాష్ట్రలోని 'జోగల్‌తంబి' ప్రాంతంలో లభ్యమయ్యాయి. ఈ నాణేలను గౌతమీపుత్ర శాతకర్ణి తన బొమ్మతో తిరిగి ముద్రించాడు. ఆంధ్రదేశంలో గౌతమీపుత్ర శాతకర్ణి నాణేలు అమరావతి, చేబ్రోలు, మాచర్ల, గోలి, మాడుగుల ప్రాంతాల్లో లభించాయి. ఇతనికాలం నాటి టంకశాల మూసకట్లతో సహా విజయపురి (నాగార్జునకొండ) వద్ద లభించాయి. ఇతడు అపరాంత, కుకుర, వైజయంతి, అసక, ముల కలను జయించాడు. ఇతనికి 'ఆగమనిలయ, ఏకబ్రాహ్మణ, క్షత్రియదర్పమానమర్దన త్రిసముద్రతోయపీతవాహన' బిరుదులున్నాయి. గౌతమీపుత్ర శాతకర్ణి తర్వాత అతని కుమారుడు 'వాసిష్ఠీపుత్ర పులోమావి' రాజ్యానికొచ్చాడు. ఇతడిని 'దక్షిణాపథేశ్వర' అని గౌతమీ బాలశ్రీ వేయించిన నాసిక్‌శాసనం ప్రస్తావించింది. ఇతని సమకాలికుడు కుషాణురాజు హవిస్కుడు. వాసిష్ఠీపుత్ర పులోమావి కాలంలోనే తన రాజధానిని ప్రతిష్ఠానపురం నుంచి ధాన్యకటకానికి మార్చాడు. ఇతడి కాలంలోనే ప్రఖ్యాతిగాంచిన అమరావతి స్తూపానికి మెరుగులు దిద్దారు. ఇతడు కార్లేలోని బౌద్ధ భిక్షువులకు దానాలు చేశాడు. ఇతడి రాజ్యకాలం క్రీ.శ. 86-114 వరకు. ఇతడినే రెండో పులోమావిగా కూడా పిలుస్తారు.

గుర్తుంచుకోండి ఇలా..!
చరిత్రలో తారీఖులు, దస్తావేజులు, రచనలు, రాజుల సమకాలీకులు, వాదాలు, రాజధానులు గుర్తుంచుకోవాలి. ఒక రాజ్యం చరిత్ర చదివినపుడు ఆనాటి సమకాలీన రాజుల గురించి కొంత తెలుసుకోవాలి. **ఉదా:** హాలుడు గాథసప్తశతిని ఏ భాషలో రచించాడు. జ: ప్రాకృతభాషలో అదే విధంగా గ్రంథాలు ఏ అంశాన్ని ప్రస్తావిస్తున్నాయి అనేది కూడా గుర్తుంచుకోవాలి. **ఉదా:** 'గాథ సప్తశతి' ఏ అంశాన్ని ప్రధానంగా పేర్కొంటుంది. జ: శృంగార పదాల గురించి.. ఈ కోణంలోనూ చరిత్రాంశాలను అధ్యయనం చేయాలి.

యజ్ఞశ్రీ శాతకర్ణి:
ఇతడు కడపటి శాతవాహన రాజుల్లో గొప్పవాడు. 27వ శాతవాహనరాజు. యజ్ఞశ్రీ శాతకర్ణి మహాక్షాత్రప శకరుద్రదామునికి సమకాలికుడు. తొలి సంస్కృత శాసనం వేయించింది రుద్రదాముడే. దీనినే 'గిర్నార్ శాసనం' అంటారు. యజ్ఞశ్రీ శాతకర్ణి కాలంలో నౌకావ్యాపారం జరిగినట్లు అతడి నాణేల ద్వారా తెలుస్తోంది. ఇతడి కాలంలోనే తెరచాప (లేదా) లంగరు వేసిన ఓడముద్రలున్న నాణేలు లభించాయి. ఇతడి ఆస్థానంలో ఆచార్య నాగార్జునుడు ఉండేవాడు. ఇతని కోసం శ్రీ పర్వతం (నాగార్జున కొండ)పై పారావత విహారం నిర్మించాడు యజ్ఞశ్రీ. యజ్ఞశ్రీ శాతకర్ణికి 'త్రి సముద్రాధిపతి' అనే బిరుదు ఉంది. ఇతడి తర్వాత శాతవాహన రాజ్యం క్షీణించింది. చివరిరాజు మూడో పులోమావి కాలంలో ఈ రాజ్యం అంతరించింది. క్రీ.శ. 225 సంవత్సరంలో సామంతరాజులైన అభిరులు, చుటునాగులు, ఇక్ష్వాకులు, పల్లవులు తిరుగుబాటు చేసి స్వతంత్ర రాజ్యాలు స్థాపించారు..

మాదిరి ప్రశ్నలు:

1) 'లీలావతి పరిణయం' గ్రంథకర్త?
   1) రాజశేఖరుడు 2) హాలుడు
   3) వాత్స్యాయనుడు 4) కుతూహలుడు
2) ఆచార్య నాగార్జునుడికి సమకాలీన శాతవాహన రాజు?
   1) హాలుడు 2) మొదటి శాతకర్ణి
   3) గౌతమీపుత్ర శాతకర్ణి 4) యజ్ఞశ్రీ శాతకర్ణి
3) 'కాతంత్ర సంస్కృత వ్యాకరణం' రచయిత?
   1) నాగార్జునుడు 2) గుణాఢ్యుడు
   3) శర్వవర్మన్ 4)వరాహమిహిరుడు
4) ఆంధ్రుల గురించి పేర్కొన్న అశోకుని శిలా శాసనం ఏది?
   1) 9వ 2) 12వ 3) 13వ 4) ఏదీకావు
5) నహపాణుడిని ఓడించిన శాతవాహన రాజు?
   1) సీముఖుడు 2) యజ్ఞశ్రీ శాతకర్ణి
   3) రెండోశాతకర్ణి 4) గౌతమీపుత్ర శాతకర్ణి
6) గాథాసప్తశతి ప్రాకృత పదాల్లో ప్రధానాంశం?
   1) జానపద పదాల వివరణ
   2) శృంగార పదాల వివరణ
   3) చిలుక చెప్పిన కథలు 4) పురాణాల కథనం
7) శాతవాహనులు ఆంధ్రులు కారని, ఆంధ్రులకు భృత్యులని వాదించిన పండితుడు?
   1) ఆర్.జి. భండార్కర్
   2) వి.యస్.సుక్తాంకర్
   3) రాప్సన్ 4) డా.గోపాలాచారి
8) ఆంధ్రశబ్దాన్ని తొలిసారిగా ప్రస్తావించింది?
   1) ఋగ్వేదం 2) సామవేదం
   3) ఐతరేయ బ్రాహ్మణం
   4) మాండ్యూకోపనిషత్
9) ఓడముద్రలున్న సీసం నాణేలను ముద్రించిన శాతవాహన రాజు?
   1) హాలుడు 2) గౌతమీపుత్ర శాతకర్ణి
   3) రెండోపులోమావి 4) యజ్ఞశ్రీ శాతకర్ణి
10) శాతవాహన రాజులు తమ వ్యక్తిగత నామాలకు మాతృగోత్ర నామాలను ముందు చేర్చి, చెప్పుకునే పద్ధతి ఎవరి కాలంలో ప్రారంభమైంది?
   1) గౌతమీపుత్ర శాతకర్ణి
   2) శ్రీముఖుడు
   3) వాసిష్ఠీపుత్ర పులోమావి
   4) హాలుడు
11) తొలిసారి సంస్కృతభాషలో క్రీ.శ.150లో గిర్నార్ శాసనాన్ని వేయించిన విదేశీ రాజు?
   1) నహపాణుడు 2) మీనాండర్
   3) రుద్రదమనుడు 4) డెమిట్రియస్

సమాధానాలు
1) 4; 2) 4; 3) 3; 4) 3; 5) 4; 6) 2; 7) 1; 8) 3; 9) 4; 10) 1; 11) 3.

నిగమన ఉపగమానికి గల ప్రయోజనం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బోధన పద్ధతులు

విజ్ఞాన శాస్త్ర బోధనాభ్యసన వ్యూహాలు

- విద్యార్థుల్లో ఆమోదయోగ్యమైన ప్రవర్తనా మార్పు తీసుకొని రావడమే బోధన ముఖ్య ఉద్దేశం.
- బోధన ఒక కళ. అది సహజ సిద్ధంగా వస్తుంది. అలాకాకపోతే శిక్షణ ద్వారా సాధించవచ్చు. విద్యా లక్ష్యాలను సాధించడానికి బోధన పద్ధతులు ఉపయోగపడతాయి.
- పూర్వం సంప్రదాయ పద్ధతిలో బోధించే వారు. జ్ఞానం విస్ఫోటనం చెందిన తర్వాత మనోవైజ్ఞానిక సిద్ధాంతాలు విద్యలో బోధించడం వల్ల అనేక బోధన పద్ధతులు ఏర్పడ్డాయి.

బోధన ఉపగమాలు:
- బోధన పద్ధతుల్లో వాడే విధానాలను ఉపగమాలు అనొచ్చు. అంటే ఒక బోధన పద్ధతిలో తెలిసిన విషయాలను తెలియని విషయాలవైపుగా లేదా తెలియని విషయం నుంచి తెలిసిన విషయం వైపుగా చెబుతూ ఉండటం ఈ ఉపగమాలను సూచిస్తాయి.
- ఒక విషయంలో ఉపగమాన్ని బోధన పద్ధతిలో వాడితే మరొక విషయంలో ఆ ఉపగమాన్నే ప్రత్యేక బోధన పద్ధతిగా వాడుతున్నారు. **ఉదా:** గణితశాస్త్రం.

ఆగమన ఉపగమం:
- తెలిసిన విషయాల నుంచి తెలియని విషయాల వైపునకు వెళ్లడం.
- మూర్త విషయాల నుంచి అమూర్త విషయాల వైపునకు వెళ్లడం.
- నిర్దిష్ట ఉదాహరణల నుంచి సామాన్య సూత్రాలను రాబట్టడం ఆగమన ఉపగమాన్ని సూచిస్తాయి.

ఫౌలర్
- నిర్దిష్ట అంశాల నుంచి సాధారణీకరణలను రూపొందించడాన్ని ఆగమనం అంటారు.

జీవన్
- ప్రత్యేక సత్యాల నుంచి సాధారణ సత్యాలను రూపొందించడాన్ని ఆగమనం అంటారు.

ఉదా:మల్లెపూవుకు సువాసన ఉంటుంది. అది రాత్రి వికసిస్తుంది. సన్నజాజికి సువాసన ఉంటుంది. అది రాత్రి వికసిస్తుంది. విరజాజికి సువాసన ఉంటుంది. అది రాత్రి వికసిస్తుంది. కాబట్టి రాత్రివేళ వికసించే పూలలో సువాసన ఉంటుంది అని సాధారణీకరణాన్ని ప్రతిపాదిస్తే అది ఆగమన ఉపగమం అవుతుంది.

నిగమన ఉపగమం:
- ఇది ఆగమన ఉపగమానికి వ్యతిరేకంగా ఉంటుంది.
- తెలియని విషయాల నుంచి తెలిసిన విషయాల వైపునకు, అమూర్త విషయాల నుం చి మూర్త విషయాల వైపునకు, సాధారణ విషయం నుంచి ప్రత్యేకాంశాల వైపునకు, వెళ్లడం ఈ ఉపగమాన్ని తెలుపుతుంది. దీన్ని అరిస్టాటిల్ తర్క శాస్త్ర పునాదులపై ఆధారపడి తయారుచేశారు.
- మానవులంతా మర్త్యులే (మరణించేవారే)
- సోక్రటీస్ మానవుడు మరణించాడు.
- ప్లేటో మానవుడు మరణించాడు.
- అలెగ్జాండర్ మానవుడు మరణించాడు. ఈ విభాగంలో బోధించడం నిగమన ఉపగమం.

విజ్ఞానశాస్త్ర బోధన వ్యూహాలు:
- విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు చేసే ప్రయత్నాలు లేదా బోధిం చే పద్ధతులు ప్రధానంగా రెండు రకాలు.
  1) ఉపాధ్యాయ కేంద్రిత బోధన పద్ధతులు
  2) విద్యార్థి కేంద్రిత బోధన పద్ధతులు.

ఉపాధ్యాయ కేంద్రిత బోధన పద్ధతులు:
- ఉపాధ్యాయుడు మాత్రమే చురుకుగా ఉండి బోధించే బోధన పద్ధతి. దీనిలో విద్యార్థి పాత్ర తక్కువ. ఇందులో నాలుగు పద్ధతులు చూడొచ్చు.
  1) ఉపన్యాస పద్ధతి
  2) ఉపన్యాస ప్రదర్శన పద్ధతి
  3) చారిత్రాత్మక పద్ధతి 4) నిర్మాణ పద్ధతి

ఉపన్యాస పద్ధతి:
- ఉపాధ్యాయుడు ఉపన్యసిస్తాడు. విద్యార్థులు వింటారు లేదా వింటున్నట్లు నటిస్తారు.
- దీన్ని రాసి మాట్లాడే పద్ధతి అని కూడా అంటారు.
- ఇందులో విద్యార్థి కంటే విషయానికే ప్రాధాన్యత ఉంటుంది.

ప్రయోజనాలు:
- ఆర్థికంగా సులువైనవి. ప్రయోగాలు, నమూనాలు లేవు కాబట్టి ఖర్చు తక్కువవుతుంది.
- తక్కువ కాలంలో ఎక్కువ అంశాలు బోధించవచ్చు.
- పాఠ్య ప్రణాళికను సకాలంలో బోధించవచ్చు.
- ఎంతమంది విద్యార్థులకైనా ఒకేసారి బోధించవచ్చు.
- పనిభారం తక్కువ.

లోపాలు
- కృత్యాధార బోధనకు వ్యతిరేకం.
- చేయడం ద్వారా నేర్చుకోవడం జరగదు. (విద్యార్థులు ప్రయోగాలు చేయరు).
- శాస్త్రీయ వైఖరి పెంపొందించలేం.
- వైయక్తిక భేదాలను గుర్తించి బోధించలేం.
- శారీరక ఉపస్థితి, మానసిక అనుపస్థితి ఉంటుంది. (తరగతి గదిలో ఉన్న విద్యార్థులు మానసికంగా సిద్ధంగా ఉండరు)

ఉపన్యాస ప్రదర్శనా పద్ధతి:
- ఉపన్యాస పద్ధతిలోని లోపాలను ప్రదర్శనా పద్ధతిలో కొన్ని సవరించారు. ఈ పద్ధతిలో వినడంతోపాటు చూడటం కూడా ఉంటుంది. కాబట్టి అభ్యసించిన విషయం ఎక్కువ రోజులు గుర్తుంటుంది.
- విద్యార్థులు ఉపన్యాస పద్ధతిలో కంటే కొంత చురుకుగా ఉంటారు.
- **ముఖ్యాంశాలు:** పాఠ్య పథక రచన - పరికరాలను సిద్ధం చేసుకోవడం - ప్రయోగాలు సరిచేసి చూడడం.

ప్రదర్శన విజయవంతం కావాలంటే?
- ప్రదర్శనా లక్ష్యాన్ని ముందుగా తెలపాలి.
- ప్రదర్శన అందరికీ కనిపించేలా ఉండాలి.
- సామగ్రి తగిన పరిమాణంలో ఉండాలి.
- ప్రత్యామ్నాయ పరికరాలుండాలి.
- మధ్యలో ప్రశ్నలు వేసి ఆసక్తి పెంచాలి.
- విద్యార్థుల స్థాయికి తగిన ప్రయోగాలుండాలి.
- విద్యార్థుల సహకారం తీసుకోవాలి.
- ప్రదర్శన చూడడానికి తగిన సమయం ఇవ్వాలి.
- చివరి వరకూ ఆసక్తి కొనసాగాలి.

ప్రయోజనాలు: మనోవైజ్ఞానికం, సిద్ధాంతం ఆచరణకు మధ్య సంబంధం కలిగి ఉంది. వ్యయాన్ని, కాలాన్ని ఆదా చేస్తుంది. (ఉపాధ్యాయుడు మాత్రమే ప్రయోగం చేస్తాడు)

లోపాలు: విద్యార్థులు ప్రయోగం చూస్తారు కానీ చేయరు. ప్రదర్శన విఫలమైతే విద్యార్థుల్లో నిరుత్సాహం కలుగుతుంది.

3. **చారిత్రక పద్ధతి:** ఇది పూర్తిస్థాయి బోధన పద్ధతి కాదు. కొన్ని పాఠ్యాంశాలను మాత్రమే ఈ పద్ధతిలో బోధించవచ్చు. **ఉదా:** శాస్త్రవేత్తల జీవిత విశేషాలు, ఆవిష్కరణలు తెలియజేసేటప్పుడు పూర్వ చరిత్ర తెలపాచ్చు. శాస్త్రవేత్తల చిత్రాలను ప్రదర్శిస్తూ చెప్పడం బాగుంటుంది. ప్రతి పాఠానికి ముందు దాని పూర్వ చరిత్ర చెప్పడం ఈ పద్ధతి.
4. **నిర్మాణ పద్ధతి:** విజ్ఞాన శాస్త్ర నిర్మాణం ప్రకారం బోధన జరిపే పద్ధతి. ష్వాబ్ అండ్ ఫినిక్స్ ప్రకారం సంశ్లేషాత్మక నిర్మాణంలో ఉండే పరిశీలనలు, వర్గీకరణలు, ప్రాకల్పనలు, ప్రయోగాలు, వ్యాఖ్యానం, కొలవడం, అన్వేషణ వంటి ప్రక్రియలు నేర్పడం, ద్రవ్యాత్మక నిర్మాణంలోని యథార్థాలు, భావనలు, సాధారణీకరణలు, సూత్రాలు, సిద్ధాంతాలు, నియమాలు తెలప డం ఈ పద్ధతిలో జరుగుతుంది. ఇది ఆలోచనను రేకెత్తించి వైఖరులను ఏర్పరుస్తుంది..

గతంలో అడిగిన ప్రశ్నలు

1. శాస్త్రీయ సూత్రాలు, సిద్ధాంతాలు, ధర్మాలు కనుక్కోవడానికి దోహదపడిన పద్ధతి? (డీఎస్సీ- 2008)
   1) ఆగమన 2)నిగమన
   3) సర్పిల 4) ఏక కేంద్రీయ
2. అభ్యసనంలో ఉపాధ్యాయుడు కల్పించే కృత్యాల పరంగా ప్రాధాన్యత లేని కృత్య లక్షణం? (డీఎస్సీ- 2008)
   1) బహుళ తరగతి బోధనకు అనువైనదిగా
   2) విద్యార్థులు శారీరక, మానసిక ఒత్తిళ్లను పెంచేదిగా
   3) ఆలోచనలు రేకెత్తించేదిగా
   4) ఆసక్తి కలిగించేదిగా

సమాధానాలు: 1) 1 ; 2) 2.

మాదిరి ప్రశ్నలు

1. బోధన ముఖ్య ఉద్దేశం కానిది?
   1) లక్ష్యాలను సాధించడం విద్యార్థుల్లో నేర్పడం.
   2) చేయడం ద్వారా నేర్చుకునేట్లు చేయడం.
   3) విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలను బోధన ద్వారా పొందడం.
   4) విద్యార్థుల్లో శాశ్వత ప్రవర్తనా మార్పులు తీసుకొని రావడం.
2. ప్రాచీన సంప్రదాయ పద్ధతిలో బోధన, బోధనలో ఆధునికీకరణకు వేటిని జోడిం చారు?
   1) ప్రయోగాలు చేస్తూ బోధించడం
   2) బోధనోపకరణాలు విరివిగా వాడడం
   3) మనోవైజ్ఞానిక సిద్ధాంతాలు
   4) సొంత పాఠశాల భవనాలు
3. ఉపగమాలు, బోధన పద్ధతుల మధ్య సంబంధానికి సంబంధించి సరైంది?
   1) ఉపగమాలు, బోధన పద్ధతులు రెండూ ఒకటే.
   2) బోధన పద్ధతుల్లో తిరిగి అనుసరించే విధానం ఉపగమం.
   3) ఉపగమానికి బోధన పద్ధతికి అసలు సంబంధమే లేదు.
   4) విద్యలో ఉపగమం లేదు, బోధన పద్ధతి మాత్రమే ఉంది.
4. ఏ శాస్త్రంలో ఉపగమాలను ప్రత్యేక బోధన పద్ధతిగా వాడుతున్నారు?
   1) విజ్ఞాన శాస్త్రం
   2) సాంఘిక శాస్త్రం
   3) జీవ శాస్త్రం 4) గణిత శాస్త్రం
5. జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు తన బోధనలో సూత్రాన్ని ముందుగా చెప్పి తర్వాత ఉదాహరణలు ఇచ్చారు. ఆమె అనుసరించిన ఉపగమం?
   1) ఆగమన ఉపగమం
   2) నిగమన ఉపగమం
   3) ఆగమన, నిగమన రెండూ
   4) ఇది ఉపగమం కాదు
6. ఇనుము, రాగి, అల్యూమినియం వేడి చేస్తే వ్యాకోచిస్తాయి. ఎందుకంటే అవి లోహాలు. కాబట్టి లోహాలన్నీ వేడి చేస్తే వ్యాకోచిస్తాయి. ఈ క్రమంలో బోధించిన విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయుడు ఏ ఉపగమాన్ని ఎంచుకున్నట్లు?
   1) ఆగమన ఉపగమం
   2) నిగమన ఉపగమం
   3) ఆగమన నిగమన రెండూ
   4) నిగమన తర్వాత ఆగమన ఉపగమం
7. వీటిలో ఏది ఆగమన ఉపగమాన్ని తెలపదు?
   1) మూర్త విషయాల నుంచి అమూర్త విషయాలు రాబట్టడం
   2) నిర్దిష్ట విషయాల నుంచి సాధారణీకరణలు రూపొందించడం
   3) సాధారణీకరణాలు ప్రతిపాదించడం
   4) అమూర్త సామాన్యీకరణల నుంచి మూర్త సత్యాలను గుర్తించే విధానం
8. నిగమన ఉపగమానికి గల ప్రయోజనం?
   1) శాస్త్రీయ పద్ధతి
   2) శాస్త్రీయ వైఖరి పెంపొందిస్తుంది
   3) నేర్చుకున్న విషయాలు ఎక్కువ కాలం జ్ఞాపకం ఉంటాయి.
   4) సిలబస్‌ను తక్కువ సమయంలో పూర్తి చేయొచ్చు.
9. 'రాసి మాట్లాడే పద్ధతి' అని ఏ బోధన పద్ధతికి మారుపేరు?
   1) ఉపన్యాస - ప్రదర్శనా పద్ధతి
   2) ఉపన్యాస పద్ధతి
   3) చారిత్రక పద్ధతి
   4) నిర్మాణ పద్ధతి
10. కింది బోధన పద్ధతుల్లో ఏది ఉపాధ్యాయ కేంద్రిత బోధన పద్ధతి కాదు?
   1) ఉపన్యాస పద్ధతి
   2) ఉపన్యాస ప్రదర్శనా పద్ధతి
   3) అన్వేషణ పద్ధతి
   4) చారిత్రక పద్ధతి

సమాధానాలు
1) 3; 2) 3; 3) 2; 4) 4; 5) 2; 6) 1; 7) 4; 8) 4; 9) 2; 10) 3.

సహజ వాయువులో ప్రధానంగా ఉండే వాయువు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం



హైడ్రోకార్బన్లు

1. ప్రయోగశాలలో ఇనార్గానిక్ సమ్మేళనం నుంచి మొదటిసారిగా తయారుచేసిన కర్బన సమ్మేళనం ఏది?
   1) చక్కెర 2) గ్లూకోజ్
   3) యూరియా 4) ఆల్కహాల్
2. కింది వాటిలో హైడ్రోకార్బన్ ఏది?
   1) మీథేన్ 2) ఇథిలీన్
   3) బ్యూటేన్ 4) పైవన్నీ
3. ఆల్కేన్లుగా పేర్కొనే మొదటి నాలుగు హైడ్రోకార్బన్లు ఏవి?
   1) మీథేన్, బ్యూటేన్, ప్రొపేన్, ఈథేన్
   2) మీథేన్, ఇథిలీన్, ఎసిటలీన్, బ్యూటేన్
   3) మీథేన్, ఈథేన్, ప్రొపేన్, బ్యూటేన్
   4) బ్యూటేన్, ప్రొపేన్, ఈథేన్, మీథేన్
4. కింది వాటిలో ద్రవరూపంలో ఉండే హైడ్రోకార్బన్ ఏది?
   1) ప్రొపేన్ 2) బ్యూటేన్
   3) పెంటేన్ 4) హెక్సేన్
5. కింది వాటిలో సంతృప్త హైడ్రోకార్బన్ ఏది?
   1) మీథేన్ 2) ఇథిలీన్
   3) బెంజీన్ 4) ఎసిటలీన్
6. ఫలాలను కృత్రిమంగా త్వరగా పండించడానికి వినియోగించే కాల్షియం కార్బైడ్ విడుదల చేసే వాయువు ఏది?
   1) ఇథిలీన్ 2) ఎసిటలీన్
   3) మీథేన్ 4) బ్యూటేన్
7. ఫలాలను కృత్రిమంగా త్వరగా పండించడానికి సురక్షితమైన పద్ధతి ఏది?
   1) ఫలాలను ఎసిటలీన్ చాంబర్‌లో ఉంచడం
   2) ఫలాలను ఇథిలీన్ చాంబర్‌లో ఉంచడం
   3) ఫలాలను బ్యూటేన్ చాంబర్‌లో ఉంచడం
   4) ఫలాలను ఈథర్ చాంబర్‌లో ఉంచడం
8. కింది వాటిలో కార్బన్ రూపాంతరం కానిది ఏది?
   1) వజ్రం 2) గ్రాఫైట్
   3) ఫుల్లరీన్ 4) కార్బోరండం
9. కింది వాటిలో కేవలం కార్బన్ పరమాణువులు మాత్రమే ఉండే పదార్థం ఏది?
   1) గ్రాఫైట్ 2) ఫుల్లరీన్
   3) వజ్రం 4) పైవన్నీ
10. కింది వాటిలో ఇంధనాలుగా ఎక్కువగా వినియోగంలో ఉన్నవేవి?
    1) ఆల్కేన్లు 2) ఆల్కీన్లు
    3) ఆల్కైన్లు 4) పైవన్నీ
11. కింది వాటిలో హరిత గృహ (గ్రీన్‌హౌజ్) వాయువు కానిది ఏది?
    1) కార్బన్ డై ఆక్సైడ్
    2) మీథేన్
    3) నైట్రస్ ఆక్సైడ్ 4) హైడ్రోజన్
12. వెల్డింగ్ చేయడానికి అవసరమైన అధిక ఉష్ణోగ్రత పొందడానికి ఆక్సిజన్‌తో కలిపి ఉపయోగించే హైడ్రోకార్బన్ ఏది?
    1) ఇథిలీన్ 2) ఎసిటలీన్
    3) ఈథేన్ 4) బ్యూటేన్
13. సహజ వాయువులో ప్రధానంగా ఉండే వాయువు ఏది?
    1) మీథేన్ 2) కార్బన్ డై ఆక్సైడ్
    3) బ్యూటేన్ 4) ఎసిటలీన్
14. గృహ ఇంధనంగా ఉపయోగించే గోబర్ గ్యాస్, బయోగ్యాస్‌లలో ప్రధానంగా ఉండే వాయువు ఏది?
    1) బ్యూటేన్ 2) ఈథేన్
    3) మీథేన్ 4) పెంటేన్
15. LPGలో ఉండే ప్రధాన హైడ్రోకార్బన్ ఏది?
    1) బ్యూటేన్ 2) మీథేన్
    3) ప్రొపేన్ 4) బెంజీన్
16. జతపరచండి.

    జాబితా - 1
    A) కోల్ గ్యాస్
    B) LPG
    C) వాటర్ గ్యాస్
    D) ఆక్సీ ఎసిటలీన్

    జాబితా - 2
    1) వెల్డింగ్‌లో వాడతారు
    2) అమ్మోనియా తయారీలో వాడతారు
    3) వంటగ్యాస్‌గా ఉపయోగపడుతుంది
    4) లోహ సంగ్రహణలో క్షయకరణిగా వినియోగిస్తారు

	A	B	C	D
1)	1	2	3	4
2)	4	3	2	1
3)	4	3	1	2
4)	2	4	1	3

17. 'వాటర్ గ్యాస్' ఏ వాయువుల మిశ్రమం?
    1) మీథేన్ + బ్యూటేన్
    2) మీథేన్ + కార్బన్ మోనాక్సైడ్
    3) హైడ్రోజన్ + కార్బన్ మోనాక్సైడ్
    4) హైడ్రోజన్ + ఆక్సిజన్
18. కింది వాటిలో సరైన వాక్యం ఏది?
    1) ఆక్సిజన్‌కు మండే స్వభావం ఉంటుంది (దహన శీలి).
    2) ఆక్సిజన్‌కు మండే స్వభావం ఉంటుంది. అదేవిధంగా మండటానికి సహాయ పడుతుంది (దహన దోహదకారి).
    3) ఆక్సిజన్ దహనశీలి కాదు. కానీ దహన దోహదకారి.
    4) ఆక్సిజన్ గ్రీన్‌హౌస్ వాయువు.
19. కింది వాటిలో మండే స్వభావం లేని వాయువు ఏది?
    i) హైడ్రోజన్
    ii) బ్యూటేన్
    iii) కార్బన్ డై ఆక్సైడ్
    iv) కార్బన్ మోనాక్సైడ్
    1) i, ii, iii 2) i, ii, iv
    3) ii, iii, iv 4) ii, iv
20. కింది వాటిలో పారిశ్రామిక ఇంధన వాయువు ఏది?
    1) వాటర్ గ్యాస్ 2) ప్రొడ్యూసర్ గ్యాస్
    3) కోల్ గ్యాస్ 4) పైవన్నీ
21. ప్రొడ్యూసర్ గ్యాస్‌లో నైట్రోజన్‌తోపాటు ఉండే ప్రధాన వాయువేది?
    1) హైడ్రోజన్ 2) ఆక్సిజన్
    3) కార్బన్ మోనాక్సైడ్
    4) బ్యూటేన్
22. కింది వాటిలో అధిక పీడనం, అధిక ఉష్ణోగ్రత వద్ద ఉత్ప్రేరక సమక్షంలో వేడిచేస్తే.. మైనం లాంటి ఘన పదార్థాన్ని ఏర్పరిచేది ఏది?
    1) హైడ్రోజన్ 2) ఇథిలీన్
    3) ఈథేన్ 4) మీథేన్
23. క్యారీ బ్యాగుల తయారీకి ఉపయోగపడే ముడి పదార్థం ఏది?
    1) ఇథిలీన్ 2) ఈథేన్
    3) బ్యూటేన్ 4) బెంజీన్
24. ఒక మైక్రాన్ కింది వాటిలో దేనికి సమానం?
    1) మిల్లీమీటర్‌లో పదో వంతు(0.1 mm)
    2) మిల్లీమీటర్‌లో వందో వంతు (0.01 mm)
    3) మిల్లీమీటర్‌లో 1000వ వంతు (0.001 mm)
    4) మిల్లీమీటర్‌కు సమానం
25. 2011లో భారత ప్రభుత్వం ఎంత మందం కలిగిన క్యారీ బ్యాగులపై నిషేధం విధించింది?
    1) 40 మైక్రాన్ల కంటే తక్కువ
    2) 40 మైక్రాన్ల కంటే ఎక్కువ
    3) 100 మైక్రాన్లు 4) ఏదీకాదు
26. జతపరచండి.

ఇంధన వాయువు	ప్రధాన అనుఘటకాలు
A) CNG	1) మీథేన్, ఈథేన్
B) కోల్‌గ్యాస్	2) హైడ్రోజన్, మీథేన్, కార్బన్ మోనాక్సైడ్
C) LPG	3) బ్యూటేన్, ప్రొపేన్
D) వాటర్ గ్యాస్	4) కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్

	A	B	C	D
1)	1	2	3	4
2)	2	3	4	1
3)	4	3	1	2
4)	3	4	1	2

27. కింది వాటిలో పొడవైన శృంఖలాలతో కూడిన హైడ్రోకార్బన్ల సల్ఫోనికామ్ల లవణాలేవి?
    1) సబ్బులు 2) డిటర్జెంట్లు
    3) కొవ్వులు 4) మైనాలు
28. ప్రింటింగ్ ఇంక్ తయారీలో వినియోగించే హైడ్రోకార్బన్ ఏది?
    1) మీథేన్ 2) ఈథేన్
    3) ప్రొపేన్ 4) బ్యూటేన్
29. దుస్తులను కొరికే క్రిముల నుంచి రక్షణ కోసం వాటి మధ్య ఉంచే కలరా ఉండల (డాంబర్ గోళీలు) తయారీలో వినియోగించే ప్రధాన పదార్థం ఏది?
    1) కాంఫర్ 2) నాఫ్తలీన్
    3) సుక్రోజ్ 4) ఫ్రక్టోజ్
30. కేన్సర్ కలిగించే గుణం ఉన్న హైడ్రోకార్బన్లు ఏవి?
    1) ఆల్కేన్లు 2) ఆల్కీన్లు
    3) ఆల్కైన్లు
    4) ఎరోమాటిక్ సమ్మేళనాలు
31. కింది వాటిలో ఎరోమాటిక్ ధర్మం ఉన్న హైడ్రోకార్బన్లు ఏవి?
    1) బెంజీన్ 2) నాఫ్తలీన్
    3) టోలీన్ 4) పైవన్నీ
32. హైడ్రోకార్బన్లను మండిస్తే విడుదలయ్యే ప్రధాన వాయువేది?
    1) కార్బన్ డై ఆక్సైడ్
    2) కార్బన్ మోనాక్సైడ్
    3) సల్ఫర్ డై ఆక్సైడ్ 4) నైట్రస్ ఆక్సైడ్
33. హైడ్రోకార్బన్లకు ప్రధాన ఆధారం?
    1) ముడి చమురు 2) చక్కెర పరిశ్రమ
    3) తోలు పరిశ్రమ 4) ఏదీకాదు
34. 'డ్రై క్లీనింగ్'లో ఉపయోగించే ద్రావణి ఏది?
    1) పర్‌క్లోరో ఇథిలీన్ (PCE)
    2) ఆల్కహాల్
    3) పెట్రోల్ 4) హెక్సేన్
35. 'మార్ష్‌గ్యాస్' అని దేనికి పేరు?
    1) ఎసిటలీన్ 2) ఇథిలీన్
    3) మీథేన్ 4) ప్రొపేన్
36. బొగ్గు గనుల్లో అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే వాయువు ఏది?
    1) బ్యూటేన్ 2) హైడ్రోజన్
    3) మీథేన్ 4) ఆక్సిజన్
37. మంటలను ఆర్పడానికి కింది వాటిలో ఏ వాయువు పనికిరాదు?
    i) హైడ్రోజన్ ii) కార్బన్ మోనాక్సైడ్
    iii) ఆక్సిజన్ iv) కార్బన్ డై ఆక్సైడ్
    1) iv మాత్రమే 2) i, iii మాత్రమే
    3) ii, iii మాత్రమే 4) i, ii, iii
38. వంట గ్యాస్ సిలిండర్లలో నింపే గ్యాస్ ఏ రూపంలో ఉంటుంది?
    1) ఘన2) ద్రవ
    3) వాయు 4) జెల్
39. వరి పొలాల్లో చెత్తాచెదారం కుళ్లిపోవడం వల్ల విడుదలయ్యే వాయువేది?
    1) ఎసిటలీన్ 2) ఈథేన్
    3) ఇథిలీన్ 4) మీథేన్
40. గాలి తగిలేలా ఉంచినప్పుడు 'వైన్' రుచి మారడానికి కారణం?
    1) ఆల్కహాల్ ఈథర్‌గా మారడం
    2) ఇథైల్ ఆల్కహాల్ ఎసిటికామ్లంగా ఆక్సీకరణం చెందడం
    3) ఇథైల్ ఆల్కహాల్ మిథైల్ ఆల్కహాల్‌గా మారడం
    4) ఇథైల్ ఆల్కహాల్ లాక్టికామ్లంగా మారడం
41. వాహనాల్లో ఇంధనం దహనం చెందినప్పుడు కార్బన్, హైడ్రోజన్‌లు ఏవిధంగా మారతాయి?
    1) కార్బన్ డై ఆక్సైడ్, నీటిఆవిరిగా మారతాయి
    2) ఆల్కీన్‌గా మారతాయి
    3) బెంజీన్‌గా మారతాయి
    4) వాతావరణంలోకి అలాగే విడుదలవుతాయి
42. భారీ మోటారు వాహనాలకు డీజిల్‌ను ఇంధనంగా వాడటానికి కారణం?
    1) కాలుష్యం తక్కువగా ఉండటం
    2) అధిక సామర్థ్యం, ఇంధన పొదుపు
    3) ఇంజన్‌కు తక్కువ నష్టం కలగడం
    4) అధికంగా లభ్యమవడం
43. గోబర్ గ్యాస్, బయోగ్యాస్, కోల్‌గ్యాస్‌లలో ప్రధాన వాయువు ఏది?
    1) బ్యూటేన్ 2) మీథేన్
    3) ప్రొపేన్ 4) పెంటేన్
44. కింది వాటిలో ఉత్పతనం చెందే గుణం ఉన్న కర్బన సమ్మేళనం ఏది?
    1) నాఫ్తలీన్ 2) కాంఫర్
    3) 1, 24) సుక్రోజ్
45. కింది వాటిలో ఇంధనంగా ఉపయోగించని హైడ్రోకార్బన్ ఏది?
    1) మీథేన్ 2) ప్రొపేన్
    3) పెంటేన్ 4) బ్యూటేన్
46. సిగరెట్ లైటర్‌లో ఉండే వాయువు ఏది?
    1) మీథేన్ 2) ఈథేన్
    3) కార్బన్ మోనాక్సైడ్ 4) బ్యూటేన్
47. కింది వాటిలో భూగోళం వేడెక్కడానికి కారణమైన ప్రధాన వాయువు ఏది?
    1) CO_2 2) CH_4
    3) CFC 4) పైవన్నీ
48. కొండ ప్రాంతాల్లోని ఆవాసాలను విద్యుదీకరించడానికి, వంటకు కింది వాటిలో చవకైంది ఏది?
    1) విద్యుచ్ఛక్తి 2) బయోగ్యాస్
    3) పవన విద్యుత్ 4) జల విద్యుత్

సమాధానాలు

1) 3; 2) 4; 3) 3; 4) 4;
5) 1; 6) 2; 7) 2; 8) 4;
9) 4; 10) 4; 11) 4; 12) 2;
13) 1; 14) 3; 15) 1; 16) 2;
17) 3; 18) 3; 19) 2; 20) 4;
21) 3; 22) 2; 23) 1; 24) 3;
25) 1; 26) 1; 27) 2; 28) 1;
29) 2; 30) 4; 31) 4; 32) 1;
33) 1; 34) 1; 35) 3; 36) 3;
37) 4; 38) 2; 39) 4; 40) 2;
41) 1; 42) 2; 43) 2; 44) 3;
45) 3; 46) 4; 47) 4; 48) 2..

హాలోజన్లు

1. కింది వాటిలో హాలోజన్ కానిది ఏది?
   1) ఫ్లోరిన్ 2) క్లోరిన్
   3) గ్జినాన్ 4) అయోడిన్
2. అయోడిన్‌కు ప్రధాన ఆధారం?
   1) సముద్ర మొక్కలు 2) నదీజలం
   3) బావుల నీరు 4) బొగ్గు గనులు
3. తళతళా మెరిసే అలోహం ఏది?
   1) ఫాస్ఫరస్ 2) అయోడిన్
   3) సల్ఫర్ 4) లెడ్
4. ఉత్పతనం చెందే గుణం ఉన్న హాలోజన్?
   1) అయోడిన్ 2) బ్రోమిన్
   3) క్లోరిన్ 4) ఫ్లోరిన్
5. గది ఉష్ణోగ్రత వద్ద ద్రవరూపంలో ఉండే హాలోజన్ ఏది?
   1) ఫ్లోరిన్ 2) బ్రోమిన్
   3) క్లోరిన్ 4) అయోడిన్
6. ఆవర్తన పట్టికలోని మూలకాలన్నింటిలో అత్యధిక రుణ విద్యుదాత్మకత ఉన్న మూలకం ఏది?
   1) ఫ్లోరిన్ 2) క్లోరిన్
   3) బ్రోమిన్ 4) అయోడిన్
7. ఆహారంలో రుచి కోసం వాడే క్లోరిన్ సమ్మేళనం ఏది?
   1) సోడియం క్లోరేట్
   2) బ్లీచింగ్ పౌడర్
   3) సోడియం క్లోరైడ్
   4) పొటాషియం క్లోరైడ్
8. టేబుల్ సాల్ట్ ఫార్ములా?
   1) Na_2CO_3 2) $NaCl$
   3) $NaHCO_3$ 4) $CaOCl_2$
9. పాలల్లో స్టార్చ్ (గంజి పొడి)తో కల్తీ జరిగితే.. ఆ పాలకు అయోడిన్ కలిపినప్పుడు వచ్చే రంగు ఏది?
   1) నీలం 2) ఆరెంజ్
   3) ఎరుపు 4) పసుపు
10. థైరాయిడ్ హార్మోన్‌ను నియంత్రించే పదార్థం ఏది?
    1) సల్ఫర్ 2) అయోడిన్
    3) ఫాస్ఫరస్ 4) క్లోరిన్
11. కింది వాటిలో దేనికి యాంటీ సెప్టిక్ ధర్మం ఉంటుంది?
    1) బ్రోమిన్ 2) అయోడిన్
    3) ఫ్లోరిన్ 4) ఏదీకాదు
12. నీటిని క్రిమిరహితం చేయడానికి ఉపయోగించే వాయువు ఏది?
    1) ఫ్లోరిన్ 2) క్లోరిన్
    3) బ్రోమిన్ 4) ఆక్సిజన్
13. విరంజన చూర్ణం (బ్లీచింగ్ పౌడర్) ఘాటైన వాసన రావడానికి.. అది విడుదల చేసే ఏ వాయువు కారణం?
    1) క్లోరిన్ 2) ఫ్లోరిన్
    3) ఆక్సిజన్ 4) హైడ్రోజన్
14. గాజుపై డిజైన్‌లు వేయడానికి (ఎచ్చింగ్) ఉపయోగపడే పదార్థం?
    1) హైడ్రో ఫ్లోరిక్ ఆమ్లం (HF)
    2) హైడ్రో క్లోరిక్ ఆమ్లం (HCl)
    3) నైట్రికామ్లం (HNO_3)
    4) ఏదీకాదు
15. బంగారాన్ని కరిగించడానికి ఉపయోగించే 'రసరాజం (ఆక్వారీజియా)' అనేది 1 : 3 నిష్పత్తిలో ఏయే గాఢ ఆమ్లాల మిశ్రమం?
    1) HCl, HNO_3 2) HNO_3, HF
    3) HCl, H_2SO_4 4) HNO_3, HCl
16. మనం తీసుకున్న ఆహారం జీర్ణమవడానికి ఉదరంలో ఉత్పత్తయ్యే హైడ్రో క్లోరికామ్లం ముఖ్యమైంది. ఆహారంలో ఏ పదార్థం లోపిస్తే ఈ ఆమ్లం ఉత్పత్తి కష్టమవుతుంది?
    1) చక్కెర (సుక్రోజ్)
    2) టేబుల్ సాల్ట్ (సోడియం క్లోరైడ్)
    3) నూనెలు 4) ప్రోటీన్లు

సమాధానాలు

1) 3	2) 1	3) 2	4) 1
5) 2	6) 1	7) 3	8) 2
9) 1	10) 2	11) 2	12) 2
13) 1	14) 1	15) 4	16) 2

The antonym of depict is...

BANK EXAMS

BANKING AWARENESS

Model Questions

Directions (Q.No. 1-05): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. In addition to escalating violence, (1)/ a distinct feature of the situation in Kashmir today (2)/ is the divide among the administration and the populace, (3)/ which is possibly at its widest today. (4)/ No error (5)
2. The government has come under a lot of criticism (1)/ above its estimates for economic growth (2)/ during the United Progressive Alliance years (3)/ and for the slowdown in GDP growth in the second quarter of this financial year. (4)/ No error (5)
3. Over centuries, humans observed (1)/ and invented means to extract repetitions (2)/ and commonalities from a world (3)/ that was full of differences and variations. (4)/ No error (5)
4. The Andhra Pradesh Weather Forecasting and Early Warning Research Centre, an division of the RTGS, (1)/ on Sunday said cyclone Phethai might make landfall (2)/ by the evening of Monday (3)/ between Kakinada and Tuni. (4)/ No error (5)
5. The Madras High Court on Monday directed the Centre (1)/ to notify the statutory rules related to online sale (2)/ of drugs and medicines by January 31, 2019 (3)/ and banned online sales till than. (4)/ No error (5)

Directions: (Q.No. 6 - 10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. At school, Mira is antisocial and sullen, but <u>it is in her home in which</u> she is a bubbly, even tempered child.
   1) in her home
   2) in her home, in which
   3) in her home where
   4) it is in her home and
   5) No correction required
7. Angel food cake, a cholesterol-free cake, solves the problem of <u>how to bake a cake for a health-conscious family.</u>
   1) having a health-conscious family for which to bake a cake
   2) how can one bake a cake for a health-conscious family
   3) how one could feed a health-conscious family a cake
   4) having a health-conscious cake to bake for a family
   5) No correction required
8. Experts believe that senior citizens with higher than average cholesterol <u>and their families develop a predisposition to cardiovascular disease</u> are more likely to die at an age below that of their life expectancy.
   1) and a predisposition to cardiovascular disease runs in the family
   2) whose families have a predisposition to cardiovascular disease
   3) whose families have a predisposition to cardiovascular disease running in them
   4) with a predisposition to cardiovascular disease running in their family
   5) No correction required
9. Sometimes, it seems like she does things only <u>making it more inconvenient for her husband so he can have</u> a good time when he's out with his friends.
   1) to make it more inconvenient for her husband to have
   2) to make more inconvenient for her husband the having of
   3) that her husband more inconveniently can have
   4) for her husband to more inconveniently
   5) No correction required
10. She had to <u>back down as she had forgotten</u> her mobile and car keys in the cabin.
    1) go back as she has forgotten
    2) went back as she has forget
    3) backed down as she had forgotten
    4) return as she had forgotten
    5) No correction required

Directions (Q.No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. A series of misunderstandings between the management and the staff have led to the present ____.
    1) concord 2) contract
    3) impasse 4) access
    5) agreement
12. Tensions had ____ towards the end of day three with Kohli and Paine exchanging verbal ____ as the game headed for a nail-biting finish.
    1) flared, trickle
    2) flared-in, pitch
    3) escalated, dribble
    4) flared-up, volleys
    5) increased, duals
13. The children were ____ by the seemingly nonsensical clues until their teacher pointed out that the messages were in code.
    1) censured 2) striated
    3) feigned 4) prevaricated
    5) flummoxed
14. The chess master promised to ____ havoc upon his opponent's pawns for taking his bishop.
    1) wreak 2) warrant 3) ensue
    4) placate 5) endow
15. The soldiers received a military ____ to inspect all their vehicles before travelling.
    1) allotment 2) dominion
    3) affectation 4) calculation
    5) mandate

Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The ruling establishment in India maintains that the NRC is an administrative task overseen by the Supreme Court, and not a political gambit.
B) Many Indian citizens are securing coveted employment opportunities in Bangladesh through multinational companies, non-governmental organizations, and trading activities.
C) According to the latest available Bangladesh government estimates of 2009, more than 500,000 Indians were working in Bangladesh.
D) However, some members of the ruling party have been making hateful anti-migration and anti-Bangladeshi comments that reflect poorly on the prevalent positive relationship between Bangladesh and India.
E) More recently, Bangladesh was reported to be among the highest source of remittances to India, behind the United Arab Emirates, the U.S., Saudi Arabia, Qatar and the U.K.
F) To put things into perspective, most of them are employed in advantageous jobs in Bangladesh while Bangladeshis in India are largely employed in low-paying jobs.

16. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What does the writer say in this passage?
    1) We must reverse storytelling.
    2) Social norms and behaviour in India are reversed.
    3) We ignore or simply don't accept the impact of multilateral agencies.
    4) It is high time to think of future generations.
    5) social behaviour is definitely influenced by films
21. Which statement/s is/are true?
    a) CBFC may bring a change by initiating yet another certification among the categories of film certification we already have today.
    b) Film industry is abound with film makers who attempt to break the stereotypes.
    c) If a gender equity certification is introduced, public will have a choice before heading to the theatres.
    1) Only a 2) a& b 3) a & c
    4) a, b & c 5) none of them
22. Genocide means
    1) Related to genes
    2) Related to Rwanda
    3) Extraction of a species
    4) deliberate and systematic destruction of a group
    5) changed social norms and behaviour
23. Reconciliation means
    1) the restoration of friendly relations
    2) Estrangement 3) Feud
    4) Incompatibility in relations
    5) Making others believe in what you think is right
24. The antonym of depict is
    1) Limn 2) delineate
    3) distort 4) sculpt
    5) sketch

KEY

1) 3	2) 2	3) 2	4) 1	5) 4
6) 1	7) 5	8) 2	9) 1	10) 4
11) 3	12) 4	13) 5	14) 1	15) 5
16) 5	17) 2	18) 4	19) 3	20) 5
21) 3	22) 4	23) 1	24) 3	